సాక్షి


సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 112

SUNDAY Special | ఆదివారం 13-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



భారత్ 387 ఆలౌట్

లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కూడా సరిగ్గా 387 పరుగులకే ఆలౌట్ కావడంతో ఎవరికీ ఆధిక్యం దక్కలేదు. కేఎల్ రాహుల్ సెంచరీ సాధించగా.. జడేజా, పంత్ రాణించారు. - 14లో



వింబుల్డన్ విజేత స్వియాటెక్

మహిళల సింగిల్స్ టైటిల్‌ను పోలండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ గెలుచుకుంది. ఫైనల్లో ఆమె 6-0, 6-0తో అమండా అనిసిమోవాను చిత్తుగా ఓడించింది. - 14లో



యువతే మన అసలైన శక్తి

జాతి నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



15న శుభాంశు శుక్లా రాక

భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా ఈ నెల 14న ఐఎస్ఎస్ నుంచి బయలుదేరి, 15వ తేదీన భూమిపైకి రానున్నారు.

- వివరాలు 6లో



ఐఐఎంలో అఘాయిత్యం

ఐఐఎం కోల్‌కతా క్యాంపస్‌లో ఓ మహిళపై విద్యార్థి అత్యాచారానికి పాల్పడగా నిందితుడిని అరెస్ట్ చేశారు.

- వివరాలు 6లో



వీసా వచ్చిందని మురవకండి

అమెరికాలో అడుగుపెట్టినప్పటికీ వీసాదారులపై 'స్క్రీనింగ్' కత్తి వేలాడుతూనే ఉంటుందని ట్రంప్ సర్కార్ స్పష్టం చేసింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

21 నుంచి నీట్ కౌన్సెలింగ్



ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నీట్ యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ వర్సిటీలు, రాష్ట్ర పరిధిలోని సీట్లలో చేరికకు కౌన్సెలింగ్ తేదీలను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ప్రకటించింది.

- వివరాలు 16లో

పదేళ్ల తర్వాత.. కొత్త రేషన్‌కార్డులు



రాష్ట్రంలో దశాబ్ద కాలం తర్వాత సోమవారం కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో సీఎం చేతుల మీదుగా కార్డులు జారీ చేయనున్నారు.

- వివరాలు 15లో

శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై ఈడీ దృష్టి

హెచ్ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై ఈడీ దృష్టి పెట్టింది. ఇప్పటికే ఈసీఐఆర్ నమోదు చేసిన ఈడీ.. ఈనెల 2న శివబాలకృష్ణ నివాసంతోపాటు కుటుంబ సభ్యుల ఇళ్లలో సోదాలు చేపట్టింది.

- వివరాలు 16లో

పారిపోయి రైలెక్కేస్తున్నారు!



బడికి వెళ్లటం ఇష్టం లేక కొందరు.. సినిమాల్లో నటించాలని ఇంకొందరు.. కిడ్నాప్‌నకు గురై మరికొందరు.. ఇలా అనేక కారణాలతో రైళ్లలో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలలను రైల్వే రక్షక దళ సిబ్బంది కాపాడుతున్నారు.

- వివరాలు 2లో

ఒకే రాజ్యం.. ఒకే రాజ్యాంగం

75 ఏళ్లుగా దేశం చెక్కుచెదరకుండా ఉండటానికి దృఢమైన రాజ్యాంగమే కారణం

సీజేఐ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్

- అంతర్గత సంఘర్షణలు ఎన్ని ఎదురైనా రాజ్యాంగం వల్లే తట్టుకొని నిలబడ్డాం
- ఓయూలో 'భారత రాజ్యాంగం: అంబేడ్కర్ పాత్ర'పై ప్రసంగం
- రాజ్యాంగ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెల్లడి
- అంబేడ్కర్ పోస్టల్ కవర్ విడుదల.. పాల్గొన్న జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ సుజోయ్‌పాల్



శనివారం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 22వ వార్షిక స్నాతకోత్సవంలో న్యాయ సంబంధ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, ఏసీజే జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ పీఎస్ నరసింహ, సీఎం రేవంత్‌రెడ్డి, నల్సార్ వీసీ ప్రొ. శ్రీకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో రాష్ట్రంలో ఒకటి.. దేశంలో మరొకటి ద్వంద్వ పౌరసత్వం ఉంటుందని.. మన దేశం (రాజ్యం) లో అది సాధ్యం కాదని.. ఒకే దేశం–ఒకే రాజ్యాంగం మనదని బాబా సాహెబ్ అంబేడ్కర్ వ్యాఖ్యానించారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పేర్కొన్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు ఎలా పనిచేయాలో ఆయన రోడ్‌మ్యాప్ వేశారన్నారు. 75 ఏళ్లుగా ఇలా చెక్కుచెదరకుండా ఉన్నామంటే అందుకు దృఢమైన రాజ్యాంగమే కారణమని చెప్పారు. భవిష్యత్ అవసరాల మేరకు రాజ్యాంగ సవరణ అనివార్యమంటూనే ప్రాథమిక హక్కుల రక్షణ బాధ్యతను సుప్రీంకోర్టుకు అప్పగించారని వెల్లడించారు. భారత రాజ్యాంగం: అంబేడ్కర్ పాత్ర అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం

మిగతా 2వ పేజీలో ▶

సృజనాత్మకతతోనే శిఖరాలకు..

- జీవితంలో స్నేహితులు, కుటుంబం, పుస్తకాలు, అభిరుచులు, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగానికి సమయమిదే
- నల్సార్ స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్
- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, జస్టిస్ నరసింహ, జస్టిస్ సుజోయ్‌పాల్

2లో

దాడికి గురైన వాహనం.. కన్నీటి పర్యంతమవుతున్న ఉప్పాల హారిక





ఏపీలో బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై
టీడీపీ గూండాయిజం

- ఉప్పాల హారిక వాహనంపై బండ రాళ్లతో దాడికి తెగబడిన టీడీపీ, జనసేన శ్రేణులు
- కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలో దారుణం.. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ సభకు వెళ్తుండగా అడ్డగించి రాళ్లు, కర్రలతో కారుపై కొడుతూ భయభ్రాంతులకు గురి చేసిన వైనం
- కర్రలు, రాడ్లతో అడ్డగించి.. సభకు వెళ్లే వారందరి వాహనాలపై దాడులు
- గంటన్నర సేపు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న మహిళా నేత
- ఆద్యంతం చోద్యం చూసిన పోలీసులు.. బాధితురాలు కన్నీటి పర్యంతం
- తనను, తన భర్తను హతమార్చేందుకే వచ్చారని ఆందోళన
- దాడిని తీవ్రంగా ఖండించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

గుడివాడ రూరల్/గుడివాడ టౌన్ : రాష్ట్రంలో ప్రజాస్వామ్య హననం జరుగుతోందనడానికి మరో తార్కాణం.. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందనడానికి మరో నిదర్శనం.. రాష్ట్రంలో శాడిస్టు ప్రభుత్వం రాజ్యమేలుతోందనడానికి నిలువుటద్దం.. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ మహిళ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు విచక్షణా రహితంగా మారణాయుధాలతో దాడి చేశారు. తాలిబన్లు, ఐసిస్, హమాస్, హిజ్‌బుల్లా ఉగ్రవాదులను మరిపించే రీతిలో పోలీసుల సమక్షంలోనే బూతులు తిడుతూ దాడికి తెగబడ్డారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తుండగా అడ్డుకుని మరీ దాడి చేయడం విస్తుగొలుపుతోంది. మద్యం, గంజాయి సేవించి.. సైకోల్లా కేకలు వేస్తూ.. చంపండి.. కొట్టండి..

మిగతా 12వ పేజీలో ▶

ఇంధనం అందలేదు!

అందుకే విమానం కూలింది

- ఆఫ్ అయిన రెండు ఇంధన స్విచ్‌లు
- ఏపీయూ డోర్ కూడా తెరుచుకుంది
- ఎయిరిండియా ప్రమాదంపై ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో కీలకాంశాలు
- పూర్తి ఆడియో బయటపెట్టని వైనం
- పైలట్ల తప్పిదమేనంటూ సంకేతాలు
- తీవ్రంగా తప్పుబట్టిన పైలట్ల సంఘం

న్యూఢిల్లీ

'ఇంధన నియంత్రణ స్విచ్‌ను ఎందుకు ఆపేశావు?'.. ఆదుర్దాగా ప్రశ్నించిన పైలట్. 'నేను ఆపలేదు'.. బదులిచ్చిన రెండో పైలట్.



పైలట్ సబర్వాల్



కో పైలట్ క్లైవ్

దేశమంతటినీ శోకసంద్రంలో ముంచిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి క్షణాల ముందు పైలట్ల తుది సంభాషణ ఇది. వారిమధ్య నెలకొన్న అయోమయానికి ఈ సంభాషణ అద్దం పడుతోందని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) పేర్కొంది. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫైన 32 క్షణాల వ్యవధిలోనే రన్‌వేను ఆనుకొని ఉన్న వైద్య కళాశాల

మిగతా 12వ పేజీలో ▶



ఒక ఆడియో.. ఎన్నో ప్రశ్నలు

- అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరిన్ని చిక్కుముడులు
- ఉద్దేశపూర్వకంగా ఫ్యూయల్ స్విచ్‌ను ఆఫ్ చేశారా?
- ఆ తర్వాత గమనించి మళ్లీ ఆన్ చేశారా?
- పూర్తి ఆడియో విడుదల చేయకపోవడంపై అనుమానాలు

- వివరాలు 6లో

రాహులే ప్రధానిగా ఉంటే..
48 గంటల్లో బీసీ రిజర్వేషన్లు!

బీసీ సంఘం నేతలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

- కేంద్రం నుంచి సాధించుకొని వచ్చేవాడిని
- బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి
- రాష్ట్ర బీజేపీ నేతలు ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలి
- బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే సామాజిక బహిష్కరణ విధించండి

3లో

60-70లలోనూ ఆరోగ్యంగా!



- మనం తినే ఆహారమే.. మన ఆలోచనను, ఆరోగ్యాన్ని, ఆయుష్షును నిర్ణయిస్తుంది. ముఖ్యంగా 40–50లలో ఉన్నప్పుడు ఆహారం విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇదే విషయాన్ని అధ్యయనాలూ చెబుతున్నాయి. నడి వయసులో ఉన్నప్పుడు ఎంచుకున్న ఆహారం.. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉంచుతుందని తాజా అధ్యయనంలో తేలింది.

- వివరాలు 3లో

పది నిమిషాల్లో పనివారు!



- చాలా మంది గృహ యజమానులు ఇంట్లో పనులు చేసేందుకు పనిమనుషులు దొరక్క చాలా ఇబ్బందులు పడుతుంటారు. పల్లెలు, చిన్న పట్టణాల్లో పనివారు సులభంగా దొరుకుతారు. అదే నగరాలు ఇందుకు పూర్తి విరుద్ధం. ఈ సమస్యకు పరిష్కారంగా ఇప్పుడు ఆన్‌లైన్ వేదికలు పుట్టుకొచ్చాయి. 10 నిమిషాల్లో పనివారిని గుమ్మం ముందుంచుతున్నాయి.

- వివరాలు 12లో

హైదరాబాద్‌లో కల్లుపై నిషేధం?

- కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఆలోచన
- సీఎం రేవంత్‌తో చర్చించాలని మంత్రి జూపల్లి నిర్ణయం
- నగరంలో స్వచ్ఛమైన కల్లు 10 శాతమే.. 90 శాతం కల్తీనే..
- 10 గ్రాముల అల్ప్రాజోలంతో 100 పెట్టెల కల్లు తయారీ




సాక్షి, హైదరాబాద్: కల్తీ కల్లుతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో కల్లు విక్రయాలను పూర్తిగా నిషేధించాలని ఎక్సైజ్ శాఖ ఆలోచిస్తోంది. నిషేధం విధించడానికి ముందు సంబంధిత వర్గాలన్నింటితో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది. కల్లుపై నిషేధం రాజకీయపరమైన సమస్యలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో జాగ్రత్తగా డీల్ చేయాలని యోచిస్తోంది. నగరంలోని కల్లు సొసైటీల్లో ఉన్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి ఎలా కల్పించాలన్న దానిపై సమాలోచన చేస్తున్నట్లు సమాచారం. కల్లుపై నిషేధం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ నగరంలో విక్రయిస్తున్న కల్లులో 90 శాతం కృత్రిమంగా తయారుచేసినదే ఉంటోందని అధికారవర్గాలు చెబుతున్నాయి. చెట్ల నుంచి సహజంగా తీసిన కల్లు 10 శాతమేనని అంటున్నారు. హైదరాబాద్‌లో మొత్తం 97 కల్లు సొసైటీలు ఉన్నాయి. ఒక్కో సొసైటీ పరిధిలో రోజూ 10 నుంచి 20 పెట్టెల (ఒక్కో పెట్టెలో 10 - 12 సీసాలు) కల్లు విక్రయాలు జరుగుతుంటాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇందులో 90 శాతం అల్ప్రాజోలం వంటి రసాయనాలతో తయారు చేసినదే ఉంటోందని


మిగతా 5వ పేజీలో ▶



పారిపోయి రైలెక్కేస్తున్నారు!

ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషన్‌లో ఆగింది. అక్కడ 26 మంది చిన్నారులతో ఎనిమిది మంది వ్యక్తులు రైలెక్కారు. వారు సికింద్రాబాద్‌లో దిగాల్సి ఉంది. సాధారణంగా రైలెక్కినప్పుడు చిన్నారుల్లో ఓ సంబరం కనిపిస్తుంది. కిటికీల్లోంచి చూస్తూ కేరింతలు కొట్టడం సహజం. కానీ, ఈ చిన్నారుల్లో ఎక్కడా చలాకీతనం లేదు. దిగాలుగా కూర్చున్నారు. ఇది గమనించిన ఓ ప్రయాణికుడు విషయాన్ని రైల్వే అధికారులకు చెప్పాడు. రైలు సికింద్రాబాద్‌లో ఆగగానే, రైల్వే భద్రతా దళ సిబ్బంది కోచ్‌లోకి వచ్చి వారందరినీ అదుపులోకి తీసుకుంది. ఆరా తీస్తే.. ఆ 26 మందిని హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లో బాలకార్మికులుగా వెట్టి చేయించేందుకు తరలిస్తున్నట్టు తేలింది. పిల్లలను తరలిస్తున్న వారిని అరెస్టు చేసి.. ఆ బాలలకు స్వేచ్ఛ కల్పించారు. **సాక్షి, హైదరాబాద్**





ముంబై వెళ్లే రైలు జనరల్ కోచ్ ఎక్కిన ఇద్దరు 13 ఏళ్ల బాలికలు, రాత్రి వేళ స్లీపర్ కోచ్‌లోకి చేరుకున్నారు. వారి వద్ద అన్ రిజర్వ్‌డ్ టికెట్లు మాత్రమే ఉండటంతో టీసీ నిలదీశాడు. పొంతనలేని సమాధానం చెప్పటంతో ఆర్‌పీఎఫ్ సిబ్బందికి ఆయన సమాచారమిచ్చాడు. వారు బాలికలను అదుపులోకి తీసుకుని విచారిస్తే, చదవడం ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయినట్టు వెల్లడించారు. దీంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బడికి వెళ్లటం ఇష్టం లేక కొందరు.. తల్లిదండ్రుల మధ్య తరచూ జరిగే గొడవలతో విసిగిపోయి మరికొందరు.. సినిమాల్లో నటించాలని ఇంకొందరు.. కిడ్నాప్‌నకు గురై మరికొందరు.. ఇలా అనేక కారణాలతో తరచూ రైళ్లలో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలలను రైల్వే రక్షక దళం సిబ్బంది కాపాడుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గత రెండున్నరేళ్లలో 3,433 మంది ఇలాంటి చిన్నారులను రక్షించారు. ఇది పెద్ద సంఖ్య కావటంతో మరింత అప్రమత్తంగా ఉండేందుకు రైల్వే శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇస్తోంది.

రైళ్లెక్కేస్తున్నారు

ఇళ్ల నుంచి పారిపోయే చిన్నారుల్లో అత్యధికులు రైళ్లనే ఆశ్రయిస్తున్నారు. రోడ్డు మార్గాన వెళ్తే పోలీసు తనిఖీలు ఉంటాయన్న ఉద్దేశంతో, పిల్లలను అక్రమంగా రవాణా చేసే ముఠాలు కూడా రైళ్లనే ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. వీరిని గుర్తించేందుకు ఇప్పుడు రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) సిబ్బంది మరింత కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, తిరుపతి, విజయవాడ, నాందేడ్ డివిజన్‌హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా చైల్డ్ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఇళ్లనుంచి పారిపోయి రైలెక్కుతున్న చిన్నారులు, అక్రమ రవాణాలో భాగంగా తరలిస్తున్న పిల్లలను గుర్తించి రక్షించటమే ఈ డెస్క్‌ల పని. రైల్వే స్టేషన్లలో నిఘా ఉంచడం, సంబంధిత విభాగాలతో సమన్వయం చేయడం, కోచ్‌లూ స్టేషన్‌లలో గుర్తించిన పిల్లలకు తక్షణ సంరక్షణ కల్పించటం, ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా ఈ డెస్క్‌లు అలాంటి చిన్నారులు ఆపదల్లో చిక్కుకోకుండా చూడగలుగుతున్నాయి. ఈ పిల్లలను గుర్తించేందుకు రైల్వే స్టేషన్‌లలో సీసీటీవీ కెమెరాల సంఖ్య కూడా పెంచుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు

రైల్వే భద్రతా విభాగం 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే', 'ఆపరేషన్ - యాక్షన్ అగైనెస్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్'వంటి ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించింది. ఒంటరిగా రైళ్లలో సంచరించే చిన్నారులు, బలవంతంగా వారిని తరలించేవారిని గుర్తించి వివరాలు వాకబు చేసి ప్రమాదంలో ఉన్న చిన్నారులను రక్షించి తిరిగి ఇళ్లకు తరలిస్తున్నారు. ఇళ్లకు వెళ్లేందుకు నిరాకరించే వారిని సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలకుగాను పోలీసులకు అప్పగిస్తున్నారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేసే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులకు ఇప్పుడు ఇలాంటి చిన్నారులను గుర్తించి కాపాడే విషయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 'బచ్‌పన్ బచావో ఆందోళన్'అనే సంస్థతో కలిసి జోనల్ స్థాయిలో సిబ్బందికి శిక్షణ అందిస్తున్నారు. ఇవి సత్ఫలితాలనిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా 16వేల మంది

2024 నుంచి ఈ ఏడాది జూన్ వరకు దేశవ్యాప్తంగా రైల్వే శాఖ 16వేల మంది చిన్నారులను కాపాడింది. వీరిలో 3,000 మంది అమ్మాయిలే. నన్హే ఫరిష్తే కార్యక్రమం ద్వారా ఒక్క 2024లోనే 10వేలకుపైగా కుర్రాళ్లను కాపాడారు. ఈ ఏడాది జూన్ వరకు 6వేలకుపైగా చిన్నారులను సురక్షితంగా వెనక్కు తీసుకొచ్చారు.

రైల్వే కోచ్‌లు, స్టేషన్‌లలో అనుమానాస్పదంగా తిరిగే చిన్నారులు; ఆందోళనగా కనిపించే పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు @RailMinIndia, @SCRailwayIndia, @Gmscrailway తదితర ఎక్స్ హ్యాండిల్స్‌లో కూడా పోస్ట్ చేయవచ్చు.

139కి సమాచారమివ్వండి

'ఇళ్ల నుంచి పారిపోయే చిన్నారులు, చైల్డ్ ట్రాఫికింగ్‌కు బలయ్యే బాలలను రక్షించే సామాజిక బాధ్యతతో రైల్వే శాఖ ప్రత్యేక చొరవ చూపుతోంది. ఈ విషయంలో ఎన్నో అద్భుత విజయాలు సాధించి వేలాది బాధిత చిన్నారులను రక్షించి తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. రైల్వే చొరవకు ప్రజల సహకారం తోడైతే మరింత మందిని రక్షించవచ్చు. రైలు ప్రయాణికులు పరిసరాలను గమనిస్తూ అనుమానం ఉన్న చిన్నారుల విషయాన్ని 139 ద్వారా గాని, రైలు మద్దతు పోర్టల్ ద్వారా గాని సమాచారం అందిస్తే రైల్వే సిబ్బంది వెంటనే స్పందిస్తారు'.

- ఎ.శ్రీధర్, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన పౌర సంబంధాల అధికారి

క్లుప్తంగా...

రైతునేస్తం-2025 పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆగస్టు 31వ తేదీ ఆఖరు

సాక్షి, హైదరాబాద్: రైతు నేస్తం పురస్కారాలకు వ్యవసాయ, అనుబంధ రంగాల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, అగ్రి ఇన్నోవేషన్స్, రైతుల నుంచి రైతు నేస్తం మాసపత్రిక దరఖాస్తులకు ఆహ్వానించింది. ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్‌లో రైతునేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త ఐ.వి.సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులతోపాటు అగ్రి ఇన్నోవేషన్స్‌ను అవార్డులతో ఘనంగా సత్కరించనుందని నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. రైతునేస్తం వెబ్‌సైట్ https://rythunestham.in/awards నుంచి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, వారి పరిశోధనా వ్యాసాలను, సాగు అనుభవాలను జతపరచి 'ఎడిటర్, రైతునేస్తం, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, ఫోన్: 9676797777 (లేదా) 'రైతునేస్తం', డో.నెం .8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 017, ఫోన్: 97053 83666 చిరునామాలకు పంపాలని సూచించారు. లేదంటే editor@rythunestham.inకు ఇ-మెయిల్ చేయవచ్చని, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులేనని తెలిపారు.

బీసీడబ్ల్యూ మినిస్టీరియల్ స్టాఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా.. సిరిసిల్ల జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ హెచ్.రేవంత్ ఎన్నికయ్యారు. నాంపల్లిలోని టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ సమావేశ మందిరంలో శనివారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల పర్యవేక్షకునిగా గ్రేటర్ హైదరాబాద్ టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీకాంత్ వ్యవహరించారు. మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు రేవంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా పద్మావతి, అసోసియేట్ అధ్యక్షునిగా సురేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖలీద్, సురేశ్, పాండురంగం, అంజన్ రాజు, షేక్ ఫర్జానా, శ్రీకర్ ఎన్నికయ్యారు.

సృజనాత్మకతతోనే ఉన్నత శిఖరాలకు..

న్యాయవాద వృత్తిలో నైపుణ్యం, సృజనకే ప్రాధాన్యం
- స్నేహితులు, కుటుంబం, పుస్తకాలు, అభిరుచులు, ఆరోగ్యం, ఊహ..
- జీవితంలో వీటికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వాలి
- నల్సార్ స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్
- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, జస్టిస్ శ్రీనరసింహ, జస్టిస్ సుజోయ్‌పాల్


విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, జస్టిస్ నరసింహ, హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద వృత్తిలో నైపుణ్యంతోపాటు సృజనాత్మకత అవసరమని, అవి పాటించినవారే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. వర్ణ వివక్ష, సామాజిక వివక్షపై పోరాడిన న్యాయవాదుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని యువ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. న్యాయవాద వృత్తిలో అడ్డంకులుంటాయని, వాటిని అధిగమించి ముందుకు సాగాలని సూచించారు. న్యాయవ్యవస్థలో విశ్వాసం, నిబద్ధత, ప్రజా సేవకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. హైదరాబాద్ షామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ బీఆర్ గవాయ్, గౌరవ అతిథిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, నల్సార్ చాన్స్‌లర్, రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీజేఐ పలుసూచనలు, సలహాలు ఇచ్చారు.

విదేశీ విద్యపై మోజు వద్దు..

'నల్సార్ అంటే విద్యా నైపుణ్యం మాత్రమే కాదు.. చట్ట విలువల పట్ల దాని లోతైన నిబద్ధత. దేశంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు ఇతర సంస్థల కంటే మెరుగ్గా ప్రమాణాలు పాటిస్తున్నాయి. కొత్త ప్రపంచం, సాంకేతిక పరిణామాలకు ప్రతిస్పందనగా వృత్తి అభివృద్ధి చెందుతున్నా.. ఇంకా బలమైన పునాదులు అవసరం. సహచరుల ఒత్తిడి కారణంగా విదేశీ విద్యపై మోజు పెంచుకోవద్దు. అంతర్జాతీయ అర్హతతోనే ఎదుగుదల సాధ్యమన్నది అవాస్తవం. దేశంలో నాణ్యమైన విద్యకు కొదవలేదు. కొందరు ఆర్థిక భారమైనా విదేశాలకు వెళ్లాలని భావించడం సరికాదు. అది ఆ కుటుంబాలను అప్పుల్లో మునిగేలా చేస్తుంది. ఎల్‌ఎల్‌బీతోనే ఆగిపోకుండా ఎల్‌ఎల్‌ఎం సహా ఉన్నత చదువులపై దృష్టి సారించాలి. కోర్టు, కక్షిదారుల ముందు న్యాయవాదులు తమను తాము నిరూపించుకునేందుకు నిరంతరం కష్టపడాలి. న్యాయస్థానం ఇచ్చే తీర్పులపై అవగాహన పెంపొందించుకోవాలి. అప్పుడే సమర్థవంతమైన న్యాయవాదిగా నిలబడగలుగుతారు' అని సూచించారు.

ఏఐతో సత్వర న్యాయం సాధ్యమే..

'ఏటా న్యాయవాద విద్యలోకి వచ్చే వారు పెరుగుతున్నారు. అయితే, వృత్తిలో నైపుణ్యం పెంచుకున్నవారే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు. దేశానికి ఉత్తమ న్యాయవాదుల అవసరం ఎంతో ఉంది. మనదేశం ఎదుర్కొంటున్న చట్టపరమైన సవాళ్లకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగించాల్సిన సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో ఉపయోగిస్తే సత్వర న్యాయం అందించేందుకు దోహదం చేస్తుంది. స్నేహితులు, కుటుంబం, పుస్తకాలు, అభిరుచులు, ఆరోగ్యం, ఊహ.. ఈ ఐదు అంశాలు ఎప్పు డూ చెక్కుచెదరకుండా చూసుకోవాలి'అని ఉద్బోధించారు.

నిబద్ధతతో ముందుకు సాగాలి..

విద్యా నైపుణ్యం, రాజ్యాంగ విలువలు, సమ్మిళిత వృద్ధికి నల్సార్ కట్టుబడి ఉందని వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద ప్రత్యేక కోర్టుల ఆధునీకరణపై కేంద్రంతో కలిసి పని చేశామని చెప్పారు. డిగ్రీలు అందుకుని వెళ్తున్న విద్యార్థులు నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా డిగ్రీలు పూర్తి చేసుకున్న పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌ఎం, ఎంబీఏ, ఎంఏ (పన్ను చట్టాలు), ఎంఏ (క్రిమినల్ జస్టిస్ మేనేజ్‌మెంట్), బీఏ ఎల్‌ఎల్‌బీ(హానర్స్), బీబీఏ (హానర్స్), బీబీఏ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జస్టిస్ బీఆర్ గవాయ్, రేవంత్‌రెడ్డి పసిడి పతకాలు ప్రదానం చేశారు. అత్యధికంగా ఇషికా గార్గ్ 8, ఖండేకర్ సుకృత్ శైలేంద్ర 7, అర్పిత సతీశ్ 6 పతకాలు సాధించారు. రెండు వీసీ మెడల్స్‌తో కలిపి మొత్తం 58 బంగారు పతాకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ కె. విద్యుల్లతారెడ్డి, కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ (ఐఏఎస్) తదితరులు పాల్గొన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా సీజేఐతో సీఎం రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

ఒకే రాజ్యం.. ఒకే రాజ్యాంగం..

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగ రూపకల్పన సమయంలో అంబేడ్కర్ ఆలోచనా సరళిని లోతుగా విశ్లేషించారు. అట్టడుగు వర్గాలకు న్యాయం చేరాలని.. రాజ్యాంగ విలువలు, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలో అంతర్గత సంఘర్షణలు ఎన్ని వచ్చినా మన రాజ్యాంగం వల్లే బలంగా తట్టుకొని నిలబడగలిగామని చెప్పారు.

నేరుగా 'సుప్రీం'ను ఆశ్రయించే వెసులుబాటు..

'భవిష్యత్తు అవసరాల రీత్యా రాజ్యాంగ సవరణకు అంబేడ్కర్ అనుమతించారు. ఆ స్ఫూర్తితో పనిచేయాల్సిన అవసరం ఉంది. అతి సమైక్య, అతి కేంద్రీకృత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. రాజ్యాంగ ఆత్మలా, రక్షణ కవచంలా ఆర్టికల్ 32 పౌర హక్కులకు భంగం కలగకుండా కాపాడుతోంది. పరిష్కార మార్గాలు లేని హక్కులున్నా ఉపయోగం లేదని అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని మరిచిపోవద్దు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే వెసులుబాటును రాజ్యాంగం కల్పించింది. అమెరికాలో ద్వంద పౌరసత్వం అమల్లో ఉన్నా.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంతోపాటు సమాఖ్య పౌరసత్వం ఉంది. అందుకు భిన్నంగా రాష్ట్రాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చేలా బలమైన ప్రజాస్వామ్య రాజ్యంగా పటిష్టపరిచే ఒకే దేశం ఒకే రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అమల్లోకి తీసుకురావడం గర్వించదగిన విషయం. 1973లో ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులపై ఘర్షణ వచ్చింది. దీనిపై 13 మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు కలిసే పనిచేస్తాయని తేల్చిచెప్పింది. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలకు కూడా రోడ్‌మ్యాప్ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర ఎనలేనిది'అని సీజేఐ జస్టిస్ గవాయ్ వివరించారు. త్వరలోనే మళ్లీ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చి ఎక్కువ సమయం కేటాయిస్తానని ప్రసంగాన్ని ముగించారు.

అంబేడ్కర్‌కు హైకోర్టు సీజేగా ఆఫర్..

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ ప్రసంగిస్తూ 'హైదరాబాద్ నా సొంత నగరం. ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్నా. నా సొంత నగరంలో నా వర్సిటీకి సీజేఐ రావడం, ఈ కార్యక్రమంలో నేను కూడా పాల్గొనడం హర్షణీయం. అంబేడ్కర్‌కు హైదరాబాద్‌తో అనుబంధం ఉంది. సామాజిక న్యాయ పోరాటంలో భాగంగా అంబేడ్కర్ భాగ్యనగరాన్ని సందర్శించారు. నిజాం నవాబ్ ఆయన్ను కలసి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండాలని కోరారు. అయితే ఆ ఆఫర్‌ను అంబేడ్కర్ సున్నితంగా తిరస్కరించారు. మన దేశ రాజ్యాంగం ఎంతో గొప్పది.. ఔన్నత్యమైనది'అని వెల్లడించారు. అంబేడ్కర్‌తో హైదరాబాద్‌కు ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. ఇక్కడ జరిగిన సామాజిక ఉద్యమాలకు ఆయన మద్దతు ప్రకటించారన్నారు. అంబేడ్కర్ తన ఆత్మకథలో హైదరాబాద్ ఉద్యమాలు, సామాజిక న్యాయం సహా అనేక విషయాలను పొందుపరిచారని వివరించారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ ప్రసంగిస్తూ 1947 అక్టోబర్‌లో రాజ్యాంగ ముసాయిదా సిద్ధమైందని.. రెండున్నరేళ్ల చర్చలు, భేటీల తర్వాత 1949 నవంబర్‌లో తుదిరూపు వచ్చిందన్నారు.



ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద సీజేఐ జస్టిస్ గవాయ్, హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ పీఎస్ నరసింహ, ఉస్మానియా వీసీ కుమార్ తదితరులు

బీఆర్ గవాయ్ తండ్రి అంబేడ్కర్‌కు సన్నిహితుడు..

అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి ప్రసంగిస్తూ 1953 జనవరి 12న అంబేడ్కర్‌కు ఓయూ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఇది ఓ భారతీయ విశ్వవిద్యాలయం ఆయనకు ప్రదానం చేసిన తొలి డాక్టరేట్ అని చెప్పారు. బీఆర్ గవాయ్ తండ్రి ఆర్ఎస్ గవాయ్ అంబేడ్కర్‌కు అత్యంత సన్నిహితుడని.. దాదా సాహెబ్ గవాయ్‌గా ఆయన సుపరిచితుడన్నారు. విద్యావేత్త, రాజకీయ నేత, సామాజిక కార్యకర్తగానే కాకుండా పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ... 108 ఏళ్ల ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రగతిని నివేదించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, రిజిస్ట్రార్ జనరల్ (ఎఫ్ఏసీ) గోవర్ధన్‌రెడ్డి, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితేందర్ కుమార్ నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ పోస్టల్ కవర్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్ విడుదల చేశారు.

రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధి

కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలి
- రాష్ట్రానికి భారంగా అధిక శాతం వడ్డీలు: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్ భేటీ


మహేంద్ర దేవ్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సందీప్‌కుమార్ సుల్తానియా

సాక్షి, హైదరాబాద్: సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... 'రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్‌తోపాటు పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచిత అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్ నిర్మిస్తాం. రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం'అని వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే అంశంపై చర్చ జరిగింది. అధిక వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని, తిరిగి చెల్లింపులు కష్టం అవుతోందని సీఎం తెలిపారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.


వీఎల్ఆర్ చెల్లింపులు రూ.818.04 కోట్లు

డిసెంబర్, 2023 నుంచి మార్చి, 2025 వరకు నిధులు విడుదల

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల (వీఎల్ఆర్) కింద రాయితీ నిధుల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా వడ్డీలేని రుణాల కింద ఇవ్వాల్సిన రాయితీని ప్రతి మూడు లేదా ఆర్నెళ్లకోసారి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.344 కోట్లు విడుదల చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాలకు రూ.44 కోట్లు చొప్పున నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈనెల 18వ తేదీ కల్లా ఈ మొత్తాన్ని స్వయం సహాయక సంఘాల ఖాతాలో జమ చేయనుంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి 3,51,599 సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.818.04 కోట్లు ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో జమ చేసింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల డిసెంబర్, 2023 నుంచి మార్చి, 2025 వరకు వడ్డీలేని రుణాల కింద అర్హత పొందిన సంఘాలకు ఈ నిధులు జమ చేశారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు తీసుకునే రుణాలకు సంబంధించి చెల్లింపులు సకాలంలో చెల్లిస్తేనే వడ్డీలేని రుణ పథకానికి అర్హత సాధిస్తారు. ప్రతి మూడు నెలలకోసారి రీపేమెంట్లను లెక్కించిన తర్వాత అర్హతలను ఖరారు చేస్తారు. వీఎల్ఆర్ కింద వచ్చిన మొత్తాన్ని పరిశీలించుకోవాలని సెర్ప్ అధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలకు సూచిస్తున్నారు.

'ఆర్టిజన్ల' నిరవధిక సమ్మె వాయిదా

15 రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు డిస్కంల హామీ



మీడియాతో మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు. చిత్రంలో వజీర్, నాగరాజు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ భద్రత కల్పించాలని..అర్హులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14 నుంచి చేపట్టాలని భావించిన నిరవధిక సమ్మెను వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ వజీర్, కోచైర్మన్ గాంబో నాగరాజులు మింట్‌కాంపౌండ్‌లో సమ్మెను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. విద్యుత్ సంస్థల యాజమాన్యాల నుంచి సానుకూల ప్రకటన రావడం, విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు సృష్టించొద్దనే ఆలోచనతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. ఆర్టిజన్లను కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడబోదన్నారు. అయితే తమ సమ్మె నోటీసులపై విద్యుత్ సంస్థల సీఎండీలు స్పందించి, ప్రభుత్వంతో మాట్లాడేందుకు 15 రోజుల సమయం కావాలని కార్మికశాఖను కోరినట్టు తెలిపారు. కార్మికశాఖ అధికారి హామీ మేరకు తాత్కాలికంగా నిరవధిక సమ్మెను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో నరేందర్, లింగం, కోటి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీసీలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వాలి

• మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వాలని బీఆర్ఎస్ మొదటినుంచి కోరుతోందని, రిజర్వేషన్లకు న్యాయపరంగా చిక్కులు రావొద్దని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కురువ విజయ్ కుమార్, సదానందంతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వానికి అసెంబ్లీలో సహకరించినా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష నాయకులను ఢిల్లీకి తీసుకువెళ్లి బీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర తెస్తామని సీఎం అసెంబ్లీలో చెప్పి మాటతప్పారని ఆయన ఆరోపించారు. తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేర్చాల్సిన అవసరం లేదని కేశవరావు ఎలా అంటారని ప్రశ్నించారు.

ఆర్డినెన్స్ తేవడంలో మతలబు ఏంటి?

• బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం వారిని వంచించడమేనని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లు గురించి తేలకముందే ఆర్డినెన్స్ తీసుకురావడంలో మతలబు ఏంటో సీఎం రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి వద్ద రిజర్వేషన్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు గవర్నర్ ఆర్డినెన్స్‌ను ఆమోదిస్తారా? ఒకవేళ ఆమోదించినా కోర్టులో అది నిలబడుతుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. శనివారం ఢిల్లీలోని తన నివాసంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ గణాంకాలను ప్రభుత్వం బయటపెట్టకపోవడాన్ని తప్పుబట్టారు. ఎంత మంది బీసీలు ఉన్నారనేది ముఖ్యం కాదని, బీసీ కులాల్లో ఎంతమందికి రాజకీయ ప్రాతినిధ్యం దక్కిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేసిందని, ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత రిజర్వేషన్లపై కొత్త డ్రామాకు తెరలేపారని ధ్వజమెత్తారు. రోహిత్ వేముల మృతికి రాంచందర్‌రావు కారణమనే కాంగ్రెస్ ఆరోపణల్లో పసలేదని స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేదు

• బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వైఖరి చూస్తుంటే బీసీలను మళ్లీ మోసం చేసే కుట్ర జరుగుతున్నట్లు స్పష్టమవుతోందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు విషయంపై రాష్ట్ర ప్రభుత్వంలోనే స్పష్టత లేదన్నారు. ఆర్డినెన్స్ ఎప్పుడు తెస్తారో చెప్పకుండానే రిజర్వేషన్లు అమలయ్యాయంటూ సంబురాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై పూర్తి స్పష్టత ఇవ్వాలని శంకర్ డిమాండ్ చేశారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం ఒప్పుకోదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, శాసనసభలో కూడా మద్దతుగా నిలిచిందని శంకర్ గుర్తుచేశారు.

బీసీలను అడుగడుగునా అణగదొక్కిన పార్టీ బీఆర్ఎస్

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలను అడుగడుగునా అణగదొక్కిన పార్టీ బీఆర్ఎస్ అయితే, ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించడం సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సీఎల్‌పీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇచ్చి రాజ్యాధికారానికి దూరం చేసిన నాయకుడు కేసీఆర్ అని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ డీఎన్ఏలోనే బీసీ, దళిత వ్యతిరేక భావజాలం ఉందన్నారు. బీసీ సాధికారత కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్, ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లు కల్పించడంపై కవిత సంబురాలు చేసుకున్నందుకు సత్యం ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ఎంపీ అయినప్పటికీ ఆర్.కృష్ణయ్య సీఎం దగ్గరకు వచ్చి అభినందనలు తెలిపారన్నారు. బీజేపీ అధిష్టానం బీసీలకు అన్యాయం చేస్తూ అగ్రకులానికి చెందిన వారికి అధ్యక్ష పదవి ఇచ్చిందని, బీఆర్ఎస్, బీజేపీల్లో సామాజిక న్యాయం జరగదని చెప్పారు.

చూడటానికి ఇరవై ఏళ్లు తక్కువ వాళ్లలా కనిపించే 60-70 ఏళ్ల వాళ్లను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది! వాళ్ల ఫిట్‌నెస్, ఆరోగ్య రహస్యం ఏమై ఉంటుందా అని ఆలోచిస్తాం. క్రమబద్ధమైన వ్యాయామం, కొలతల ప్రకారం ఆహారం, కంటి నిండా నిద్ర, జిమ్ము, స్విమ్మింగ్ ఇవన్నీ కారణాలు కావచ్చు. 'ప్రధాన కారణం మాత్రం వాళ్లు తీసుకుంటున్న ఆహారమే'అని తాజా అధ్యయనం చెబుతోంది. 40, 50లలో మీరేం తింటున్నారన్నది 60, 70లలో మీ ఆరోగ్యం ఎలా ఉండబోతోందో నిర్ణయిస్తుంది అని పరిశోధకులు అంటున్నారు. ప్రముఖ మెడికల్ జర్నల్ 'నేచర్ మెడిసిన్'తాజా సంచికలో వచ్చిన ఈ అధ్యయన వ్యాసం వృద్ధాప్య ఆరోగ్యానికి సరికొత్త నిర్వచనం ఇచ్చింది. - సాక్షి, స్పెషల్ డెస్క్

60–70లలోనూ.. అంతే ఆరోగ్యంగా!





40-50లలో మనం తీసుకునే ఆహారమే ప్రధానం	ఆరోగ్యకరమైన దీర్ఘాయుష్షుకూ అదే రక్షణ కవచం	మలివయసులోనూ ఉల్లాసంగా, ఉత్సాహంగా

మనం తినే ఆహారమే.. మన ఆలోచనను, ఆరోగ్యాన్ని, ఆయుష్షును నిర్ణయిస్తుంది. ముఖ్యంగా 40–50లలో ఉన్నప్పుడు ఆహారం విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇదే విషయాన్ని అధ్యయనాలూ చెబుతున్నాయి. నడి వయసులో ఉన్నప్పుడు ఎంచుకున్న ఆహారం.. మిమ్మల్ని ఆరోగ్యంగా వృద్ధాప్యంలోకి తీసుకెళ్తుంది, వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉంచుతుంది అని అధ్యయనంలో పాల్గొన్న హార్వర్డ్ టి.హెచ్. చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్; కోపెన్‌హెగెన్, మాంట్రియల్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు వెల్లడించారు. దీర్ఘాయుష్షుకు, ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి ఆహారమే కీలకం అని తాము కనుగొన్నట్లు వారు తెలిపారు.


లక్షకుపైగా వ్యక్తులపై అధ్యయనం

ఆరోగ్యకరమైన ఆహారానికి, దీర్ఘాయుష్షుకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోటానికి పరిశోధకులు హార్వర్డ్ టి.హెచ్. చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన రెండు అధ్యయనాల డేటా పరిశీలించారు. అందులో మొదటిది పూర్తిగా మహిళలపై చేసిన 'నర్సెస్ హెల్త్ స్టడీ', రెండోది పురుషులపై చేసిన 'హెల్త్ ప్రొఫెషనల్స్ ఫాలో అప్ స్టడీ'. 30 సంవత్సరాల కాలంలో, 39–69 ఏళ్ల మధ్య వయసు కలిగిన లక్షకుపైగా మహిళలు, పురుషుల ఆహారపు అలవాట్లు, ఆరోగ్య ఫలితాలు ఆ డేటాలో ఉన్నాయి. ప్రత్యామ్నాయ ఆరోగ్యకర ఆహార సూచీ, కేవలం మొక్కల ఆధారిత ఆహార సూచీ, అధిక మధుమేహాన్ని తగ్గించే ఆహార సూచీ, హైపర్‌టెన్షన్‌ను తగ్గించే ఆహార సూచీ.. ఇలా 8 రకాల ఆహార విధానాలతో కూడిన ఆరోగ్య సంబంధ ప్రశ్న పత్రాలు ఇచ్చి, వాటిలో వేటిని పాటించారో రాయమని కోరినప్పుడు వచ్చిన సమాధానాలతో ఆ డేటా తయారైంది. దాన్నే యూనివర్సిటీ పరిశోధకులు విశ్లేషించి, 'ఆహారమే దీర్ఘాయుష్షుకు కారణం'అని కనిపెట్టారు.

విశ్లేషణలో ఏం వెల్లడయింది?

పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, గింజలు, చిక్కుళ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా తీసుకుని.. ప్రాసెస్ చేసిన మాంసం, చక్కెర ఉండే పానీయాలు, ఉప్పు, రిఫైన్డ్ ధాన్యాలు లేదా గింజలు తక్కువగా తీసుకునే 'ప్రత్యామ్నాయ ఆరోగ్యకర ఆహార సూచీ'అన్నింటికంటే అత్యుత్తమమైనదని అధ్యయనంలో తేలింది. భవిష్యత్ దీర్ఘకాలిక తీవ్ర వ్యాధులను నివారించటంలో ఇది మంచి తోడ్పాటును ఇచ్చింది. 70 ఏళ్ల వయసులోనూ దిటువుగా ఉన్నవారు ఈ విధానంలో 86 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారు. తక్కిన విధానాలతో పోలిస్తే ఇది 2.2 రెట్లు ఎక్కువగా వృద్ధాప్యపు ఆరోగ్యానికి ఉపయోగపడింది. అదే సమయంలో కృత్రిమ పదార్థాలు, అధిక చక్కెరలు, సోడియం, సంతృప్త కొవ్వులు, అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకున్నవారి ఆరోగ్య స్థాయిలు తక్కువగా ఉన్నట్లు గమనించారు. సర్వేలో పాల్గొన్నవారిలో 9,771 మంది (9.3 శాతం) తమ వృద్ధాప్యంలోకి చక్కటి శారీరక, మానసిక ఆరోగ్యంతో ప్రవేశించారు.

శాకాహారమే వృద్ధాప్య బలం



దీర్ఘాయుష్షు అంటే పరిశోధకుల ఉద్దేశంలో ఎన్నేళ్లు జీవించామన్నదొక్కటే కాదు.. ఎంత నాణ్యంగా జీవించామన్నది కూడా. శాకాహారాన్ని సమృద్ధిగా తీసుకుంటూ; మాంసాహారాన్ని, అల్ట్రా–ప్రాసెస్డ్ ఫుడ్‌ను మితంగా తీసుకోవటమే శారీరకంగానూ, మానసికంగానూ వృద్ధాప్య ఆరోగ్య సంరక్షణకు కీలకం అని అధ్యయనం స్పష్టం చేసింది.

వృద్ధాప్యానికి చేటు తెచ్చేవి

అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలు.. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసం; చక్కెర ఉండే, డైట్ పానీయాలు ఎక్కువగా తీసుకున్నవారిలో ఆరోగ్యకరమైన వృద్ధాప్యాన్ని పొందే భాగ్యం తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. 'వ్యక్తుల ఆరోగ్యం, ప్రజారోగ్య వ్యవస్థ రెండింటికీ చాలా ప్రాధాన్యం ఉంటుంది కనుక ఆరోగ్యకరమైన వృద్ధాప్యం మీద పరిశోధనలు చాలా అవసరం. భవిష్యత్ ఆహార మార్గదర్శకాలను రూపొందించటానికి ఇవి సహాయపడతాయి'అని కోపెన్‌హెగెన్ విశ్వవిద్యాలయ ప్రజారోగ్య విభాగం ప్రొఫెసర్, హార్వర్డ్ చాన్ స్కూల్‌లోని పోషకాహార పాత్యాంశ నిపుణురాలు మార్తా గ్వాష్ ఫెర్రీ అంటున్నారు. అయితే 'మంచి ఆహారం'అని తాము గుర్తించినది అందరి విషయంలో ఒకే విధంగా ప్రభావం చూపించకపోవచ్చని, అది వ్యక్తుల శారీరక, మానసిక స్వభావాలను బట్టి ఉంటుందని ఈ అధ్యయనంలో పాల్గొన్న సహ పరిశోధకురాలు యానీ జూలీ టెస్సియర్ చెబుతున్నారు.

'ప్రత్యామ్నాయ ఆహార విధానం'

భవిష్యత్ దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో అధికంగా తోడ్పడిన విధానం

ఇవి ఎక్కువ	ఇవి తక్కువ
పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, గింజలు, చిక్కుళ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు	ప్రాసెస్ చేసిన మాంసం, చక్కెర ఉండే పానీయాలు, ఉప్పు, రిఫైన్డ్ ధాన్యాలు లేదా గింజలు

దీర్ఘాయువుకు శత్రువులు



- అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలు
- ప్రాసెస్డ్ మాంసం
- చక్కెర ఉండేవి, డైట్ పానీయాలు

రాహులే ప్రధానిగా ఉంటే.. 48 గంటల్లో బీసీ రిజర్వేషన్లు!

- కేంద్రం నుంచి సాధించుకుని వచ్చేవాడిని
- బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి
- రాష్ట్ర బీజేపీ నేతలు ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలి
- బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే సామాజిక బహిష్కరణ విధించండి
- బీసీ సంఘం నేతలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆది శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, కొండా సురేఖ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'బీసీ రిజర్వేషన్లపై మాకు చిత్తశుద్ధి లేదని కొందరు విమర్శిస్తున్నారు. చిత్తశుద్ధి లేనిది బీజేపీకి. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్ క్రిష్ణయ్య దీన్ని సాధించాలి. మోదీ స్థానంలో రాహుల్‌గాంధీ ప్రధానిగా ఉండి ఉంటే 48 గంటల్లో నేను బీసీ రిజర్వేషన్లను సాధించుకు వచ్చేవాడిని. ప్రధాని మోదీని తెలంగాణకు చెందిన బీజేపీ మంత్రులు ప్రశ్నించాలి. బీజేపీ నాయకులు నిబద్ధతను చూపించాలి'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించినందుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఇతర నాయకులు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో తనను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని అన్నారు. బీసీల వందేళ్ల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందని తెలిపారు. 'కులగణన చేస్తామని భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆయన మాట మాకు శిలాశాసనం. నాయకుడు మాట ఇస్తే దాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత నాది, మా పీసీసీ అధ్యక్షుడిది . ఏడాదిలో పక్కాగా కులగణన పూర్తి చేశాం. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తెలంగాణ మోడల్‌లో కులగణన చేయాలని దేశమంతా చెబుతున్నారు. కులగణనకు వ్యతిరేకమని బీజేపీ గతంలో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జంతర్ మంతర్‌లో నిర్వహించిన ధర్నాకు 16 పార్టీలు మద్దతు ఇచ్చాయి. మనం తీసుకువచ్చిన ఒత్తిడికి లొంగే కేంద్రం 2026లో జరిగే జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించింది. తెలంగాణ నిర్ణయం దేశాన్ని ప్రభావితం చేసింది'అని సీఎం పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే సామాజిక బహిష్కరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకించేవారికి సామాజిక బహిష్కరణ శిక్ష విధించాలని సీఎం పిలుపునిచ్చారు. 'రిజర్వేషన్ల కోసం ఇంకా ఏం చేయాలన్నా నేను సిద్ధం. అర్ధరాత్రి కూడా మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేస్తా. నెల రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంతకాలం ఈ ఎన్నికలు వాయిదా వేశాం. 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని గత కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసింది. ఈ చట్టం చేసినప్పుడు మంత్రులుగా బీసీలైన గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు. కేసీఆర్ ఇప్పుడు వాళ్లను మాపైకి ఉసిగొల్పుతున్నారు. ఆ చట్టంలో పేర్కొన్న 50 శాతం నిబంధనను సవరిస్తూ మేం ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకువచ్చాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది నేను. నాకు తోడుగా ఉండండి. రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలి. రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయవాదులను నియమిస్తా. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్లని, కాగితం పెట్టించిన వాళ్లను సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించండి. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం. అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలు అయితేనే నిజమైన విజయం. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన జెండా కావాలి'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై ప్రభుత్వానికి సూచనలిద్దాం

• రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రి మండలి నిర్ణయించడం మంచి పరిణామమని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్డినెన్స్ జారీ తర్వాత ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా.. రాష్ట్ర బీసీ కమిషన్ సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం బీసీ మేధావులతో బీసీ కమిషన్ సమావేశమై వారి అభిప్రాయాలను, సలహాలను, సూచనలను తీసుకుంది. వీటిని క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని నిరంజన్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, స్పెషల్ ఆఫీసర్ జి.సతీశ్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి.లక్ష్మీనారాయణ, బీసీ మేధావులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌ది మాత్రమే

- స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మక నిర్ణయం
- బీసీ డిక్లరేషన్ సమయంలో జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత
- బీసీ రిజర్వేషన్లపై ఆమె సంబరాలు చేసుకోవటం హాస్యాస్పదం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్




సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. దేశ చరిత్రలోనే బీసీలకు అత్యధికంగా రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సామాజిక న్యాయానికి నాంది పలికే చరిత్రాత్మక ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం, ఆ సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉండటం తన అదృష్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. 'బీఆర్ఎస్‌లో దెయ్యాల పీడ ఉందా? లేక దెయ్యాలే పనిచేస్తున్నాయా?'అనేది కవిత సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె ఏ పార్టీకి చెందినవారో ప్రజలకు అర్థం కావడం లేదని, కాంగ్రెస్ ప్రకటించిన రిజర్వేషన్లపై కవిత సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రంగులు, వేషాలు మార్చినంత మాత్రాన పిల్లి పులి కాదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో నైతికత ఉండి ఉంటే కవిత ఇప్పటివరకు రాజీనామా చేసి ఉండాల్సిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సమయంలో ఆమె లిక్కర్ కుంభకోణంలో ఊచలు లెక్కపెడుతున్నారని ఎద్దేవా చేశారు.

బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదు

బీజేపీకి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిని బీసీ నేతకు ఇవ్వకుండా అగ్రవర్ణాలకు కట్టబెట్టినప్పుడే ఆ పార్టీ చిత్తశుద్ధి తేలిపోయిందని అన్నారు. బీసీలు ఇప్పుడు వారి వాటా వారు అడిగే స్థాయికి వచ్చారని చెప్పారు. అసాధ్యమనుకున్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధ్యం చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ మా చాంపియన్.. మా హీరో రాహుల్ గాంధీ.. మేమంతా రాహుల్ సైనికులం అని పేర్కొన్నారు. ఇక ఎవరు దొంగలు, ఎవరు హీరోలు అనేది తెలంగాణ ప్రజలు తేలుస్తారని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలుకు తాము ఎంతగా కట్టుబడి ఉన్నామో ప్రతి ఒక్కరికీ తెలుసునని అన్నారు.

వికసిత్ తెలంగాణ బీజేపీతోనే సాధ్యం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధం చేస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: వికసిత్ తెలంగాణ బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ధర్మయుద్ధాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యుద్ధంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా ఈ యుద్ధం సాగుతుందని వ్యాఖ్యానించారు. అసంబద్ధమైన హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. తనకు న్యాయవాదులతో అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. 1993లో తార్నాకలో ఓ షాపును 100 మంది రిజర్వ్ పోలీసులు ధ్వంసం చేస్తున్నప్పుడు తను ఆ చర్యను అడ్డుకున్నానని, దీంతో తనపై లాఠీ చార్జ్ చేశారని, అరెస్ట్ చేసి కేసు కూడా నమోదు చేశారని రాంచందర్‌రావు గుర్తుచేశారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి రెండు నెలల పాటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నానని, ఆ సమయంలో ఉమ్మడి ఏపీలో న్యాయవాదులు 43 రోజుల పాటు కోర్టులను బహిష్కరించారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి ప్రత్యేక రాష్ట్ర బిల్లుకు అత్యంత కీలకమైన మద్దతు బీజేపీ ఇచ్చిందని, బీజేపీ మద్దతు ఇవ్వకుంటే ప్రత్యేక రాష్ట్రం సాధ్యం కాదనేది చరిత్ర అన్నారు. తెలంగాణ బిల్లుకు పార్లమెంటులో న్యాయపరంగా ఇబ్బందుల్లేకుండా పాస్ చేసే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర కీలకమైందని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

> సూర్యునిక్రింద జరుగుచున్న క్రియల నన్నిటిని నేను చూచితిని;
> అవి అన్నియు వ్యర్థములే, అవి యొకడు గాలికై ప్రయాస పడినట్టున్నవి.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** బ.తదియ రా.1.11 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** శ్రవణం ఉ.7.45 వరకు తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.11.44 నుండి 1.20 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.50 నుండి 5.42 వరకు, **అమృత ఘడియలు:** రా.9.20 నుండి 10.55 వరకు.

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం : 6.35
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మోహన్ భాగవత్ (ఆరెస్సెస్ చీఫ్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

శ్రీ మోదీజీకి, నాకు ఈ ఏడాదితో 75 నిండుతాయి. నేను ఆయన కన్నా ఓ ఆరు రోజుల ముందు డెబ్బై ఐదును దాటేస్తాను.

డెబ్బై ఐదేళ్లు పూర్తయిన వాళ్లు పదవి నుంచి హుందాగా తప్పుకుని, తర్వాతి వాళ్లకు సగౌరవంగా దారివ్వాలనేమీ ఆరెస్సెస్‌లో రూలు లేదు. రాజ్యాంగమూ లేదు కనుక, రిటైర్మెంట్ ప్లాన్‌ల గురించి చింతపడే అవసరం డెబ్బై ఐదు దాటిన ఆరెస్సెస్ చీఫ్‌లకు ఏ రోజూ ఉండదు.

'ఏజ్ ఈజ్ జస్ట్ ఎ నంబర్' అంటారు! ఆరెస్సెస్‌లో ఏజ్ అసలు నంబరే కాదు. బాలాసాహెబ్ దేవరస్ డెబ్బై ఐదు దాటాక కూడా మూడేళ్లు ఆరెస్సెస్ చీఫ్‌గా ఉన్నారు. రజ్జూ భయ్యా డెబ్బై ఐదు దాటాక కూడా ఐదేళ్లు చీఫ్‌గా ఉన్నారు. కేఎస్ సుదర్శన్ డెబ్బై ఐదు దాటాక కూడా మూడేళ్లు చీఫ్‌గా ఉన్నారు.

బీజేపీలో కూడా ఈ డెబ్బై ఐదు అన్నది అసలు ఒక నంబరే కాకపోయేది. కానీ శ్రీ మోదీజీ వచ్చి అత్యవసరంగా దానికొక నంబర్ హోదాను కల్పించారు.



డెబ్బై ఐదు దాటిన అద్వానీని, మురళీ మనోహర్ జోషిని, జశ్వంత్ సింగ్‌ని మార్గదర్శకులుగా మార్చి, రాజకీయాల నుంచి వీడ్కోలు ఇప్పించారు. డెబ్బై ఐదు దాటిన ఎవరికైనా "నో టిక్కెట్" అన్నారు. డెబ్బై ఐదు దాటాయని గుజరాత్ సీఎం ఆనందీబెన్ పటేల్‌ను మధ్యలోనే కుర్చీలోంచి లేపేశారు. ఇప్పుడా డెబ్బై ఐదు అటు తిరిగి ఇటు తిరిగి శ్రీ మోదీజీ వైపే ఒక గ్రహ శకలంలా రాబోతోంది.

ఆ గ్రహ శకలం ఆయన్ని ఢీ కొంటుందా, లేక ఆయనే ఆ గ్రహ శకలాన్ని ఢీ కొంటారా అన్నది సెప్టెంబర్ 17న కానీ తెలీదు. ఆ రోజు శ్రీ మోదీజీ బర్త్ డే.

"డెబ్బై ఐదు అన్నది మోదీజీ నిర్ణయమే తప్ప, ఆయన పెట్టిన నియమం కాదు" అని అమిత్ షా ఎప్పటికప్పుడు పార్టీని, ప్రతిపక్షాలను నెట్టుకొస్తున్నారు. అందుకు ఆయనను అభినందించాలి.

ఆరెస్సెస్ వందేళ్ల వేడుకలకు మార్చిలో శ్రీ మోదీజీ నాగపూర్ వచ్చినప్పుడు ఆయన ఎంతో భావోద్వేగంతో కనిపించారు. ఆరెస్సెస్‌ను ఒక పెద్ద మర్రిచెట్టుతో పోల్చారు.

ఆరెస్సెస్ కూడా శ్రీ మోదీజీని చూసి అదే స్థాయిలో భావోద్వేగానికి గురైంది. ముఖ్యంగా నేను గురయ్యాను. పదవిలో ఉండగా ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన తొలి భారత ప్రధాని శ్రీ మోదీజీ!

అటల్‌జీ ఓడిపోయి, బీజేపీ నిర్వేదంలో మునిగి ఉన్నప్పుడు, పార్టీకి ప్రధాని అభ్యర్థిగా నేను చేసిన ఎంపికే శ్రీ నరేంద్ర మోదీజీ. నేను నాటిన మహా మర్రి ఆయన.

శ్రీ మోదీజీ నాగపూర్ వచ్చి ఢిల్లీ వెళ్లిపోగానే ఇక్కడ ముంబైలో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ మొదలు పెట్టేశారు! "డెబ్బై ఐదు నిండాక కూడా ప్రధానిగా కొనసాగేందుకు పర్మిషన్ కోసం మోదీ నాగపూర్ వచ్చి, మోహన్ భాగవత్‌ను కలిసి వెళ్లారు" అని!!

నిజానికి శ్రీ మోదీజీ, నేను ఆ రోజు మాట్లాడుకున్నది భారత స్వాతంత్ర్య దినోత్సవానికి 2047లో రానున్న వందేళ్ల గురించే కానీ, 2025లో భారత ప్రధానికి నిండనున్న డెబ్బై ఐదేళ్ల గురించి కాదు.

ఆరెస్సెస్ సిద్ధాంత కర్త మోరోపంత్ పింగ్లే అనేవారు... డెబ్బై ఐదు దాటాయని మీకెవరైనా శాలువా కప్పితే దానర్థం మీరిక విశ్రాంతి తీసుకోవాలనీ, కొత్తవారికి అవకాశం ఇవ్వాలనీ!

పింగ్లేకి డెడికేట్ చేసిన ఒక సభలో మొన్న నేను ఈ మాట గుర్తు చేసుకున్నప్పుడు, వెంటనే కాంగ్రెస్ నా మాటను బంతిలా క్యాచ్ పట్టేసింది. "చూశారా, మోదీని దిగిపొమ్మని మోహన్ భాగవత్ ఎంత సంకేతంగా చెబుతున్నారో..." అని ప్రచారం మొదలు పెట్టింది.

అదే రోజు వేరొక సభలో అమిత్ షా – తను రిటైర్ అయ్యాక వేదాలు, ఉపనిషత్తులలో పడిపోతానని, ప్రకృతి వ్యవసాయం చేస్తానని అన్నారు! సహకార సంఘాల మహిళలతో మాట్లాడే సందర్భంలో ఆయన అలా అన్నారు.


నేనైనా, అమిత్ షా అయినా సందర్భాన్ని బట్టే మాట్లాడాం. అయితే మా రెండు సందర్భాలూ... ఏ మాత్రం సమయం, సందర్భం కానీ టైమ్‌లో వచ్చిపడ్డాయంతే!

విద్యారంగంపై విషపు చూపు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



> పేదల విద్యాసాధికారత మీద ఇన్ని కుట్రలు చేసిన తెలుగుదేశం పెద్దల పుర్రెల్లో 'తల్లికి వందనం' ఆలోచన పుట్టిందని చెప్పడం కంటే హాస్యాస్పద విషయం ఇంకేముంటుంది? 'నాడు–నేడు' కార్యక్రమాన్ని నిలిపివేయడం, జగన్ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను క్రమంగా ఉపసంహరించడం, మధ్యాహ్న భోజన పథకాన్ని నీరుగార్చడం వంటివన్నీ ఉద్దేశ పూర్వక చర్యలేనని అభిజ్ఞ వర్గాల సమాచారం. ఈ చర్యలు ఇంకా చురుగ్గా సాగుతాయట! రెండో దశలో ఇంకో ప్రచారం మొదల వుతుంది. ప్రైవేట్ స్కూళ్లలో చదివినా తల్లికి వందనం వస్తున్నప్పుడు సౌకర్యాలు లేని ప్రభుత్వ స్కూళ్లలో ఎందుకు చదవాలని టముకు వేస్తారు. చేరగలిగిన వాళ్లంతా ప్రైవేట్‌కు మారిన తర్వాత అసలు కథ మొదలవుతుంది. ప్రైవేట్ స్కూళ్లలో చదివించే స్థోమత కలిగిన వారికి ప్రభుత్వ సాయమెందుకని పెంపుడు మీడియానే ప్రశ్నిస్తుంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు. విద్య ప్రభుత్వం బాధ్యత కాదనే చంద్రబాబు మాట నెగ్గి ప్రైవేట్ విద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. నాణ్యమైన విద్యకు దూరమైన శ్రామిక వర్గాల పిల్లలు చౌక శ్రామికులుగానే మిగిలిపోతారు.

ఆయనో గాడిదను చూపెడతారు. దాన్ని గుర్రం అనాలంటారు. ఔనౌను అది గుర్రమేనని పెంపుడు మీడియా నమ్మబలుకుతుంది. తామేది చెబితే జనం దాన్నే నమ్మాలనే నియమావళిని ఆయన అమల్లోకి తెచ్చారు. అయ్యయ్యో, అది గుర్రం కాదు గాడిదని అమాయకంగా ఎవరైనా అరిస్తే వారి మీద పెంపుడు మీడియా దండుపాళ్యం బ్యాచ్ అనే ముద్రను వేస్తుంది. ఆ దండుపాళ్యం బ్యాచ్‌ను దండించడానికి ఖాకీ మూక కదులుతుంది. దేశంలో ఉన్న అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఆయనొకరు. ముఖ్యమంత్రి కుర్చీతో నాలుగు విడతలుగా పదిహేనేళ్ల సావాసముంది. అయినా పచ్చి అబద్ధాలను పబ్లిగ్గా వల్లెవేయడానికి ఇప్పటికీ వెనకాడటం లేదు.

ఎందుకంటే, ఆయనకది అబ్బొచ్చిన విద్య. ఆ విద్యతోనే రాజకీయంగా తనను తాను ప్రమోట్ చేసుకున్నారు. పెంపుడు మీడియా అండదండగా నిలబడింది. ఇతరులకు దక్కవలసిన ఘనతను లాఘవంగా లాగేసుకోవడంలో, ఇతరుల మెడలో వేయాల్సిన వీరతాళ్లను తన మెడలో వేసుకోవడంలో ఆయన ప్రదర్శించే దిగ్భ్రాంతికరమైన చొరవ జగమెరిగిన సత్యమే. ఆయన వయసు డెబ్బై ఐదు దాటింది. ఇంకో పదిహేనేళ్లు ఆయన నాయకత్వంలోనే పని చేస్తానని పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారు. పవన్ కల్యాణ్ శిరోధార్యంగా తలపోసే సనాతన ధర్మంపై సర్వహక్కులున్న ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ మాత్రం మరోరకంగా ఆలోచిస్తున్నారు. సెవెంటీ ఫైవ్ దాటిందంటే శాలువా కప్పుకొని తప్పుకోవలసిందేనని ఆయన కుండబద్దలు కొడుతున్నారు.

ఆరెస్సెస్ బాస్ విధిస్తున్న ఈ సెవెంటీ ఫైవ్ డెడ్‌లైన్‌పై భారత రాజకీయాల్లో ఈ సంవత్సరం పెద్ద చర్చే జరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో మన సెవెంటీ ఫైవ్ ప్లస్ బాబు కూడా తననింతటి వాడిని చేసిన గోబెల్స్ వ్యూహాన్ని తన వారసుడి కోసం కూడా అమలు చేయడం మొదలుపెట్టాడు. అమెరికా వాళ్లు ఇటీవల ఇరాన్ మీద ప్రయోగించిన బంకర్ బస్టర్ లాంటి బాంబునొకదాన్ని సత్యసాయి జిల్లా కొత్తచెరువు స్కూల్లో చంద్రబాబు జారవిడిచారు. అడపాదడపా ఇలా బాంబులేయడం రివాజే కనుక పెద్దగా గగ్గోలు పుట్టలేదు కానీ, ఈ రకమైన క్షుద్ర రాజకీయాలను ఇంకో తరం కూడా భరించవలసిందేనా అనే ఆందోళన మాత్రం మొదలైంది.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన విప్లవాత్మక కార్యాచరణలో 'అమ్మఒడి' అనే పథకం అతి ముఖ్యమైన అంశం. 2014 ఎన్నికలకు ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలోనే ఆయనీ వాగ్దానం చేశారు. 2019లో గెలిచిన తర్వాత అమలు చేయడం, దీనిపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురవడం తెలిసిన విషయాలే. చంద్రబాబు ఈ పథకం పేరు 'తల్లికి వందనం'గా మార్చి మరింత గొప్పగా చేస్తానంటూ తన సూపర్ సిక్స్ ఎన్నికల హామీల్లో చేర్చారు. ఏడాది ఎగనామం తర్వాత ఆంక్షల వర్తింపుతో అమల్లోకి తెచ్చి ఆ వీరతాడును మీడియా కెమెరాల సాక్షిగా తన కుమారుడి మెడలో వేశారు. పాఠశాల పిల్లలతో మాట్లాడుతూ "'విద్యామంత్రి బాగా చదువుకున్నారు. మంత్రయ్యారు. ఇప్పుడు మీకోసం 'తల్లికి వందనం' అనే ఆలోచన ఆయనే చేశారు''ని నిస్సంకోచంగా చెప్పుకొచ్చారు. ఆ విధంగా తన గోబెల్స్ బాటన్‌ను మరుసటి తరం చేతికి అందజేశారు.

'మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్' అనే మరో గిన్నీస్ బుక్ కార్యక్రమం ఈ వేదికకు వేదికైంది. విద్యార్థుల డేటాబేస్‌ను నిర్వహించే కేంద్ర ప్రభుత్వ సంస్థ లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 87 లక్షలమంది విద్యార్థులుండాలి. ప్రతి విద్యార్థికీ 'తల్లికి వందనం' స్కీమును వర్తింపజేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం 67 లక్షలమందినే లెక్క తేల్చింది. అందులో తల్లికి వందనం నిధులు 60 లక్షల లోపు విద్యార్థులకే అందినట్టు లెక్కలున్నాయి. మెగా పీటీఎమ్ రికార్డు బ్రేకింగ్ కార్యక్రమానికి 61 వేల పాఠశాలల్లోని 74 లక్షలమంది విద్యార్థులు పాల్గొన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వారి తల్లిదండ్రులతో సహా 2 కోట్ల 30 లక్షల మంది హాజరై రికార్డు సృష్టించినట్టు చెప్పారు. 67 లక్షల మంది పిల్లల లెక్క తీసుకున్నప్పుడు తల్లుల సంఖ్యను 42 లక్షలుగా చూపెట్టారు. 74 లక్షలకు అదే నిష్పత్తితో లెక్కిస్తే తల్లుల సంఖ్య 46 లక్షలవుతుంది. అదే సంఖ్యలో తండ్రులు కూడా హాజరై ఉంటారు. 3 లక్షల పైచిలుకు టీచర్లు హాజరయ్యారు. అంతా కలిపి 1 కోటీ 69 లక్షలు. ఇంకో 60 లక్షలమంది పరిశీలకులూ, దాతలని పేర్కొన్నారు. సగటున ప్రతి పాఠశాలకు వందమంది వీరే. కొన్ని ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థుల సంఖ్య కంటే దాతల సంఖ్యే ఎక్కువ కనిపించడం గిన్నీస్ బుక్‌లో చేర్చాల్సిన అసలు విషయం.

విద్య ప్రభుత్వ బాధ్యత కాదు, కార్పొరేట్ సంస్థలే చూసుకోవాలన్న చంద్రబాబు కొటేషన్ మరీ పాతదేం కాదు. ఆరేడేళ్ల కిందటిదే. ఇంతలోనే ఈ బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేయడం కోసం ఆయన తన ఫిలాసఫీని వదిలేసుకున్నారా? ఎంతమాత్రమూ కాదు. ఇది నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించడం అనే డబుల్ యాక్షన్ ప్లాన్. ఈ పథకాన్ని అమలు చేసే నాటికే ప్రభుత్వ బడుల్లో నాలుగు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు మెరుగుపరిచే 'నాడు–నేడు' కార్యక్రమం ఆగిపోయింది. విద్యార్థుల పౌష్టికాహారం కోసం 16 రకాల పదార్థాలతో జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించిన 'గోరుముద్ద' పథకం స్థానంలో బొద్దింకల భోజనం స్వయంగా మంత్రుల అనుభవంలోకే వచ్చింది. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం కోసం ప్రాథమిక స్థాయిలోనే జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సబ్జెక్ట్ టీచర్ బోధన ఎగిరిపోయింది. విద్యార్థులు లేక 4,700 పాఠశాలలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం వైసీపీ సర్కార్ వెయ్యి స్కూళ్లలో ప్రారంభించిన సీబీఎస్ఈ బోధనను చంద్రబాబు – లోకేశ్‌ల సర్కార్ తొలగించింది. వారి నైపుణ్యానికి పదును పెట్టే టోఫెల్ శిక్షణను మాయం చేశారు. నగరాల్లో ఉన్నత వర్గాల వారు వారి పిల్లలకోసం లక్షలు గుమ్మరించి చెప్పించే ఐబీ సిలబస్‌ను పేద పిల్లలకు ఉచితంగా నేర్పించాలన్న జగన్ సంకల్పానికి గండికొట్టారు. పేద విద్యార్థులు కూడా డిజిటల్ ప్రపంచంలో ముందడుగు వేయాలన్న లక్ష్యంతో ఎనిమిదో క్లాసు విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేయడం ప్రారంభించింది జగన్ ప్రభుత్వం. ఆయన హయాంలో సుమారు పది లక్షలమంది చేతుల్లోకి ట్యాబ్‌లు వచ్చాయి. ఈ కార్యక్రమాన్ని నిర్దాక్షిణ్యంగా ఆపేసి, పేద బిడ్డల్ని డిజిటల్ ప్రపంచానికి దూరం చేసే కుట్రను అమలుచేశారు. పేద ప్రజల పిల్లల్ని ఐక్యరాజ్యసమితి వేదికపై నిలబెట్టిన ఇంగ్లిష్ మీడియం బోధనకు వ్యతిరేకంగా ఎన్ని కుట్రలు చేశారో, ఎంతమంది కుహనా సాంస్కృతిక రాబందుల్ని రంగంలోకి దింపారో, పేద పిల్లల నోటి దగ్గరి 'నాణ్యతా' ముద్దను తన్నేయడానికి ఎన్ని గద్దలు ఎగిరాయో ఈ సమాజం జ్ఞాపకాల్లోంచి అంత త్వరగా చెరిగిపోయేవి కావు.

పేదల విద్యాసాధికారత మీద ఇన్ని కుట్రలు చేసిన తెలుగుదేశం పెద్దల పుర్రెల్లో 'తల్లికి వందనం' ఆలోచన పుట్టిందని చెప్పడం కంటే హాస్యాస్పద విషయం ఇంకేముంటుంది? 'నాడు–నేడు' కార్యక్రమాన్ని నిలిపివేయడం, జగన్ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను క్రమంగా ఉపసంహరించడం, మధ్యాహ్న భోజన పథకాన్ని నీరుగార్చడం వంటివన్నీ ఉద్దేశ పూర్వక చర్యలేనని అభిజ్ఞవర్గాల సమాచారం. ఈ చర్యలు ఇంకా చురుగ్గా సాగుతాయట! రెండో దశలో ఇంకో ప్రచారం మొదలవుతుంది. ప్రైవేట్ స్కూళ్లలో చదివినా తల్లికి వందనం వస్తున్నప్పుడు సౌకర్యాలు లేని ప్రభుత్వ స్కూళ్లలో ఎందుకు చదవాలని టముకు వేస్తారు. చేరగలిగిన వాళ్లంతా ప్రైవేట్‌కు మారిన తర్వాత అసలు కథ మొదలవుతుంది. ప్రైవేట్ స్కూళ్లలో చదివించే స్థోమత కలిగిన వారికి ప్రభుత్వ సాయమెందుకని పెంపుడు మీడియానే ప్రశ్నిస్తుంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు. విద్య ప్రభుత్వం బాధ్యత కాదనే చంద్రబాబు మాట నెగ్గి ప్రైవేట్ విద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. నాణ్యమైన విద్యకు దూరమైన శ్రామిక వర్గాల పిల్లలు చౌక శ్రామికులుగానే మిగిలిపోతారు.

బాల్యంలో వేగంగా నేర్చుకునే వయసులో ఉన్నప్పుడు వారికి అందే విద్యా ప్రమాణాలే వారి ఐక్యూ స్థాయిలను నిర్ధారిస్తాయని అనేక సర్వేలు వెల్లడించాయి. పోషకాహార లేమి వేగంగా నేర్చుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని కూడా చాలాకాలంగా నిపుణులు చెబుతున్నారు. ఉన్నత స్థాయి బోధనా పద్ధతులు, డిజిటల్ పరిజ్ఞానం, పౌష్టికాహారం కొంత మందికి మాత్రమే అందుబాటులో ఉండి ఎక్కువమంది బాలలకు అందని ద్రాక్షలుగా ఉన్న దేశాలు ఐక్యూ ర్యాంకుల్లో వెనుకబడి ఉండటానికి కారణం అదే. విద్యా వ్యవస్థపై శాస్త్రీయమైన మదింపు చేసిన తర్వాతనే జగన్ మోహన్‌రెడ్డి మన పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమేనని తన ప్రసంగాల్లో, సందేశాల్లో పదేపదే ప్రస్తావించేవారు. జగన్, చంద్రబాబుల దృక్పథంలో ఉన్న మౌలికమైన తేడా ఇదే! పేద, ధనిక, కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ తేడాల్లేకుండా చదువు అనే ఆస్తి అందరికీ సమకూరాలనేది జగన్‌మోహన్ రెడ్డి తాత్విక భూమిక. చదువు అనే ఆస్తి కూడా కొనుగోలు చేయగలిగినవాడికే చెందాలనేది చంద్రబాబు విచార ధార. అందుకే దాన్ని ప్రభుత్వ బాధ్యతగా కాకుండా కార్పొరేట్ బాధ్యతగా వర్గీకరించారు. 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో కాకుండా ఒక ఎరగా వేశారని నిపుణులు అభిప్రాయపడుతున్నది కూడా అందుకే!

ఈ మౌలికమైన తేడా ఇప్పుడు ఉపాధ్యాయుల అనుభవంలోకి కూడా వచ్చినట్టుంది. మొన్నటి మెగా పీటీఎమ్ కార్యక్రమాన్ని ఒక ఈవెంట్‌లా నిర్వహిస్తున్నారంటూ వారి సామాజిక మాధ్యమ గ్రూపుల్లో విమర్శలు వెల్లువెత్తాయి. అందులో ఒక్క పోస్టును క్లుప్తంగా గమనిస్తే వారి అభిప్రాయం ఏమిటో తేటతెల్లమవుతుంది. "బాబుగారూ, లోకేశ్‌గారూ... మీరు ఈ సమావేశంలో కూర్చున్న బెంచీలు మీ ప్రభుత్వం ఇచ్చినవి కావు. మీ ఎదురుగా వున్న ఐఎఫ్‌పీ ప్యానెళ్లు మీరు ఏర్పాటు చేయలేదు. పైన తిరుగుతున్న ఫ్యాను, వెలుగుతున్న లైటూ కూడా మీరిచ్చినవి కావు. మిగిలిన నాలుగేళ్లయినా ఈ పనికిమాలిన సమావేశాలు మానేయండి. టీచర్ల కాలాన్ని వృథా చేయకండి. పిల్లల భవిష్యత్తును నాశనం చేయకండి. ఉపాధ్యాయుల్ని మీ కూటమి ప్రభుత్వం ఈవెంటు మేనేజర్లుగా మార్చేస్తున్నది. పిల్లల తల్లిదండ్రులతో టీచర్ల సమావేశాలు ప్రతినెలా జరుగుతూనే ఉన్నాయి. దయచేసి ఈ కార్యక్రమాన్ని రాజకీయ కార్యక్రమంగా మార్చవద్దు. ముఖ్య విషయం: పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మీరు పాఠశాలలకు చేసిన మేలు ఒక్కటంటే ఒక్కటైనా ఉన్నదా?... చెప్పండి సీ.ఎం. సారూ!"

vardhelli1959@gmail.com

కలయిక సరే... లాభం ఎవరికి?

సందర్భం



జిల్లా గోవర్ధన్

జూలై 9 నాటి, సాక్షి పత్రిక సంపాదకీయం– 'ఠాక్రే సోదరుల యుగళం' చదివాక, మరిన్ని వాస్తవాలు తెలియజేయటానికి ఈ విశ్లేషణ. మరాఠీ అస్మిత (ఉనికి), మరాఠీ యువత ఉద్యోగావకాశాల కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా 1966 జూన్ 19న ఏర్పాటైన శివసేన 'మరాఠీ మాన సాంచా హక్ ఆని న్యాయ సాఠీ' (మరాఠీ వాళ్ళ న్యాయమైన హక్కుల కోసం) అనే నినాదం ఆ రోజుల్లో యువతను ఆకట్టుకుంది. భూమి పుత్రుల (సన్స్ ఆఫ్ సాయిల్) ఉద్యోగ సమస్యలు పరిష్కరిస్తూ, చట్ట సభలో వారి గొంతు వినిపించాలని మొదట ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌కు, తర్వాత విధాన సభకు ప్రతినిధులన పంపటంతో రాజకీయాలతో ప్రమేయం లేని శివసేన, రాజకీయ రంగు పులుముకుంది.

1960, 1970 దశకాలలో కమ్యూనిస్టులకు నిలయం బొంబాయి నగరం అనేవారు. శివసేన రాకతో క్రమేణా కమ్యూనిస్టులు ఈ నగరంలో తెరమరుగు కావటం అప్పట్లో కాంగ్రెసుకు కూడా కలిసొచ్చింది. 1984 నుండి రైట్ వింగ్ జాతీయ పార్టీ అయిన భాజపాతో చేతులు కలిపిన శివసేన 1995లో కాషాయ కూటమితో మహారాష్ట్రలో (శివ షాహి) అధికారం చేజిక్కించుకుని, రాష్ట్రంలో కాంగ్రెసుకు ముఖ్య విరోధిగా ఎదిగింది. సుమారు నాలుగు దశాబ్దాలు పార్టీ అధినేత బాలా సాహెబ్ ఠాక్రే, సర్వం తానై పార్టీని రిమోట్ కంట్రోల్ శైలిలో, పకడ్బందీగా నడిపించారు (అడపా దడపా వలసలు మినహా).

బాల్ ఠాక్రే సోదరుడు శ్రీకాంత్ కొడుకు స్వరరాజ్. ఈయన్నే రాజ్ అని పిలుస్తారు. చిన్నప్పటి నుండీ సాహెబ్‌తో చనువుగా ఉండేవాడు. తొమ్మిది పదేళ్ల ప్రాయం నుండే అతడిని తన ఒడిలో కూర్చోబెట్టుకుని పార్టీ మీటింగుకు తరచుగా హాజరయ్యేవారు బాల్ ఠాక్రే. పెద నాన్న ముఖకవళికలు కలిగిన రాజ్ ఆయనలాగే పొలిటికల్ కార్టూన్లు గీయటం హాబీగా చేసుకున్నారు. బాలా సాహెబ్ హావభావాలు, ఆయన ఉపన్యాస శైలి, బాడీ లాంగ్వేజ్‌ను అప్పటినుండే పుణికిపుచ్చుకున్న రాజ్‌ను, కాలేజీ రోజుల్లోనే శివసేన విద్యార్థి విభాగం 'భారతీయ విద్యార్థి సేన' చీఫ్‌గా నియమించి రాజకీయ సెలయేటిలోకి దించారు బాలా సాహెబ్. 1990 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధినేతకు కుడి భుజంగా మెదిలిన రాజ్‌ను... ముందు అతడే పార్టీ పగ్గాలు చేపట్టే సాహెబ్ వారసుడు అని అప్పట్లో కార్యకర్తలు చెప్పుకోసాగారు. మరాఠీ యువతకు కొత్త ఒరవడి చూపిస్తూ, పార్టీలోకి వారిని చేర్చుతూ నవ చైతన్యం ప్రోదిచేశారు రాజ్.

అయినా, పుత్ర వాత్సల్యం ప్రభావమో, మరే కారణమో తెలియదు కానీ రాజకీయాలకు బహుదూరంగా ఉన్న తన చిన్న కొడుకు ఉద్ధవ్ ఠాక్రేను 2002 నుండి రాజకీయాల వైపు మరల్చటం మొదలెట్టారు బాలా సాహెబ్. 2003లో జరిగిన శివసేన కార్యకర్తల శిబిర్‌లో ఉద్ధవ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటుగా నియమించారాయన. అది రాజ్‌కు అస్సలు మింగుడు పడలేదు. ఆ లగాయతు పార్టీలో ఉద్ధవ్, రాజ్ మధ్య అంతర్గత యుద్ధం ముదిరింది.



◆ రాజ్ ఠాక్రే, తన అన్నయ్య ఉద్ధవ్‌తో రాజకీయ మైత్రి నెరపడానికి కారణం ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఓటు బ్యాంక్‌కు చెక్ పెట్టడమే కావచ్చు. అయితే ఈ కలయిక 'మహా వికాస్ అఘాడీ' కూటమిని కూడా ఇరకాటంలో పడేసింది. ఠాక్రే సోదరులు కలిసిపోయే ఎపిసోడ్‌కు స్క్రిప్ట్ రైటర్ బీజేపీ నాయకుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీసే అంటున్న స్థానిక విశ్లేషకుల మాటా గమనార్హమే!

చివరికి 2005 నవంబర్‌లో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి, నాలుగు నెలల తర్వాత (మార్చి 2006) సొంత కుంపటి, 'మహారాష్ట్ర నవ నిర్మాణ సేన' (ఎమ్ఎన్ఎస్) ఏర్పాటు చేసుకున్నారు రాజ్ ఠాక్రే. కానీ, రాజ్‌కు అనుకున్న ఫలితం దక్కలేదు. ఎమ్ఎన్ఎస్ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 13 సీట్లతో ఖాతా తెరిచింది. అయితే శివసేన ఓట్లను చాలా వరకు చీల్చింది. ఆ తర్వాత 2014, 2019ల్లో కేవలం ఒక్క సీటుకే పరిమితమై, మొన్నటి 2024 ఎన్నికల్లో 1.55 ఓటింగ్ శాతంతో ఆ ఒక్క సీటును సైతం పోగొట్టుకుంది.

గత ఇరవై సంవత్సరాల నుండి ఉత్తర–దక్షిణ ధ్రువాలుగా ఉన్న ఈ సోదరులు మొన్నటి (జూలై 5) హిందీభాష వ్యతిరేక ఉద్యమ విజయోత్సవ ర్యాలీలో ఒకే వేదిక పైకి వచ్చినప్పటికీ, రాజ్ ఠాక్రే వ్యవహార తీరులో అనుకున్న స్పందన కనిపించ లేదని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. రాజ్ దూకుడు వైఖరి, ఉద్ధవ్ నిదానమే ప్రధానం పద్ధతి వల్ల రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఇరుపార్టీలూ సీట్లు సర్దుబాటు చేసుకుని, ఓటర్ల ముందుకు రావటం క్లిష్ట సమస్యే కావచ్చు. అదీకాక, ఉద్ధవ్ కొడుకు, మాజీ మంత్రి ఆదిత్య; రాజ్ కొడుకు అమిత్ (మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు)ల రాజకీయ భవిష్యత్తులు కూడా ఈ కలయిక నేపథ్యంలో ఆలోచించాల్సిన మరో కోణం.

కాంగ్రెస్ దోస్తీ పుణ్యమా అని శివసేన (ఉద్ధవ్) పార్టీకి గత లోక్‌సభ ఎన్నికల్లో మైనారిటీ ఓట్లు చాలానే కలిసి వచ్చాయి. ఇప్పుడు ఆ పార్టీకి ఎమ్ఎన్ఎస్‌తో స్నేహం కారణంగా ఆ మైనారిటీ ఓట్లే కాక ఉత్తర భారతీయుల ఓట్లు కూడా మున్ముందు దూరం కావచ్చు. 'రాజ్ ఠాక్రే బహిరంగ సభలో జనాన్ని ఆకర్షించవచ్చు కానీ, ఆయన భాషణ్ బ్యాలెట్ లోకి ఓట్లను తేలేద'ని సీనియర్ మరాఠా అధినేత, శరద్ పవార్ గతంలో ఒకసారి ఘంటాపథంగా చెప్పారు. అది వాస్తవం కూడా. ఏది ఏమైనా రాజ్ ఠాక్రే, తన అన్నయ్య ఉద్ధవ్‌తో రాజకీయ మైత్రి నెరపడానికి కారణం ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఓటు బ్యాంక్‌కు చెక్ పెట్టడమే కావచ్చు. అయితే ఈ కలయిక 'మహా వికాస్ అఘాడీ' కూటమిని కూడా ఇరకాటంలో పడేసింది. చివరిగా, ఠాక్రే సోదరులు కలిసిపోయే ఎపిసోడ్‌కు స్క్రిప్ట్ రైటర్ రాష్ట్ర బీజేపీ నాయకుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీసే అని అంటున్న స్థానిక విశ్లేషకుల మాటా గమనార్హమే!

వ్యాసకర్త విశ్రాంత పీఎఫ్ కమిషనర్, ముంబై
మొబైల్ : 98190 96949

చెప్పుడు మాటలు

శ్రీరామ యువరాజ పట్టాభిషేక నిర్ణయం జరిగే సమయానికి, కైకేయి అన్నివిధాలా – భార్యగా, తల్లిగా, రాణిగా, వ్యక్తిగా, భాగ్యరాశిగా – సర్వదా ఉన్నత స్థితిలో ఉంది. భర్త మహారాజు. ఆమెకు పూర్తిగా స్వాధీనుడు. తన అతిలోక సౌందర్యం ఆయనను మోహపాశంతో బందీ చేయటమే కాదు, దేవ దానవ సంగ్రామ సందర్భంలో అసాధారణ సాహసం ప్రదర్శించి ఆయన ప్రాణాలు కాపాడి ఆయన కృతజ్ఞతకు పాత్రురాలయింది. గుణసంపత్తి గల రాజపత్నిగా పేరు పొందింది.

'ధర్మవర్తనలో జ్యేష్ఠుడయిన శ్రీరాముడే నా జ్యేష్ఠ పుత్రుడు. నాకు రామ భరతులిద్దరూ సమానులు' అని పలుమార్లు ప్రకటించి, తన ధర్మప్రీతి చాటుకొన్నది. రామ పట్టాభిషేక వార్త వినగానే ఆమె తొలి స్పందన పరమానందం. వార్త తెచ్చిన మంథరకు వెంటనే కనకాభరణాన్ని కానుక ఇచ్చింది. ఆమె సౌశీల్యానికి అదే సాక్ష్యం.

జ్యోతిర్మయం

కానీ కొద్ది సమయం పాటు మంథర చెప్పుడు మాటలకు తల ఒగ్గటంతో, అంతా తలకిందులైంది. ఆమె జీవితం అన్ని రకాలుగా ఛిన్నాభిన్నమైపోయింది. అప్పటి వరకు తనను నెత్తిన పెట్టుకొన్న భర్త చేత అనరాని మాటలు అనిపించుకొంది. తినరాని తిట్లు తిన్నది. అయోధ్య వాసులందరూ ఆబాలగోపాలమూ ఆమెను ముక్తకంఠంతో దుమ్మెత్తి పోశారు. అయిదవతనంతో సహా ఆమె సర్వస్వమూ చేజారిపోయింది. చివరికి, ఏ కుమారుడి కోసం ఇంత లోకనింద కూడగట్టుకొందో, ఆ భరతుడికి అపారమైన మనోవేదన కలిగించి, అతడి దుర్భాషలకు గురయింది. చెరపటానికి వీలు లేనంత అపకీర్తితో, చరిత్రలో నిలిచిపోయింది.

చెప్పుడు మాటలకు చెవి ఒగ్గక ముందు కైకమ్మకు లేని భాగ్యం లేదు. మంథర దుర్బోధతో మారిపోయిన తరవాత, కైకమ్మ కోల్పోనిదేమీ లేదు. ఈ విశాల విశ్వంలో ఆమెను ఈసడించుకోనివారు ఇద్దరంటే ఇద్దరు మిగిలారు. ఒకతె, ఆమె చెవిలో విషం పోసి, ఆమె బ్రతుకులో నిప్పులు పోసిన ఆమె శ్రేయోభిలాషి మంథర. ఒకడు, స్థితప్రజ్ఞుడూ, మర్యాదా పురుషోత్తముడూ అయిన శ్రీరాముడు.

చెప్పుడు మాటలవల్ల కలిగే చేటుకు, కైకేయి వృత్తాంతం కన్న గొప్ప దృష్టాంతం ఉండదు.

– ఎం. మారుతి శాస్త్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

బీమా చేయించి.. ఆపై చంపించి..

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం అత్తను హత్య చేయించిన అల్లుడు

- సిద్దిపేట జిల్లా పెద్దమాసాన్‌పల్లిలో ఘటన
- నాలుగు నెలల ముందే అత్త పేరు మీద పోస్టాఫీస్, ఎస్‌బీఐలో రూ.60 లక్షల బీమా
- ప్లాన్ ప్రకారం జీపుతో ఢీకొట్టించి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి..
- ఇద్దరు నిందితుల అరెస్టు.. వివరాలు వెల్లడించిన సీపీ అనురాధ


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట సీపీ అనురాధ


రామవ్వ


వెంకటేశ్


కరుణాకర్

సాక్షి, సిద్దిపేట/సిద్దిపేట కమాన్: ఇన్సూరెన్స్ డబ్బుల కోసం అత్తను హత్య చేయించి..దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన ఓ అల్లుడు కటకటాల పాలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా పెద్దమాసాన్‌పల్లి శివారులో చోటుచేసుకుంది. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ డాక్టర్ బి.అనురాధ ఆ వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన తొగుట పీఎస్ పరిధిలో దివ్యాంగురాలైన తాటికొండ రామవ్వ(60)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని.. ఆమె అల్లుడు తాళ్ల వెంకటేశ్ డయల్ 100కు కాల్ చేశాడు. దీంతో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందినట్టు తొగుట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైట్ కారు ఢీ కొట్టి..ఇప్పుడే వెళ్లిందని ఫిర్యాదులో భాగంగా వెంకటేశ్ పోలీసులకు చెప్పాడు. పోలీసులు వైట్ కారు డ్రైవర్‌ను విచారించగా, తన కంటే ముందు బ్లాక్ కలర్ తార్‌జీపు వెళ్లిందని చెప్పాడు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఈ తార్ జీపు తుక్కాపూర్ వరకు నంబర్ ప్లేట్ ఉన్నట్టు, తర్వాత దానిని తొలగించి టీఆర్ స్టిక్కర్ వేసినట్టు గుర్తించారు. ఎందుకు నంబర్ ప్లేట్ తొలగించారని ఆరా తీశారు. ఆ తార్ జీపు నంబరు ఆధారంగా వాహన యజమాని దగ్గరకు వెళ్లి పోలీసులు విచారించారు. పెద్దమాసాన్‌పల్లికి చెందిన కరుణాకర్ సెల్ఫ్ డ్రైవింగ్ నిమిత్తం సిద్దిపేటలో రూ 2,500 చెల్లించి ఆధార్ కార్డు, వివరాలు ఇచ్చి అద్దెకు తీసుకున్నాడు. దీంతో పోలీసులు కరుణాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయి. కరుణాకర్ చెప్పిన వివరాల ఆధారంగా మృతురాలి అల్లుడైన వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. తానే ఈ దారుణానికి ఒడికట్టానని పోలీసులకు చెప్పాడు.

ముందస్తు ప్లాన్ ప్రకారమే...

సిద్దిపేట కేసీఆర్‌నగర్‌కు చెందిన తాటికొండ రామవ్వ–రంగయ్య దంపతుల కుమార్తెను తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన తాళ్ల వెంకటేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే వెంకటేశ్ తన అత్తను హత్య చేసి దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి... ఆమె పేరుపై ఇన్సూరెన్స్ చేయించి డబ్బు కాజేయాలనుకున్నాడు. అందులో భాగంగానే ఈ ఏడాది మార్చిలో తాటికొండ రామవ్వ పేరుపై పోస్టాఫీసులో ఏడాదికి రూ.755 చెల్లించి రూ.15 లక్షల ఇన్సూరెన్స్, ఎస్‌బీఐలో రూ.2 వేలు చెల్లించి రూ 40 లక్షల ఇన్సూరెన్స్ చేయించాడు. రైతుబీమా డబ్బులు వస్తాయని రంగయ్య (మృతురాలి భర్త) పేరు పైన ఉన్న 28 గుంటల వ్యవసాయ భూమిని రామవ్వ పేరు మీద పట్టా మార్పిడి చేయించాడు. ఆపై తన ప్లాన్‌కు వరుసకు తమ్ముడయ్యే తాళ్ల కరుణాకర్‌కు చెప్పాడు. వెంకటేశ్ గతంలోనే తాళ్ల కరుణాకర్‌కు రూ.1.30 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అయితే కరుణాకర్ పౌల్ట్రీఫామ్ పెట్టి రూ.22 లక్షల వరకు నష్టపోయాడు. తన అత్త హత్యకు సహకరిస్తే అప్పు ఇవ్వాల్సిన అవసరం లేదని, వచ్చే ఇన్సూరెన్స్‌లో ఇద్దరం చెరి సగం పంచుకుందామని వెంకటేశ్ కరుణాకర్‌ను ఒప్పించాడు. ప్లాన్‌లో భాగంగానే ఈ నెల 7న కారు తీసుకొని రావాలంటూ వెంకటేశ్ కరుణాకర్‌కు ఫోన్ చేశాడు. ఇదే సమయంలో విద్యుత్ అధికారులు వస్తున్నారని నీ సంతకం కావాలని చెప్పి వెంకటేశ్ తన అత్త రామవ్వను ఎక్స్‌ఎల్ వాహనంపై పెద్దమాసాన్‌పల్లి శివారులోని వ్యవసాయ భూమి వద్దకు తీసుకొచ్చాడు. కరుణాకర్ సిద్దిపేటలోని కార్లు సెల్ఫ్ డ్రైవింగ్ ఇచ్చే వారి వద్దకు వెళ్లి ఓ తార్ జీపు (టీఎస్ 18జీ 2277)ను అద్దెకు తీసుకున్నాడు. నంబర్ ప్లేట్ కనిపించకుండా టీఆర్ పేపర్ అతికించి పెద్దమాసాన్‌పల్లి శివారుకు వచ్చాడు. రోడ్డుపైన రామవ్వను ఉంచి వెంకటేశ్ పొలంలోకి వెళ్లాడు. అనుకున్న ప్లాన్ ప్రకారం... రామవ్వను జీపుతో కరుణాకర్ ఢీకొట్టాడు. ఆపై కొద్ది దూరం వెళ్లాక వెంకటేశ్‌కు వాట్సాప్ కాల్ చేసి మీ అత్తను చంపిన వెళ్లి చూసుకో అన్నాడు. అనంతరం జీపునకు టీఆర్ పేపర్ తీసేసి దానిని సిద్దిపేటలో ఇచ్చేశాడు. సాంకేతిక సాయంతో పోలీసులు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే తన అత్తను చంపించినట్టు ఒప్పుకున్నాడు. ఆధారాలు దొరక్కుండా చేసేందుకు వారు దృశ్యం సినిమా చూశారని పోలీసులు తెలిపారు. నార్మల్ ఫోన్ కాల్ చేస్తే పోలీసులకు దొరికే ప్రమాదముందని నిందితులిద్దరూ వాట్సాప్ కాల్స్ మాట్లాడుకున్నట్టు విచారణలో తేలింది. వెంకటేశ్, కరుణాకర్‌లను అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన తార్ జీప్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో కేసును ఛేదించిన తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంతరావు, సిబ్బందిని సీపీ అభినందించి రివార్డు అందజేశారు.

ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

మహాధర్నాలో ఎంపీల డిమాండ్


మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): ఔట్ సోర్సింగ్ విధానం ఉద్యోగుల పట్ల అన్యాయమైందని, దీనిని రద్దు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు రాజకీయ పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా చేపట్టారు. ఈ మహాధర్నాకు ముఖ్య అతిథులుగా ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా తన గొంతు వినిపిస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తలచుకుంటే ప్రభుత్వాలు స్తంభించి పోతాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో మార్పురావాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు ధర్నాలో ప్రసంగించారు.

టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా రాజీవ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు టీపీసీసీ డాక్టర్, మెడికల్, హెల్త్ వింగ్ సెల్ చైర్మన్‌గా సూర్యాపేటకు చెందిన ఎం.రాజీవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని రాజీవ్‌కు.. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, మహేశ్‌కుమార్‌లు అందజేశారు. ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


శ్రీకాంత్

రామాయంపేట (మెదక్): విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందాడు. మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన గాయంతి రాజయ్య కుమారుడు శ్రీకాంత్ (22) డిగ్రీ వరకు చదువుకొని వ్యవసాయం చేస్తున్నాడు. సాయంత్రం మెషీన్‌తో పశువులకు గడ్డి కోస్తున్న క్రమంలో.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుని మృతితో.. అతని తల్లిదండ్రులు విలపించారు. మృతుని చిన్నాన్న మల్లేశం కూడా 20 రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకు మృతి


మాణయ్య


వెంకటేశ్

కొండాపూర్ (సంగారెడ్డి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఇంటి ముందు గల హైటెన్షన్ వైర్లు ఇనుప పైపులకు తగలడంతో కరెంట్ షాక్ కొట్టి తండ్రీ కొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో ఈ ఘటన జరిగింది. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం.. గొల్లపల్లికి చెందిన మాణయ్య (45), ఆయన కుమారుడు వెంకటేశ్ (20) వారి ఇంటి ముందు ఉన్న ఇనుప బోరు పైపులను పైకి లాగుతున్న క్రమంలో అవి హైటెన్షన్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు మాణయ్య భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, హైటెన్షన్ వైర్ల వల్ల ప్రమాదం జరగకుండా వాటికి ప్లాస్టిక్ పైపులను అమర్చాలని గతంలోనే చెప్పినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఘటన జరిగిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ఫొటో తీస్తానని.. నదిలోకి నెట్టేసి..

భర్తపై భార్య హత్యాయత్నం

- నదిలో బండరాయి పట్టుకొని ప్రాణం కాపాడుకున్న భర్త
- కృష్ణానది గుర్జాపూర్ బ్రిడ్జిపై ఘటన


గెట్టెమ్మ


నదిలో నుంచి తాతప్పను తాడు సహాయంతో రక్షిస్తున్న యువకులు

కృష్ణా: కొత్తగా పెళ్లయిన జంట.. బైక్‌పై వెళ్తూ మాంచి లొకేషన్ కనిపిస్తే ఫొటోలు తీసుకోవాలని ముచ్చటపడ్డారు. వారు వెళ్తున్న దారిలో కృష్ణానదిపై గుర్జాపూర్ బ్రిడ్జి వచ్చింది. అదే మంచి స్పాట్ అనుకొని ఫొటోలు దిగటానికి సిద్ధమయ్యారు. భర్త తన భార్యకు ఫోన్ ఇచ్చి.. తనను ఫొటోలు తీయాలని కోరి వెళ్లి బ్రిడ్జి అంచున నిలబడ్డాడు. భార్య కూడా ఫొటోలు తీస్తూనే భర్త వద్దకు వెళ్లి ఒక్కసారిగా అతన్ని నదిలోకి తోసేసింది. బిక్కచచ్చిపోయిన భర్త నీళ్లలో పడి కొట్టుకుపోతూ.. నదిలో ఓ రాయిని పట్టుకొని ప్రాణాలు కాపాడుకున్నాడు. అతడి కేకలు విని జాలర్లు రక్షించి పైకి తీసుకొచ్చారు. అయితే, భార్యే తనను నదిలోకి తోసిందని భర్త చెబుతుండగా, లేదు లేదు.. అతడే నదిలో పడిపోయాడని భార్య వాదిస్తోంది. ఏం చేయాలో తెలియని పోలీసులు తలలు పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం తెలంగాణ– కర్ణాటక సరిహద్దులో నారాయణపేట జిల్లాలో ఉన్న గుర్జాపూర్ బ్రిడ్జిపై చోటుచేసుకుంది.

ప్రమాదమా? హత్యాయత్నమా?

కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఉన్న శక్తినగర్‌కు చెందిన తాతప్ప (23)కు యాద్గిర్ జిల్లాలోని వడిగేరి గ్రామానికి చెందిన గెట్టెమ్మ (20)తో మూడు నెలల క్రితం వివాహమైంది. రెండు రోజుల క్రితం ఇద్దరు బైక్‌పై వడిగేరికి వెళ్లి శనివారం ఉదయం తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో కృష్ణానదిపై ఉన్న గుర్జాపూర్ బ్రిడ్జిపై ఫొటోలు దిగాలని భావించారు. భర్త తన ఫోన్‌ను భార్య చేతికి ఇచ్చి ఫొటో తీయమని చెప్పి ఆయన బ్రిడ్జి చివరన నిలబడ్డాడు. గెట్టెమ్మ ఫొటో తీస్తున్నట్లు నమ్మించి భర్తను నదిలోకి తోసేసింది. తర్వాత భర్త తల్లికి ఫోన్ చేసి తాతప్ప నదిలో పడిపోయాడని చెప్పింది. నదిలో పడిన తాతప్ప బ్రిడ్జి పక్కనే కొద్ది దూరంలో ఉన్న రాయిపైకి చేరి 'నన్ను రక్షించండి.. నా భార్య పారిపోకుండా పట్టుకోండి' అంటూ కేకలు వేశాడు. దీంతో సమీపంలో చేపలు పడుతున్న జాలర్లు గమనించి తాతప్పను తాడు సహాయంతో ఒడ్డుకు చేర్చారు. పైకి వచ్చిన తాతప్ప.. భార్యే తనను నదిలోకి తోసేసిందని ఆగ్రహం వ్యక్తంచేయగా.. భార్య మాత్రం తాను తోయలేదని, ఆయనే ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడని వాదించింది. ఈ విషయమై శక్తినగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బస్వరాజ్‌ను వివరణ కోరగా ఘటన జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు. భార్యాభర్తల మధ్య పంచాయితీ ఉందని, వారి కుటుంబ సభ్యులు మాట్లాడుకొని ఆదివారం ఫిర్యాదు ఇస్తామని చెప్పారని వివరించారు.

ఆస్తి కోసం దూషించి.. దాడి చేసి..

- కొడుకు, కోడలు వేధింపులు
- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య


రవి

గంగాధర: ఆస్తికోసం కొడుకు, కోడలు వేధించడమే కాక చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లి గ్రామ పంచాయతీ పరిధి పిట్టలపల్లి గ్రామంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ వంశీకృష్ణ కథనం ప్రకారం.. పిట్టలపల్లి గ్రామానికి చెందిన పిట్టల రవి (50) ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ఎనిమిది నెలల క్రితం తిరిగి వచ్చి స్థానికంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. విదేశాల నుంచి వచ్చినప్పటి నుంచి కొడుకు శ్రీకాంత్, కోడలు మానస.. వ్యవసాయ భూమిని తమ పేరిట మార్చాలని వేధించడం మొదలు పెట్టారు. శుక్రవారం భూమి రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు తేవాలని దూషించారు. అంతటితో ఆగకుండా రవిపై చేయి చేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన రవి.. శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పిట్టల జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిమ్స్‌లో కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో అనారోగ్యంపాలై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు క్రమంగా కోలుకుంటున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 35 మంది బాధితుల్లో ఐదుగురు శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారు. మరో పది మంది ఆరోగ్యం మెరుగుపడటంతో వారిని కూడా డిశ్చార్జ్ చేసేందుకు ఆస్పత్రి వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. కాగా ప్రస్తుతం నిమ్స్‌లో 30 మంది బాధితులు మెరుగైన వైద్య సేవలు పొందుతున్నట్టు మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. వారిలో 9 మంది రోగులకు డయాలసిస్ కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా, కల్తీ కల్లు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు నిమ్స్‌లో 41 మంది, ఇతర దవాఖానాల్లో ఏడుగురు చికిత్స పొందుతుండగా, మరో 19 మంది గాంధీలో చికిత్స పొందుతున్నట్లు ఆయా ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. అనధికారికంగా బాధితులు వంద మందికి పైగానే ఉంటారని సమాచారం.



కృష్ణానదికి భారీ వరదలు రావడంతో శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరుస సెలవులు (రెండో శనివారం, ఆదివారం) కలిసి రావడంతో భక్తులు, సందర్శకులు శ్రీశైలానికి పోటెత్తారు. దీంతో శనివారం ఉదయం 10 గంటల నుంచే వాహనాల రాక పెరగడం ప్రారంభమైంది. మన్ననూరు చెక్‌పోస్టు నుంచి దోమలపెంట, శ్రీశైలం వరకు నల్లమల దారి మొత్తం వాహనాలతో కిక్కిరిసిపోయింది. రాత్రి వరకు కూడా పరిస్థితిలో మార్పు లేక పోవడంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిలో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వందలాది వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో మహిళలు, చిన్నారులు అవస్థలు పడ్డారు. ప్రధాన రహదారి పొడవునా దాబాలు, హోటళ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఆదివారం సైతం వాహనాల రద్దీ కొనసాగే అవకాశం ఉంది. – దోమలపెంట/మన్ననూర్

సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి

- పునరావాస పనులు త్వరితగతిన పూర్తవ్వాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్
- టన్నెల్‌ల నిర్మాణంలో సలహాలకు ఆర్మీ ఇంజనీర్ల సేవలు


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పునరావాస పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శనివారం సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ అధికారులతో పలు విషయాలపై సమీక్షించారు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని చట్టపరమైన, పాలనాపరమైన అంశాలను తక్షణమే పరిష్కరించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇటు భూసేకరణ.. అటు పునరావాస పనుల్లో జాప్యం లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన ఆయన నిర్మాణంలో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. భూసేకరణలో జరుగుతున్న జాప్యంతో అంచనాలపై ప్రభావం చూపుతూ రెట్టింపు అవుతోందని చెప్పారు. భూసేకరణలో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు భూములు కోల్పోయిన రైతులతో సుహృద్భావ చర్చలు జరపాలన్నారు. నష్ట పరిహారం, పునరావాసం వంటి అంశాలపై పారదర్శకంగా ఉండాలని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణాలను మంత్రి ప్రస్తావిస్తూ ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. పాలనాపరమైన అంశాలలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల పూర్తికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

వరదలొస్తున్నాయి.. అప్రమత్తంగా ఉండాలి

వరద నేపథ్యంలో రాష్ట్రంలోని జలాశయాలలో పెరుగుతున్న నీటిమట్టాలపై మంత్రి ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని..ఎప్పటికప్పుడు నీటిమట్టాలను గమనించాలన్నారు. ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాల్లో టన్నెల్‌లు కీలకంగా మారాయని, అందుకే వీటి నిర్మాణాల్లో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను తెలంగాణ నీటిపారుదల శాఖలో భారత సైన్యంలో పనిచేస్తున్న ఇద్దరు ఇంజనీరింగ్ నిపుణులను చేర్చుకోబోతున్నట్టు ఉత్తమ్ వెల్లడించారు. భారతసేన మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ జనరల్ హార్పల్‌సింగ్ నీటిపారుదల శాఖలో గౌరవ సలహాదారుగా, అంతర్జాతీయ స్థాయిలో టన్నెల్ ఇంజనీరింగ్ నిపుణుడిగా ప్రసిద్ధి చెందిన కల్నల్ పరీక్షిత్ మెహ్రాలు నీటిపారుదల శాఖలో చేరుతారన్నారు. అత్యంత క్లిష్టమైన రోహ్తాంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో వీరిద్దరూ కీలకపాత్ర పోషించారని చెప్పారు. రాజేంద్రనగర్‌లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను మరింత బలోపేతం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నారాయణరావు మృతి

- నివాళులర్పించిన నాయకులు


దొడ్డా నారాయణరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణ, పల్లా వెంకట్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి తదితరులు (ఇన్‌సెట్‌లో) నారాయణరావు

చిలుకూరు: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు (96) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా చిలుకూరులోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. దొడ్డా నారాయణరావు స్వాతంత్ర్య సంగ్రామంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు. నారాయణరావు అన్న దొడ్డా నర్సయ్య హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. నారాయణరావు సర్పంచ్‌గా, ఎంపీపీగా, పీఏసీఎస్ చైర్మన్‌గా దాదాపు 40 ఏళ్లకు పైగా ప్రజాప్రతినిధిగా కొనసాగారు. అంతేకాకుండా ఉమ్మడి నల్లగొండ సీపీఐ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, పార్టీ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన భార్య సక్కుబాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నారాయణరావు ముగ్గురు కుమారుల్లో ఇద్దరు రాజకీయాల్లో ఉండగా.. చిన్న కుమారుడు లాయర్‌గా పనిచేస్తున్నారు. శనివారం చిలుకూరులో దొడ్డా నారాయణరావు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరై భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ఛత్తీస్‌గఢ్‌లో 23 మంది మావోల లొంగుబాటు

- అందరిపై కలిపి రూ.1.18 కోట్ల రివార్డు



కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్‌రాజు ముందు లొంగిపోయిన మావోయిస్టులు

దుమ్ముగూడెం/కొత్తగూడెంటౌన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో 23 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇందులో 9 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు. జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ సమక్షంలో వీరు లొంగిపోయారు. వీరిపై రూ.1.18 కోట్ల రివార్డు ఉందని ఆయన వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఒకరు డీవీసీఎం సభ్యుడు, ఆరుగురు పీపీసీఎం సభ్యులు, నలుగురు ఏసీఎం కమిటీ మెంబర్లు ఉండగా, నాలుగు జంటలు కూడా ఉన్నాయి. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలకంగా వ్యవహరించిన లోకేశ్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నాడని ఎస్పీ వెల్లడించారు.

కొత్తగూడెంలో ఆరుగురు..: ఆపరేషన్ చేయూతలో భాగంగా మావోయిస్టులు ప్రభుత్వంపై నమ్మకంతో లొంగుబాటుకు ముందుకొస్తున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. శనివారం కొత్తగూడెంలో మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు దళ సభ్యులు ఎస్పీ ముందు లొంగిపోగా వారికి ప్రోత్సాహక చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరుకు చెందిన పూనెం లల్లూ, మాధవి నందు, అవుట్‌పల్లికి చెందిన ఓయం బీమా, సుక్మా జిల్లాకు చెందిన మడకం దేవాతో పాటు ఇద్దరు మహిళా దళ సభ్యులు లొంగిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కల్లుపై నిషేధం?

▶ మొదటి పేజీ తరువాయి

సమాచారం. ఈ ఆల్ప్రాజోలం ఎక్కువగా మహారాష్ట్ర నుంచి వస్తున్నట్లు చెబుతున్నారు. ఒక కిలో ఆల్ప్రాజోలం ధర దాదాపు రూ.15 లక్షల వరకు ఉంటుంది. ఎక్సైజ్ అధికారులు గత మూడేళ్లలో అడపాదడపా నిర్వహించిన దాడుల్లోనే దాదాపు 64 కిలోల ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్ హయాంలో నిషేధం..

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నగరంలో కల్లు అమ్మకాలను నిషేధించారు. దాదాపు 12 సంవత్సరాలపాటు కల్లు విక్రయాలు బంద్ అయ్యాయి. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ (నాడు టీఆర్ఎస్) అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ కల్లు విక్రయాలు ప్రారంభం అయ్యాయి. నగర శివార్లలో అప్పట్లో తాటి చెట్లు పెద్ద ఎత్తున ఉన్నా.. అవి స్థానిక అవసరాలకే సరిపోవడం లేదని, అక్కడ నుంచి నగరానికి కల్లు సరఫరా సాధ్యం కాదన్న ఉద్దేశంతోనే వైఎస్ఆర్ హయాంలో నిషేధం విధించారని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు రియల్‌ఎస్టేట్ కారణంగా ఉన్న చెట్లన్నీ నరికేశారని, హైదరాబాద్‌కు నిజామాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని చెట్లను కేటాయించినా.. అక్కడి నుంచి కల్లు గీసి తీసుకురావడం లేదని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కల్లు సొసైటీలు 4,064 ఉంటే 4,697 దుకాణాలు ఉన్నాయి. అందులో సభ్యులుగా 1,95,391 మంది లైసెన్స్ విక్రయదారులు ఉన్నారు. 3,541 టీఎఫ్‌టీ (ట్రీ ఫర్ ట్రేడింగ్) కమిటీల కింద మరో 29,279 మంది ఉన్నారు. 2014 నుంచి 2025 వరకు కల్తీ కల్లు విక్రయాలపై నమోదైన కేసుల సంఖ్య కూడా దారుణంగా పడిపోయింది. 2014లో 9,562 కేసులు నమోదైతే, 2025లో 516 కేసులు మాత్రమే నమోదు కావడం గమనార్హం.

బిల్లు మంజూరుకు రూ.90 వేల డిమాండ్

- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ


ఏఈ జగదీశ్

కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి): సీసీ రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూరు చేయడానికి లంచం డిమాండ్ చేసిన పంచాయతీరాజ్ ఏఈ జగదీశ్‌ను ఏసీబీ అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా గంగారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాలోని ఓదెల మండలం బాయమ్మపల్లె గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కావేటి రాజు కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామంలో రూ.15 లక్షలు వెచ్చించి ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. ఇందుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని ఆయన ఏఈ జగదీశ్‌ను సంప్రదించారు. అయితే, తనకు రూ.లక్ష లంచం ఇస్తేనే బిల్లు మంజూరు చేస్తానని ఏఈ డిమాండ్ చేయగా, రూ.90 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారిసూచన మేరకు గంగారంలో రూ.90 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

రోడ్డుపైనే నిఘావేసి..: బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు గంగారం ప్రధాన చౌరస్తా సమీపంలోని రహదారిపై నిఘా వేశారు. అటుగా వచ్చిన కాంట్రాక్టర్ రాజు నుంచి రూ.90 వేలు లంచం తీసుకుంటుండగా ఏఈ జగదీశ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ ప్రభుత్వ అధికారి రోడ్డుపైనే బహిరంగంగా లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది.

ఒక ఆడియో.. పలు ప్రశ్నలు

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరిన్ని చిక్కుముడులు

- ఉద్దేశపూర్వకంగా ఫ్యూయల్ స్విచ్‌ను ఆఫ్ చేశారా?
- తరువాత గమనించి మళ్లీ వెంటనే ఆన్ చేశారా?
- పూర్తి ఆడియో విడుదల చేయకపోవడంపై అనుమానాలు

వారాల తరబడి వేచి ఉన్నాక, ప్రాథమిక దర్యాప్తు జరిగాక నివేదిక వెలువడితే ఆ విమానప్రమాద రహస్యాలు బయటికొస్తాయని అందరూ ఆశించారు. అయితే జూన్ 12న జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన తాలూకు నివేదిక అందుకు భిన్నంగా మరిన్ని చిక్కుముడులు వేసేలా వెలువడటం అందర్నీ విస్మయానికి గురిచేస్తోంది. విమానం ట్యాక్సీ స్థలం నుంచి మొదలై రన్‌వేపై పరుగెత్తి ఆకాశంలోకి ఎగిరేదాకా పైలట్ల సంభాషణలు రికార్డయితే కేవలం ఒకటి, రెండు వాక్యాలు మాత్రమే పొడిపొడిగా దర్యాప్తులో ప్రస్తావించడం కొత్త అనుమానాలను రేకెత్తిస్తోంది. ఆ వాక్యాలు కూడా పైలట్ల సత్ప్రవర్తనను ప్రశ్నించేలా, వారి అంకితభావంపై అనుమానాలు రేకెత్తించేలా ఉన్నాయి. ఫ్యూయల్ స్విచ్‌ను ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్‌ను మరో పైలట్ అడగటం చూస్తుంటే మొదటి పైలట్ ఉద్దేశపూర్వకంగానే స్విచాఫ్ చేశాడనే అనుమానం రేకెత్తుతోంది. అయితే తాను స్విచాఫ్ చేయలేదని అతని కరాఖండీగా చెప్పడం, వెనువెంటనే ఇద్దరూ స్విచ్ ఆన్‌కు ప్రయత్నించడం చూస్తుంటే ఆ స్విచ్‌లలోనే ఏవైనా మెకానిక్, ఎలక్ట్రిక్ లోపాలు ఉండొచ్చనే అనుమానాలూ బలపడుతున్నాయి. అయితే స్విచింగ్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయో లేదో ప్రాథమిక నివేదికలో పేర్కొనకపోవడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అయితే స్విచాఫ్ చేయడాన్ని గమనించి పైలట్ ఇంకొరిని ప్రశ్నించాడా ? అనేది తేలాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ ప్రతీకార చర్యల్లో భాగంగా సరిహద్దు సమీప రాష్ట్రాల గగనతలాలపై ఎగిరే విమానాల కోఆర్డినేట్స్‌ను మార్చి, కూల్చేసేందుకు పాక్ సైబర్ దాడులను యత్నిస్తోందన్న కథనాల నడుమ ఈ నివేదిక విడుదలైంది. అయితే ఫ్యూయల్ స్విచ్‌ను ఎందుకు ఆఫ్ చేశావని ప్రశ్నించిన పైలట్ పేరును నివేదికలో బహిర్గతం చేయకపోవడం వెనుక ఆంతర్యమేముందని పలువురు నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పైలట్‌ల పూర్వచరిత్రపై కూపీలాగేందుకు, ఆ దిశగా దర్యాప్తు సజావుగా సాగాలని ఉద్దేశంతోనే వాళ్ల ఐడెంటిటీనీ ప్రభుత్వం బయటపెట్టలేదనే వాదనను అంతర్జాతీయ మీడియా తెరమీదకు తెచ్చింది. అయితే పైలట్లను ఈ నివేదిక ఎక్కడా తప్పుబట్టకపోవడం విశేషం. అలా అని ఇది పూర్తిగా మెకానికల్, ఎలక్ట్రికల్ సమస్య కారణంగా జరిగిందనీ పేర్కొనలేదు. ప్రభుత్వం ఫ్యూయల్ స్విచ్‌లు ఆఫ్ అయ్యాయని మాత్రమే ప్రస్తావించి అక్కడితో ముగించింది. కానీ ప్రజల్లో మాత్రం కొత్త ప్రశ్నల పరంపరకు పరోక్షంగా నాంది పలికింది. స్విచ్‌లను పొరపాటున ఆఫ్ చేశారా? లేదంటే స్విచింగ్ లోపాలా అనేది నివేదిక స్పష్టంగా పేర్కొనలేదు. దీంతో అసలు కారణం ఏమిటనే మిస్టరీ అలాగే మిగిలిపోయింది.


అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం అనంతర దృశ్యం (ఫైల్)

మెకానికల్, ఎలక్ట్రికల్ సమస్యలే కారణమా?

విమానం సెకన్ల వ్యవధిలో నేలరాలడానికి మెకానికల్, ఎలక్ట్రికల్ సమస్యలే కారణమై ఉంటాయని పలువురు అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక్కడే పైలట్ ఈ రెండు ఫ్యూయల్ స్విచ్‌లను ఒకేసారి ఆఫ్ చేయడం అసాధ్యమని కెనడాకు చెందిన విమాన ప్రమాదాల దర్యాప్తు అధికారి ఒకరు వెల్లడించారు. ''ఫ్యూయల్ స్విచ్‌లను పొరపాటున ఆన్, ఆఫ్ చేయడం అంత సులభంకాదు. వీటికి లీవర్–లాక్‌లు ఉంటాయి. స్విచ్‌ను ఆన్ లేదా ఆఫ్ చేయాలంటే మొదటగా అక్కడున్న లీవర్‌ను పైకి లాగాల్సి ఉంటుంది. 1950వ దశకం నుంచే ఈ భద్రతా ఫీచర్ ఉంది. ఇవికాకుండా ప్రొటెక్టివ్ గార్డ్ బ్రాకెట్స్ అనేవి కూడా ఉంటాయి. పొరపాటున స్విచ్‌లు ఆన్/ఆఫ్ కాకుండా వాటిని ఈ బ్రాకెట్లు నిరోధిస్తాయి. ఈ లెక్కన ఒక్క చేతితో రెండు స్విచ్‌ల లీవర్‌లను ఒకేసారి పైకి లాగడం అసాధ్యం. పొరపాటున లాగారని భావించినా ఒకేసారి రెండింటినీ ఎవరూ లాగరు. ఈ లెక్కన వాటి పొజిషన్‌ను మార్చకపోయినా మెకానికల్, ఎలక్ట్రికల్ సమస్యల కారణంగా వాటి పొజిషన్ మారి ఉంటుంది''అని ఆ నిపుణుడు వివరించారు.


737 మోడల్‌లో లాకింగ్ ఫీచర్‌లో సమస్యలు!

బోయింగ్ 737 రకం విమానాల్లో అమర్చిన ఫ్యూయల్ స్విచ్‌లకు లాకింగ్ వ్యవస్థ సరిగా అనుసంధానం కాలేదన్న అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ స్పెషల్ ఎయిర్‌వర్తీ ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను 2018 డిసెంబర్‌లో విడుదలచేసింది. అందులో బోయింగ్ 737లోని ఫ్యూయల్ స్విచ్‌లతో లాకింగ్ ఫీచర్ సరిగా అనుసంధానం కావట్లేదని, అత్యవసర సమయాల్లో పనిచేయకపోవచ్చని, ఎప్పటికప్పుడు చెక్‌చేసుకుంటే మంచిదని సంస్థ తన అడ్వైజరీలో పేర్కొంది. అయితే ఈ సిఫార్సును ఏ విమానసంస్థ అయినా పట్టించుకుందో లేదో ఎవరికీ తెలీదు. అయితే ఇదే స్విచ్ డిజైన్‌ను బోయింగ్ 787–8 రకం విమానాల్లోనూ ఉపయోగించారు. అహ్మదాబాద్‌లో కూలిన వీటీ–ఏఎన్‌బీ విమానం ఈ రకానికి చెందినదే. అందుకే మీ వద్ద ఉన్న ఈ రకం విమానాలను స్వీయ తనిఖీచేసుకుంటే బాగుంటుందని సిఫార్సుచేసింది. అయితే తనిఖీలకు ఎయిర్‌ఇండియా ఒప్పుకోలేదని తెలుస్తోంది.

మొత్తం ఆడియో ఎందుకు బయటపెట్టలేదు?

నువ్వెందుకు స్విచ్ ఆఫ్ చేశావని ఒక పైలెట్‌ను మరో పైలట్ అడగడం, నేను ఆఫ్‌చేయలేదని అతను బదులివ్వడం తప్పితే మరే ఇతర ఆడియో వివరాలు బహిర్గతం చేయకపోవడం సైతం అనుమానాలకు తావిస్తోందని నిపుణులు వ్యాఖ్యానించారు. ''విమానం ట్యాక్సీ స్థలం నుంచి మొదలై రన్‌వే అటు కొనకు చేరుకుని రన్‌వేపై ప్రయాణించి, గాల్లోకి లేచి, కూలిపోయే చిట్టచివరి సెకన్ దాకా ఇద్దరు పైలట్ల మధ్య జరిగిన సంభాషణ మొత్తం రికార్డ్ అయింది. అలాంటప్పుడు మొత్తం ఆడియోను విడుదలచేస్తే నిపుణులు విశ్లేషించి ప్రమాదంపై ఓ అంచనాకు రాగలరు. వాళ్ల పరస్పర మాటలు, వాగ్వాదం లాంటివి వినగల్గితే స్విచ్‌లు ఆఫ్ కావడం అనేది మానవతప్పిదమా? ఉద్దేశపూర్వకమా? లేదంటే అవి పాడైపోవడంతో పనిచేయడం మానేశాయా? అనేవి స్పష్టంగా తెలుస్తాయి''అని అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ పీటర్ గోయెల్జ్ చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్


కాక్‌పిట్‌లో ఇంధన నియంత్రణ స్విచ్‌లు (మార్క్ చేసిన ప్రాంతంలో)

ఏమిటీ ఇంధన స్విచ్‌లు

విమానంలో ఇంజన్లకు సరఫరా చేసే ఇంధనాన్ని కాక్‌పిట్‌లోని 'ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్'లతోనే నియంత్రిస్తుంటారు. టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో ఇవే అత్యంత కీలకం. ఇంజన్ విఫలమైతే మాన్యువల్‌గా రీస్టార్ట్, లేదా షట్‌డౌన్ చేయడానికి వీటిని ఉపయోగిస్తారు. టేకాఫ్ సమయంలో స్విచ్‌లను అచేతనావస్థలో (ఆఫ్ చేసి) ఉంచడం అత్యంత అసాధారణమని నిపుణులు చెబుతున్నారు. అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి ఇదే కారణం కావొచ్చని అంచనా వేస్తున్నారు.

నివేదికపై పైలట్ల సంఘం తీవ్ర అభ్యంతరం

నిష్పాక్షికంగా సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్

ముంబై: అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి దర్యాప్తు జరిగిన తీరు, నివేదికలో ప్రస్తావించిన కొన్ని అంశాలు పైలెట్లదే తప్పు అనే అర్థం గోచరించేలా ఉన్నాయని భారతీయ ఎయిర్‌లైన్ పైలెట్ల సంఘం(ఏఎల్‌పీఏ) వ్యాఖ్యానించింది. నివేదికపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. నిష్పాక్షికంగా సమగ్ర దర్యాప్తు కొనసాగించాలని ఏఎల్‌పీఏ అధ్యక్షుడు కెప్టెన్ శ్యామ్ థామస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ''పైలెట్లదే తప్పు అని తేల్చేలా దర్యాప్తు జరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ప్రాథమిక దశలోనే ఇలాంటి నిర్ణయానికి రావడం విచారకరం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పైగా దర్యాప్తులో ఇంత గోప్యత ఎందుకు? ఇంత కీలకమైన కేసు దర్యాప్తు బృందంలో పైలట్ల రంగం నుంచి నిపుణులకు చోటివ్వకపోవడం శోచనీయం. కనీసం పరిశీలకులుగా అయినా పైలట్ల సంఘ ప్రతినిధులకు అవకాశం కల్పించాలి. అప్పుడే దర్యాప్తులో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటాయి. ఫ్యూయల్ స్విచ్ గేట్స్ వంటి కీలక మెకానికల్, ఎలక్ట్రిక్ ఉపకరణాల వ్యవస్థలో లోపాలు ఉండొచ్చని ఆరోపణలున్నాయి. అవి సరిగా ఉన్నదీ లేనిదీ విమానం బయల్దేరే ముందే తనిఖీలు చేశారా? ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌ల పొజిషన్లు మారడం సైతం ప్రమాదానికి కారణం కావచ్చని అమెరికాలోని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. భారత్‌లో దర్యాప్తు జరుగుతుండగా, ప్రాథమిక దర్యాప్తు నివేదిక అధికారికంగా విడుదల కాకముందే అందులోని అంశాలు ఎలా లీకయ్యాయి?'' అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్‌లో సమస్య ఉందా?

''విమానంలో ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ అనేది కీలకం. ఈ ప్రమాదం విషయంలో ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ పాత్ర ఏమిటి అనేది ఎక్కడా పేర్కనలేదు. పైలట్ ప్రమేయం లేకుండా ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్‌లో సమస్య కారణంగా ఫ్యూయల్ స్విచ్ పొజిషన్ మారిందా లేదా అనేది తెలియల్సి ఉంది. ఒకవేళ అదే జరిగితే ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ స్తంభించిపోవడం అనే అంశంపై తీవ్రంగా దృష్టిసారించాల్సిందే''అని భారత్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో మాజీ దర్యాప్తు నిపుణుడు కెప్టెన్ కిశోర్ చింతా అన్నారు. ''ఇంజిన్లు ఆగిపోవడంతో వెంటనే మొదటి ఇంజిన్‌ను స్టార్ట్ చేసేందుకు పైలట్లు ప్రయత్నించారు. అది నెమ్మదిగా శక్తిని అందుకుంటోంది. రెండో ఇంజిన్‌నూ స్టార్ట్‌చేశారు. అది మరింత నెమ్మదిగా శక్తిని అందుకుంటోంది. పైలట్లు దురుద్దేశంతో ఇంజిన్లను ఆఫ్ చేస్తే మళ్లీ ఆన్ చేయాల్సిన అవసరం వాళ్లకు లేదు. కానీ వాళ్లు వెంటనే ఆన్ పొజిషన్‌కు మార్చారు. విమానాన్ని తిరిగి తమ అధీనంలోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ లెక్కన స్విచాఫ్‌లో వాళ్ల ప్రమేయం లేదని ఊహించుకోవచ్చు''అని మరో నిపుణుడు వ్యాఖ్యానించారు. ఈ విమానంలో ఫ్యూయల్ స్విచ్‌లు గతంలో ఏమైనా పాడయ్యాయా? రిపేర్ చేశారా? కొత్తవి బిగించారా? అనే వివరాలు నివేదికలో లేకపోవడం సైతం ఫ్యూయల్ స్విచ్‌ల నాణ్యతపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి.

ఈయూ, మెక్సికోపై 30% టారిఫ్‌లు

- ఆగస్టు 1 నుంచే అమల్లోకి..
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



వాషింగ్టన్: యూరోపియన్ యూనియన్ (ఈయూ), మెక్సికో దేశాల ఉత్పత్తులపై 30 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు. సుంకాలపై ఆయా దేశాలకు రాసిన లేఖలను సోషల్ మీడియాలో శనివారం పోస్టుచేశారు. అక్రమ వలసదారులు, మత్తు పదార్థాలు అమెరికాలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి మెక్సికో ప్రభుత్వం తమకు చక్కగా సహకరిస్తోందని మెక్సికోకు రాసిన లేఖలో ట్రంప్ ప్రశంసించారు. మత్తు పదార్థాల నియంత్రణకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని మెక్సికో ప్రభుత్వానికి సూచించారు. అలాగే ఈయూతో అమెరికాకు వాణిజ్య లోటు ఉందని, ఇది తమ జాతీయ భద్రతకు ముప్పేనని తేల్చిచెప్పారు. ఈ లోటును పూడ్చడానికి కలిసికట్టుగా పని చేద్దామని ఈయూకు రాసిన లేఖలో పిలుపునిచ్చారు. అమెరికా ఉత్పత్తులపై ఈయూ దేశాలు అధికంగా టారిఫ్‌లు విధిస్తున్నాయని ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన ఇప్పటిదాకా 24 దేశాలతోపాటు 27 దేశాలతో కూడిన ఈయూపై టారిఫ్‌లను ప్రకటించారు. మరికొన్ని దేశాలపై సుంకాలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఏ రెండు దేశాల మధ్యనైనా సరే టారిఫ్‌లు ఒకేరకంగా ఉండాలని ట్రంప్ వాదిస్తున్నారు. ఒక దేశం నుంచి వచ్చే ఉత్పత్తులపై అధికంగా సుంకాలు వసూలు చేస్తూ.. అదే దేశానికి ఎగుమతయ్యే మన ఉత్పత్తులపై సుంకాలు తక్కువగా ఉండాలని కోరుకోవడం న్యాయం కాదని అంటున్నారు.

కాలిఫోర్నియాలో వలసదారుల అరెస్టులు ఆపండి

ట్రంప్ యంత్రాంగానికి ఫెడరల్ జడ్జి ఆదేశాలు

లాస్ ఏంజెలెస్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వలసదారులను ఎక్కడపడితే అక్కడ ఆపి తనిఖీలు చేపట్టడం, అరెస్టులు చేయడం తక్షణమే ఆపేయాలని ఫెడరల్ జడ్జి ఒకరు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దక్షిణ కాలిఫోర్నియా ప్రాంతంలోని హిస్పానిక్‌లు, లాటినోలను పథకం ప్రకారం వేధిస్తోందని గత వారం లాస్ ఏంజెలెస్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో వలసదారుల తరఫున పలు పిటిషన్లు దాఖలయ్యాయి. గుర్తింపు కార్డులు చూపినా ఇద్దరు అమెరికా పౌరులను మరో ముగ్గురు వలసదారులను ఎటువంటి వారెంట్లు లేకుండా అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారని ఆరోపించారు. కేవలం శరీరం రంగు ఆధారంగా అరెస్టులు చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన జడ్జి మామె ఈ ఫ్రిమ్‌పాంగ్ శుక్రవారం పలు ఆదేశాలను వెలువరించారు. లాస్ ఏంజెలెస్ సహా కాలిఫోర్నియాలోని ఏడు కౌంటీల పరిధిలో వలసదారుల అరెస్టులు, సోదాలను నిలిపివేయాలన్నారు. అంతేకాదు, వలసదారులను నిర్బంధించిన లాస్ ఏంజెలెస్ డిటెన్షన్ కేంద్రంలోకి అటార్నీ ప్రవేశించకుండా ఫెడరల్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సైతం రద్దు చేశారు.

ఐఐఐటీ బెంగళూరు విద్యార్థికి రూ.1.45 కోట్ల వార్షిక వేతన ప్యాకేజీ

బెంగళూరు: ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ)–బెంగళూరు విద్యార్థికి ఏకంగా రూ.1.45 కోట్ల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగం లభించింది. ఇటీవలే 25 ఏళ్లపూర్తి చేసుకున్న ఈ సంస్థ చరిత్రలో ఓ విద్యార్థి ఈస్థాయిలో భారీ వేతన ప్యాకేజీ పొందడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ నెల 8న ఐఐఐటీ–బెంగళూరు స్నాతకోత్సవం నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, డిజిటల్ సొసైటీ, పీహెచ్‌డీ తదితర కోర్సుల్లో 372 మంది చదువుకుంటున్నారు. ఒక విద్యార్థి రూ.1.45 కోట్ల వార్షిక ప్యాకేజీతో కొలువు సాధించగా, మరో 14 మంది విద్యార్థులు రూ.60 లక్షలకు పైగా, 67 మంది విద్యార్థులు రూ.40 లక్షలకు పైగా, 180 మంది విద్యార్థులు రూ.20 లక్షలకుపైగా వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారని ఐఐఐటీ–బెంగళూరు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది తమ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు లభించాయని తెలియజేసింది. ఇదిలా ఉండగా, ఐఐఐటీ–బెంగళూరు స్నాతకోత్సవంలో వలిపిరెడ్డి ప్రణతి, మనోజ్ నారాయణ్ చౌదరి, సూక్తీ భట్ బంగారు పతకాలు అందుకున్నారు. 1998లో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యా సంస్థల్లో ఒకటిగా ఎదిగింది.

యువతే మన అసలైన శక్తి

యువత సాధికారతకు కట్టుబడి ఉన్నాం

- దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యం పెంచుతాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి నియామక పత్రాల పంపిణీ

సాక్షి, న్యూఢిల్లీ: యువత సాధికారతకు, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యువశక్తి, అతిపెద్ద ప్రజాస్వామ్యం మన దేశానికి ఉన్నాయని, ఇవే మనకు అసలైన బలం అని తెలిపారు. యువశక్తి దేశానికి అత్యంత విలువైన మూలధనమని స్పష్టం చేశారు. శనివారం దేశవ్యాప్తంగా 47 నగరాల్లో నిర్వహించిన రోజ్‌గార్ మేళాల్లో ప్రధాని మోదీ వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన యువతకు 51 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని ఉద్దేశించి ప్రసంగించారు. పారదర్శకమైన నియామక ప్రక్రియకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని లక్షలాది మంది యువత రోజ్‌గార్ మేళాల ఉద్యోగాలు పొందారని, నేడు జాతి నిర్మాణంలో వారంతా పాలుపంచుకుంటున్నారని హర్షం వ్యక్తంచేశారు. గత 11 ఏళ్లుగా దేశం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని వ్యాఖ్యానించారు.



దేశానికి సేవ చేయడమే ఉమ్మడి లక్ష్యం

రోజ్‌గార్ మేళాలు సద్వినియోగం చేసుకొని, కొలువులు పొందిన యువతీ యువకులు రాబోయే రోజుల్లో దేశ అభివృద్ధి వేగాన్ని మరింత వేగవంతం చేస్తారని ప్రధాని మోదీ వివరించారు. కొందరు దేశాన్ని రక్షిస్తారని, మరికొందరు 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'లక్ష్యానికి నిజమైన సైనికులుగా మారతారని పేర్కొన్నారు. యువత వేర్వేరు విభాగాల్లో నియమితులైనప్పటికీ దేశానికి సేవ చేయడమే వారి ఉమ్మడి లక్ష్యమని ఉద్ఘాటించారు. 'పౌరులే ప్రథమం'అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పుడు సిఫార్సులు లేదా లంచం లేకుండా, సామర్థ్యం ఆధారంగా మాత్రమే పొందవచ్చనే విశ్వాసాన్ని రోజ్‌గార్ మేళాలు సృష్టించాయని చెప్పారు.

ఇప్పటికే 1.5 కోట్ల 'లఖ్‌పతి దీదీలు'

'నమో డ్రోన్ దీదీ'కార్యక్రమం గ్రామీణ మహిళలకు డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చి, సాధికారత కల్పించిందని ప్రధానమంత్రి తెలిపారు. 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారి దీదీలుగా మార్చే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందని, ఇప్పటికే 1.5 కోట్ల మంది మహిళలు 'లఖ్‌పతి దీదీ'లుగా సాధికారత సాధించారని వివరించారు.

ఉద్యోగాల స్వభావం మారుతోంది

ప్రస్తుత శతాబ్దంలో ఉద్యోగాల స్వభావం వేగంగా మారుతోందని, ఈ క్రమంలోనే స్టార్టప్ కంపెనీలు, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని మోదీ చెప్పారు. ఇవన్నీ యువత గొప్ప ఆశయాలతో ముందుకు రావడానికి దోహదం చేస్తున్నాయని, ఈ కొత్త తరంపై తనకు ఎంతో విశ్వాసం ఉందన్నారు. యువత కోసం ప్రైవేట్ రంగంలో నూతన ఉపాధి అవకాశాల సృష్టికి ఎంతగానో కృషి చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు రక్షణ తయారీ రంగంలో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతోందని, రూ.1.25 లక్షల కోట్లకుపైగా ఉత్పత్తిని సాధించిందని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద రైలింజన్ తయారీ కేంద్రంగా భారత్ ఆవిర్భవించిందని వెల్లడించారు. రైలింజన్లు, రైలు కోచ్‌లు, మెట్రో కోచ్‌ల ఎగుమతిలో భారత్ పురోగతి సాధిస్తోందన్నారు.

ఈ నెల 15న శుభాంశు శుక్లా రాక

- తొలుత 7 రోజులపాటు క్వారంటైన్‌లో
- ఆ తర్వాతే బాహ్య ప్రపంచంలోకి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో సహచరులతో కలిసి పరిశోధనల్లో నిమగ్నమైన భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా పునరాగమనానికి సమయం ఆసన్నమైంది. ఆయన ఈ నెల 14న ఐఎస్ఎస్ నుంచి బయలుదేరి, 15వ తేదీన భూమిపైకి చేరుకోబోతున్నారు. శుభాంశు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోజ్ ఉజ్‌నాన్‌స్కీ-విస్నివ్‌స్కీ, టిబోర్ కపు భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4.35 గంటలకు ఐఎస్ఎస్ నుంచి వేరుపడతారని(అన్‌డాకింగ్), అనంతరం క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో భూమి దిశగా ప్రయాణం సాగిస్తారని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'ఒక ప్రకటనలో వెల్లడించింది. మంగళవారం సాయంత్రం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరంలో భూమిపై అడుగు పెడతారని తెలియజేసింది. శుభాంశు శుక్లాతోపాటు ఇతర వ్యోమగాములు భూమికిపైకి తిరిగివచ్చిన తర్వాత వారం రోజులపాటు క్వారంటైన్‌లో ఉంటారు. సైంటిస్టులు వారికి భిన్నరకాల పరీక్షలు నిర్వహిస్తారు. భూవాతావరణానికి పూర్తిస్థాయిలో అలవాటు పడిన తర్వాత వ్యోమగాములు బాహ్య ప్రపంచంలోకి వస్తారు. స్పేస్‌ఎక్స్ యాగ్జియం–4 మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు గత నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న సంగతి తెలిసిందే.

కలకత్తా ఐఐఎంలో అఘాయిత్యం

- క్లినికల్ సైకాలజిస్ట్‌పై అత్యాచారానికి పాల్పడిన విద్యార్థి
- కౌన్సిలింగ్ తీసుకుంటానని నమ్మించి హాస్టల్‌కు రప్పించిన వైనం
- మత్తు మందు కలిపిన పానీయం ఇచ్చి అత్యాచారం
- బాధితురాలి ఫిర్యాదుతో విద్యార్థిని అరెస్టు చేసిన పోలీసులు

కోల్‌కతా: ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) కలకత్తా క్యాంపస్‌లో ఘోరం జరిగింది. ఓ మహిళపై విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. మత్తు మందు కలిపిన పానీయం తాగించాడని, తాను అపస్మారక స్థితిలోకి చేరుకున్న తర్వాత అఘాయిత్యానికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు. కోల్‌కతాలోని హరిదేవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితుడు మహావీర్ తొప్పాన్నవర్ అలియాస్ పరమానంద జైన్‌ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం నగరంలోని అలీపూర్ కోర్టులో ప్రవేశపెట్టగా, నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 19వ తేదీన అతడిని మళ్లీ తమ ఎదుట ప్రవేశపెట్టాలని పోలీసులకు సూచించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని నిందితుడు కోరగా మేజిస్ట్రేట్ తిరస్కరించారు.

ఆన్‌లైన్ ద్వారా సంప్రదింపులు

కోల్‌కతాకు చెందిన మహిళ క్లినికల్ సైకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. విద్యార్థులకు, యువతకు కౌన్సిలింగ్ ఇస్తుంటారు. ఐఐఎం క్యాంపస్‌లో చదువుకుంటున్న విద్యార్థి కౌన్సిలింగ్ తీసుకుంటానని ఆన్‌లైన్ ద్వారా ఆమెను సంప్రదించాడు. శుక్రవారం సదరు మహిళను తమ హాస్టల్‌కు రప్పించాడు. హాస్టల్ గదికి చేరుకున్న తర్వాత ఆమెకు డ్రగ్స్ కలిపిన పానీయం అందజేశాడు. అది సేవించి ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడంతో అత్యాచారానికి పాల్పడ్డాడు. కొన్ని గంటల తర్వాత తేరుకున్న బాధితురాలు తనపై అత్యాచారం జరిగినట్లు గుర్తించారు. అతడిని గట్టిగా నిలదీయడంలో బెదిరింపులకు గురి చేశాడు. ఈ విషయం బయటపెడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. బాధితురాలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన ఘోరాన్ని వివరించారు. పోలీసులు రంగంలోకి దిగి, శుక్రవారం రాత్రి నిందితుడు పరమానంద జైన్‌ను అరెస్టు చేశారు. ఈ ఉదంతంపై ఐఐఎం–కలకత్తా యాజమాన్యం స్పందించింది. తమ విద్యార్థిపై ఒక మహిళ ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని వెల్లడించింది. ఆమె తమ సంస్థకు చెందిన మహిళ కాదని స్పష్టంచేసింది.

కోల్‌కతాలో వరుస ఘటనలు

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మహిళలపై అత్యాచార ఘటనలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. గత ఏడాది ఆగస్టు 9న ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరగడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అలాగే 15 రోజుల క్రితం కోల్‌కతాలోని న్యాయ కళాశాలలో 24 ఏళ్ల విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురయ్యారు. ముగ్గురు వ్యక్తులు సెక్యూరిటీ గార్డుతో కలిసి ఆమెను రేప్ చేసినట్లు కేసు నమోదైంది. నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

అత్యాచారం జరగలేదు.. ఆటో నుంచి కింద పడిపోయింది

ఐఐఎం–కలకత్తా క్యాంపస్ హాస్టల్‌లో అత్యాచారానికి గురైన మహిళ తండ్రి భిన్నంగా స్పందించారు. తన కుమార్తెపై అత్యాచారం జరగలేదని, ఆటోలో ప్రయాణిస్తూ కింద పడిపోవడంతో స్వల్పంగా గాయాల పాలైందని శనివారం చెప్పారు. శుక్రవారం రాత్రి 9.34 గంటల సమయంలో తనకు ఫోన్ వచ్చిందని, తన బిడ్డ ఆటో నుంచి పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరినట్లు తెలిసిందని అన్నారు. పోలీసులు ఆమెను ఆసుపత్రికి చేర్చారని తెలిపారు. రేప్ జరగలేదని తన కుమార్తె తనతో స్వయంగా చెప్పిందని వెల్లడించారు.

వీసా వచ్చిందని మురవకండి

- చట్టాలను అతిక్రమిస్తే వెళ్లగొడతాం
- వీసా వచ్చినా 'స్క్రీనింగ్' కొనసాగుతుంది
- వీసాదారులకు హెచ్చరిక
- అడ్వైజరీ జారీచేసిన అమెరికా ఎంబసీ

న్యూఢిల్లీ: వీసా కష్టాల కడలిని ఈది అమెరికాలో అడుగుపెట్టాక సైతం వీసాదారులపై 'స్క్రీనింగ్'కత్తి వేలాడుతూనే ఉంటుందని ట్రంప్ సర్కార్ స్పష్టం చేసింది. ఏ చట్టాలు, నిబంధనల ప్రకారం విదేశీయులకు వీసా మంజూరు చేశామో అవే చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను ఇక్కడికొచ్చాక అతిక్రమిస్తున్నట్లు తేలితే వెంటనే బహిష్కరించి దేశం నుంచి వెళ్లగొడతామని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం శనివారం ఒక అడ్వైజరీని విడుదలచేసింది. ''అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్, టెలిగ్రామ్, లింక్డ్‌ఇన్ వంటి మీ సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలు ఇచ్చారు. అమెరికా వ్యతిరేక, హమాస్ ప్రతికూల సోషల్‌మీడియా పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యానాలు ఉంటే ఆయా దరఖాస్తుదారులకు వీసాలను తిరస్కరించాం. అంతా సక్రమంగా ఉండి వీసాలు పొందిన విదేశీయులు ఆనందపడాల్సిన పనిలేదు. వీసాలు మంజూరైనా సరే మీపై సోషల్‌మీడియా 'స్క్రీనింగ్'ప్రక్రియ ఇకమీదటా కొనసాగుతుంది. సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టులపై ఓ కన్నేస్తాం. అమెరికా గడ్డపై ఉంటూ మా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే వెంటనే వీసాను రద్దుచేస్తాం. అలాంటి వ్యక్తులను బహిష్కరించి దేశం నుంచి వెళ్లగొడతాం''అని అడ్వైజరీ ద్వారా అమెరికా హెచ్చరించింది. ''అమెరికాలో ఉన్నంతకాలం ఇక్కడి చట్టాల ప్రకారం నడుచుకోవాలి. వీసా స్క్రీనింగ్‌లో భాగంగా మీ సోషల్‌మీడియా అకౌంట్లలోని పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యానాలను ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలించేందుకు వీలుగా అందరికీ కనిపించేలా సెట్టింగ్‌లను 'పబ్లిక్'మోడ్‌లోనే కొనసాగించండి. జాతీయ భద్రతకు లోబడే వీసా జారీ అనేది ఉంటుంది. అందుకే ఎఫ్, ఎం, జే ఇలా ప్రతి వీసాదారుడు ఈ నిబంధనలను అనుసరించాలి''అని సూచించింది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 13 । జూలై । 2025



ఫ్రీ లెఫ్ట్ బ్లాక్.. జంక్షన్ జామ్

గ్రేటర్ జంక్షన్లు జామ్ అవుతున్నాయి. కూడళ్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ విధానం అమలు కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. -10లో



ఆట.. డిజైన్ల వేట.. అత్లీజర్

ఆధునిక జీవనశైలికి తగ్గట్టుగా రూపుదిద్దుకుంటున్న ఫ్యాషన్ ప్రపంచంలో 'అత్లీజర్' స్టైల్ ఒక కొత్త ట్రెండ్‌గా మారింది. యువత ఆదరణ పొందుతోంది. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ కాన్వొకేషన్ వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. న్యాయశాస్త్రం అభ్యసించిన విద్యార్థులు పట్టాలు అందుకుని ఆనందంలో మునిగితేలారు. పలువురు స్వర్ణ పతకాలు సాధించి సంతోషంలో తేలియాడారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపారు.

అ'లా'.. పట్టాల ఆనందంలో..





పట్టాలు అందుకున్న సంతోషంలో..

అమ్మవారి ఆలయం.. దేదీప్యమానం



నేడు, రేపు లష్కర్ బోనాల జాతర కన్నులపండువగా జరగనుంది. ఉత్సవాలకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం అందంగా ముస్తాబైంది. ఆదివారం బోనాలు, సోమవారం రంగం కార్యక్రమంలో భాగంగా భవిష్యవాణి ఉంటుంది. ఈ సందర్భంగా శనివారం రాత్రి విద్యుద్దీపాల అలంకరణతో అమ్మవారి ఆలయం వెలుగులీనుతూ కనిపించింది.

– రాంగోపాల్‌పేట



ఈ చిరునవ్వులిక కానరావు

సంప్‌లో పడి నాలుగేళ్ల బాలుడి మృతి



అభి (ఫైల్)

మియాపూర్: ఇంటి ఆవరణలోని సంప్‌లో పడి బాలుడు మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిలా ఘన్‌పూర్ మండలానికి చెందిన సభావత్ శ్రీను, నీల దంపతులకు ఓ కూతురు అఖిల, కుమారుడు అభి (4) ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం మూడేళ్ల క్రితం వలస వచ్చి నగరంలో మియాపూర్ హఫీజ్‌పేట్ సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. స్థానికంగా సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. బాలుడు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం శ్రీను, నీల దంపతులు కూలిపనుల నిమిత్తం వెళ్లగా కూతురు అఖిల, కుమారుడు అభి ఇంటి వద్ద ఉన్నారు. మధ్యాహ్నం సమయంలో బాలుడు అభి ఇంటి ఆవరణంలో ఉన్న సంపులో నుంచి నీటిని తీసుకునేందుకు వెళ్లి అందులో పడిపోయాడు. సమీపంలో ఆడుకుంటూ ఉన్న అఖిల చూసి స్థానికులకు చెప్పడంతో అభిని సంపులోంచి బయటకు తీసి సమీపంలోని కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. సంపుపై మూత ఏర్పాటు చేయాలని ఇంటి యజమానికి పలుమార్లు చెప్పి నా పట్టించుకోలేదని.. దీంతో తమ కుమారుడు మృత్యువాత పడినట్లు అభి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మియాపూర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అంతా కలరింగ్

- పటిష్టత లేని హంగులు
- ఫ్లై ఓవర్లకు ఇవేం పనులు?
- వృథా అవుతున్న రూ.కోట్లు
- ఇవి ఎవరి ప్రయోజనాల కోసమో.. కాంట్రాక్టర్ల జేబులు నింపడానికో..!

పైపై పూతలతో రంగులు



నారాయణగూడ ఫ్లై ఓవర్‌కు రంగులు సరే.. పటిష్టత మాటేంటి?

సాక్షి, సిటీబ్యూరో

తెలుగుతల్లి.. నారాయణగూడ తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లకు రంగులేశారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. వాటి పటిష్టత ఎంత? అన్నది మాత్రం చెప్పలేని పరిస్థితి. ప్రపంచ సుందరి పోటీలు అనో, ఇంకో సందర్భమనో, ఏవీ కాకున్నా నగరం అందంగా కనపడాలనో పలు ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లకు రంగులేశారు. రూ.కోట్లు ఖర్చు చేశారు. ఆ చేసే పనేదో వాటికి పటిష్టత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మరమ్మతులు చేశాక రంగులేస్తే ప్రయోజనం ఉండేది. కానీ.. ఎవరి ప్రయోజనాలకో, కాంట్రాక్టర్లకు జేబులు నింపడానికో ఇలాంటి పనులు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇంటికైనా మరో నిర్మాణానికైనా రంగులేశాక మరమ్మతులు చేస్తారా? మరమ్మతులు చేశాక రంగులేస్తారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫ్లై ఓవర్లకు పెద్దగా మరమ్మతులంటూ అవసరం ఉండదు.. కానీ నిర్ణీత వ్యవధుల్లో నిర్మాణ పటిష్టత (స్ట్రక్చరల్ స్టెబిలిటీ) పరీక్షలు అవసరమంటున్నారు నిపుణులు. నగరంలోని కొత్త ఫ్లై ఓవర్లు మినహాయిస్తే పాత ఫ్లై ఓవర్లకు అవి తప్పనిసరి అని పేర్కొన్నారు. నగరంలో దశాబ్దం, రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఫ్లై ఓవర్లు 30కి పైగా ఉన్నాయి. బేగంపేట, సీటీఓ జంక్షన్, హరిహర కళాభవన్, తార్నాక, బషీర్‌బాగ్, మాసబ్‌ట్యాంక్, తెలుగుతల్లి తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లు నిర్మించి రెండు దశాబ్దాలు దాటింది. వీటన్నింటికీ స్టెబిలిటీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మరమ్మతులు చేయాల్సి ఉంది. ఆ పని చేయకుండా ఫ్లైఓవర్లపై పడే గుంతలు పూడ్చేందుకు పైపై కోటింగ్‌లు వేస్తూ పోతుండటంతో కొన్ని ఫ్లై ఓవర్ల మందం పెరిగిపోయింది.

పటిష్ట చర్యలు అవసరం

దీర్ఘకాలంలో ఫ్లై ఓవర్లకు సంబంధించిన బేరింగులు, ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ వదులవుతాయని వాటిని పటిష్ట పరిచేందుకు మరమ్మతులు అవసరమని ఇంజినీరింగ్ నిపుణులు తెలిపారు. నగరంలోని పాత ఫ్లై ఓవర్లలో రెండు మూడు ఫ్లై ఓవర్లకు తప్ప మిగతా వాటికి మరమ్మతులు జరగలేదని సమాచారం. ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌కు దాదాపు ఐదేళ్ల క్రితం స్వల్ప మరమ్మతులు మాత్రం చేశారు. పూర్తిస్థాయి మరమ్మతులు చేయకుండానే ప్రస్తుతం రంగుల హంగులు, పచ్చదనం పెంపు వంటి చర్యలకు సిద్ధమయ్యారు.

నిర్ణీత వ్యవధుల్లో మరమ్మతులు అవసరం..

నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం, సాధారణంగా ఫ్లైఓవర్లలోని గర్డర్స్ ప్రాంతాల్లో కాంక్రీట్ దెబ్బతింటుంది. బేరింగులు అరిగిపోతాయి. ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ వదులై బలహీనంగా మారతాయి. స్తంభాల పైభాగాలు (పయర్ క్యాప్స్) తుప్పుపడతాయి. బాక్స్‌గర్డర్స్ ఏటవాలు గోడల్లో పగుళ్లు ఏర్పడతాయి. నిర్ణీత వ్యవధుల్లో వాటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ అలా జరగడం లేదు. ఒక్కో ఫ్లైఓవర్‌కు దాదాపు 15–20 స్పాన్‌లుంటాయి. వాటిల్లో ఉండే బేరింగ్‌లను జాకీలు ఏర్పాటుచేసి మార్చాల్సి ఉంటుంది. బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్ కొత్తలోనే జరిగిన ప్రమాదంతో కొత్తవి, పాతవి అన్నింటికీ అదనపు సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని, వేగ పరిమితి హెచ్చరికలతోపాటు క్రాష్‌బారియర్స్, వ్యూకట్టర్స్ తదితర ఏర్పాట్లు చేయాలని భావించారు. కానీ ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. అధికారుల వద్ద ఈ అంశాలు ప్రస్తావించగా, త్వరలో తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

థర్డ్ పార్టీతో పరీక్షలు

నగరంలోని పాత ఫ్లై ఓవర్ల పటిష్టతను నిర్ధారించేందుకు థర్డ్‌పార్టీ నిపుణుల కమిటీని నియమించి, పరీక్షలు చేయించి అదిచ్చేని వేదిక మేరకు, కమిషనర్ సూచనలకు అనుగుణంగా స్పెషలైజ్డ్ మెయింటనెన్స్ ఆపరేషన్స్, రిట్రో ఫిట్టింగ్, రిస్టోరేషన్ పనులు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాట్‌హోల్స్ పూడ్చివేత, స్వల్ప పగుళ్ల ప్యాచ్‌వర్క్స్, దెబ్బతిన్న రెయిలింగ్స్‌కు మరమ్మతులతోపాటు అవసరమైన ప్రాంతాల్లో యాంటి కార్బొనేషన్ పూతలు వేసే పనులు నిర్వహణ విభాగం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

అటకెక్కిన ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్‌లు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుకు ప్రతిపాదనలు

- ట్రాక్‌ల నిర్వహణపై గతంలోనే రవాణా శాఖ అధ్యయనం
- పారదర్శకంగా పరీక్షించేందుకు పలుచోట్ల సాంకేతిక దన్ను
- ప్రస్తుతం ఇష్టారాజ్యంగా మారిన టెస్టుల నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: డ్రైవింగ్ నైపుణ్యాన్ని కచ్చితంగా పారదర్శకంగా పరీక్షించి లైసెన్సులు అందజేసేందుకు ప్రతిపాదించిన ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్‌ట్రాక్‌లు అటకెక్కాయి. మానవ ప్రమేయం లేకుండా కేవలం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగానే పరీక్షలు నిర్వహించేందుకు రవాణా అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఈ మేరకు వివిధ రాష్ట్రాల్లో ట్రాక్‌ల నిర్వహణపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సైతం అందజేశారు. కానీ ఇప్పటి వరకు ఈ ప్రతిపాదన ఆచరణకు నోచుకోలేదు. కేంద్రం రూపొందించిన రహదారి భద్రత చట్టంలో భాగంగా అధునాతన డ్రైవింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ట్రాక్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. డ్రైవింగ్ ప్రమాణాలు, నైపుణ్యం పడిపోతున్నాయి. దీంతో రహదారి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో నైపుణ్యం కలిగిన డ్రైవర్లను తయారు చేసేందుకు పటిష్టమైన శిక్షణ అవసరమని రవాణా అధికారులు గుర్తించారు. శిక్షణతో పాటు పరీక్షలు కూడా ఎంతో కీలకమని భావించారు. ఇందుకనుగుణంగానే నగరంలో ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ప్రతిపాదనలు తెచ్చారు. కానీ ఇప్పటి వరకు ఈ ప్రతిపాదనలు ఆచరణలోకి రాకపోవడం గమనార్హం.

ట్రాక్‌ల నిర్వహణ అస్తవ్యస్తం..

ప్రస్తుతం ట్రాక్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇబ్రహీంపట్నం, బండ్లగూడ వంటి కొన్ని కార్యాలయాల్లో అలంకారప్రాయంగా మారాయి. కొన్ని చోట్ల ట్రాక్‌ల నిర్వహణ డ్రైవింగ్ స్కూళ్ల ఏజెంట్‌ల కనుసన్నల్లో నడుస్తోంది. దీంతో పరీక్షల్లో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ట్రాక్‌లలో ప్రతిరోజు 2,500 మందికి పైగా పరీక్షలకు హాజరవుతారు. ఏజెంట్‌ల ద్వారా పరీక్షలకు వచ్చిన 85 శాతం మంది ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్తీర్ణులవుతారు. స్వయంగా వచ్చేవాళ్లు మాత్రం చిక్కుల్లో పడుతున్నారు. కొన్ని పెద్ద ట్రాక్‌లు మినహా మిగతా చోట్ల వీటి నిర్వహణ అస్తవ్యస్తంగానే మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ట్రాక్‌లు కొందరు ఎంవీఐల అక్రమార్జనకు కేంద్రంగా మారాయనే ఆరోపణలున్నాయి.

తాత్సారమెందుకో?

పారదర్శకమైన ట్రాక్‌ల నిర్వహణ కోసం గతంలో అనేక ప్రయోగాలు చేశారు. అన్ని ట్రాక్‌లకు సీసీ కెమెరాలతో పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టారు. కొన్ని చోట్ల వాహనాల కదలికలను నమోదు చేసే సెన్సర్‌ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ.. ప్రయోగాల దశలోనే కొందరు అధికారులు వాటికి గండికొట్టారు. పదేళ్ల క్రితమే ఏర్పాటు చేసిన సెన్సర్‌లను ధ్వంసం చేశారు. కెమెరాలు పని చేయడం లేదు. ఆధునిక ట్రాక్‌ల ప్రతిపాదన పదేళ్ల క్రితమే అమల్లోకి వచ్చింది. ఆచరణలో ముందుకు సాగలేదు. ఇప్పుడు కేంద్ర రహదారి భద్రతా చట్టం ఆదేశాల మేరకు ఆటోమేటిక్ ట్రాక్‌లు మరోసారి తెరపైకి వచ్చాయి. కానీ అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ముం'చెత్త'కుండా..

నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మకోల్

- కల్వర్టుల వద్ద ఇరుక్కుపోవడంతో అడ్డుగా..
- వెలికితీతకు చర్యలు చేపట్టిన హైడ్రా
- ఖైరతాబాద్‌లో 10 టిప్పర్ల మేర తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: బుల్కాపూర్ నాలా అభివృద్ధిపై దృష్టి పెట్టిన హైడ్రా ఆక్రమణలతో పాటు కల్వర్టుల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను హైడ్రా తొలగిస్తోంది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద కల్వర్టు నుంచి 13 టిప్పర్ల వ్యర్థాలు బయటకు తీయగా.. వీటిలో 10 టిప్పర్లు కేవలం థర్మకోల్ వ్యర్థాలే కావడం గమనార్హం. కేవలం ఈ ఒక్క నాలానే కాదు దాదాపు ప్రతి నాలా, హార్వెస్టింగ్ పిట్ పరిస్థితి ఇలానే ఉందని హైడ్రా అధ్యయనంలో తేలింది.

నాలా పరిస్థితిని పరిశీలించి..

మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌తో (ఎంఈటీ) పాటు హైడ్రా అధీనంలోని డీఆర్‌ఎఫ్ బృందాలు ఈ నెల 1 నుంచే రంగంలోకి దిగాయి. ఇప్పటి వరకు ఈ బృందాలకు కేవలం వర్షం కురిసినప్పుడు మాత్రమే పని ఉండేది. మిగిలిన సమయంలో నిర్దేశిత ప్రాంతాల్లో వేచి ఉంటుండేవి. వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నాలాల పరిస్థితిని పరిశీలించారు. అనేక ప్రాంతాల్లో అవి కబ్జా కావడంతో పాటు కల్వర్టుల వద్ద చెత్త, ప్లాస్టిక్, థర్మకోల్ వ్యర్థాలు పేరుకు పోవడం వల్ల కూడా నీటి ప్రవాహం తగ్గిపోతోంది. ఈ కారణంగా అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోతున్నట్లు గుర్తించారు. కేవలం వర్షం కురిసినప్పుడే కాకుండా ఈ అడ్డంకులను ఎప్పటికప్పుడు తొలగించే బాధ్యతల్ని ఎంఈటీలకు అప్పగించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న 940 కల్వర్టుల వద్ద, ముఖ్యమైన ప్రాంతాల్లో ఉన్న ఇంకుడుగుంతల్లో పరిస్థితుల్ని ఈ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి.

వివిధ విభాగాల సహకారంతో..

వ్యర్థాల క్లియరెన్స్ కోసం హైడ్రా అధికారులు జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, జలమండలి సహకారంతో ముందుకు వెళ్తున్నారు. వర్షాలు జోరందుకునే లోపు క్లీనింగ్ పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. మ్యాన్‌హోళ్ల పరిస్థితుల్నీ ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. నాలాల్లో చెత్తతో పాటు ఆక్రమణల్నీ హైడ్రా తొలగిస్తోంది. ఖైరతాబాద్‌లోని శ్రీధర్ ఫంక్షన్ హాల్ వద్ద బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించింది. నగరంలోనే అత్యంత కీలకమైన బుల్కాపూర్ నాలాకు హైడ్రా ప్రాధాన్యం ఇస్తోంది. దీనికి గేట్లు ఏర్పాటు చేయడం ద్వారా జంట నగరాలకు తాగు నీరు అందించే ఉస్మాన్‌సాగర్‌కు (గండిపేట చెరువు) ఉన్న మురుగు ముప్పు తప్పించింది. ఖానాపూర్, నాగులపల్లి నుంచి వచ్చిన మురుగు నీరు బుల్కాపూర్ నాలా ద్వారా గండిపేటలోకి వెళ్లకుండా హైడ్రా ఈ ఏడాది మేలో కొత్త గేట్లు ఏర్పాటు చేసింది.



వ్యర్థాలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది



నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

హుస్సేన్‌సాగర్ వర్షపు నీటిని తీసుకువెళ్లే..

బుల్కాపూర్ నాలా ఒకప్పుడు వరద కాలువగా ఉండేది. శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే ఈ నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూ కాలనీ, షేక్‌పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హకీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలిటరీ ఏరియా, బంజారాహిల్స్, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా ప్రవహించి హుస్సేన్‌సాగర్‌కు నీటిని చేరుస్తోంది. ప్రస్తుతం నాలాకు ఎగువన ఉన్న నివాసాలు, వాణిజ్య సముదాయాలు, రిసార్టుల నుంచి బయటకు వస్తున్న మురుగు నీరు దీని ద్వారానే ప్రవహిస్తోంది. బుల్కాపూర్ నాలాను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే ప్రయోజనాలుంటాయని, హుస్సేన్‌సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువెళ్లే ఏకైక నాలా ఇదేనని అధికారులు చెబుతున్నారు. దీంతో నాలా పునరుద్ధరణ పైనా హైడ్రా ప్రత్యేక దృష్టి పెట్టింది.

7 స్టార్ సిటీగా గ్రేటర్ హైదరాబాద్?

ఈసారి కనీసం మూడు అవార్డులు

- త్వరలో స్వచ్ఛ ర్యాంకింగ్‌ల వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌లో ఈ సంవత్సరం కూడా జీహెచ్‌ఎంసీకి మంచి ర్యాంకింగ్‌తో పాటు కనీసం మూడు అవార్డులు లభించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు సమాచారం అందింది. ఇందులో ఒక రాష్ట్రస్థాయి అవార్డు ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు త్రీస్టార్ నుంచి ఫైవ్‌స్టార్ రేటింగ్ పొందిన నగరం ఈసారి సెవెన్‌స్టార్ రేటింగ్ పొందనున్నట్లు తెలిసింది. దీంతోపాటు వాటర్ ప్లస్ సిటీ అవార్డు మరోసారి దక్కనుంది. దీంతో వరుసగా నాలుగోసారి ఈ అవార్డు పొందే నగరంగా నిలవనుంది. ఈ నెల 17వ తేదీన ఢిల్లీలో జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో ఏ ర్యాంకు అన్నది వెల్లడి కానుంది.

తెలుగు రాష్ట్రాల్లోనే తొలి నగరంగా..

తెలుగు రాష్ట్రాల్లో సెవెన్‌స్టార్ ర్యాంకింగ్ పొందే తొలి నగరంగా హైదరాబాద్ నిలవనుంది. ర్యాంకింగ్స్‌లో గత సంవత్సరం 9వ ర్యాంక్‌ను పొందినందున ఈసారి అంతకంటే మెరుగైన ర్యాంక్ రానున్నట్లు సంబంధిత అధికారులు భావిస్తున్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీగానూ తగిన గుర్తింపు రానున్నట్లు తెలుస్తోంది. ఈసారి హైదరాబాద్, కంటోన్మెంట్ బోర్డు తప్ప రాష్ట్రంలోని మిగతా పురపాలికలకు తగిన గుర్తింపు దక్కలేదని విశ్వసనీయ సమాచారం. ఇంటింటికీ చెత్త సేకరణ, విభజన, ప్రాసెసింగ్‌లతో పాటు పౌరుల అభిప్రాయాల సేకరణ, ఫిర్యాదుల పరిష్కారంతో సహా వివిధ అంశాలను స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌కు పరిగణనలోకి తీసుకుంటారు.

నగరానికి గతంలోనూ..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీహెచ్‌ఎంసీ 2015 నుంచి 2022 వరకు 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాల్లో వివిధ ర్యాంకింగ్‌లు, అవార్డులు పొందింది. 2018లో బెస్ట్ స్టేట్ క్యాపిటల్ అవార్డు, 2019లో బెస్ట్ మెట్రో సిటీ అవార్డులు పొందింది. అదే సంవత్సరం తొలిసారిగా ఓడీఎఫ్ డబుల్ ప్లస్ సర్టిఫికెట్ పొందింది. స్వచ్ఛత ఎక్సలెన్సీ అవార్డును కైవసం చేసుకుంది. 2020లో సిటిజెన్ ఫీడ్‌బ్యాక్‌లో బెస్ట్ మెగాసిటీగా ఎన్నికైంది. 2021లో బెస్ట్ సెల్ఫ్ సస్టైనబుల్ మెగా సిటీ అవార్డును అందుకోవడం ద్వారా త్రీస్టార్ హోదాను పొందింది. అదే సంవత్సరం తొలిసారిగా వాటర్ ప్లస్ సిటీగా సర్టిఫికెట్‌ను అందుకుంది. 2022 సంవత్సరానికి గార్బేజ్ ఫ్రీ సిటీ కింద త్రీ స్టార్ హోదాను పొందడం గమనార్హం.



పసికందును పారేశారు!

- రామంతాపూర్‌లో రోడ్డుపై మగశిశువు
- నిలోఫర్ ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- ఎవరో కావాలనే వదిలివెళ్లినట్లు వెల్లడి



శిశువును ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఉప్పల్: ఆ కన్నతల్లికి పేగు బంధమే భారం అయిందా? శిశువును వదిలించుకోవాలని ఎవరైనా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా? అనే రీతిలో అమానవీయ ఘటన జరిగింది. అప్పుడే పుట్టిన.. ఇంకా కళ్లు కూడా సరిగా తెరవని పసికందును రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ వివేక్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున మగశిశువు ఏడుస్తున్న శబ్దం వినిపించడంతో కౌశిక్ అనే వ్యక్తి ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో శిశువును నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి కంటికి గాయం కావడంతో కమిలిపోయి ఉంది. ఆస్పత్రిలో చిన్నారిని వైద్యులు పరీక్షించారు. శిశువుకు ఎలాంటి అపాయం లేదని వారు వెల్లడించినట్లు సమాచారం. కన్నతల్లే కావాలని శిశువును ఇలా రోడ్డుపై వదిలి వెళ్లిందా? లేక ఎవరైనా వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడ పారవేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. కిందపడి వ్యక్తి మృతి

మియాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆసుపత్రికి వెళ్తుండగా ద్విచక్రవాహనంపై నుండి కిందపడి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తర్‌ప్రదేశ్ నజీబాబాద్‌కు చెందిన నయీమ్ అహ్మద్ (36) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మియాపూర్ న్యూహాఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్ కాలనీలో స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. స్థానికంగా కార్పెంటర్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తుందని నయీమ్ అహ్మద్ ఈనో తాగి పడుకున్నాడు. శనివారం ఉదయం కూడా నీరసంగా అన్పించడంతో కొండాపూర్‌లోని ఓ ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా..ప్రేమ్‌నగర్ వద్ద ప్రధాన రహదారిపై కిందపడిపోయాడు. స్థానికులు చూసి నయీమ్ అహ్మద్‌ను చికిత్స నిమిత్తం కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి నయీమ్ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి స్నేహితుడు నసీమ్ అలీ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నయీమ్ అహ్మద్ గుండెలో నొప్పిరావడం వల్ల కిందపడి మృతిచెంది ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

అనురాగ్ వర్సిటీలో స్లాబ్ సెంట్రింగ్ కూలి కార్మికులకు గాయాలు



పోచారం: మున్సిపాలిటీ పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఆవరణలో భవన నిర్మాణ పనులు జరుగుతుండగా శనివారం ప్రమాదవశాత్తు స్లాబ్ సెంట్రింగ్ కూలడంతో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని సమీపంలోని నీలిమా హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స చేయించారు. గాయపడిన భవన నిర్మాణ కార్మికులను మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్నాడకు చెందిన కేశవులు, రాజు, చత్తీస్‌ఘడ్‌కు చెందిన రాజు యాదవ్, ఓమ్‌ప్రకాష్‌గా గుర్తించారు. 10వ ఫ్లోర్ స్లాబ్ వేస్తుండగా 5 అడుగుల వెడల్పు ఉన్న సంకెస్ స్లాబ్ రెండు రాడ్లు కదలడంతో సెంట్రింగ్ బాక్స్‌లు పడిపోయాయి. దీంతో కింది ఫ్లోర్‌లో పని చేస్తున్న నలుగురు కార్మికులపై పడటంతో గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన నిర్మాణ కాంట్రాక్టర్ పోలీసులకు తెలియజేశారు. పోలీసులతో పాటు హైడ్రా అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

మినీ శిల్పారామంలో థిమాటిక్ ఎగ్జిబిషన్


హస్తకళల ఉత్పత్తులను పరిశీలిస్తున్న శృతి పాటిల్ తదితరులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో పది రోజులపాటు నిర్వహించే థిమాటిక్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఐఐఎస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శృతి పాటిల్ మాట్లాడుతూ హస్తకళలు నిత్య నూతనంగా మన సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయని అన్నారు. అలాంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ప్రతి స్టాల్‌ను, ప్రతి పనిని ఆసక్తిగా గమనించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ అవార్డీ దోసడ కృష్ణాచారి, అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల, విజయ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ ప్రధాన కార్యదర్శిగా సాయిబాబు

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ ఉద్యోగుల కార్మిక సంఘం...1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జి.సాయిబాబు నాలుగో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్లకోసారి జరిగే రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు శనివారం సాయంత్రం నగరంలోని కొత్తపేటలో ఉన్న రాజధాని గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో జి.సాయిబాబు తిరిగి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనే సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవుతూ వస్తున్నారు. మరోవైపు ప్రస్తుత అధ్యక్షులుగా ఉన్న వేమూరి వెంకటేశ్వర్లు సహా అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్న జి.వరప్రసాద్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె.రాజేందర్ కొత్తగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల కోసం తాము రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి జి సాయిబాబు స్పష్టం చేశారు. తనను తిరిగి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికున్నందుకు 1104 యూనియన్ సభ్యులు, నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మిక నేతలు కొత్త కార్యవర్గాన్ని అభినందించారు.

కల్లు కాంపౌండ్లపై ఎక్సైజ్ దాడులు

గచ్చిబౌలి: కల్లు కాంపౌండ్లపై ఎక్సైజ్ శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీమ్స్ ప్రత్యేక దాడులను నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి మూడు ఎస్టీఫ్ టీమ్‌లతో దాడులు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో శనివారం ఎస్టీఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి సిద్దిక్‌నగర్‌లో పలు కాంపౌండ్లపై దాడులు నిర్వహించారు. లైసెన్స్ ఉన్న కల్లు దుకాణాల్లో కల్లు పరీక్షల కోసం శాంపిల్స్‌ను సేకరించారు. సిద్దిక్‌నగర్‌లో అనుమతి లేకుండా నడిపిస్తున్న కల్లు దుకాణాన్ని సీజ్ చేశారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్టీ లీడర్ అంజిరెడ్డి తెలిపారు. ఎస్‌టీఎఫ్‌సిటీ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి బాలానగర్, మూసాపేట్, కైతలాపూర్ ప్రాంతాల్లో డిపోలు, కల్లు కాంపౌండ్లలో తనిఖీలు నిర్వహించారు. శాంపిళ్లను సేకరించి ఆయా ఎక్సైజ్ సీఐలకు అప్పగించారు. ఎస్‌టీఎఫ్ సీటింగ్ సీఐ నాగరాజు సిబ్బంది కలిసి ముషీరాబాద్‌లో మూడు కాచిగూడలో రెండు కల్లు డిపోలను తనిఖీ చేశారు. కల్లు శాంపిళ్లను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు వివరించారు.

రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఫ్లాట్లు నిర్మించి ఇస్తామంటూ నమ్మబలికి రూ.35 లక్షల 10 వేలు వసూలు చేసి నిర్ణీత కాల వ్యవధి లోగా నిర్మాణం పూర్తి చేయని ఓ రియల్ ఎస్టేట్ సంస్థపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..ఉప్పల్ నాచారం పోలీస్‌స్టేషన్ వెనుక గల భవానీనగర్‌లో నివాసం ఉండే రాజీవ్‌కుమార్ నిమ్మగడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొల్లూరులో నివాస ఫ్లాట్లను బుక్ చేసుకోవడానికి జీఎస్ఆర్ గ్రూప్ (గతంలో ఈవైకే గ్రూపు)ను సంప్రదించాడు. ఆ మేరకు ఫ్లాట్‌నెంబర్ 4001, బ్లాక్-ఈ నాలుగో ఫ్లోర్‌లో ఈస్ట్ ఫేసింగ్ కలిగిన 1170 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ను బుక్ చేసుకున్నాడు. ఇందుకోసం ఒక చదరపు అడుగుకు 3,000ల చొప్పున చెక్కుల రూపంలో, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ రూపంలో రూ.35,10,000 చెల్లించి రశీదు పొందారు. కానీ నిర్ణీత సమయానికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. సదరు సంస్థ ఎండీ గుంటుపల్లి శ్రీనివాసరావు తన లాగా మరింత మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశాడని, కానీ ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు చేపట్టలేదని, నిధులు దుర్వినియోగం చేశారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు వల్ల ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. హుస్సేన్‌సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆంధ్రాబ్యాంక్ ఏరియా, పట్టాభి భవన్ ఏరియా, ఫారెస్ట్ ఆఫీస్ ఏరియా, నవత్ పహాడ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాకా భవన్, నిజాం క్లబ్, కళాంజలి, ఆల్ ఇండియా రేడియో, ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ పరిధిలో సంగీత్ నగర్, కపాడియా లేన్, రెడ్ రోస్ హోటల్, సివిల్ సప్లై గల్లీ, ఎర్రమంజిల్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

హిమాయత్‌నగర్: వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబీబ్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరబోయిన లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షులు ముక్కు నర్సయ్యలు తెలిపారు.

తెలంగాణ పంచాయత్ పరిషత్ అధ్యక్షుడిగా జలీల్



నియామక పత్రాన్ని అందజేస్తున్న విజయ్ వర్మ, చిదంబర రెడ్డి, రామచంద్రయ్య

హిమాయత్‌నగర్: ఆలిండియా పంచాయత్ పరిషత్ రాష్ట్ర విభాగం అయిన తెలంగాణ పంచాయత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇల్లందు కు చెందిన ఎంఏ జలీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఆలిండియా పంచాయత్ పరిషత్ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త విజయ్ వర్మ మాట్లాడుతూ ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నికైన జలీల్ నేతృత్వంలో తెలంగాణ పంచాయత్ పరిషత్ కమిటీ గ్రామ స్వరాజ్య దిశగా కృషి చేయాలన్నారు.

ఫౌంటెయిన్లు శుభ్రం చేసిన సిబ్బంది



బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం పరిధిలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్లలో పెద్ద ఎత్తున మురుగు, చెత్త చెదారం నిండిపోయి అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఫిర్యాదులు అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు కూడళ్లలో ఉన్న ఫౌంటెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. శనివారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం చౌరస్తాలోని ఫౌంటెయిన్‌ను శుభ్రం చేశారు. కొన్ని చోట్ల నీటిని పంపింగ్ చేసే మోటార్లు పాడుకావడంతో వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చారు.

మాగంటి వజ్రనాథ్‌కు షేక్‌పేట మున్నూరుకాపుల మద్దతు



వజ్రనాథ్‌ని కలిసిన సంఘం నేతలు

శ్రీనగర్‌కాలనీ: షేక్‌పేట మున్నూరుకాపుల మద్దతు మాగంటి వజ్రనాథ్‌కేనని మున్నూరు కాపు సంఘం నేతలు తెలిపారు. శనివారం షేక్‌పేట డివిజన్ సీతానగర్‌లోని మున్నూరు కాపు సంఘం నేతలు మాగంటి వజ్రనాథ్‌తో సమావేశమయ్యారు. మాగంటి గోపీనాథ్ మరణం తీరని లోటని, ఆయన ఆశయాలను మాగంటి వజ్రనాథ్ ముందుకు తీసుకువెళ్తారని మున్నూరుకాపు సంఘం నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

లెక్క తేలింది

ప్రభుత్వ స్థలాలను గుర్తించిన అధికారులు



బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ పక్కన స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

- షేక్‌పేటలో 260..ఖైరతాబాద్‌లో 113
- జియో ట్యాగింగ్ ద్వారా వెబ్‌సైట్‌లో నమోదు
- రోజూ మండల సిబ్బంది తనిఖీలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఎమ్మెల్యే కాలనీలో ఎన్నో ఏళ్లుగా కబ్జాదారుల చెరలో ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మూడు నెలల క్రితం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి చుట్టూ బ్లూషీట్లు నిర్మించారు. ఈ స్థలం విలువ సుమారుగా రూ.1000 కోట్లు ఉంటుంది.

- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆనుకుని కొత్త రోడ్డు పక్కన కబ్జాదారుల చెర నుంచి 2,000 గజాల ప్రభుత్వ స్థలాన్ని నెల క్రితం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లో ఓ కబ్జాదారుడు ప్రభుత్వ స్థలంలో గదులు నిర్మించగా వాటిని కూల్చివేసి కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు.
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లో భాగ్యనగర్ స్టూడియోను ఆనుకుని ఖరీదైన ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు బ్యానర్లు ఏర్పాటుచేయగా ఆ స్థలాన్ని స్వాదీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు ఇద్దరు కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు.
- ప్రభుత్వ స్థలాలను రక్షించుకోవడమే కాకుండా వాటికి జియో ట్యాగింగ్ చేసి ప్రత్యేక వెబ్‌సైట్‌లో



ఎమ్మెల్యే కాలనీలో స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలం..

నమోదు చేస్తున్నారు. ల్యాండ్ పార్శిళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించిన రెవెన్యూ విభాగం ఆ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. షేక్‌పేట మండల రెవెన్యూ పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఖరీదైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ స్థలాలను రక్షించుకోవడమే కాకుండా చాలా చోట్ల ఫెన్సింగ్‌లు ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటుచేశారు. షేక్‌పేట మండల పరిధిలో 260 ల్యాండ్ పార్శిళ్లు గుర్తించారు. ఇందులో ఎక్కువగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. వీటిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడమే కాకుండా ప్రతిరోజూ తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్ మండల పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలో 113 చోట్ల ల్యాండ్ పార్శిళ్లు గుర్తించి వాటికి జియో ట్యాగింగ్ చేశారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ఈ ప్రభుత్వ స్థలాల వివరాలను నమోదు చేయడమే కాకుండా జియో కో–ఆర్డినేట్ చేస్తూ యాప్‌ను రూపొందించి ఈ మొత్తం వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఎక్కడెక్కడ ల్యాండ్ బ్యాంక్‌లు ఉన్నాయో వాటిని ప్రతిరోజూ తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇటీవలనే సంబంధిత మండల తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి ల్యాండ్ పార్శిల్‌ను యాప్ ద్వారా గుర్తించుకోవాలని సూచించారు.

వివిధ కార్యాలయాలకు..

ప్రభుత్వ స్థలాలను తమకు కేటాయించాలంటూ వివిధ ప్రభుత్వ సంస్థలు సంబంధిత రెవెన్యూ అధికారులను కోరుతున్నాయి. ప్రభుత్వ స్థలాలకు చాలా డిమాండ్ కూడా ఏర్పడింది. తమ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించాలంటూ చాలా సంస్థలు అధికారులకు లేఖలు కూడా రాశాయి. బంజారాహిల్స్‌లో ఫైర్ స్టేషన్ కావాలంటూ అగ్నిమాపక శాఖ అధికారులు లేఖ రాయడం జరిగింది. ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కోసం పదెకరాల స్థలం కావాలంటూ సదరు సంస్థ ఇటీవలనే ప్రభుత్వానికి లేఖ రాసింది. అలాగే బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం స్థలం కేటాయించాలంటూ ట్రాఫిక్ విభాగం ఇటీవలనే కలెక్టర్‌కు లేఖ రాసింది. ఇక అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, పోలీస్‌స్టేషన్లు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించుకోవడానికి స్థలాలు కావాలంటూ అధికారులు లేఖలు కూడా రాయడం జరిగింది. చాలా డిమాండ్ ఉండడంతో ఈ స్థలాలను కేటాయించే విషయంలో అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

గిరిజన గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీందర్

హిమాయత్‌నగర్: గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆలిండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీందర్ నాయక్ కోరారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జేఏసీ అధ్యక్షులు ధారావత్ సురేష్ నాయక్ అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల విద్యా సంస్థల్లో, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పించిన వసతులు, పెంచిన మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తదితర కారణాల వల్ల ఈ విద్యా సంవత్సరం విపరీతమైన డిమాండ్ ఏర్పడిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు సీట్ల సంఖ్యకు మించి దాదాపు 50 శాతం అదనంగా దరఖాస్తు చేసుకోవడం వల్ల మెరిట్ కలిగిన విద్యార్థులకు కూడా సీటు రాని పరిస్థితి ఉందని తెలిపారు. కో–ఆర్డినేటర్ గోపి నాయక్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సభ్యులు శ్రీనివాసులు, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి

పంజగుట్ట: రాష్ట్రంలో డిగ్రీ కాలేజీలు జూన్ 2వ తేదీన తెరిచినప్పటికీ ఇప్పటివరకు డిగ్రీ గెస్ట్‌లెక్చరర్లను రెన్యువల్ చెయ్యకపోవడం బాధాకరమని డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొర్ర ఈశ్వర్ లాల్ అన్నారు. రాష్ట్రంలోని 8 యూనివర్సిటీల్లో, 149 డిగ్రీ కాలేజీల్లో 1940 మంది గెస్ట్ లెక్చలర్‌లు పనిచేస్తున్నారని, మా సేవలపైనే 30 నుండి 90 శాతం సేవలు నడుస్తున్నాయని తమను రెన్యువల్ చెయ్యకపోవడంవల్ల విద్యార్థులు పాఠాలు బోధించే వారు లేక అయోమయ పరిస్థితుల్లో అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కో ఆర్డినెటర్ పి.వెకంటేశ్వర్లుతో కలిసి ఆయన మాట్లాడుతూ .. విద్యాశాఖ ఉన్నతాధికారులను సంప్రదించగా తమకు ప్రభుత్వం ఫైనాన్స్ అప్రువల్ జీవో ఇవ్వలేదని అందుకే రెన్యువల్ చెయ్యడం లేదని చెపుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు.

మా కుమారుడిని విచక్షణారహితంగా కొట్టారు

బాధితుడి తల్లిదండ్రుల ఆవేదన

పంజగుట్ట: తన కుమారునిపై విచక్షణారహితంగా దాడిచేసిన వారితోపాటు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాధితుడు (మైనర్ బాలుడు), తల్లిదండ్రులు దగ్గుపాటి రాంబాబు కనకదుర్గ మాట్లాడారు. గత సంవత్సరం డిసెంబర్ 15న తన కుమారుడు సెల్‌ఫోన్‌లో రీల్స్ తీస్తుండగా పక్కింట్లో స్నానం చేస్తున్న ఓ వ్యక్తి వీడియో కూడా ఉందన్నారు. దీంతో వారు తన కుమారుడిని విచక్షణా రహితంగా కొట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు మైనర్ బాలుడు అని చూడకుండా బాగా కొట్టారని బాధిత మైనర్ బాలుడు ఆరోపించారు. అప్పటినుంచి తన కుమారు నడవలేని స్థితికి వచ్చాడని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమకు న్యాయంచేయాలని కోరారు.

ఆరోపణలు అవాస్తవం : ఏసీపీ

జూబ్లీహిల్స్ పోలీసులపై రాంబాబు అతని కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని జూబ్లీహిల్స్ ఏసీపీ ఎస్. వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేసు నమోదు అయిన నాలుగు నెలల తరువాత వీరు ఆరోపణలు చేస్తున్నారని. మైనర్ బాలున్ని స్టేషన్‌లో కొట్టలేదని, విచారణ చెయ్యగా మైనర్ బాలునికి జన్యుపరమైన లోపం ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు.

నర్సింగ్ హాస్టల్‌కు మరమ్మతులు చేయించండి

సికింద్రాబాద్: గాంధీ నర్సింగ్ కాలేజీకి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు శనివారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. బన్సీలాల్ పేట డివిజన్ న్యూ బోయిగూడలో కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల, హాస్టల్ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థ సమస్య తీవ్రంగా ఉందని, ఏళ్లుగా ఆ సమస్య వల్ల ఇబ్బందులు పడుతూ, పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పిర్యాదు చేశారు. మరమ్మతులు చేస్తామన్న హామీపై హాస్టల్‌ను ఖాళీ చేసినప్పటికీ, ఇప్పటికీ ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. బయట హాస్టళ్ల ఖర్చులు భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ తాము ఇబ్బంది పడుతున్నామని.. ఇప్పటికైనా సమస్యను అర్థం చేసుకొని హాస్టల్‌కు మరమ్మతులు చేయించలని ఈ సందర్భంగా విద్యార్థినులు కోరారు.

సనత్‌నగర్ పీఎస్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

సనత్‌నగర్: శివరాంపల్లిలోని నేషనల్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐపీఎస్ అధికారులు శనివారం సనత్‌నగర్ పోలీస్‌స్టేసన్‌ను సందర్శించారు. స్టేషన్‌ను సందర్శించినన సందర్భంగా శిక్షణ పొందుతున్న ఐపీఎస్‌లకు పీఎస్‌లోని రికార్డులు, కేసు ఫైల్స్‌తో పాటు రిసెప్షన్, సైబర్ క్రైమ్, ఎస్ఐ విధులు, పెట్రోలింగ్ అంశాలను పరిశీలించారు. దీంతోపాటు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా 2003లో దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో జరిగిన ఓ హత్య కేసుకు సంబంధించి క్రైమ్ సీన్‌ను శిక్షణ పొందుతున్న ఐపీఎస్ అధికారులకు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరించారు. సనత్‌నగర్ పీఎస్‌ను సందర్శించిన యువ ఐపీఎస్‌లలో మణిపూర్‌కు చెందిన ఇద్దరితో పాటు గుజరాత్‌కు చెందిన మహిళా అధికారి కూడా ఉన్నారు.

కూల్చివేయించిన చోటే జెండా దిమ్మె ఏర్పాటు చేయాలి



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు..

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎన్బీటీ నగర్ బస్తీలో ఈ నెల 7వ తేదీన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెను కూల్చివేయించిందని కూల్చిన చోటనే జెండా దిమ్మెను ఏర్పాటు చేయాలంటూ ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాలో నల్ల జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. జెండా దిమ్మెను ఏర్పాటు చేయడంతో పాటు, మాదిగలను దూషించినందుకు మేయర్ క్షమాపణ చెప్పాలని జూబ్లీహిల్స్ డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ మాదిగ డిమాండ్‌చేశారు. మేయర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి, కొండ్రపల్లి శివకుమార్, కండె రామ్ కుమార్ మాదిగ పాల్గొన్నారు.

అభినందనలు



అభినందనలు తెలుపుతున్న కీర్తిరెడ్డి

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన ఎన్.రాంచందర్‌రావుని బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరు కీర్తిరెడ్డి శనివారం కలిసి అభినందనలు తెలిపారు. రాంచందర్ రావు నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని, రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ విజయదుందుభి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న సీఎన్.రెడ్డి

రహమత్‌నగర్: అఅర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్.రెడ్డి అన్నారు. రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా ఆయన సివిల్ సప్లై అధికారులతో కలిసి శనివారం డివిజన్‌లో పర్యటించి లబ్ధిదారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వ రేషన్ కార్డులు జారీ చేయడంలో విఫలమైందని, తమ ప్రభుత్వం కేవలం ఏడాదిలోని అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తుందన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరించండి..

బస్తీ సమస్యలు పరిష్కరించాలని సలీంబాబానగర్, కమలానగర్ వాసులు కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని వాటిని వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

దొడ్డ నారాయణ రావు మృతి పట్ల సంతాపం

హిమాయత్‌నగర్: ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు దొడ్డ నారాయణ రావు మృతి పట్ల సిపిఐ సీనియర్ నాయకులూ కందిమళ్ల ప్రతాప్ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. దున్నేవాడికి భూమి కావాలని, వెట్టి చాకిరికి వ్యతరేకంగా, నిరంకుశ నిజాంకు, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డ నారాయణ రావు కీలక పాత్రపోషించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర సమర యోధుడిగా గుర్తించిందని తెలిపారు.

ఆక్రమణ దారులపై కేసు నమోదు

బంజారాహిల్స్: కొందరు వ్యక్తులు అక్రమంగా తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ శ్రీగాయత్రీ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ప్రలేఖ్ జూలూరి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. షేక్‌పేట మండలం సర్వేనెంబర్ 327లో ప్లాట్‌నెంబర్లు 63 నుంచి 74 వరకు ఉన్న స్థలంలో శ్రీగాయత్రీ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ఈ ఏడాది మార్చి 4న జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు పొందింది. అయితే ఈ నెల 7న గణేష్ ప్రతాప్‌తో పాటు మరో ఆరుగురు దౌర్జన్యంగా వచ్చి దుర్భషలాడుతూ అక్కడి వారి విధులకు ఆటంకం కలిగించారని ప్రలేఖ్ జూలూరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌లో పార్కింగ్ మరింత భారం!

లక్డీకాపూల్: వాహనాల పార్కింగ్‌కు సంబంధించి నిమ్స్ పాలకవర్గం కాంట్రాక్ట్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న పార్కింగ్ కాంట్రాక్ట్ కాల పరిమితి ముగిసింది. దీంతో అర్హులైన కాంట్రాక్టర్ల కోసం నిమ్స్ టెండర్ల ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు సోమవారం నిమ్స్ బోర్డు రూమ్‌లో పార్కింగ్ సర్వీస్‌పై ప్రీ బిడ్ మీటింగ్ ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కాంట్రాక్టర్లను ఆహ్వానించినట్టు సమాచారం.

కొత్త పార్కింగ్ ఛార్జీలు ఇలా..

ద్విచక్ర వాహనానికి మూడు గంటల వరకు రూ.20 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆపై 6 గంటల వరకు రూ.40, ఆరు గంటలు దాటితే రూ.50 చొప్పున చెల్లించాలి. కారుకు మూడు గంటల వ్యవధికి రూ.30, ఆపై ఆరు గంటల వరకు రూ.60, ఆరు గంటలు దాటితే రూ.90 చెల్లించాలి. ఆయా వాహనాల వాలెట్ పార్కింగ్‌కు అదనంగా రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా నిమ్స్‌లో పార్కింగ్ ఫీ వసూలు చేసుకునే వెసులుబాటును కల్పిస్తూ నిమ్స్ పాలకవర్గం టెండర్ల ప్రక్రియను చేపట్టింది.

గంజాయి తాగుతున్న నలుగురి అరెస్ట్

వెంగళరావునగర్: గంజాయి తాగుతున్న నలుగురిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల్లో గంజాయి తాగుతున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో పోలీసులు పెట్రోలింగ్‌ను పెంచారు. శనివారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా యూసుఫ్‌గూడ లేబర్ అడ్డా సమీపంలోఎం.భరత్ తేజ, ఎం.గణేష్ గుణశేఖర్, షేక్ సయిఫుల్లా, షేక్ జిలాని అనే నలుగురు యువకులు దాదాపు 80 గ్రాముల గంజాయిని తాగుతున్నారు. వారిని పోలీసులు సమీపంచగా పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న గంజాయిని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మురళీగౌడ్ తదితరులు

రహమత్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాట నిల బెట్టుకుందని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్ హర్షం వ్యక్తం చేశాడు. బోరబండ సైట్-3లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీసీ రిజర్వేషన్ అమలు ఒక చరిత్రాత్మక నిర్ణయమని, దేశంలోని ఏ రాష్ట్రం లోనూ అమలు కాని బిల్లును తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కూమార్, ఎండీ గౌస్, చంద్రమౌళీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత..

బంజారాహిల్స్: బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు వారికి అప్పగించారు. శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, డీఐ బషీర్ అహ్మద్ బాధితులకు ఈ ఫోన్లను అప్పగించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 67 మందికి ఫోన్లను అప్పగించారు.



పూజారి ఇంట్లో చోరీ

రహమత్‌నగర్: పూజారి ఇంట్లో చోరీ జరిగిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ ఫేజ్-2 బస్తీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2 బస్తీలో చంద్రగిరి విశ్వనాథం అనే వ్యక్తి పురోహిత్యం చేస్తుండేవాడు. తన తల్లి చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 5న తన ఇంటికి తాళం వేసి సనత్‌నగర్‌లో నివాసముండే తన సోదరుని ఇంటికి వెళ్లాడు. తిరిగి శుక్రవారం సాయంత్రం ఇందిరానగర్‌లోని తన నివాసానికి రాగా, ఇంటి తాళం పగలగొట్టబడి ఉండడంతో అనుమానంతో ఇంట్లోని అల్మారా తెరిచి చూడగా అందులో దాచి ఉంచిన 200 గ్రాములు వెండి పాము పడక, చార్మినార్ పాత వెండి నాణేం, వెండి బహుమతి వస్తువులతో పాటు రూ.28 వేలు కనిపించక పోవడంతో విశ్వనాథం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంహెచ్‌ఎం కోర్సులో ప్రవేశాలకు గడువు పొడిగింపు

లక్డీకాపూల్: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో నిర్వహిస్తున్న మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఎం) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. రెండేళ్ల కోర్సు తర్వాత ఆరు నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. నిమ్స్‌లో ఈ కోర్సుకు సంబంధించి 20 సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జూలై 21 తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ప్రతులను 24వ తేదీ లోపు ఆసుపత్రిలో ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు నిమ్స్ వెబ్‌సైట్ nims.edu.inనుగానీ, ఫోన్ నంబర్ 040 – 23489189లోగానీ సంప్రదించవచ్చని తెలిపారు.

'బెల్ట్‌షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌గౌడ్

మూసాపేట: బెల్ట్‌షాపులు, పర్మిట్ రూములు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ కోరారు. శనివారం మూసాపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్స్‌లు పొందిన బార్ అండ్ రెస్టారెంట్స్ మధ్య ఎన్నో బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, వాటి వల్ల తాము ఎన్నో రకాలుగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో ఉన్న వైన్‌షాపుల సమయాన్ని హైదరాబాద్‌లో కూడా అమలు చేయాలన్నారు. వైన్‌షాపుల్లో పర్మిట్ రూములు, కుర్చీలు, టేబుల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను తొలగించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, పల్లె నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతి ప్రాంగణంలో సుదర్శన హోమం



ఖైరతాబాద్ మహాగణపతి ప్రాంగణంలో నిర్వహించిన సుదర్శన హోమంలో భక్తులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి ప్రాంగణంలో శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలను సజావుగా సాగేలా చూడాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుతూ సుదర్శన హోమం నిర్వహించామని పూజారి రంగరాజాచార్యులు తెలిపారు. ఈ హోమ కార్యక్రమానికి ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మహేందర్‌బాబు, రాజ్‌కుమార్, వీణామాధురి, సందీప్ రాజ్, మధుకర్ యాదవ్‌లతోపాటు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

నగరంలో నేడు

- ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు–2025 ప్రదానోత్సవ సభ ఉదయం 10.30 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది.
- ఇంటర్నేషనల్ రాక్ డేను పురస్కరించుకుని గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటల నుంచి పీస్‌ఫుల్ మూమెంట్ ఈవెంట్ జరుగుతుంది.
- ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణాలో ఉదయం 1 నుంచి రాత్రి 8 గంటల వరకు లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఫ్రీ లెఫ్ట్ బ్లాక్..
జంక్షన్ జామ్



గ్రేటర్‌లో అమలుకాని ఫ్రీ లెఫ్ట్ నిబంధనలు
- కూడళ్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాల రద్దీ
- దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాదచారులు
- సబ్‌వేలు, ఎఫ్ఓబీలు, పెలికాన్ సిగ్నల్స్ ఉంటేనే మేలు
- చెన్నై, బెంగళూరుల్లో పటిష్టంగా అమలవుతున్న ఈ విధానం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ జంక్షన్లు జామ్ అవుతున్నాయి. కూడళ్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ విధానం అమలు కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. వేర్వేరు రోడ్లు కలిసే చోటగానీ, విడిపోయే చోటగానీ ఫ్రీ లెఫ్ట్ సూచిక బోర్డులను ఇష్టానుసారం ఏర్పాటు చేయడంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో పాదచారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. చెన్నై, బెంగళూరు తరహాలో ప్రతి ఫ్రీ లెఫ్ట్‌కు 200 నుంచి 500 మీటర్ల దూరంలో ఫ్రీ లెఫ్ట్ ఎ హెడ్, ఫ్రీ లెఫ్ట్ ప్రొహిబిటెడ్, నో ఫ్రీ లెఫ్ట్ అంటూ బోర్డులు ప్రదర్శించడం ద్వారా సాధ్యమైనంత వరకూ రద్దీని నియంత్రించవచ్చని రోడ్డు భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

- నగరంలో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఎడమ వైపు మలుపులను ఎక్కువగా 'ఫ్రీ లెఫ్ట్'గా పేర్కొన్నారు. అంటే వాహనదారులు గ్రీన్‌లైట్ కోసం వేచి ఉండకుండా ఎడమ వైపు వెళ్లిపోవచ్చు. అయితే ఈ విధానాన్ని చాలామంది వాహనదారులు పాటించరు. ఎందుకంటే నేరుగా లేదా కుడివైపు వెళ్లాల్సిన వాహనదారులు జంక్షన్లలో రెడ్‌లైట్ పడినప్పుడు ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేస్తుంటారు. దీన్ని నియంత్రించేందుకు బారికేడ్లు, జరిమానాలు ఉన్నప్పటికీ వాహనదారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఆఫీసు, విద్యా సంస్థల పని దినాలు, పీక్ అవర్స్‌లో ఈ గందరగోళం మరింత ఎక్కువగా ఉంటుంది.

అన్ని రోడ్లు ఫ్రీ లెఫ్ట్ కాదు..

మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, మాదాపూర్, గచ్చిబౌలి, ఖాజాగూడ, ఖైరతాబాద్, అఫ్జల్‌గంజ్, పంజాగుట్ట, అమీర్‌పేట, హిమాయత్‌నగర్, తార్నాక తదితర జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్ ఉంటుందే తప్ప ఇతర వాహనాలు అంత సులువుగా ఆ వైపు వెళ్లలేవు. ట్రాఫిక్ రద్దీ, రోడ్ల వెడల్పును బట్టి పోలీసులు ఫ్రీ లెఫ్ట్‌లను ఏర్పాటు చేస్తుంటారు. వెడల్పాటి రోడ్లు ఉన్న ప్రాంతంలో జంక్షన్‌కు సుమారు 300 మీటర్ల దూరంలో 'ఫ్రీ లెఫ్ట్'అని సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

కూడళ్ల వద్ద ఇలా చేయాలి

కూడళ్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ విజయవంతంగా అమలు అవ్వాలంటే మూడు విధానాలు కచ్చితంగా పాటించాల్సిందేనని నిపుణులు సూచిస్తున్నారు. పాదచారులు ఫ్రీ లెఫ్ట్ ఉన్న కూడలి వద్ద ఒక వైపు నుంచి ఇంకో వైపునకు వెళ్లాలంటే మరోవైపున గ్రీన్ సిగ్నల్ పడటంతో అటు నుంచి వాహనాలు వస్తుంటాయి. దీంతో పాదచారులు రోడ్డు దాటలేరు. అందుకే ఆయా జంక్షన్ల వద్ద సబ్‌వేలు గానీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు గానీ ఏర్పాటు చేయాలి. గతంలో నగరంలో కోఠి, ఆర్టీసీ క్రాస్ రోడ్డు ప్రాంతాలలోనే సబ్‌వేలు ఉండేవి. కానీ, ఇప్పుడు మనగడలో లేవు. వీటిని ఏర్పాటు చేయలేని పక్షంలో కనీసం కూడళ్ల వద్ద పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా పాదచారులు సులువుగా రోడ్డు దాటగలుగుతారు.

ఫ్రీ లెఫ్ట్‌లో అస్పష్టత..

- ఫిల్మ్ నగర్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వచ్చే మార్గంలో మూడు లేన్ల రహదారి ఉండగా.. బ్లైండ్ స్పాట్‌లో నాలుగో లేన్ ఉండగా చివరలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. దీంతో దగ్గరికి వచ్చేవరకూ వాహనదారుడికి ఈ దారి కనిపించదు.
- బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ నుంచి కిందకి దిగిన వెంటనే ఎల్బీ స్టేడియం దగ్గర ఫ్రీ స్ట్రెయిట్ అని ఏర్పాటు చేశారు. ఇక్కడే వాహనదారులు సిగ్నల్ పడినా ఆగడం లేదు.
- సైబర్ టవర్స్ జంక్షన్‌కు కొద్ది దూరంలో ఆవాసా హోటల్, అక్కడి నుంచి మైండ్ స్పేస్ వెళ్లే మార్గంలో ఓ ఫ్రీ లెఫ్ట్ ఉంది. సమీపంలోకి వరకు వేగంగా వెళ్లే వాహనదారులకు ఫ్రీ లెఫ్ట్ ఉన్న సంగతి తెలిసే పరిస్థితి లేదు. ఇలా చివరి క్షణంలో ఫ్రీ లెఫ్ట్ కనిపిస్తుండంతో వాహనదారులు ఒక్కసారిగా ఆపేస్తుండటంతో రద్దీ పెరుగుతుంది.

తెలంగాణ అస్తిత్వాన్ని చెరిపేశక్తి ఎవరికీ లేదు



మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాజకీయ అస్తిత్వంపై దాడి చేయగలరమో గాని, దాన్ని చెరిపే శక్తి ఎవరికీ లేదని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో 'తెలంగాణ అస్తిత్వం– సవాళ్లు– కర్తవ్యాలు'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో అస్తిత్వంపై దాడి చేసిన వారే రూపాలు మార్చుకొని ఇప్పుడు కూడా దాడి చేస్తున్నారని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ సీతారామరావు మాట్లాడుతూ తెలంగాణ రాజకీయ అస్తిత్వం నేడు ప్రమాదంలో పడిందని, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీలకు వంత పాడే ఇంటి ద్రోహులు ఉన్నంత కాలం మనకు కొట్లాట తప్పదన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార కమిషన్ మాజీ సభ్యుడు మాడభూషి శ్రీధర్, ప్రముఖ పాత్రికేయులు పి.వేణుగోపాలస్వామి, ఎమ్మెల్సీలు గోరెటి వెంకన్న , దేశపతి శ్రీనివాస్, సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్, చెల్లా శ్రీనివాస్, రచయిత్రి దంటు కనకదుర్గ, సామాజిక విశ్లేషకులు పి.శ్రీశైల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో మాదిగలకు సంపూర్ణ న్యాయం

మందకృష్ణ పిలుపు



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సికింద్రాబాద్: ఎంఆర్‌పీఎస్ నిరాటంక ఉద్యమాల ద్వారా అమలులోకి వచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం ద్వారా విద్య. ఉద్యోగ రంగాల్లో మాదిగలకు సంపూర్ణ న్యాయం జరిగే అవకాశం ఉందని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సికింద్రాబాద్ మధురానగర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంస్థల జిల్లా ఇన్‌చార్జీలు, కో ఇన్‌చార్జీల సమావేశం జరిగింది. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లు వంద శాతం అమలయ్యే విధంగా పర్యవేక్షించేందుకు ఎంఆర్‌పీఎస్ ముందుండాలన్నారు. ఇంతటితో విశ్రాంతి చెందకుండా అణచివేతకు గురవుతున్న పీడిత వర్గాల విముక్తి కోసం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పోరాటాలకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. వికలాంగులతోపాటు అన్ని రకాల పెన్షనర్లకు న్యాయం చేయడం కోసం ఉద్యమాలను నిరాటంకంగా కొనసాగించాలన్నారు. దేశవ్యాప్త ఉద్యమాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంఆర్‌పీఎస్ కమిటీలు వేసి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు గోవింద్, నరేశ్, వెంకటస్వామి, సోమశేఖర్, సురేశ్, లక్ష్మణ్, దప్పు మల్లికార్జున్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల బలంతో కాంగ్రెస్‌ను గద్దె దింపుతాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



అభినందన సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

అబిడ్స్: కార్యకర్తల బలంతో ప్రజలను పలు విధాలుగా మోసాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి అధికారంలోకి వస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శ్రీరాముడు తన సైన్యంతో లంకను జయించినట్లుగానే బీజేపీ కార్యకర్తల సైన్యంతో తెలంగాణలో బీజేపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీజేపీ నేతలు శనివారం రాంచందర్‌రావు అభినందన సభ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం కావడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు వణుకు పుడుతోందన్నారు. ఆ రెండు పార్టీలను ప్రజలు విస్మరిస్తుండటంతో జీర్ణించుకోలేక చవకబారు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గోషామహల్‌తోపాటు అన్ని నియోజకవర్గాల్లో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకువెళ్లి బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. పాతబస్తీలో అభివృద్ధిని ఒవైసీ బ్రదర్స్ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. బీజేపీతోనే పాత బస్తీ అభివృద్ధి జరుగుతుందని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేస్తామన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే గ్రేటర్ హైదరాబాద్‌ను దేశంలోనే నెంబర్ 1 సిటీగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్, కార్పొరేటర్లు శంకర్ యాదవ్, లాల్ సింగ్, డాక్టర్ సురేఖ, రాకేష్ జైస్వాల్, బీజేపీ సీనియర్ నాయకులు పాండు యాదవ్, రఘునందన్ యాదవ్, గోవింద్‌రాఠి, నట్రాజ్ నాందారితోపాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం



ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు



వినీత్ భట్‌కు గోల్డ్ మెడల్ అందిస్తున్న అశోక్ ఝున్‌ఝున్‌వాలా

హఫీజ్‌పేట్: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవం అట్టహాసంగా సాగింది. గచ్చిబౌలి శాంతి సరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 24వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నీతిఆయోగ్ విశిష్ట సభ్యురాలు, నాస్కామ్ మాజీ అధ్యక్షురాలు దేబ్జాని ఘోష్, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ చేతుల మీదుగా 529 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందించారు. కాగా, ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థుల ద్వారా 73 మంది విద్యార్థులకు రూ.4.83 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. పూర్వ విద్యార్థులను ట్రిపుల్ ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు కుట్ర

పాలకులపై బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ నేత వెంకటాచలం ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటాచలం

కాచిగూడ: అప్పట్లో సామాన్యులకు సేవలందించేందుకు జాతీయకరణ చేసిన బ్యాంకులను నేటి పాలకులు క్రమంగా ప్రజలకు దూరం చేసేందుకు, తద్వారా వాటిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం విమర్శించారు. సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమన్నారు. శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో కొటక్ మహేంద్రా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ 31వ జాతీయ మహాసభలను ఆయన ప్రారంభించారు. కేఎంబీఈయూ అధ్యక్షుడు వి.నాగరాజు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులు ఉద్యోగుల శ్రమను మరింతగా దోపిడీ చేయడానికి పది గంటల పని విధానాన్ని తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పనివిధానం స్థానంలో 10 గంటల విధానాన్ని తీసుకువచ్చేందుకు పాలకులు, కార్పొరేట్ శక్తులు వ్యూహాలు రచిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యల పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు, కొటక్ మహేంద్ర బ్యాంక్ సీహెచ్ఆర్ఓ అనుపమ్ కౌర్, రావు సాహెబ్ కంగనే, జయంత్, కె.ఫణీంద్ర, ఏఆర్ సుజిత్ రాజు, జితేంద్రప్రసాద్ షా, ఆర్.వెంకటేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ' రోడ్ సేఫ్టీ' డ్రైవ్



జోన్	గుర్తించిన గుంతలు	పూడ్చివేసినవి
ఎల్‌బీనగర్	1,982	213
చార్మినార్	1,300	607
ఖైరతాబాద్	806	282
శేరిలింగంపల్లి	1,311	79
కూకట్‌పల్లి	1,121	356
సికింద్రాబాద్	1,542	212
మొత్తం	8,062	1,749

సాక్షి, సిటీబ్యూరో: రోడ్‌సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా రోడ్లపై గుంతల పూడ్చివేతలు, మరమ్మతు పనుల్ని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్(మెయింటనెన్స్) విభాగం ముమ్మరం చేసింది. వారం రోజుల్లో పూర్తి చేయాలన్న కమిషనర్ కర్ణన్ ఆదేశాలకనుగుణంగా వడివడిగా పనులు సాగుతున్నాయి. రెండో శనివారం సెలవు రోజైనప్పటికీ జీహెచ్ఎంసీ జోన్లు, సర్కిళ్లలోని అధికారులు, సిబ్బంది పనులు చేశారని చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు తదితర విభాగాల సహకారంతో పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన పాట్‌హోల్స్(గుంతలు), శుక్ర, శనివారాల్లో పూడ్చివేసిన గుంతలు తదితర వివరాలు ఇలా ఉన్నాయి.

- 28 ప్రాంతాల్లో క్యాచ్‌పిట్స్ మూతలకు మరమ్మతులు చేశారు. పూర్తిగా పాడైపోయిన, మూతల్లేని ప్రాంతాల్లో కొత్తగా 8 క్యాచ్‌పిట్స్ మూతలు అమర్చారు. రెండు ప్రాంతాల సెంట్రల్ మీడియన్లలో స్వల్ప మరమ్మతులు చేశారు.

ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం



షేక్‌పేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: ప్రజాసంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్‌లో ఉన్న పలు బస్తీలలో పర్యటించారు. అనంతరం ఆయన షేక్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనతో ప్రజలంతా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. పటిష్టమైన ఆర్థిక వ్యవస్థకు మోదీ సమర్థవంతమైన పాలననే కారణం అని ఆయన అన్నారు. కేంద్రమంత్రిగా తాను అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నానని చెప్పారు. తెలంగాణలో సైతం కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అవి తమ పథకాలని ప్రకటించుకుంటోందన్నారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల ప్రజల కోసం కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా దేశానికి వెన్నుముకగా ఉన్న రైతాంగం వైపు ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటలకు మద్దతు ధర ఇవ్వడమే కాకుండా రైతులకు ప్రయోజనం చేకూర్చే ఎన్నో పథకాలను మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. షేక్‌పేట్ డివిజన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బల్దియా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ నాయక్, షేక్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పూస రాకేష్, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శివకుమార్ తదితరులు ఉన్నారు.

లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు • తొలిపూజ చేయనున్న మంత్రి పొన్నం



ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు

రాంగోపాల్‌పేట్/సనత్‌నగర్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 13, 14 తేదీల్లో అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం బోనాలు, సోమవారం రంగం కార్యక్రమంలో భాగంగా భవిష్యవాణి ఉంటుంది. ఆదివారం ఉదయం 4 గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ద్వారాలు తెరుస్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలిపూజ చేసి బోనం సమర్పిస్తారు. అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతిస్తారు. ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

6 క్యూలైన్లు.. బోనాలతో వచ్చేవారికి రెండు...

తెలంగాణ నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొనే బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఆరు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు క్యూలైన్లు బోనాలతో వచ్చే మహిళల కోసం, ఒకటి వీఐపీ పాస్‌లతో వచ్చే వారికి, మిగతావి సాధారణ భక్తులకు కేటాయించారు. బోనాలతో వచ్చే మహిళలతోపాటు ఐదుగురు కుటుంబ సభ్యులను అనుమతిస్తారు. దేవదాయ శాఖ అధికారులు దేవాలయం మొత్తం రంగులు, పువ్వులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు 24 గంటలు పారిశుధ్య పనులు నిర్వహించేలా సిబ్బందిని నియమించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. జలమండలి అధికారులు ఐదు ప్రాంతాల్లో మంచినీటి శిబిరాలను ఏర్పాటు చేసి వాటర్‌బాటిళ్లు, మంచినీటి ప్యాకెట్లు అందించనున్నారు. మహంకాళి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి డాక్టర్లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్‌లను సిద్ధంగా పెట్టారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భక్తులను అలరించేందుకు ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేసి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

శివసత్తులకు ప్రత్యేక టైం...

శివసత్తులు, జోగినుల కోసం అధికారులు ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు వారికి ప్రత్యేకంగా అనుమతిస్తారు. ఆ సమయంలో తమ సంప్రదాయ పద్ధతిలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవచ్చు. బాటా వైపు నుంచి క్యూలైన్లలో కాకుండా నేరుగా ఆర్చ్ గేటు వరకు అనుమతిస్తారు.



ప్రత్యేక క్యూలైన్లు

2,500 మంది పోలీసులతో బందోబస్తు

బోనాల జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు పోలీసు ఉన్నతాధికారులు 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సాధారణ పోలీసులతోపాటు సాయుధ బలగాలతో మోహరించారు. దేవాలయం బయట 40కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పోలీసులతోపాటు వివిధ శాఖల అధికారులు 24 గంటలు పర్యవేక్షించనున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్। ఆదివారం।
13। జూలై। 2025



వావ్.. టాక్ ఆఫ్ ది ట్రెండ్

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని 'అవర్ ప్యాలెస్' వేదికగా శనివారం జరిగిన 'టాక్ ఆఫ్ ది ట్రెండ్' ఎగ్జిబిషన్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను మల్లారెడ్డి విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా.సీహెచ్ ప్రీతిరెడ్డి, ఏబీవీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్య కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కవిత జైన్, పాయల్ సరాఫ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ప్రదర్శనలో నగరంతో పాటు దేశంలో పేరొందిన డిజైనర్లు, లైఫ్‌స్టైల్ బ్రాండ్లు తమ ఉత్పత్తులు ప్రదర్శించాయి. రాఖీ, తీజ్ పండగల కాన్సెప్ట్‌తో ఏర్పాటైన ఈ ప్రదర్శనలో డిజైనర్ వేర్, ఎథ్నిక్ వేర్, ఆభరణాలు, ఫ్యాషన్ యాక్సెసరీస్, హోండెకర్, పండగల సందర్భంగా ఇచ్చే గిఫ్టింగ్ ఐటమ్స్ ఆకర్షణగా నిలిచాయి.



మనల్ని మళ్లీ కలిపే.. ఒక యాత్ర

సాక్షి, సిటీబ్యూరో: మహారాష్ట్రకు చెందిన ప్రసిద్ధ భారతీయ చిత్రకారిణి ఆర్టిస్ట్, టెడెక్స్ స్పీకర్ అనురాధా ఠాకూర్ రూపొందించిన 'అన్ రిటెన్ ఎర్త్ సాంగ్స్' సోలో చిత్ర ప్రదర్శన బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఏర్పాటైంది. దీన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనురాధ ఠాకూర్ మాట్లాడుతూ ఇది కేవలం చిత్ర కళా ప్రదర్శన మాత్రమే కాదని ఆలోచన, తాత్వికత, సంస్కృతి, ఆత్మస్పర్శల కలయికగా అభివర్ణించారు. 'ఈ ప్రదర్శన నా మనసు లోతుల్లోనుంచి వచ్చిన ఆవిష్కరణ. మన వారసత్వంతో, మన చుట్టూ ఉన్న మాయాజాలంతో మనల్ని మళ్లీ కలిపే ఒక యాత్ర,' అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన జూలై 20 వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



అత్లీజర్ స్టైల్.. న్యూ ట్రెండ్

ఆధునిక జీవనశైలికి తగ్గట్టుగా రూపుదిద్దుకుంటున్న ఫ్యాషన్ ప్రపంచంలో 'అత్లీజర్' స్టైల్ ఒక కొత్త ట్రెండ్‌గా మారింది. ఆటలకు, వ్యాయామానికి ఉపయోగించే డ్రెస్‌లను, కంఫర్ట్ స్టైలిష్ లుక్ కోసం రోజువారీగానూ ఉపయోగించే ఈ స్టైల్ ఇప్పుడు యువతలో విపరీతమైన ఆదరణ పొందుతోంది.

- సాక్షి, సిటీబ్యూరో



అత్లీజర్ అనే పదం 'అథ్లెటిక్స్ + లీజర్(ఆటల వినోదం/విశ్రాంతి)' అనే రెండు పదాల కలయిక. అంటే స్పోర్ట్స్ వేర్‌ను కేవలం ఆటలు, జిమ్ కోసమే కాకుండా, షాపింగ్, కేఫేలకు వెళ్లే సందర్భాల్లో కూడా ధరించడం ఇప్పుడు స్టైలిష్ ట్రెండ్‌గా మారింది. ఇది కంఫర్ట్, ఫంక్షనాలిటీ, ఫ్యాషన్ మూడింటినీ సమపాళ్లలో కలిపే స్టైల్‌గా డిజైనర్లు అభివర్ణిస్తున్నారు. ఈ స్టైల్‌ను ప్రధానంగా యువత, ఉద్యోగంలో ఉన్న మహిళలు, ఇన్‌ఫ్లూయెన్సర్స్, సెలబ్రిటీలు అధికంగా ఇష్టపడుతున్నారు. జిమ్, యోగా సెంటర్లకు వెళ్లే వారు మాత్రమే కాదు, ప్రతిరోజూ పనుల్లో స్టైలిష్‌గా కనిపించాలనుకునే వారందరూ ఈ స్టైల్‌ను స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం గంటల కొద్దీ సమయం షాపింగ్స్‌లో గడపడం, అలాగే మల్టీప్లెక్స్‌లలో మూవీస్ చూడటం.. వంటి పనులన్నింటికీ సిటిజనులు ఈ తరహా డ్రెస్సింగ్‌కే ఓటేస్తున్నారు.

వెరైటీ.. విశేషాలివే..

సౌకర్యవంతమైన మెటీరియల్స్ వినియోగించి స్ట్రెచబుల్, చెమటను పీల్చుకునే స్వెట్ విక్ ఫ్యాబ్రిక్స్‌తో ఇవి రూపొందుతాయి. న్యూట్రల్స్ నుంచి బ్రైట్ షేడ్స్ వరకు వైవిధ్యమైన కలర్స్‌లో లభిస్తాయి. స్నీకర్స్, హుడీలు, లెగింగ్స్ వంటి ఆధునిక స్టైల్స్ కూడా ఉన్నాయి. సినిమాల్లో, ముఖ్యంగా వెబ్ సిరీస్‌లలో నటీనటులు అత్లీజర్ స్టైల్ అనుసరించడం బాగా పెరిగింది. దీంతో ఇది ఒక ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారింది. 'ఫిట్ అండ్ ఫ్యాషన్' అనే న్యూయేజ్ థీమ్‌ను ప్రతిబింబిస్తూ నగరంలో ఎక్కువ కాలం కొనసాగే స్టైల్‌గా స్థిరపడింది.

సిటీలో అందుబాటులో..

నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ వంటి చోట్ల ఉన్న మల్టీబ్రాండ్ స్టోర్స్‌తో పాటు ఎంపోరియో మాల్స్, లుయిస్ ఫిలిప్, అడిడాస్, నైకి, ప్యూమా, డెకథ్లాన్ తదితర స్పోర్ట్స్ మెటీరియల్‌కి పేరొందిన బ్రాండెడ్ షోరూమ్స్‌లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి. మింత్రా అజియో, నైకా ఫ్యాషన్, అమెజాన్, అర్బానిక్ వంటి ఆన్‌లైన్ వెబ్‌సైట్స్ ద్వారా కొనుగోలు చేయవచ్చు. వీటి ధరల విషయానికి వస్తే లెగింగ్స్, ట్రాక్ ప్యాంట్లు: రూ.800 నుంచి రూ.3 వేల వరకూ, స్పోర్ట్స్ బ్రాలు: రూ.వెయ్యి నుంచి రూ.2,500, హుడీలు, జాకెట్లు: రూ.1,500 నుంచి రూ.4 వేల వరకూ, బ్రాండెడ్ సెట్లుగా కొనుగోలు చేస్తే రూ.3 వేలు. వివిధ ధరల్లో అందుబాటులో ఉన్నాయి. అత్లీజర్ ఇప్పుడు దాదాపు అన్ని వయసుల వారూ అనుసరిస్తున్నారు. అయితే మన వయసు, శరీరతత్వం, జీవనశైలిలను దృష్టిలో ఉంచుకుని ఎంచుకుంటే అవి మరింతగా ఆకట్టుకుంటాయి. ఈ సందర్భంగా వయసుల వారీగా కొన్ని రకాల ముందస్తు సూచనలను అందిస్తున్నారు నగరానికి చెందిన హ్యామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫ్యాషన్ నిపుణులు.



ఈ తరహా డ్రెస్సింగ్‌కే నగరవాసుల ఓటు

- సందర్భం ఏదైనా కంఫర్ట్‌గా ఫీల్ అవుతూ..
- మల్టీప్లెక్స్‌ల్లో మూవీస్ చూసేందుకు సైతం..
- అన్ని రకాల వారిని ఆకట్టుకుంటున్న వైనం



టీనేజర్లు (13-19 మధ్య వయస్కులు)

ఫ్యాషన్ ట్రెండ్స్‌తో ఆడుకునే వయసు ఇది. క్యాజువల్‌గా సాయంత్రాలు ఫ్రెండ్స్‌తో తిరగడానికి, స్కూల్, కాలేజీ తర్వాత కాలక్షేపపు వ్యాపకాలకు నప్పుతాయి. కంఫర్టబుల్ జాగర్స్, ఫుల్ లెంగ్త్ లెగ్గింగ్స్, హూడెడ్ టీస్, క్యాప్స్ వినియోగించవచ్చు. బ్రీతబుల్ ఫ్యాబ్రిక్స్ ఎంచుకోవాలి. ఫ్యాషన్‌తో ప్రయోగాలు చేయదగ్గ వయసు కాబట్టి బోల్డ్ కలర్స్, గ్రాఫిక్ ప్రింట్స్ కూడా ట్రై చేయవచ్చు.

యంగ్ అడల్ట్స్ (20 - 35 వయసు)

వర్కవుట్ నుంచి హ్యాంగ్ అవుట్ దాకా ఉపకరించేలా వీరు మల్టీ ఫంక్షనల్ అవుట్ ఫిట్స్ ఎంచుకోవాలి. క్రాప్ టాప్స్, బాంబర్ జాకెట్స్ వంటివి మోడ్రన్‌స్ట్రీట్ వేర్ లుక్‌ని ఇస్తాయి. కాన్ఫిడెంట్‌గా, స్టైలిష్‌గా కనిపించే డ్రెస్ బెస్ట్.

సీనియర్స్ (50ఏళ్లు ఆపైన)

సున్నితమైన మెత్తని ఫ్యాబ్రిక్స్ బెస్ట్. లాంగ్ స్లీవ్స్, హై నెక్స్ వంటి ఫుల్ కవరేజ్ డిజైన్స్ ఎంచుకోవాలి. కాటన్ కలగలిసిన ఫ్యాబ్రిక్ మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. అత్లీజర్ కేవలం వాకింగ్‌కు మాత్రమే కాదు ఇంట్లో రిలాక్స్‌గా ధరించేందుకు కూడా ఉపయుక్తమే.





మహిళలకు..

క్రాప్‌టాప్‌కు బదులుగా టూజ్‌గా ఉండే టాప్స్ స్టైలిష్ ఎంపిక అవుతుంది. తగినంత సౌకర్యం, సపోర్ట్ ఇచ్చే స్పోర్ట్స్ బ్రాను సెలక్ట్ చేసుకోవాలి. హెయిర్ బ్యాండ్స్, బక్కెట్ హ్యాట్స్, స్లింగ్ బ్యాగ్స్ వంటి యాక్సెసరీస్ జతచేస్తే లుక్ కంప్లీట్ అవుతుంది. న్యూబ్ షేడ్స్ మేకప్, డెవీ ఫేస్ మిస్ట్స్ ఈ డ్రెస్‌కు తగ్గ నాన్ మేకప్, ఫ్రెష్ గ్లోను జత చేసే శైలి.. అన్ని వయసుల వారికీ లెగ్గింగ్స్, జాకెట్ కాంబినేషన్ స్టైలిష్ ఎంపిక.

పురుషులకు..

స్లిమ్, ఫిట్ ట్రాక్ ప్యాంట్స్ లేదా జాగర్స్ ఎంచుకోవాలి. బేస్, లేయర్ టీ షర్ట్స్, జిప్ అప్ హుడీస్ స్టైలిష్‌గా ఉంటాయి. మెష్ బ్యాక్ టీస్ వర్కవుట్ టైమ్‌లో బ్రీతబుల్‌గా ఉంటాయి. క్యాప్స్, స్మార్ట్ వాచ్‌లు, స్నీకర్స్‌తో లుక్ కంప్లీట్ అవుతుంది. బ్లాక్, నేవీ బ్లూ, ఫారెస్ట్ గ్రీన్ వంటి గాఢమైన కలర్స్ స్లీమ్, మస్క్యులైన్ ఎడ్జ్ ఇస్తాయి. ముందు కంఫర్ట్‌ని దృష్టిలో పెట్టుకుని ఎంచుకోవడం ప్రారంభించి, ఆ తర్వాత స్టైలిస్, వెరైటీ ఎలిమెంట్స్‌ను జోడించాలి.





ట్రాషిక్.. క్లిక్..

సాక్షి సిటీబ్యూరో: నగరానికి చెందిన ఫ్యాషన్ ఇన్ ఇనిస్టిట్యూట్ లఖోటియా కాలేజ్ బంజారాహిల్స్ క్యాంపస్‌లో 'ట్రాషిక్ ది బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్' పేరిట నిర్వహించిన ఫ్యాషన్ ప్రదర్శన ఆకట్టుకుంది. 'ట్రాషిక్' అనేది 'ట్రాష్' 'చిక్'ల మేళవింపు అని, వ్యర్థాలను అద్భుతమైన ఫ్యాషన్‌గా మార్చే శైలి అని సంస్థ ఎండీ మహ్మద్ అఫాన్ ముజాహిద్ తెలిపారు. వ్యర్థం అనేది ఏదీ ఉండదు అనేదే ఈ షో సందేశంగా పేర్కొన్నారు. ఈ ట్రాషిక్‌లో ఫ్యాబ్రిక్ అవశేషాలు, ప్లాస్టిక్ సీసాలు, వార్తాపత్రికలు ఇతర నిరుపయోగ వస్తువులు, రీసైకిల్ చేసిన ఉత్పత్తులతో దుస్తులు ఉపకరణాలను డిజైన్ చేసి ఆకట్టుకునే ఫ్యాషన్‌ను విద్యార్థులు ప్రదర్శించారు.



వినూత్నం టైమ్ స్పీడ్ డిస్టెన్స్ కార్ ర్యాలీ

- రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో చారిటీ రైడ్
- సామాజిక సేవ కోసం నిధుల సేకరణ

సాక్షి, సిటీబ్యూరో: రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో చారిటీ టైమ్ స్పీడ్ డిస్టెన్స్(టీఎస్డీ) కార్ ర్యాలీని శనివారం ఘనంగా ప్రారంభించింది. నగరం నుంచి డిండి వరకు కొనసాగనున్న ఈ కార్ ర్యాలీ ఆదివారం ముగియనుంది. 2వ ఎడిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీ కేవలం టైమింగ్, నావిగేషన్ పరీక్ష మాత్రమే కాదు.. ఇది ఒక వైవిధ్యంతో కొనసాగే డ్రైవ్. రోటరీ మానవీయ సేవా ప్రాజెక్టుల కోసం నిధులను సేకరించేందుకు రూపొందించబడిన ఈ ర్యాలీ సేకరించిన నిధులను నగరంలోని ఏంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ కోసం తదుపరి జెన్ సీక్వెన్సింగ్ మెషీన్‌కు కేటాయించనున్నారు. ఈ ర్యాలీలో దాదాపు 15 కార్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షురాలు అను కేంద్రీ మాట్లాడుతూ.. ఈ డ్రైవ్ అద్భుతమైన థ్రిల్‌తో పాటు సామాజిక సేవా సంతృప్తిని అందిస్తోందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, సమాజ అభ్యున్నతి, సుస్థిర అభివృద్ధికి రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. కార్ ర్యాలీ అవగాహనతో పాటు రైడింగ్ స్పిరిట్‌ను పెంచుతుందని వివరించారు.



మెరీడియన్ ఫౌండేషన్ డే



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్ ఫౌండేషన్ వేడుకలను విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల 30వ ఫౌండేషన్ డే సందర్భంగా ట్రిస్ డెసినియోస్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ఫౌండర్, మాజీ ఎంపీ బుట్టా రేణుక విద్యార్థులకు బ్లాక్‌ల వారిగా బాధ్యతలను అప్పగించారు. మెరీడియన్ విద్యాసంస్థల సీఈవో తేజస్విని బుట్టా, ఎండీ నీలకంఠ బుట్టా, ప్రెసిడెంట్ లలితానాయుడు, ప్రిన్సిపాల్ పూనం జా, డాక్టర్ అనూజ్ కపాడియా తదితరులు పాల్గొన్నారు.



నృత్యోత్సాహం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య గురువు ఆశానాయుడు శిష్యురాలు శరణ్య శ్రీనిధి కూచిపూడి రంగప్రవేశం శనివారం రవీంద్ర భారతిలో కన్నుల పండువగా జరిగింది. పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, కళారత్న ఉమామహేశ్వర్, తల్లిదండ్రులు నీలిమ, శశి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ పెట్టు.. అక్కడే తేల్చుకుందాం

- మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్



సిద్దిపేట జోన్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డీ.. నీకు నిజంగా సత్తా, దమ్ము ఉంటే అసెంబ్లీ పెట్టు.. చర్చిద్దాం అన్నావు కదా. నా మైక్ కట్ చేయకుండా ఎంతసేపైనా మాట్లాడదాం.. నువ్వేంచేశావో.. మేమేం చేశామో తేల్చుకుందాం. అసెంబ్లీ పెట్టే దమ్ముందా'అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా గోదావరి నీళ్లను విడుదల చేయడం లేదని, మహారాష్ట్రలో పుష్కలంగా వర్షాలు పడి 8 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం మేడిగడ్డ వంతెనపైన లారీలు, మోటార్లు నడుస్తున్నాయని, ఒకవేళ మేడిగడ్డ మొత్తానికి కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయని ప్రశ్నించారు. మా మీద కోపం ఉంటే కేసులు వెయ్యాలికానీ, రైతులేం చేశారని ప్రశ్నించారు. కాళేశ్వరం నీళ్లను విడుదల చేయకుంటే రైతులతో కలిసి వచ్చి మోటార్లను వేస్తామని హరీశ్ హెచ్చరించారు.

'సీతారామ' కేసీఆర్ దార్శనికత..

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ముందుచూపుతో గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలంగా చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఫలాలు రైతులకు అందడం సంతోషంగా ఉందని హరీష్‌రావు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసి నీళ్లు అందించడంతో, రైతులు కేసీఆర్ కృషిని గుర్తు చేసుకుంటున్నారని ఆయన ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు.

పాలనపై చర్చకు సిద్ధం!

- నీళ్లు, నిధులు, నియామకాలపై చర్చిద్దాం
- హరీశ్‌రావుకు ఎంపీ చామల కిరణ్ సవాల్



సాక్షి, హైదరాబాద్: గోదావరి, కృష్ణా జలాల మీద అసెంబ్లీలో ఏకపాత్రాభినయం చేస్తానని కలలు గంటున్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుతో తాను ఎలాంటి చర్చకైనా సిద్ధమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సవాల్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై ముందు తనతో చర్చకు రావాలని, ఈ చర్చలో నీటి పారుదల అంశంతో పాటు నిధులు, నియామకాలపై కూడా చర్చించేందుకు తాను రెడీగా ఉన్నానని అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, అభీష్టానికి వ్యతిరేకంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలన సాగిందని, బీఆర్ఎస్ నేతలు చిత్తశుద్ధితో పని చేస్తే తెలంగాణ అప్పులకుప్పగా మారేది కాదని చెప్పారు. గోదావరి, బనకచర్ల టాపిక్ తీసుకొచ్చి మరోసారి ఆంధ్ర సెంటిమెంట్ రెచ్చగొట్టాలనే పిచ్చి ఆలోచనతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారని, అసలు సినిమా బీఆర్ఎస్ నేతలకు 70 ఎంఎంలో చూపించేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీలో సీఎం, మంత్రులను దూషిస్తూ, వాస్తవాలకు భిన్నంగా బుర్రకథలు, హరికథలు చెప్పుకుంటూ స్పీకర్‌ను సైతం దూషిస్తే మైకులు కట్ చేయరా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా నీటిని ఆంధ్రకు పంపించిందే కేసీఆర్ అని విమర్శించారు. నీళ్ల విషయంలో ఆంధ్ర ప్రాంతం వాళ్లు అన్యాయం చేస్తే.. బీఆర్ఎస్ రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయలేని కేసీఆర్‌కి ప్రతిపక్ష హోదా ఎందుకని చామల ప్రశ్నించారు. రాజకీయాల్లో తానున్నానని నిరూపించుకోవడానికే కవిత తాపత్రయం అని ఎద్దేవా చేశారు.

పది నిమిషాల్లో పనివారు!

ఎంచుకున్న పని మనుషుల సరఫరా

ఇంటి సేవల రంగం కొత్త పుంతలు

యాప్స్‌తో సేవలందిస్తున్న కంపెనీలు

దేశీయ మార్కెట్ విలువ రూ.42,500 కోట్లు



చాలా మంది గృహ యజమానులు ఇంటి రోజువారీ పని కోసం పనివారిని నియమించుకోవడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. తెలిసినవారైతేనే పనిలో పెట్టుకుంటాం. లేదా బంధువులు, స్నేహితులు సిఫార్సు చేయాల్సిందే. పల్లెలు, చిన్న పట్టణాల్లో పనివారు సులభంగా దొరుకుతారు. అదే నగరాలు ఇందుకు పూర్తి విరుద్ధం. ఈ సమస్యకు పరిష్కారంగా ఇప్పుడు ఆన్‌లైన్ వేదికలు పుట్టుకొచ్చాయి. 10 నిమిషాల్లో పనివారిని గుమ్మం ముందుంచుతున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

పట్టణీకరణ వేగం పుంజుకుంటోంది. చిన్న కుటుంబాలు పెరుగుతున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుండడం, మధ్యతరగతి కుటుంబాల సంఖ్య అధికం అవుతుండడంతో ఇంటి పనికోసం పనివారిని నియమించుకుంటున్నారు. పనివారి సరఫరాకోసం ఎన్నో ఏళ్ల క్రితమే ఏజెన్సీలు పుట్టుకొచ్చాయి. పూర్తి సమయం పనిచేసే ఉద్యోగులను దేశంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంపిక చేసుకుని.. వీరిని నగరాల్లో పనిచేయడానికి నియమిస్తున్నాయి. వెబ్‌సైట్ లేదా ఫోన్ కాల్స్ ఆధారంగా ఈ ఏజెన్సీలు సేవలు అందిస్తున్నాయి. అయితే ఈ సేవల కోసం ఇప్పుడు యాప్స్ కూడా పోటీపడుతున్నాయి.

నిమిషాల్లో ఎంట్రీ..

స్నాబిట్, ప్రోంటో వంటి కొత్త స్టార్టప్‌లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. కేవలం 10 నిమిషాల్లో పని మనుషులను గుమ్మం ముందు ఉంచుతామని హామీ ఇస్తున్నాయి. అర్బన్ కంపెనీ 'ఇన్‌స్టా హెల్ప్'పేరుతో 15 నిమిషాల్లోనే డొమెస్టిక్ హెల్పర్లను సరఫరా చేస్తోంది. ఊడవడం, శుభ్రపరచడం, వంట, దుమ్ము దులపడం, బట్టలు ఉతకడం, ఇస్త్రీ, కిటికీలు శుభ్రం చేయడం, పెంపుడు కుక్కలను నడిపించడం, పెంపుడు జంతువుల పర్యవేక్షణ, ఆహారం అందించడం.. ఇలా విభిన్న అవసరాలను లక్ష్యంగా చేసుకుని ఈ స్టార్టప్స్ విస్తృత శ్రేణి సేవలను అందిస్తున్నాయి. గృహ నిర్వహణలో దీర్ఘకాలిక అవసరాలను తీర్చే 'బ్రూమీస్'కంపెనీ సైతం క్విక్ సర్వీస్ రంగంలోకి అడుగుపెట్టింది. 'బుక్‌మైబాయి'సైతం క్విక్ సర్వీస్ విభాగంలోకి ఎంట్రీ ఇవ్వనుంది.

విదేశాలకూ పనివారు..

చాలా ఇళ్లలో పనివారి అవసరం ఉంది. పనులు చేసే వారూ లక్షల్లోనే ఉన్నారు. అయితే ఈ ఇద్దరినీ కలిపే పూర్తి స్థాయి వ్యవస్థ లేకపోవడం మార్కెట్లో పెద్ద అంతరం. ఈ సమస్యకు పరిష్కారంగా అర్బన్ కంపెనీ, బుక్‌మైబాయి, బ్రూమీస్, మీహెల్ప్ వంటి కంపెనీలు రంగంలోకి దిగాయి. వివిధ దేశాల్లో ఉన్న భారతీయుల గృహ అవసరాల కోసం పనివారిని సరఫరా చేసే స్థాయిలో ఈ కంపెనీలు అవతరించాయి. కంపెనీలు పనివారి బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయడం, ఐడెంటిటీ కార్డుల పరిశీలన, వ్యక్తిగత సంప్రదింపులు చేపడుతున్నాయి. అంతేగాక పనివారికి తగిన శిక్షణ ఇచ్చి నియమిస్తున్నాయి.

సంక్లిష్టమైన సవాళ్లు

భారత్‌లో హౌస్ కీపింగ్ మార్కెట్‌లో కార్యకలాపాల విస్తరణ కోసం స్టార్టప్‌లు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కానీ అదే స్థాయిలో విజయవంతం కాలేకపోతున్నాయి. పనివారికి డిమాండ్ ఉన్నప్పటికీ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా పనివాళ్లను, వినియోగదారులతో అనుసంధానించలేకపోతున్నాయి. వ్యక్తులతో ముడిపడి ఉండడంతో నమ్మకం, నియంత్రణ, నాణ్యత విషయంలో ఈ రంగంలో సవాళ్లు సంక్లిష్టంగా మారాయి. కస్టమర్ అసంతృప్తి అనేది ప్రధాన సమస్యగా అవతరించింది. కస్టమర్ల నుంచి నెల జీతం కమీషన్‌గా వసూలు చేసే ఏజెన్సీలు చాలా కాలంగా పనిచేస్తున్నాయి. చాలా స్టార్టప్‌లు ఆ మోడల్‌ను డిజిటల్‌గా తయారు చేశాయి కానీ పెద్దగా ఆవిష్కరణలు జరగలేదు. భద్రత, నమ్మకం రెండు వైపులా కీలక సమస్యలుగా ఉన్నాయి. స్టార్టప్‌లు పనివారి ఐడెంటిటీ ధ్రువీకరణ, శిక్షణను అందిస్తున్నట్లు చెప్పుకొంటున్నప్పటికీ.. బలమైన ధ్రువీకరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం సంక్లిష్టం, ఖరీదైనదిగా మారిపోయాయి. నేపథ్య ధ్రువీకరణ విషయానికొస్తే చాలా కంపెనీలు ఇందుకోసం థర్డ్ పార్టీ సంస్థల సాయం తీసుకుంటున్నాయి.

పెట్టుబడులూ వస్తున్నాయ్

గృహ సేవల కోసం క్విక్ సర్వీస్ మోడల్‌పై పెట్టుబడిదారులు ఆసక్తిగా ఉన్నారు. భారత్‌లో గృహ సేవల మార్కెట్ ఒక పెద్ద వ్యాపార అవకాశంగా మారవచ్చని వీరు నమ్ముతున్నారు. మే నెలలో లైట్‌స్పీడ్, నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ నుంచి 19 మిలియన్‌డాలర్లను స్నాబిట్ సేకరించింది. బెయిన్ క్యాపిటల్ వెంచర్స్ నుంచి 2 మిలియన్ డాలర్లను ప్రోంటో అందుకుంది. అలాగే మరో రౌండ్ నిధుల కోసం ప్రయత్నిస్తోంది. బ్రూమీస్ సైతం నిధుల వేటలో ఉంది. హోమ్ సర్వీస్ రంగంలో దిగ్గజ సంస్థ అర్బన్ కంపెనీ ఐపీవో ద్వారా రూ.1,900 కోట్లు సమీకరించే పనిలో ఉంది.

ఎలా పనిచేస్తుందంటే..

ఈ డిజిటల్ ఆధారిత ప్లాట్‌ఫామ్స్‌లో కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. వీరిని నియమించుకోవాలనుకునే వినియోగదారులకు కార్మికుల ప్రొఫైల్స్ కనిపిస్తాయి. పని, పని గంటలు, రోజులనుబట్టి కస్టమర్లు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని కంపెనీలు పనివారికి వాలెట్స్ రీచార్జ్ మోడల్ ద్వారా ఫీజును తీసుకుంటున్నాయి. అంటే హౌస్ కీపర్స్‌కు కంపెనీలు పని ఇప్పించినందుకుగాను కమీషన్‌రూపంలో కొంత మొత్తాన్ని వాలెట్ నుంచి తగ్గిస్తాయి. మరికొన్ని కంపెనీలు పనివారికి వేతనాలను ఆఫర్ చేస్తున్నాయి. యాప్స్ ద్వారా సేవలు అందించే కార్మికులకు మెరుగైన ఆదాయం లభిస్తోందని కంపెనీలు అంటున్నాయి.

భారతీయ హౌస్ కీపింగ్ సేవల పరిశ్రమ పరిమాణం ప్రస్తుతం రూ.42,500 కోట్లుగా ఉంది. 2032 నాటికి ఈ మార్కెట్ రూ.1,70,000 కోట్లకు చేరుకుంటుందని జియాన్ మార్కెట్ రీసెర్చ్ అంచనా వేస్తోంది.

సమీకరించిన నిధులు (మిలియన్ డాలర్లలో)

అర్బన్ కంపెనీ 376	స్నాబిట్ 25.5
ప్రోంటో 2	బ్రూమీస్ 1.1

ఏపీలో బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై టీడీపీ గూండాయిజం

▶ మొదటి పేజీ తరువాయి

అని అరుస్తూ బండరాళ్లు, కర్రలతో దాడులు చేస్తున్నా పోలీసులు అడ్డుకోవడానికి ఏమాత్రం ముందుకు రాకపోవడం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనకు అద్దం పడుతోంది. దాడిని నిలువరించక పోగా, సినిమా షూటింగ్ చూస్తున్నట్లు వ్యవహరించడం.. తీరా దాడి చేసి వెళ్లిపోతుండగా హంగామా చేయడం పోలీసులు ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు ఎంతగా లొంగి పోయారన్నది తేటతెల్లం చేస్తోంది.

గుడివాడలో దాడి జరిగిందిలా..

చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ఊరూరా ఎండగట్టేలా 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమాన్ని గుడివాడ మండలం లింగవరంలోని కె.కన్వెన్షన్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించ తలపెట్టాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ నాయకురాలు ఉప్పాల హారిక తన భర్త, ఇతరులతో కలిసి వాహనంలో బయలు దేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చాయి. ఈ విషయం తెలియడంతో కూటమి నేతల కన్ను కుట్టింది. గుడివాడ నియోజకవర్గంలో ఈ కార్యక్రమం విజయవంతం కాకుండా చూడాలని ప్రభుత్వ పెద్దల నుంచి స్థానిక టీడీపీ, జనసేన నేతలకు ఆదేశాలు అందాయి. దీంతో ఆ కార్యక్రమానికి వచ్చే వైఎస్సార్‌సీపీ శ్రేణులను నాగవరప్పాడు వద్ద అడ్డుతగులుతూ, రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించారు. రాళ్లు, కర్రలు చేత పట్టుకుని యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. కర్రలు, రాడ్లతో సభకు వెళ్లే వారిని అడ్డగించి, అడ్డువచ్చిన వాహనాలపై దాడులకు తెగబడ్డారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంయమనం పాటించాయి. ఈ క్రమంలో సభకు హాజరయ్యేందుకు గుడివాడ మీదుగా లింగవరం వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారు అక్కడికి రాగానే.. టీడీపీ, జనసేన నేతలు రాళ్లు, కర్రలు, రాడ్లతో పోలీసుల సమక్షంలో దాడులకు తెగబడ్డారు. కారు అద్దాలను ధ్వంసం చేశారు. కారుపై బండరాళ్లు విసిరారు. బీసీ మహిళ అని కూడా చూడకుండా బూతులు తిట్టారు. కారును ముందుకు కదలనివ్వకుండా అడ్డుకున్నారు. కారుపై పదిసార్లు విచ్చలవిడిగా దాడి చేయడంతో గంటన్నర సేపు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జెడ్పీ చైర్మన్, ఆమె భర్త కారులోనే ఉండి పోయారు. ఈ తతంగం అంతా జరిగాక, అక్కడే ఉన్న పోలీసులు తాపీగా అక్కడికి చేరుకుని ఉప్పాల హారికను అక్కడి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు.

చంపేస్తారనుకున్నా..

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి



ఉప్పాల హారిక కారును చుట్టుముట్టిన టీడీపీ గూండాలు

ఆమె విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకులు గూండాల్లా కర్రలు, రాడ్లతో కారుపై పోలీసుల సమక్షంలోనే దాడి చేసి కారు అద్దాలను పగలకొట్టారని చెప్పారు. తమను హతమార్చేందుకు ప్రయత్నించారని కన్నీటిపర్యంతమయ్యారు. ఓ దశలో తనను చంపేస్తారనుకున్నానని చెప్పారు. తన మామ, తన భర్త, తాను రాజకీయాల్లో ఉన్నా, ఇప్పటి వరకు ఎవరినీ విమర్శించలేదని, తన దారిలో తాను వెళ్తేంటే బీసీ మహిళ అని కూడా చూడకుండా నోటితో చెప్పలేని విధంగా అసభ్య పదజాలంతో దూషించి తమను చంపేందుకు యత్నించారన్నారు. సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడ ఉండగానే, వారి సమక్షంలోనే తమపై దాడి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో జిల్లా ప్రథమ పౌరురాలినైన తనకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు ఏం రక్షణ ఉంటుందని ఆమె ప్రశ్నించారు. తనపై జరిగిన దాడికి సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, ఇప్పటికే గుడివాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. జిల్లా ఎస్పీని కలసి దాడి గురించి ఫిర్యాదు చేస్తానని హారిక స్పష్టం చేశారు. పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము మాట్లాడుతూ టీడీపీ నేతలు మద్యం తాగి వచ్చి వీధి గూండాల్లా కర్రలు, రాడ్లతో తమపై దాడి చేసి తమను హతమార్చేందుకు ప్రయత్నించారన్నారు. దాదాపు 400 మంది పోలీసుల సమక్షంలోనే తమపై దాడి చేశారన్నారు. కారులో తాను ఒక్కడినే ఉంటే భయపడేవాడిని కాదని, మహిళ అయిన తన భార్య ఉండటంతో ఆందోళన చెందానన్నారు.

వాహనాలు, అంబులెన్స్‌ను అడ్డుకుని వీరంగం

గుడివాడలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని అడ్డుకోడానికి కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన కార్యకర్తలు చేయని ప్రయత్నం లేదు. నాయకులు, కార్యకర్తలు శనివారం స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద వీరంగం సృష్టించారు. తాగిన మైకంలో ఏమి చేస్తున్నారో తెలియక వచ్చి పోయే వాహనాలను అడ్డుకుని సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. పోలుకొండ రోడ్‌లో రోగిని తీసుకెళ్లేందుకు వెళ్తున్న అంబులెన్స్‌ను సైతం అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో దానిని వదిలివేశారు. ఇలా ప్రతి వాహనాన్ని ఆపడం, అందులో ఉన్న వారిని గుర్తించి.. వైఎస్సార్‌సీపీ నాయకులని భావిస్తే వారిపై దాడులకు తెగబడ్డారు.దద

అరాచకానికి పరాకాష్ట

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులను గుప్పిట్లో పెట్టుకుని, యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తూ.. పౌర హక్కులను కాలరాస్తోంది. తమను ప్రశ్నించే వారే ఉండకూడదన్నట్లు తాలిబన్లను మరిపిస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలను సైతం అడ్డుకుంటోంది. ఆయన కార్యక్రమాల్లో పాల్గొన్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో పాటు మిగతా హామీలన్నీ అమలు చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి రాకుండా ముందే భయభ్రాంతులకు గురి చేసేలా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. ఈ క్రమంలో ప్రజా సమస్యలు ఎత్తి చూపేందుకు ప్రజల్లో వెళ్తున్న వైఎస్ జగన్‌కు భద్రత కల్పించకుండా కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్ జగన్ గుంటూరు మిర్చి యార్డు పర్యటన, టీడీపీ గూండాల చేతిలో హతమైన బీసీ నాయకుడు కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా రామగిరి మండల పర్యటనకు వెళ్లినప్పుడు అడ్డంకులు సృష్టించింది. ఇదే రీతిలో ప్రకాశం జిల్లా పొదిలిలో పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు వెళ్లినప్పుడు, పల్నాడు జిల్లా సత్తెనపల్లెలో టీడీపీ గూండాల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు, నిన్నటికి నిన్న చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతులకు మద్దతు ధర కోసం గళం విప్పేందుకు వెళ్లినప్పుడు ఇదే తరహాలో అడ్డంకులు సృష్టించింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించింది.

మహిళలపై దాడి మీ శాడిజానికి పరాకాష్ట

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్



- కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి చేయించడం దుర్మార్గం
- మీ పచ్చ సైకోలతో పోలీసులను అడ్డుపెట్టుకుని దాడులు చేయించడం గొప్ప పనా?
- దీన్ని పరిపాలన అనరు.. శాడిజం, పైశాచికత్వం అంటారు

సాక్షి, అమరావతి: 'చంద్రబాబూ.. మహిళల మీద మీ దాడి మీ శాడిజంకు పరాకాష్ట'అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం నేరం చేశారని బీసీ సామాజిక వర్గానికి చెందిన గుడ్లవల్లేరు జెడ్పీటీసీ సభ్యురాలు, కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గుడివాడలో మీ వాళ్లను పంపి దాడులు చేయించారని సీఎం చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు శనివారం రాత్రి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'మహిళల మీద ఈ రోజు మీ దాడి, మీ శాడిజంకు పరాకాష్ట. వైఎస్సార్‌సీపీ నాయకుల మీద వరుసగా దాడులు చేయించడమే కాదు.. చివరకు బీసీ మహిళా నాయకుల మీద కూడా నిస్సిగ్గుగా దాడులు చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నానని.. చేతిలో అధికారం ఉంది కదా అని, పోలీసులు ఎలా చెబితే అలా వింటున్నారు కదా అని, మీ పచ్చ సైకోలతో మీరు దాడులు చేయించడం గొప్ప పనా? ఏం నేరం చేశారని ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గుడివాడలో మీవాళ్లను పంపి దాడులు చేయించారు? చంద్రబాబూ.. దీన్ని పరిపాలన అనరు. శాడిజం అంటారు.. పైశాచికత్వం అంటారు. ఒక రాజకీయ పార్టీగా మా కార్యక్రమాలు మేం చేసుకోకూడదా? ఆ కార్యక్రమాలకు మా నాయకులు, మా మహిళా నాయకులు హాజరు కాకూడదా? ఇదేమైనా తప్పా? అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విషయంలో మీరు ఇలాగే చేస్తున్నారు. తన సొంత ఇంటికి, తన నియోజకవర్గ కేంద్రానికి, హైకోర్టు ఆదేశాలున్నా మీరు వెళ్లనీయడం లేదు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై కూడా నెల్లూరులో ఒక పథకం ప్రకారం మీ పచ్చసైకోలతోనే, పోలీసుల సమక్షంలోనే దాడులు చేయించారు.

రాజకీయ కక్షలతో దుష్ట సంప్రదాయాన్ని తీసుకొస్తారా?

చంద్రబాబూ.. మీరు రాజకీయ కక్షలతో ఈ రాష్ట్రంలో ఒక దుష్ట సంప్రదాయాన్ని తీసుకువచ్చి, దాన్ని కొనసాగిస్తున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వల్లభనేని వంశీ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, నందిగం సురేష్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పోసాని కృష్ణమురళి సహా ఎంతో మంది మీద తప్పుడు కేసులు, దొంగ కేసులు పెట్టారు. వీళ్లే కాకుండా సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు సహా ఎంతో మంది అమాయకులను కేసుల్లో ఇరికించారు.. దాన్ని ఇంకా కొనసాగిస్తున్నారు. ఇదే సంప్రదాయం రేపు మా ప్రభుత్వం వచ్చిన తర్వాత, ప్రతిచర్యగా కొనసాగితే అప్పుడు మీ పరిస్థితి ఏంటి? ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధ పాలనను, చట్టాన్ని పూర్తిగా గాలికి వదిలేసి, మీ ఇష్టానుసారం మీరు ప్రవర్తిస్తే పరిస్థితులు ఎల్లకాలం ఇలాగే ఉండిపోవు. అవి మారినప్పుడు, మీరంతా ఇప్పుడు చేస్తున్న దుర్మార్గాలకు, దారుణాలకు, అన్యాయాలకు మీరు బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజల తరఫున హెచ్చరిస్తున్నాం. ఇకనైనా శాడిజం వదిలి, ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను అమలు చేయడం మీద దృష్టి పెట్టండి. లేకపోతే చరిత్రహీనుడిగా మిగిలిపోతారు.

ఇంధనం అందలేదు!

▶ మొదటి పేజీ తరువాయి

భవనాలపై కుప్పకూలడం, 241 మంది ప్రయాణికులతో సహా మొత్తం 260 మంది దుర్మరణం పాలవడం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఏఏఐబీ, ఇప్పటి దాకా వెలుగు చూసిన కీలకాంశాలతో రూపొందించిన 15 పేజీల ప్రాథమిక నివేదికను సంస్థ శనివారం విడుదల చేసింది. ''విమానం టేకాఫైన క్షణాల్లోనే రెండు ఇంజన్ల తాలూకు ఇంధన నియంత్రణ స్విచ్‌లు ఒక్క సెకన్ వ్యవధిలో ఒకదాని తర్వాత ఒకటి 'రన్' నుంచి 'ఆఫ్' మోడ్‌కు మారిపోయాయి. దాన్ని గమనించగానే పైలట్లు పరస్పరం ప్రశ్నలు సంధించుకున్నారు. అప్పటికే ఇంజన్లకు ఇంధన సరఫరా ఆగిపోవడంతో విమానం పైకెగిరేందుకు అత్యవసరమైన థ్రస్ట్ లభించలేదు. అప్పటికి కేవలం 625 అడుగుల ఎత్తుకు మాత్రమే వెళ్లిన విమానం అక్కణ్నుంచి శరవేగంగా కిందకు దిగడం మొదలైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు పైలట్లిద్దరూ శాయశక్తులా ప్రయత్నించారు. తొలుత మొదటి ఇంజన్ ఇంధన స్విచ్‌ను, రెండు సెకన్లలోనే రెండో స్విచ్‌ను ఆన్ చేసినా లాభం లేకపోయింది. మొదటి ఇంజన్ కాసేపు రికవరీ అయినట్టే కనిపించినా ఆ వెంటనే చేతులెత్తేసింది. రెండోది పూర్తిగా మొరాయించింది. తర్వాత క్షణాల్లోనే విమానం ఘోర ప్రమాదానికి గురైంది'' అని పేర్కొంది. ఎన్‌హాన్స్‌డ్ ఎయిర్‌బోర్న్ ఫ్లైట్ రికార్డర్ (ఈఏఎఫ్ఆర్) నుంచి సేకరించిన పైలట్ల సంభాషణ తాలూకు ఆడియో క్లిప్పింగులను విశ్లేషించిన మీదట ఏఏఐబీ ఈ మేరకు అంచనాకు వచ్చింది. ''విమానానికి విద్యుత్ సరఫరా చేసే ఆగ్జిలరీ పవర్ యూనిట్ (ఏపీయూ) ఇన్‌లెట్ డోర్ టేకాఫ్ ప్రక్రియ పూర్తవకుండానే అనూహ్యంగా తెరుచుకుంది. ఇంజన్లు మొరాయించిన సమయంలోనే ఇది చోటుచేసుకుంది. విమానం చుట్టూ వాయు ప్రవాహాన్ని తీవ్రంగా ప్రభావితం చేయగల పరిణామమిది!'' అని వివరించింది. స్విచ్‌లు ఆఫ్ కావడానికి ఏఏఐబీ ఎలాంటి కారణమూ పొందుపరచకపోయినా, ''ఇంధన నియంత్రణ స్విచ్‌లు ఆటోమేటిగ్గా పని చేయవు. ఎవరో



విమానం కూలుతున్న దృశ్యం (ఫైల్)

ఒకరు పూనుకుని వాటిని ఆన్, ఆఫ్ చేయాల్సిందే'' అని చెప్పుకొచ్చింది. తద్వారా, పైలట్లే పొరపాటున ఆ పని చేసి ఉంటారనే సంకేతాలిచ్చింది. ''విమానంలో ఎలాంటి లోపాలూ మా దృష్టికి రాలేదు. దాన్ని పక్షులు ఢీకొన్న ఆనవాళ్లు కూడా లేవు. ఇంధనాన్ని ఉద్దేశపూర్వకంగా కలుషితం చేసినట్టు ఎలాంటి ఆధారాలూ లేవు'' అని ఏఏఐబీ స్పష్టం చేసింది. ప్రమాదానికి పైలట్ల తప్పిదమే కారణమని పరోక్షంగా పేర్కొంది. అయితే ఎయిరిండియాపైనేగాక బోయింగ్ 787–8 రకం విమానాలు నడుపుతున్న, జీఈ కంపెనీ ఇంజన్లు వాడుతున్న విమానయాన సంస్థలపై ఇప్పటికిప్పుడు ఎలాంటి చర్యలూ వద్దని నివేదిక సూచించింది. కలిసి ఏఏఐబీ విచారణలో బ్రిటన్‌కు చెందిన ఎయిర్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ విభాగం, అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ కూడా పాలు పంచుకుంటున్నాయి. ప్రాథమిక నివేదికను పరిశీలిస్తున్నట్టు ఎయిరిండియా పేర్కొంది. మరోవైపు ప్రాథమిక నివేదికలోని అంశాలతో విమాన పైలట్ల సంఘం తీవ్రంగా విభేదించింది. ''దర్యాప్తు గోప్యంగా సాగుతోంది. పైగా పైలట్లను దోషులుగా తేలుస్తూ హడావుడిగా నిర్ణయానికి వచ్చినట్టుగా కనిపిస్తోంది'' అని ఆరోపించింది.

అప్పుడే తుది నిర్ణయానికి రావొద్దు

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్య

విశాఖపట్నం: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) కేవలం ప్రాథమిక నివేదికను మాత్రమే ఇచ్చిందని, ఈలోపే ఎవరూ అప్పుడే తుది నిర్ణయానికి రావొద్దని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టంచేశారు. శనివారం మంత్రి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు. '' దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఈ దశలో అప్పుడే తుది నిర్ణయానికి రాకండి. తుది నివేదిక వచ్చేదాకా వేచి ఉండండి. ప్రాథమిక నివేదికలో ఎన్నో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి. వీటి చిక్కుముడులు విప్పే బాధ్యతను దర్యాప్తు ఏజెన్సీలు తీసుకున్నాయి. సమగ్రస్థాయిలో దర్యాప్తు పూర్తయ్యాక అధికారులు తుది నివేదికను సమర్పిస్తారు. ప్రస్తుత తరుణంలో ఈ అంశంపై ఏం మాట్లాడినా తొందరపాటే అవుతుంది'' అని అన్నారు. ఈ సందర్భంగా ఏఏఐబీ, భారతీయ పైలెట్లు, క్యాబిన్ సిబ్బంది సేవలను మంత్రి కొనియాడారు. ''మనకు ప్రపంచంలోనే అత్యుత్తమమైన విమాన పైలట్లు ఉన్నారు. అనుభవజ్ఞులైన విమాన సిబ్బంది సేవలందిస్తున్నారు. వీళ్లతోపాటు ప్రమాద బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం. దర్యాప్తు బాధ్యతలను ఏఏఐబీ సమర్థంగా నిర్వహిస్తోంది. బ్లాక్‌బాక్స్‌ను కనిపెట్టడం, విదేశాలపై ఆధారపడకుండా బ్లాక్‌బాక్స్‌లోని డేటాను సొంతంగా డీకోట్ చేయడం వంటి కీలక సవాళ్లను ఏఏఐబీ అధిగమించింది'' అని మంత్రి అన్నారు.

అంతా 32 సెకన్లలోపే...

ఇదీ ప్రమాదక్రమం...

ఎయిరిండియా విమానం టేకాఫ్ నుంచి దుర్ఘటన దాకా ఎప్పుడేం జరిగిందో ఏఏఐబీ నివేదికలో వెల్లడించింది...

- ➔ **ఉదయం 11.17:** ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయంలో దిగిన ఎయిరిండియా విమానం
- ➔ **మధ్యాహ్నం 1.38:39:** రన్‌వే నంబర్ 23 నుంచి టేకాఫ్ అయిన విమానం
- ➔ **మధ్యాహ్నం 1.38:42:** టేకాఫై 180 నాట్ల ఐఏఎస్ వేగం అందుకున్న విమానం. అదే సమయంలో 'రన్' పొజిషన్ నుంచి 'కటాఫ్'కు మారిన రెండు ఇంధన నియంత్రణ స్విచ్‌లు
- ➔ **1.38:47:** ఇంధన సరఫరా నిలిచిపోవడంతో రెండు ఇంజన్లూ విఫలమయ్యాయి. దాంతో విమానం పూర్తిగా గాల్లోకి లేచేందుకు కావాల్సిన మినిమం ఐడిల్ రేట్‌ను అందుకోలేదు. అందుకు కావాల్సిన హైడ్రాలిక్ పవర్ అందించేందుకు రామ్ ఎయిర్ టర్బైన్ (ఆర్ఏటీ) పంప్ క్రియాశీలమైంది.
- ➔ **1.38:52:** ఆన్ అయిన ఒకటో ఇంజన్ స్విచ్
- ➔ **1.38:54:** తెరుచుకున్న ఏపీయూ ఇన్‌లెట్ తలుపు
- ➔ **1.38:56:** ఆన్ అయిన రెండో ఇంజన్ స్విచ్
- ➔ **1.39:05:** పైలట్ ప్రమాద (మే డే) సందేశం
- ➔ **1.39:11:** తుది డేటా నమోదు. ఏటీసీ స్పందించేలోపే రన్‌వేకు కేవలం 1.85 కి.మీ. దూరంలో జనసమ్మర్ద ప్రాంతంలో నేలను తాకి మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై పడి పేలిపోయిన విమానం

నడిపింది కో పైలట్

ప్రమాదానికి గురైన సమయంలో ఎయిరిండియా విమానాన్ని కో పైలట్ క్లైవ్ కుందర్ (32) నడిపారు. ఆయనకు మొత్తం 3,403 గంటల పాటు విమానాలు నడిపిన అనుభవముంది. డ్రీమ్‌లైనర్ విమానాలను 1,128 గంటల పాటు నడిపారు. ఏడాది పాటు ఏరోనాటికల్ ఇంజనీర్‌గా చేశాక పైలట్‌గా మారిన తన కల నిజం చేసుకున్నారు. ఇక ప్రధాన పైలట్ సుమీత్ సబర్వాల్ (56) ప్రమాద సమయంలో విమాన పర్యవేక్షణ విధులు నిర్వర్తించారు. ఆయనకు ఏకంగా 15,638 గంటల అపార అనుభవముంది. అందులో 8,596 గంటల పాటు డ్రీమ్‌లైనర్ విమానాలే నడిపారు. ఎయిరిండియాలో ఆయన ఇన్‌స్ట్రక్టర్ కూడా.

కార్పొరేట్ మద్దతుతోనే మోదీ పాలన

- దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలకు సిద్ధం: సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్



మాట్లాడుతున్న రాఘవులు. చిత్రంలో తమ్మినేని, జాన్ వెస్లీ, విజయ రాఘవన్

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు అడ్డగోలుగా అప్పగిస్తున్న మోదీ ప్రభుత్వం సామాన్యులకు గుదిబండగా మారిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ తీవ్రంగా విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ విధానం పేదలకు భారంగా మారిందని, నిత్యావసరాలపై అధిక పన్నులు వసూలు చేస్తూ కార్పొరేట్ సంస్థల పన్నులను మాత్రం తగ్గిస్తున్నారని విమర్శించారు. కార్మిక, వ్యవసాయ రంగాలు సంక్షోభంలోకి వెళుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని, ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాల పిలుపుతో ఈ నెల 9న నిర్వహించిన దేశవ్యాప్తంగా సమ్మెకు విశేష స్పందన లభించడం దేశంలో మోదీ ప్రభుత్వం పట్ల పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమన్నారు.

- మరో పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ దేశంలో అసోం, బెంగాల్‌లో మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని, పౌరసత్వం నిరూపించుకోమనడం, మావోయిస్టుల పేరిట హక్కులను రద్దు చేయడం మానవ హక్కుల ఉల్లంఘన అని ఆవేదన వ్యక్తం చేశారు.
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ తెలంగాణలో 8 గంటల పని సమయాన్ని 10 గంటలకు పెంచేలా జీఓ 282ను తెచ్చిన రేవంత్ సర్కార్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, టి.జ్యోతి పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 13-7-2025

'అమ్మాయే కదా ఏం చేస్తుందిలే... టచ్ చేసేద్దాం' అనుకుంటే **అనంతికా సనీల్‌కుమార్** గట్టిగా బుద్ధి చెప్పింది. 'ఆత్మవిశ్వాసానికి కేరాఫ్ అనంతిక' అనొచ్చు. మనల్ని మనం రక్షించుకునే కళ తెలియాలంటోంది ఈ టీనేజ్ బ్యూటీ. అందుకే అనంతికా సనీల్‌కుమార్ 'మార్షల్ ఆర్ట్స్' నేర్చుకుంది. కరాటేలో బ్లాక్ బెల్ట్, కేరళ ప్రాచీన మార్షల్ ఆర్ట్ అయిన కలరిపయట్టు నేర్చుకుంది. కథకళి, భరతనాట్యం, మోహినియాట్టమ్, కూచిపుడి కూడా నేర్చుకుంది. మరోవైపు సినిమాలంటే ఇష్టంతో హీరోయిన్‌గా కొనసాగుతోంది. 'మ్యాడ్', ఇంకా ఆ మధ్య విడుదలైన '8 వసంతాలు' చిత్రాలతో నటిగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఇక అనంతికా సనీల్‌కుమార్ 'సాక్షి'కి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలోని విశేషాలు...

ఈ కళ అమ్మ కల



రెస్ట్ నచ్చదు

నాకు 'బ్లాక్ ఫ్లిప్' అంటే ఇష్టం. ఒకసారి అది చేస్తున్నప్పుడు వెన్నెముకకి గాయం అయింది. అప్పుడు నేను 'ప్లస్ వన్' చదువుకుంటున్నాను. నా స్పైన్ బెండ్ అయింది. ఫలితంగా ఏడాది పాటు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండాలనుకునేవారికి రెస్ట్ అంటే అస్సలు నచ్చదు. విశ్రాంతి ఏడాది పూర్తి కావొస్తున్న సమయంలో '8 వసంతాలు' సినిమాకి అవకాశం వచ్చింది. ఎక్కువసేపు నిలబడినా, కూర్చున్నా బ్యాక్ పెయిన్ ఉంటుంది. అయినా ఆ సినిమా ఒప్పుకుని, చేశాను. ఇప్పటికీ కంటిన్యూస్‌గా నిలబడితే నొప్పిగానే ఉంటుంది. అది ఎప్పటికీ ఉన్నా పట్టించుకోకుండా పని చేసుకోవాలని ఫిక్స్ అయిపోయాను (నవ్వుతూ).

రియాక్ట్ అయ్యే బలం

మార్షల్ ఆర్ట్స్ అంటే... ఒంటి చేత్తో రాళ్లని పగలగొట్టడం కాదు. మనల్ని మనం కాపాడుకోవడానికి వేళ్లు, గోళ్లు, చేతులు, కాళ్లు ఎలా ఉపయోగించుకోవాలో తెలిపేది... మన ఆత్మవిశ్వాసం పెంచే కళ. మనకు ఏం జరిగినా వేరేవాళ్ల మీద ఆధారపడకుండా మనల్ని మనం రక్షించుకోవడానికి ఉపయోగపడుతుంది. అబ్బాయిలు శారీరకంగా బలంగా ఉంటారు కాబట్టి వాళ్లైతే ఈ ఆర్ట్ నేర్చుకోవచ్చని చాలామంది అనుకుంటారు. అయితే ఫిజికల్‌గా వీక్‌గా ఉన్నవాళ్లు నేర్చుకోవాలంటా. అమ్మాయిగా నాకు ఫిజికల్ స్ట్రెంత్ తక్కువే. కానీ ఇవి నేర్చుకోవడం వల్ల రియాక్ట్ అవ్వాల్సిన టైమ్‌లో రియాక్ట్ అయ్యేంత బలం దానంతట అది వచ్చేస్తుంది. డిఫెండ్ చేసుకోవడం మనకు తెలుసు అని లోపల ఉన్న ఆత్మవిశ్వాసం మనల్ని ఎదురు తిరిగేలా చేస్తుంది.

నా ఫ్యామిలీ నాకు ఎప్పుడూ సపోర్టివ్‌గా ఉంది. కొత్తగా ఏదైనా నేర్చుకోవాలనుకున్నప్పుడల్లా 'ఓకే' అనే సమాధానమే వచ్చింది. ఇక డ్యాన్స్ నేర్చుకోవాలనుకున్నప్పుడు క్లాసికల్ మాత్రమే కాదు... హిప్ హాప్ నేర్చుకోవాలన్నా అదే రియాక్షన్. అంత సపోర్టివ్. మా అమ్మ తన కలని నాలో చూసుకున్నారు. ఇప్పుడు నేను నేర్చుకున్నట్లుగా చిన్నప్పుడు ఆమె మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలనుకున్నారు. అయితే అప్పుడు ఆమె పేరెంట్స్‌కి అంత స్థోమత లేకపోవడంతో రాజీ పడాల్సి వచ్చింది. ఇప్పుడు నేను కోరుకున్నట్లుగా అన్నీ నేర్చుకునే పరిస్థితి ఉంది. అన్నీ నేర్పించి, మా అమ్మ నాలో తనని చూసుకుంటున్నారు. యాక్చువల్‌గా ఫోర్త్ స్టాండర్డ్ వరకూ నేను టాపర్‌ని. ఆ తర్వాత ఆడుకోవడం, మార్షల్ ఆర్ట్స్, డ్యాన్స్ పట్ల ఇంట్రెస్ట్‌తో స్టడీస్ వైజ్ కొంచెం వీక్ అయ్యాను. ఎయిత్ స్టాండర్డ్ వరకూ ఇలానే. ఆ తర్వాత మళ్లీ గుడ్ స్టూడెంట్ అయ్యాను.



సైలెంట్‌గా ఉండొద్దు

అమ్మాయిలకు స్వీయ రక్షణ తెలియాలి. ఆ మాటకొస్తే ఇప్పుడు అబ్బాయిలకూ కొన్ని ఊహించని చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. సో... ఎవరైనా సరే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని చెబుతున్నాను. ఎందుకంటే నాకు తెలిసినవాళ్లల్లో అబ్బాయిలకు కూడా సమస్యలు వచ్చాయి. ఇక అమ్మాయిలకు ఎందుకు మరీ ముఖ్యం అంటే... వాళ్లకి ఎక్కువగా వేధింపులు ఎదురవుతుంటాయి. హఠాత్తుగా ఎవరైనా వచ్చి, తాకకూడని చోట తాకారనుకోండి 'మనకి సెల్ఫ్ డిఫెన్స్ తెలిసి ఉంటే బాగుండేది' అని అప్పుడు అనుకుంటాం. అది ప్రయోజనం లేదు. అదే ముందే నేర్చు కుంటే... ఆ టైమ్‌లో సైలెంట్‌గా ఉండకుండా బుద్ధి చెప్పగలుగుతాం.

పాలిటిక్స్‌లోకి...

నాకు పాలిటిక్స్ అంటే ఇష్టం. ఎందుకంటే జనాల్లో ఉండటం ఇష్టం. వారికి ఏదైనా సహాయం చేయాలని ఉంది. ప్రాపర్ రాజకీయాల్లోకి వెళ్లే ముందు అవగాహన పెంచుకోవాలనుకుంటున్నాను. చట్టం గురించి తెలుసుకోవడం ముఖ్యం. అందుకే 'లా' చదువుతున్నాను. ఇప్పుడు ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను. భవిష్యత్తులో అమ్మాయిల కోసం మార్షల్ ఆర్ట్స్ స్కూల్ పెట్టాలని ఉంది. కానీ దీనికి ఫైనాన్షియల్ సపోర్ట్ అవసరం. కొంచెం టైమ్ పడుతుంది.

– కరాటేలో సెకండ్ బ్లాక్ బెల్ట్ మాత్రమే సాధించాను. వన్ నుంచి టెన్ వరకూ ఉన్నాయి. థర్డ్ కూడా సాధించాలని ఉంది. కానీ ఇప్పుడు సినిమాలు కూడా చేస్తున్నాను కాబట్టి టైమ్ దొరకడం లేదు. పదో స్టేజ్ వరకూ వెళ్లడానికి చాలా టైమ్ పడుతుంది. ఇక సినిమాల్లో నాకు పూర్తి స్థాయి మార్షల్ ఆర్ట్స్ చేసే పాత్ర వస్తే హ్యాపీగా చేసేస్తాను.

క్రమశిక్షణకు కళ

కళ ఏదైనా సరే క్రమశిక్షణకు ఉపయోగపడుతుంది. అసలు ఆర్టిస్ట్ (యాక్టింగ్) అంటేనే క్రమశిక్షణ ఉండాలి. మార్షల్ ఆర్ట్స్ వల్ల నా ఆలోచనా విధానం మారింది. ఏదైనా విషయం గురించి నిదానంగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకుంటున్నాను. మార్షల్ ఆర్ట్స్ అంటే శరీరాన్ని మాత్రమే కాదు... మనసుని కూడా క్రమ పద్ధతిలో పెడుతుంది. అలాగే మార్షల్ ఆర్ట్స్ అంటే మీద పడి కొట్టడం కాదు... మనల్ని మనం రక్షించుకోవడం. ఈ ఆర్ట్ నేర్చుకున్న ఎవరైనా సరే ముందు చాలావరకు నియంత్రించడానికే ప్రయత్నిస్తారు... అయితే లిమిట్ దాటితే అప్పుడు కొడతాం.





బ్యాడ్ టచ్... టీచ్ హిమ్

నా చిన్నప్పుడు ఒక అబ్బాయితో చాలా గట్టిగా గొడవ జరిగింది. ఆ అబ్బాయి నన్ను ఏమీ అనలేదు. తను నా ఫ్రెండ్. పిల్లల గొడవలుంటాయి కదా... అలాంటిది. నేను తిరగబడి బాగా కొట్టాను. నన్ను కూడా బాగా కొట్టాడు (నవ్వుతూ). కిడ్స్ ఫైట్ అన్న మాట. ఆ తర్వాత నా టీనేజ్‌లో నేను నడుచుకుంటూ వెళుతున్నప్పుడు ఒక అబ్బాయి 'బ్యాడ్ టచ్' చేశాడు. అమ్మాయే కదా ఎలా బిహేవ్ చేసినా ఏమీ అనదనే ధైర్యం వారికి ఉంటుంది. నేను అతన్ని నా మార్షల్ ఆర్ట్స్ టెక్నిక్‌తో లాక్ చేశాను. బ్యాడ్ టచ్ చేస్తే టీచ్ చేయాల్సిందే. అమ్మాయిలు ఇలా చేస్తే ఓ ఎవేర్‌నెస్ వస్తుంది. అమ్మాయిలకు కూడా అన్నీ తెలుస్తున్నాయి... తిరగబడతారనే ఫీలింగ్ సొసైటీలో క్రియేట్ చేయగలిగితే దాడులు తగ్గుతాయని నా ఫీలింగ్.



సెల్ఫ్ డిఫెన్స్ ముఖ్యం

నాకు గాయాలంటే చాలా ఇష్టం. ఎందుకంటే గాయాలు తగిలిన ప్రతిసారీ 'మనం ఏదో చేస్తున్నాం' అనే ఫీలింగ్ నాకు ఆనందాన్నిస్తుంటుంది. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకునే క్రమంలో చాలాసార్లు తగిలాయి. ఇక కలరి అయినా, కరాటే అయినా ఏదైనా ఫస్ట్, సెకండ్ స్టేజ్ చాలా స్లోగా ఉంటుంది. త్వరగా నేర్చేసుకోవాలనే ఉత్సాహం ఉంటుంది కదా... అందుకని బోర్ ఫీలవుతాం. కొంతమంది అమ్మాయిలైతే ఒకటీ రెండు క్లాసులకు వచ్చి, మా వల్ల కాదని వెళ్లిపోయారు. కానీ నిదానం అవసరం. అయితే ఆ ఫస్ట్ స్టెప్ మనం ఓపికగా ఉంటే మన లాస్ట్ స్టెప్ బ్యూటిఫుల్‌గా ఉంటుంది. కొందరైతే ఈ కష్టం మావల్ల కాదనుకున్నారు. కానీ, కొన్నేళ్లు కష్టపడి నేర్చుకున్న ఆర్ట్ మన జీవితాంతం మనకు ఉపయోగపడుతుంది. ఫైనల్లీ నేను చెప్పొచ్చేదేంటంటే... అమ్మాయిలు ఎవరి మీదా ఆధారపడకపోవడం అనేది 'ఆర్థిక స్వాతంత్ర్యం' విషయంలో మాత్రమే కాదు... మన మీద జరిగే దాడుల విషయంలోనూ డిపెండ్ కాకూడదు. 'సెల్ఫ్ డిఫెన్స్' చాలా ఇంపార్టెంట్.

– డి.జి. భవాని

● విజయపథం

బంజరు భూమి బంగారం అయింది

దిల్లీలో ఉంటున్న రీవా సూద్ తాను వ్యవసాయం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. క్యాన్సర్ బారిన పడిన భర్తను దృష్టిలో పెట్టుకొని రసాయన రహిత పంటలే లక్ష్యంగా హిమాచల్ ప్రదేశ్‌లోని స్వస్థలానికి వెళ్లిన రివా సూద్ బంజరు భూమిని డెబ్బైఎకరాల వ్యవసాయ క్షేత్రంగా మార్చి ఎంతో మంది మహిళలకు ఉపాధిని ఇచ్చింది. సంవత్సరానికి కోటి రూపాయల టర్నోవర్ సాధించింది...



కొన్ని సంవత్సరాల క్రితం తన భర్తకు క్యాన్సర్ అని నిర్ధారణ అయినప్పుడు రీవా సూద్ షాక్‌కు గురైంది. ఆ తరువాత 'ఎందుకు ఇలా?' అనే ఆలోచన ఆమెలో మొదలైంది. తన శోధనలో ఎన్నో విషయాలను తెలుసుకోగలిగింది. రసాయనాలతో నిండిన కూరగాయలు, పండ్లు క్యాన్సర్ కారకం అవుతున్నాయి.

ప్రాణం నిలపాల్సిన తిండే ప్రాణం తీస్తే ఎలా?! ప్రత్యామ్నాయం లేదా? అని ఆలోచించింది. చదువు, ఉద్యోగాల వల్ల హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన రీవా సూద్ కుటుంబం దిల్లీలో ఉంటుంది. రసాయనరహిత పంటలే లక్ష్యంగా సొంత రాష్ట్రానికి వెళ్లింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో తమకు వ్యవసాయభూములు ఉన్నప్పటికీ వాటిని సాగు చేయడం లేదు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న డ్రాగన్ పండ్లతో వ్యవసాయ ప్రస్థానం మొదలుపెట్టిన రీవా వ్యవసాయానికే పరిమితం కాలేదు. డ్రాగన్ పండ్లను నేచురల్ జ్యూస్‌గా మార్చి మార్కెటింగ్ చేసి విజయం సాధించింది.

డ్రాగన్ పండ్ల ప్రాసెసింగ్ ద్వారా హిమాచల్ ప్రదేశ్, హరియాణ, పంజాబ్, ఉత్తరాఖండ్‌లోని 300 మంది మహిళలకు ఉపాధి కల్పించింది. డ్రాగన్ పండ్లతో పాటు అశ్వగంధ, మోరింగా, ఇతర మూలికలను సాగు చేస్తోంది. రకరకాల వనమూలికలను సాగు చేయడం వల్ల ఆదాయం మాట ఎలా ఉన్నా వ్యవసాయ జ్ఞానం మాత్రం పెరిగింది. తమ రసాయన రహిత డ్రాగన్ పండ్లను 'అగ్రీవ నేచురల్లీ' పేరుతో గ్లోబల్ మార్కెట్‌లోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తోంది రీవా సూద్.

● సమ్‌థింగ్ స్పెషల్

డయాబెటీస్ బార్బీ!



చిక్ బ్లూ పోల్కా-డాట్ క్రాప్ టాప్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్న ఈ బార్బీ, టైప్ 1 డయాబెటిస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తొలి బొమ్మగా చరిత్రలో నిలిచి పోనుంది. నడుముకు ఇన్సులిన్ పంపు, భుజానికి కంటిన్యుయెస్ గ్లూకోజ్ మానిటర్(సిజీఎం)తో ఈ బార్బీ ప్రత్యేకంగా కనిపిస్తుంది. టైప్1 డయాబెటీస్‌తో ఇబ్బంది పడుతున్న అమెరికాలోని 3,04,000కు పైగా పిల్లలు, టీన్స్ అనుభవాలను ప్రతిఫలించేలా ఈ బార్బీని రూపొందించారు. ఈ బార్బీ ప్రత్యేకత రియలిస్టిక్ టూల్స్. టైప్ 1 డయాబెటీస్ బాధితులు ఉపయోగించే సిజీఎం లాంటివి కనిపిస్తాయి. 175 రకాల బొమ్మలను తయారు చేసింది ఫ్యాషనిస్తా లైన్. ఇందులో ప్రోస్థెటిక్ లింబ్స్, హియరింగ్ ఎయిడ్స్‌తో కనిపించే బార్బీలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా డౌన్స్ సింద్రోమ్, బ్లైండ్ బార్బీలు అమ్మకాలలో టాప్‌లో ఉన్నాయి.

హెల్త్

● సరిగా కూర్చోండి

సిట్ రైట్



ఇవ్వాళ అన్నీ కూర్చుని చేసే ఉద్యోగాలే. ఒకప్పటిలాగా గొంతుక్కూచుని కలుపు తీస్తూనో, నిలబడి పొలంలో మందులు చల్లుతూనో, మాటిమాటికీ ఒళ్లు కదిలిస్తూ ఒళ్లు అలిసేలా కష్టపడి పనిచేస్తూనో ఉండే ఉద్యోగాలు లేవు. అది ఏరకమైన పని అయినప్పటికీ గంటలకొద్దీ కూర్చోవాల్సిందే. ఇక్కడ ఇంకా దురదృష్టం ఏమిటంటే ఇలా కూర్చోవడంలో కూడా మన వెన్నుకు అలసట లేకుండా, దానికి నష్టం జరగకుండా పనిచేయడమెలాగో మనలో చాలామందికి తెలియకపోవడం. దాంతో మన కూర్చునే భంగిమ సరిగాలేక వెన్నునొప్పి, నడుము నొప్పి, మెడ పట్టేయడం, నరం నొక్కుకుపోవడం... ఇలాంటి సమస్యలెన్నో. ఈ నేపథ్యంలో అసలు నిటారుగా / సరిగా కూర్చోలేకపోవడంతో వచ్చే సమస్యలేమిటో, సరిగా కూర్చోవడం అంటే ఎలాగో తెలుసుకుందాం...

సరైన భంగిమలో కూర్చోవడం అంటే వెన్ను మీద చాలా తక్కువ భారం మాత్రమే పడేలా కూర్చోవడం. కూర్చున్న సమయంలో ఎలా పడితే అలా ఒంగడం, వెన్నును నిటారుగా ఉంచకపోవడం లాంటి అంశాలతో దీర్ఘకాలంలో వెన్ను, నడుము నొప్పి వస్తుంది. ఈ నేపథ్యంలో సరిగా కూర్చోకపోతే వెన్నుపై ఎలాంటి దుష్ప్రభావాలు పడతాయో చూద్దాం.

సరిగా కూర్చోకపోవడం వల్ల వెన్నుపై దుష్ప్రభావాలు ఎందుకంటే...

వెన్ను ఓ గడకర్రలా లేదా ఒక పైప్‌లా తిన్నగా ఉండదు. అది దాదాపు ఇంగ్లిష్ 'ఎస్' అక్షరం షేప్‌లో కొన్ని ఒంపులతో ఉంటుంది. ఇందులో ఈ ఒంపులు మూడు భాగాల్లో ఉంటాయి. మొదట మెడ భాగంలోని 'సెర్వికల్' అని పిలిచే ఏడు వెన్ను ఎముకలు 'పుటాకారం' (కాన్‌కేవ్) షేపులో ఉంటాయి. ఆ తర్వాత ఎదురొమ్ముకు వెనక (వీపు) భాగంలో ఉండే థొరాసిక్ (మిడ్ బ్యాక్‌లో) ఎముకలు కుంభాకారంలోలా (కాన్‌వెక్స్) బయటివైపునకు ఒంగి ఉంటాయి. ఆ తర్వాత మళ్లీ నడుము భాగంలో ఉండే లంబార్ ఎముకలు లోపలి వైపునకు ఒంగి ఉంటాయి. చివర టెయిల్ బోన్ ఎముకలు మళ్లీ కాస్తంత బయటివైపునకు ఒంగి ఉంటాయి. వెన్నెముక ఇలా విల్లు ఆకృతిలో ఒక నిర్దిష్టమైన షేప్‌లో ఉంటుంది. మనం సరిగా కూర్చోకపోవడం వల్ల లేదా తప్పుడు భంగిమల్లో కూర్చోవడం వల్ల ఈ నిర్దిష్టమైన వెన్నెముక షేపు... అదే భంగిమలో నిర్వహితం కాకపోవడంతో అనేక దుష్ప్రభావాలు చోటు చేసుకుంటాయి. ఉదాహరణకు అనేక పూసలుగా పూసలుగా ఉండి, ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉండే వెన్నెముక షేపు అదే ఆకృతిలో కొనసాగలేకపోవడం, ఈ పూసలపై పడే ఒత్తిడి కారణంగా ఒక పూసకూ, మరో పూసకూ మధ్య కుషన్‌లా ఉండే డిస్క్ పక్కకు తొలగడం, అది అలా పక్కకు తొలగినప్పుడు... ఆ పూసల మధ్యనుండి బయటకు వచ్చే నరాలపై ఒత్తిడి పడి ఆ నరం సప్లై అయ్యే అవయవం దగ్గర తీవ్రమైన నొప్పి రావడం, వెన్నుకు అనుసంధానమై ఉండే కండరాలు దెబ్బతినడం, వెన్ను సరిగా నిర్వహితం కాకపోవడంతో వెన్నెముక షేపు (స్పైనల్ అలైన్‌మెంట్) బాలెన్స్ తప్పడం లాంటి అనర్థాలు చోటు చేసుకునే అవకాశముంది.

కూర్చోవడంలో మనం చేసే పొరబాట్లేమిటి, వాటిని సరిదిద్దుకోవడం ఎలా?

మనం కూర్చునే సమయంలో చేసే పొరబాట్లు, వాటిని సరిదిద్దుకోవడం ఎలాగో చూద్దాం. వీటిని సమస్య తాలూకు నివారణ చర్యలుగా పరిగణించవచ్చు.

పొరబాటు : డెస్క్‌పై ముందుకు ఒంగినట్లుగా కూర్చోవడం.
దిద్దుబాటు : ఇలా ఒంగినట్లుగా కాకుండా వెన్ను నిటారుగా ఉండేలా కూర్చోవడం.
పొరబాటు : మెడను బిగదీసినట్లుగా (స్టిఫ్‌గా) గంటల కొద్దీ అలాగే ఉండటం.
దిద్దుబాటు : మెడను చాలాసేపు స్టిఫ్‌గా ఉంచకుండా కొద్దికొద్దిసేపటికి కదిలిస్తూ ఉండటం.
పొరబాటు : కాళ్లను చాలాసేపు ఒకదానిపై మరొకటి వేసి క్రాస్‌చేసినట్లు కూర్చోవడం.
దిద్దుబాటు : కాళ్లను క్రాస్ చేయకుండా రిలాక్స్‌డ్‌గా విడిచేసినట్లు కూర్చోవడం.
పొరబాటు : కూర్చున్నప్పుడు ఒకపక్కకు (కుడివైపునకో లేదా ఎడమవైపునకో) ఒరిగిపోయినట్లుగా కూర్చోవడం.
దిద్దుబాటు : కూర్చున్నప్పుడు ఎటూ ఒరగకుండా నిటారుగా, రిలాక్స్‌డ్‌గా కూర్చోవడం.
పొరబాటు : వెన్నుకు ఎలాంటి సపోర్ట్ లేకుండా స్టూల్‌పై కూర్చునట్లుగా కూర్చోవడం.
దిద్దుబాటు : వెన్నుకు మంచి సపోర్ట్‌తో కాస్త వెనక్కువాలి, దేహానికి ఇబ్బంది కలగని యాంగిల్‌లో కూర్చోవడం. ఈ వెనక్కు వంగే యాంగిల్... మరీ ఎక్కువగానూ, మెడను నిటారుగా ఉంచడంలో ఇబ్బంది కలగనంత మాత్రమే ఉండాలి.

కూర్చునే సమయంలో దేహంపై ఒత్తిడి వీలైనంత తక్కువగా పడేలా శరీర భంగిమలు ఉండేలా కుర్చీలు, ఇతరత్రా పరికరాల తయారీతో పాటు అలా తక్కువ ఒత్తిడితో కూర్చునేలా చేసే ప్రక్రియలను 'ఎర్గానమిక్స్' అంటారు. ఈ ఎర్గానమిక్స్ పాటిస్తూ కూర్చోవడంతో పాటు ఇక్కడ పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తే వెన్నుపై భారం చాలా తక్కువగా పడి, వెన్నెముక, వెన్నుపూసలూ, డిస్క్, నరాలపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.

తప్పుడు భంగిమల్లో కూర్చోవడం వల్ల దేహానికి కలిగే అనర్థాలు

కొందరు కూర్చునే సమయంలో తప్పుడు భంగిమల్లో కూర్చుంటారు. ఉదాహరణకు డెస్క్‌టాప్ కంప్యూటర్‌పై పనిచేసే కొందరు ముందుకు ఒంగి కూర్చునే అవకాశముంటుంది. అలా తప్పుడు పోష్చర్‌లో కూర్చునే వారిలో వెన్నెముకపై ఒత్తిడి పడటం వల్ల కనిపించే కొన్ని లక్షణాలివి...

- వెన్నుతో అనుసంధానితమై ఉండే కండరాల అలసట, దాంతో కండరాల నొప్పులు
- తప్పుడు భంగిమల్లో కూర్చోవడం వల్ల వెన్నుపూసలు తొలగడంతో... వాటి మధ్య నుంచి బయటకు వచ్చే నరాలపై ఒత్తిడి పడి తీవ్రమైన నొప్పి.
- సరైన భంగిమలో కూర్చోకపోవడంతో వెన్నుపూసలపై ఒత్తిడి కారణంగా... వాటి మధ్యన ఉండే కుషన్‌లాంటి డిస్క్ బయటకు జారడం (హెర్నియేటెడ్ డిస్క్స్)
- దేహంలో వెన్నుపాము నుంచి కాలి చివరల వరకు వెళ్లే అత్యంత పొడవైన సయాటికా నరం... ఒత్తిడికి గురికావడంతో నడుము దగ్గర నుంచి కాలివరకు పాకుతూ ఉండి బాధించే అత్యంత తీవ్రమైన నొప్పి.
- మెడ దగ్గర వెన్ను తాలూకు (సర్వైకల్) ఎముకల అరుగుదల వల్ల భుజాల నుంచి చేతుల వరకు వెళ్లే నరాలపై ఒత్తిడి పడి మెడ వెనక భాగం నుంచి భుజాలు, చేతుల వరకు తీవ్రమైన నొప్పి.
- నడుము (లంబార్) భాగంలోని డిస్క్‌లపై పడే ఒత్తిడి కారణంగా వచ్చే తీవ్రమైన నడుము నొప్పి (లంబార్ పెయిన్).

మొదట్లో చిన్నపాటి నొప్పిగా కనిపించే సమయంలోనే కూర్చునే భంగిమ (సిట్టింగ్ పోష్చర్)ను సరిదిద్దకపోవడం వల్ల అది దీర్ఘకాలంలో నరం అంకురం నుంచి మొదలైన నొప్పి క్రమంగా తీవ్రతరమవుతూ... ఆ నరం సప్లై అయ్యే అవయవం వరకు పాకుతూ పోయే నొప్పి (రేడియేటింగ్ పెయిన్)గానూ, అలాగే అది సప్లై అయ్యే అవయవం చివరన మొద్దుబారిపోతూ, తిమ్మిర్లు పట్టినట్టుగా బాధిస్తూ ఉంటుంది. ఉదాహరణకు సర్వైకల్ నొప్పిలో మెడ వెనక భాగం నుంచి మొదలైన నొప్పి భుజాలూ, చేతుల మీదుగా వేలి చివరల వరకూ పాకుతూ... వేలి చివరల్లో తిమ్మిర్లూ, వేళ్ల చివర మొద్దుబారి స్పర్శ తెలియకపోవడం... ఇలాంటి ఎన్నో సమస్యలు కనిపించవచ్చు.

కూర్చువడం అంటే అది అందరికీ తెలిసిన అంశమే అని చాలామంది అనుకుంటారు. కానీ భవిష్యత్తులో నొప్పులు రాకుండా, వెన్నుకు నష్టం కాకుండా ఎర్గానమికల్‌గా ప్రయోజనం ఉండేలా కూర్చోవడం చాలామందికి తెలియదు. అలా సరైన భంగిమలో కూర్చోవడం ఎలాగో తెలుసుకోవడం ద్వారా మెడ, వెన్ను, నడుము నొప్పులను నివారించుకోవడమే కాకుండా... భవిష్యత్తులో పరిస్థితిని శస్త్రచికిత్స వరకు తీసుకెళ్లకుండా కాపాడుకున్నట్లు అవుతుందని అందరూ తెలుసుకోవాల్సిన అవసరముంది.

చికిత్స

తొలుత పోష్చర్ కరెక్షన్ కోసం న్యూరోఫిజీషియన్లు, స్పైన్ స్పెషలిస్టులు, ఆర్థోపెడిక్ నిపుణుల ఆధ్వర్యంలో జరిగే వర్క్‌షాపులకు హాజరై సరిగా కూర్చోవడం ఎలాగో తెలుసుకోవాలి.

కూర్చువడంలో పోష్చర్ దిద్దుబాటు చర్యలు తీసుకున్న తర్వాత కూడా నొప్పి వస్తుంటే మొదట ఫిజియోథెరపిస్టుల ఆధ్వర్యంలో వెన్ను ఎముకలు, కండరాలు బలపడేలా కొన్ని వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది.

అటు ఆ వ్యాయామాలు చేయిస్తూనే తాత్కాలికంగా నొప్పి నివారణ మాత్రలు ఇస్తారు.

ఇంకా నొప్పి తగ్గకపోతే ఎమ్మారై, స్పైన్ ఇమేజింగ్ పరీక్షల తర్వాత డాక్టర్లు / న్యూరో స్పెషలిస్టులు అవసరమైన మందులు సూచించడం. అప్పటికీ నొప్పి తగ్గకపోతే అవసరాన్ని బట్టి తగిన శస్త్రచికిత్సలను సూచిస్తారు.



డాక్టర్ వోలేటి సూర్య ప్రకాష్ రావు
సీనియర్ ఆర్థోపెడిక్ & స్పైన్ సర్జన్

● ఫ్రూట్స్ & వెజిటబుల్స్

చైల్డ్ డైట్

చిన్న పిల్లలు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు అన్ని పోషకాలు ఉండే సమతులాహారం అవసరం. అయితే చాలా మంది చిన్న పిల్లలు కూరగాయలు, ఆకుకూరలతో ఇష్టంగా అన్నం తినరని, అవి తినడానికి వారు మారాం చేస్తుంటారనేది దాదాపు పేరెంట్స్ అందరూ చేసే ఫిర్యాదు. డాక్టర్ల దగ్గర తల్లిదండ్రులు తరచూ ఈ కంప్లెయింట్ చేస్తుంటారు.

ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు కొన్ని చిన్నపాటి జాగ్రత్తలతో వారు తినేలా చేయవచ్చు. ఆకుకూరలు, కాయగూరలు తినడం ఇష్టం లేదనే పిల్లలకు కూరగాయలన్నీ కలగలిపి చేసే... గ్రిల్డ్ వెజిటబుల్ శాండ్‌విచ్, వెజిటెబుల్ ఆమ్లెట్ లాంటివి తయారు చేసి ఇవ్వవచ్చు. ఇవి రుచిగా ఉండటంతో పాటు అన్ని రకాల వెజిటబుల్స్, ఆకుకూరలు కలిసి ఉండటంతో పోషకాలన్నీ వారికి అందుతాయి.



ఒకవేళ పిల్లలు అన్నానికి బదులు నూడుల్స్ ఇష్టంగా తినేట్లయితే... అన్ని రకాల కూరల ముక్కలను నూడుల్స్‌తో కలిపి వండి ఇవ్వవచ్చు. అన్నంతో లేదా నూడుల్స్‌తో గుడ్డు/ఆకుకూరలు/కాయగూరలు కలగలిపి వెజ్‌ఫ్రైడ్ రైస్ /ఫ్రైడ్ నూడుల్స్ చేసి తినిపించవచ్చు.

ఇక మాంసాహారం తినేవారు, చికెన్, మటన్, చేపలతో చేసిన కూరలు పెట్టవచ్చు. సాధారణంగా పిల్లలు అవి ఇష్టంగానే తింటారు. దాంతోపాటు లెగ్యూమ్స్ (దాల్స్), బాదాం, జీడిపప్పు, వాల్‌నట్ వంటి నట్స్ ఇవ్వాలి, వాటిలో ప్రొటీన్స్, విటమిన్స్ ఎక్కువగా ఉంటాయి కాబట్టి అందాల్సిన పోషకాలు లభిస్తాయి.

పండ్లు తినని పిల్లలకు వాటిని ముక్కలుగా కోసి కస్టర్డ్‌తో/ఐస్‌క్రీమ్‌తో కలిపి ఇవ్వడం, ఫ్రూట్ సలాడ్స్ రూపంలో అందించవచ్చు లేదా జ్యూస్‌గా తీసి ఇవ్వవచ్చు. పండ్లు తినని పిల్లలు కూడా పండ్ల రసాలను ఇష్టంగా తాగుతారు. ఇక పిల్లలు పాలు తాగకపోతే వారికి మిల్క్ షేక్ తయారు చేసి ఇవ్వవచ్చు.





ఆర్చరీ ప్రపంచకప్‌లో జ్యోతి సురేఖ 'హ్యాట్రిక్'

మాడ్రిడ్: ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచకప్‌లో 'హ్యాట్రిక్' పతకాలు సాధించింది. అయితే కాంపౌండ్‌లో తృటిలో రెండు స్వర్ణావకాశాల్ని చేజార్చుకుంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఒక్కో రజతం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం గెలుచుకుంది. కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో జ్యోతి 147–148తో ఎలా గిబ్సన్ (బ్రిటన్) చేతిలో పాయింట్ తేడాతో ఓడి రజతంతో తృప్తి పడింది. మరో కాంపౌండ్ టీమ్ ఈవెంట్ స్వర్ణ పతక పోరులో జ్యోతి, పర్ణీత్ కౌర్, ప్రీతికలతో కూడిన భారత జట్టు 225–227తో చైనీస్ తైపీకి చెందిన హువంగ్ జొ, చెన్ యి సున్, చియు యు ఎర్ చేతిలో పరాజయం చవిచూసింది. మొదట 57–57తో తైపీ త్రయాన్ని నిలువరించిన భారత జట్టు... 58–56తో, 55–56తో మూడు రౌండ్లు ముగిసేసరికి 170–169తో ఆధిక్యంలో నిలిచింది. కానీ ఆఖరి నాలుగో రౌండ్లో గురి కుదరక రజతంతో సరిపెట్టుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో జ్యోతి సురేఖ (ఏపీ)–రిషభ్ యాదవ్ (హరియాణా) జోడీ 156–153తో పాలో కొరాడో–డగ్లస్ నొలాస్కో (ఎల్ సాల్వడోర్) జంటపై గెలిచింది.

వింబుల్డన్ క్వీన్ స్వియాటెక్


స్వియాటెక్

ఫైనల్లో అనిసిమోవాపై ఘన విజయం

- 6–0, 6–0తో అమెరికా ప్లేయర్ చిత్తు
- కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ సాధించిన పోలండ్ స్టార్


అనిసిమోవా

లండన్: పోలండ్ స్టార్ ఇగా స్వియాటెక్ అసాధారణ ఆటతో వింబుల్డన్‌లో విజయకేతనం ఎగురవేసింది. గ్రాస్ కోర్టుపై తిరుగులేని ప్రదర్శన కనబర్చిన ఇగా 2025 వింబుల్డన్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్లో ఎనిమిదో సీడ్ స్వియాటెక్ 6–0, 6–0తో 13వ సీడ్ అమందా అనిసిమోవా (అమెరికా)ను చిత్తు చిత్తుగా ఓడించింది. కేవలం 57 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో స్వియాటెక్ ముందు అమందా ఏమాత్రం నిలవలేకపోయింది. స్వియాటెక్ కెరీర్‌లో ఇది తొలి వింబుల్డన్ టైటిల్ కాగా...ఓవరాల్‌గా ఇది ఆరో గ్రాండ్‌స్లామ్. ఈ గెలుపుతో మూడు సర్ఫేస్ (హార్డ్, క్లే, గ్రాస్)లలోనూ గ్రాండ్‌స్లామ్ నెగ్గిన ప్లేయర్‌గా స్వియాటెక్ గుర్తింపు పొందింది. నాలుగు ఫ్రెంచ్ ఓపెన్‌లు, ఒక యూఎస్ ఓపెన్ ట్రోఫీ నెగ్గిన పోలండ్ స్టార్ కెరీర్‌లో ఇక ఆస్ట్రేలియన్ ఓపెన్ మాత్రమే మిగిలి ఉంది.

ఫటాఫట్...

మ్యాచ్‌కు ముందు మాజీ వరల్డ్ నంబర్‌వన్ స్వియాటెక్‌పై సహజంగానే గెలుపు అంచనాలు ఉన్నాయి. అయితే సెమీస్‌లో వరల్డ్ నంబర్‌వన్ సబలెంకాపై సంచలన విజయం సాధించిన అనిసిమోవా గట్టి పోటీనిస్తుందని అంతా భావించారు. అయితే పోలండ్ స్టార్ ముందు అమెరికన్ ప్లేయర్ ఆటలు ఏమాత్రం సాగలేదు. తొలి సెట్‌లో ఏకంగా 14 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేసిన అనిసిమోవా... రెండో సెట్‌లోనూ మరో 14 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్‌తో ప్రత్యర్థికి మ్యాచ్‌ను అప్పగించింది. తొలి ఫైనల్ ఆడుతున్న ఒత్తిడి అమెరికన్‌లో కనిపించగా...స్వియాటెక్ మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయింది. 3 ఏస్‌లు సంధించిన పోలండ్ ప్లేయర్ ప్రత్యర్థి సర్వీస్‌ను 6 సార్లు బ్రేక్ చేసింది. ఆరో గ్రాండ్‌స్లామ్‌తో ఇగా విజయగర్జన చేయగా... ఓటమి అనంతరం అనిసిమోవా కన్నీళ్లపర్యంతమైంది. 2018లో స్వియాటెక్ బాలికల సింగిల్స్‌లో వింబుల్డన్ టైటిల్ నెగ్గింది.

6 స్వియాటెక్ కెరీర్‌లో ఇది ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్

100 గ్రాండ్‌స్లామ్‌లో స్వియాటెక్‌కు ఇది వందో విజయం. 2019లో తొలి సారి బరిలోకి దిగిన ఆమె 120 మ్యాచ్‌లలో 100 గెలిచింది.


114 వింబుల్డన్ ఫైనల్ ఇలా 6–0, 6–0 (డబుల్ బీగెల్)తో ముగియడం 114 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1911 వింబుల్డన్ ఫైనల్లో డొరొతియా లాంబర్ట్ 6–0, 6–0తో డొరా బుత్బైని ఓడించింది. 1988 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో స్టెఫీగ్రాఫ్ 6–0, 6–0తో నటాషా జ్వెరెవాను చిత్తు చేసింది.

నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్
అల్కరాజ్ (స్పెయిన్) X సినెర్ (ఇటలీ)
రాత్రి గం. 8:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సరిగ్గా... సమంగా...


రాహుల్


జడేజా

లార్డ్స్ మైదానంలో మూడు రోజు ఆట సమంగా ముగిసింది...భారత బ్యాటర్లు పట్టుదలగా నిలబడగా, ఇంగ్లండ్ కూడా కీలక సమయాల్లో వికెట్లతో మ్యాచ్‌లో నిలిచింది. సరిగ్గా ఇంగ్లండ్ చేసిన స్కోరునే భారత్ కూడా తొలి ఇన్నింగ్స్‌లో చేసింది. తొలి సెషన్‌లో రాహుల్–పంత్‌ల భాగస్వామ్యం, రెండో సెషన్‌లో జడేజా, నితీశ్ కుమార్ రెడ్డిల నిలకడ... భారత్ దీటైన స్కోరు చేసేందుకు దోహదం చేసింది. మూడు రోజులైనా ఎవరి పైచేయి ఖరారు కానీ ఈ 'లార్డ్స్' టెస్టును నేటి నాలుగో రోజే అటో... ఇటో... తేల్చనుంది. నిర్జీవమైన పిచ్‌పై రెండు రోజుల్లో 20 వికెట్లు సాధ్యమా అనేది సందేహమే! డ్రా కు, డ్రామాకు నేడు, రేపు రసవత్తర పోరు జరగనుంది.

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కూడా 387కే ఆలౌట్

- కేఎల్ రాహుల్ సెంచరీ
- రాణించిన పంత్, జడేజా
- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 2/0

లండన్: బుమ్రా తన బౌలింగ్‌తో కూలగొట్టిన ప్రదర్శనకు దీటుగా భారత బ్యాటర్లు తలబడ్డారు. ఇంగ్లండ్‌ను సమష్టిగా ఎదుర్కొన్నారు. మూడో రోజంతా ఆడటంలో సఫలమైన టీమిండియా సరిగ్గా... సమానంగా ఇంగ్లండ్ చేసిన స్కోరే చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 119.2 ఓవర్లలో 387 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (177 బంతుల్లో 100; 13 ఫోర్లు) సెంచరీ సాధించాడు. రిషభ్ పంత్ (112 బంతుల్లో 74; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (131 బంతుల్లో 72; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 3, జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొక్కుబడిగా ఆడిన ఇంగ్లండ్ ఒక ఓవర్లో వికెట్ నష్టపోకుండా 2 పరుగులు చేసింది. క్రాలీ (2 బ్యాటింగ్), డకెట్ (0) క్రీజులో ఉన్నారు. మూడో రోజు మరిన్ని ఓవర్లు ఆడేందుకు ఏమాత్రం ఇష్టపడని ఓపెనర్లు అదే పనిగా బుమ్రా ఓవర్‌ను ఎదుర్కొనేందుకు తాత్సారం చేశారు. దీంతో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఇంగ్లండ్ ఓపెనర్ల తీరును తప్పుబట్టాడు.

రిషభ్ పంత్ ఫిఫ్టీ

ఓవర్‌నైట్ స్కోరు 145/3తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ తొలి సెషన్‌లో ఆతిథ్య బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంది. పిచ్ సహకారంతో ఓపెనర్ రాహుల్, రిషభ్ పంత్ సాధికారికంగా ఆడారు. దీంతో ఆరంభంలోనే వికెట్ తీసి పట్టుబిగిద్దామనుకున్న ఇంగ్లండ్ ఆశలేవీ ఫలించలేదు. బౌలర్లను మార్చినా, స్పిన్‌ను ప్రయోగించినా ఈ జోడీ మాత్రం నింపాదిగానే పరుగులు రాబట్టింది. దీంతో ఈ సెషన్ అసాంతం భారత్‌దే పైచేయి అయింది. ఇద్దరు ఆచితూచి ఆడుతూనే, వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. రాహుల్, రిషభ్‌ల సమన్వయంతో పరుగుల రాకకు ఏ దశలోనూ ఇబ్బంది లేకపోయింది. చూస్తుండగానే జట్టు స్కోరు 200కు చేరింది. ఎట్టకేలకు లంచ్ విరామానికి ముందు ఇంగ్లండ్‌కు పంత్ వికెట్ రూపంలో ఓదార్పు లభించింది. లేని పరుగుకు ప్రయత్నించిన రిషభ్... స్టోక్స్ విసిరిన డైరెక్ట్ త్రోకు వికెట్‌ను సమర్పించుకున్నాడు. ఐదు మంది బౌలర్ల వల్ల కాని పనిని స్టోక్స్ ఒక్క త్రోతో విడగొట్టేశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అతని వికెట్ పడిన 248/4 స్కోరు వద్దే లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. రాహుల్ శతకానికి 2 పరుగుల దూరంలో నిలిచాడు.

రాహుల్ శతక్కొట్టిన వెంటనే...

రెండో సెషన్‌లో రాహుల్‌తో కలిసి జడేజా క్రీజులోకి వచ్చాడు. రాహుల్ సెంచరీ చేశాడన్న ఆనందం అతను అవుటవడంతోనే ఆవిరైంది. 176 బంతుల్లో సెంచరీ పూర్తిచేసుకున్న కేఎల్ రాహుల్... తర్వాత ఒక్క పరుగైన చేయకుండా నిష్క్రమించాడు. టెస్టుల్లో రాహుల్‌కిది పదో సెంచరీ కాగా... క్రికెట్ మక్కా లార్డ్స్‌లో రెండో శతకం. 2021–22 సీజన్‌లోనూ అతను శతక్కొట్టాడు. కాగా అతని వికెట్ ఇంగ్లండ్ శిబిరానికి పెద్ద సాఫల్యం. అదృష్టం కొద్ది సులువైన రనౌట్ల నుంచి నితీశ్ బతికిపోవడం జట్టుకు కాస్త ఊరటనిచ్చింది. లేదంటే బ్యాటింగ్ చేసే సామర్థ్యమున్న నితీశ్ వికెట్ కూడా భారత్ కోల్పోయేది. జడేజాకు జతగా నితీశ్ కుమార్ (30; 4 ఫోర్లు) విలువైన పరుగులు చేయడంతో జట్టు స్కోరు 300 దాటింది. 316/5 స్కోరు వద్ద ఈ సెషన్ ముగిసింది.

జడేజా అర్ధ సెంచరీ

టి విరామం తర్వాత కాసేపటికే నితీశ్ వికెట్‌ను పారేసుకున్నాడు. స్టోక్స్ బంతిని ఎదుర్కోవడంలో పొరపడిన నితీశ్ కీపర్ స్మిత్ చేతికి క్యాచ్ అప్పజెప్పి వెళ్లాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ (23; 1 ఫోర్, 1 సిక్స్) అండతో జడేజా 87 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. వీళ్లిద్దరి జోడీ కూడా ఆతిథ్య బౌలర్లను దీటుగా ఎదుర్కోవడంతో వికెట్ తీసేందుకు ఇంగ్లండ్ బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. ఏడో వికెట్‌కు సరిగ్గా 50 పరుగులు జతయ్యాక జడేజా అవుటయ్యాడు. ఇతను అవుటైన 11 పరుగుల వ్యవధిలోనే ఆకాశ్ దీప్ (7), బుమ్రా (0) సుందర్ వికెట్లను కోల్పోవడంతో భారత్ సరిగ్గా 387 పరుగుల వద్దే ఆలౌటైంది.


స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలిఇన్నింగ్స్: 387; భారత్ తొలిఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (సి) బ్రూక్ (బి) బషీర్ 100; కరుణ్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; శుబ్‌మన్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ రనౌట్ 74; జడేజా (సి) స్మిత్ (బి) వోక్స్ 72; నితీశ్ రెడ్డి (సి) స్మిత్ (బి) స్టోక్స్ 30; సుందర్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 23; ఆకాశ్ (సి) బ్రూక్ (బి) కార్స్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) వోక్స్ 0; సిరాజ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (119.2 ఓవర్లలో ఆలౌట్) 387. **వికెట్ల పతనం:** 1–13, 2–74, 3–107, 4–248, 5–254, 6–326, 7–376, 8–385, 9–387, 10–387. **బౌలింగ్:** వోక్స్ 27–5–84–3, ఆర్చర్ 23.2–6–52–2, కార్స్ 24–5–88–1, స్టోక్స్ 20–4–63–2, బషీర్ 14.5–2–59–1, జో రూట్ 10.1–0–35–0.
ఇంగ్లండ్ రెండోఇన్నింగ్స్: క్రాలీ బ్యాటింగ్ 2; డకెట్ బ్యాటింగ్ 0; **మొత్తం** (1 ఓవర్లో వికెట్ నష్టపోకుండా) 2/0. **బౌలింగ్:** బుమ్రా 1–0–2–0.

సాక్షి సినిమా

టెక్నాలజీతో ఫైట్ చేయలేం


– సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్‌కుమార్



''సినిమా గ్రాండియర్‌గా ఉంటే ఆడియన్స్ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. 'బాహుబలి' సినిమా కంటే ముందు 'మగధీర' సినిమాను చెప్పుకునేవారు. అయితే సినిమా ఎంత గ్రాండియర్‌గా ఉన్నా, కొత్త ప్రపంచాలను సృష్టించినా, హ్యూమన్ ఎమోషన్స్ అనేవి కథలో చాలా ముఖ్యం. 'బాహుబలి' తర్వాత ఈ తరహాలో ఇతర ఇండస్ట్రీస్‌లోనూ సినిమాలొచ్చాయి. కానీ ప్రేక్షకుల ఎమోషన్స్‌కు కనెక్ట్ అయిన సినిమాలే విజయాలు సాధించాయి. 'జూనియర్' సినిమా కథలో ప్రేక్షకులను కదిలించే భావోద్వేగాలు నచ్చి, ఈ సినిమా ఒప్పుకున్నాను'' అని సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్‌కుమార్ అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా నటించిన చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ చిత్రం సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్‌కుమార్ చెప్పిన విశేషాలు.


- ఎవరైనా కొత్తవారిని పరిచయం చేస్తున్నప్పుడు సినిమాలో డ్యాన్స్, ఫైట్స్ ఉంటే చాలనుకుంటారు. కానీ ఫ్యామిలీ డ్రామా జానర్‌కి వెళ్లరు. అయితే కొత్త హీరోగా కిరీటి ఈ చాలెంజ్ తీసుకోవడం నాకు నచ్చింది. కిరీటి హార్డ్‌వర్కర్. యాక్టింగ్, డ్యాన్స్, ఫైట్స్... ఇలా అన్నీ బాగా చేశాడు. నిర్మాత సాయిగారితో 'ఈగ' సినిమా తర్వాత మళ్లీ ఈ సినిమా చేయడం హ్యాపీ. రాధాకృష్ణ క్లారిటీ ఉన్న దర్శకుడు.
- రాజమౌళిగారి 'ఛత్రపతి, యమదొంగ, బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్' వంటి సినిమాలకు నేను సినిమాటోగ్రాఫర్‌గా చేశాను. ఆ మధ్యలో 'విక్రమార్కుడు, మర్యాద రామన్న' వంటి సినిమాలకు నేను చేయలేదు. అలాగే ప్రస్తుతం రాజమౌళిగారి సినిమాకు (మహేశ్‌బాబు హీరోగా చేస్తున్న సినిమా) నేను సినిమాటోగ్రాఫర్‌గా చేయకపోవడం పట్ల షాకవ్వాల్సిన అవసరం లేదు. భవిష్యత్తులో మళ్లీ కలిసి పని చేస్తాం.
- రెండు దశాబ్దాల నా కెరీర్ సంతృప్తిగా ఉంది. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలకు పని చేయడం నా అదృష్టం. కొత్త టెక్నాలజీ నేర్చుకుంటూ అప్‌డేట్ అవుతుంటా. టెక్నాలజీతో ఫైట్ చేయలేం. సినిమాటోగ్రఫీ పైనే కాదు మొత్తం సినిమా ఇండస్ట్రీపైన ఏఐ (కృత్రిమ మేధ) ప్రభావం ఉంటుంది. మంచి ఉంది... చెడు ఉంది.
- ప్రస్తుతం నిఖిల్ 'స్వయంభూ' సినిమా చేస్తున్నాను. 'బాహుబలి' తరహాలో ఇది కూడా రాజుల కథ. అలాగే నిఖిల్ 'ది ఇండియా హౌస్' సినిమా చేస్తున్నాను. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు జరిగిన కథ ఇది. వీర్ సవార్కర్ నేపథ్యంలో కథ ఉంటుంది. ఐదారు లక్షల లీటర్ల వాటర్ ఉన్న ఓ ట్యాంకులో సముద్రం నేపథ్యంలో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరిపే ప్లాన్ చేశాం. కానీ సెట్స్‌లో వాటర్ ట్యాంకు పేలి, ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఏం కాలేదు.
- హాలీవుడ్‌లో ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరణ జరుగుతోంది. క్రిస్టోఫర్ నోలన్ వంటివారు అలా చేస్తున్నారు. ఓ సినిమాను ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించాలా? లేదా? అనేది ఆ సినిమా దర్శక–నిర్మాతల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఐమ్యాక్స్ కెమెరాతో చిత్రీకరించినప్పుడు హాలీవుడ్‌లో మంచి థియేటర్స్ దొరుకుతాయి. ఇక భవిష్యత్తులో దర్శకత్వం చేసే ఆలోచన ఉంది.

పవర్‌ఫుల్ గౌర్నాయుడు


శివ రాజ్‌కుమార్

కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ 'పెద్ది' సినిమాలో పవర్‌ఫుల్ గౌర్నాయుడుగా సందడి చేయనున్నారు. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. తొలి చిత్రం 'ఉప్పెన'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో కీలక పాత్ర చేస్తున్న శివ రాజ్‌కుమార్ లుక్‌ని శనివారం (జూలై 12) ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు. కాగా ఈ సినిమా రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రత్నవేలు.


రెండు ప్రపంచాలు... నాలుగు పాత్రలు!


అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్‌కి ఇప్పటివరకు ద్విపాత్రాభినయం చేసే అవకాశం రాలేదు. అలాంటిది ఒకే సినిమాలో అల్లు అర్జున్ ఏకంగా నాలుగు పాత్రలు చేస్తే ఎలా ఉంటుందో చూసే అవకాశాన్ని కల్పించనున్నారట తమిళ దర్శకుడు అట్లీ. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రష్మికా మందన్నా, మృణాల్ ఠాగూర్, జాన్వీ కపూర్‌లు కూడా ఈ సినిమాలో భాగమయ్యారని, భాగ్యశ్రీ భోర్సే – ఆలియా .ఎఫ్‌లలో ఎవరో ఒకరు ఈ సినిమాలో నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రచారంలోకి వచ్చింది. అదేంటంటే... ఈ చిత్రంలో అల్లు అర్జున్ నాలుగు పాత్రల్లో కనిపిస్తారని, తాత–తండ్రి–ఇద్దరు కొడుకులు... ఇలా ఈ నాలుగు పాత్రల్లోనూ ఈ హీరో కనిపిస్తారని, రెండు ప్రపంచాల నేపథ్యంలో, రెండు విభిన్నమైన కాలమానాలతో ఈ సినిమా ఉంటుందని భోగట్టా. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.


కొత్తపల్లిలో ఒకప్పుడు నవ్విస్తుంది

– ప్రవీణ పరుచూరి


ప్రవీణ, మనోజ్ చంద్ర

''నేను నిర్మించిన 'కేరాఫ్ కంచరపాలెం' సినిమాని చాలామంది థియేటర్స్‌లో చూడలేదని చెబుతుంటారు. దయచేసి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' చిత్రాన్ని మాత్రం థియేటర్స్‌లోనే చూడండి. సినిమా చాలా గమ్మత్తుగా ఉంటుంది. ప్రేక్షకులు హాయిగా నవ్వుకుంటారు. సెకండ్ హాఫ్‌లో నా స్టైల్‌లో కొన్ని సున్నితమైన అంశాలు ఉంటాయి. తప్పకుండా ఆలోచన కలిగించేలా ఉంటుంది'' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి పేర్కొన్నారు. మనోజ్ చంద్ర, మోనిక జోడీగా బెనర్జీ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో రానా దగ్గుబాటి సమర్పణలో పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్‌పై గోపాలకృష్ణ పరుచూరి–ప్రవీణ పరుచూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ– ''నేను తొలిసారి దర్శకత్వం వహించిన చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారని పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు. ''రామకృష్ణ పాత్రకి ప్రాణం పోశాను'' అని మనోజ్ చంద్ర చెప్పారు. ''నిర్మాతగా, డైరెక్టర్‌గా ఈ కథని అద్భుతంగా తెరకెక్కించారు ప్రవీణ. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది'' అని బెనర్జీ తెలిపారు. నటులు రవీంద్ర విజయ్, ఫణి మాట్లాడారు.

మధ్య తరగతి తెలుగబ్బాయి


సంతోష్ శోభన్

సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మానసా వారణాసి హీరోయిన్‌గా నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. కాగా జూలై 12న సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా 'కపుల్ ఫ్రెండ్లీ' తెరకెక్కింది. చెన్నైలో లైఫ్ లీడ్ చేస్తున్న ఓ మధ్య తరగతి తెలుగబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తారు. చెన్నై నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథా చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇచ్చేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్.

వాస్తవ ఘటనలతో...


అధర్వ, నిమిషా సజయన్

అధర్వ మురళి, నిమిషా సజయన్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీఎన్ఏ'. నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించారు. ఇటీవల తమిళంలో విడుదలై, ఘనవిజయం సాధించిన ఈ సినిమా 'మై బేబీ' పేరుతో తెలుగులో విడుదల కానుంది. 'ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్ మాల్, పిజ్జా' వంటి విజయవంతమైన అనువాద చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించిన నిర్మాత సురేష్ కొండేటి 'మై బేబీ'ని ఈ నెల 18న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సురేష్ కొండేటి మాట్లాడుతూ–''2014లో ఒక ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో 'మై బేబీ' కథ సాగుతుంది. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో, భావోద్వేగాలతో ఉంటుంది'' అని తెలిపారు.

ప్రతి ఇంట్లో విక్రాంత్..!


మిషా నారంగ్, ఆర్కే సాగర్

''ది 100' చిత్రంలో ప్రతి పాత్రకి ప్రాముఖ్యత ఉంది. సినిమాని థియేటర్స్‌లో చూడండి... ఏ ఒక్కర్నీ నిరుత్సాహపరచదు. మా సినిమా నచ్చలేదని ఒక్కరు చెప్పినా సరే నేను దేనికైనా సిద్ధం... అంత నమ్మకంగా చెబుతున్నాను'' అని ఆర్కే సాగర్ అన్నారు. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో ఆర్కే సాగర్, మిషా నారంగ్ జోడీగా ధన్యా బాలకృష్ణ కీలక పాత్ర పోషించిన చిత్రం 'ది 100'. రమేశ్ కరుటూరి, వెంకీ పుషడపు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో ఆర్కే సాగర్ మాట్లాడుతూ– ''నేను చేసిన ఆర్కే నాయుడు పాత్రలాగే విక్రాంత్ ఐపీఎస్ క్యారెక్టర్ కూడా ప్రేక్షకులకి నచ్చింది. ఇంకా మంచి కథలు చెప్పాలనే స్ఫూర్తిని ప్రేక్షకులు ఇచ్చారు'' అని తెలిపారు. రాఘవ్ ఓంకార్ శశిధర్ మాట్లాడుతూ– ''సమాజంలోని సవాళ్ల గురించి తీసిన సినిమా ఇది. ప్రతి ఇంట్లో విక్రాంత్‌లాంటి క్యారెక్టర్ ఉండాలని ప్రేక్షకులు కోరుకోవడం నాకు నచ్చింది'' అన్నారు. ''మా చిత్రానికి ముఖ్యంగా మహిళలు చాలా కనెక్ట్ అవుతున్నారు. ప్రేక్షకులు పతాక సన్నివేశాల్లో చప్పట్లు కొడుతుండటం సంతోషంగా ఉంది'' అని రమేశ్ కరుటూరి తెలిపారు. మిషా నారంగ్, నటుడు రాజా రవీంద్ర, పాటల రచయిత రాంబాబు గోసాల మాట్లాడారు.

శంఖు చక్ర నామాల నమూనా విడుదల



ఆలయాధికారులు విడుదల చేసిన శంఖు చక్ర నామాల నమూనా

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాద విక్రయశాల భవనంపై ఏర్పాటు చేయనున్న శంఖు చక్ర నామాల నమూనాను ఆలయ అధికారులు శనివారం విడుదల చేశారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గతంలో విద్యుద్దీపాలతో కనువిందు చేసిన శంఖు చక్ర నామాలను అధికారులు తొలగించారు. వాటిని ప్రసాద విక్రయ శాల భవనం పైభాగంలో పునరుద్ధరించాలని ఈవో వెంకట్రావ్ శుక్రవారం నిర్ణయించి.. ఈ మేరకు నమూనాను విడుదల చేశారు.

జోగుళాంబను దర్శించుకున్న హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి



హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్ర ఆలయాలను శనివారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్‌తేజతో కలిసి వచ్చిన వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి, శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.

పదేళ్ల తర్వాత.. కొత్త రేషన్‌కార్డులు

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో రేపు సీఎం రేవంత్‌రెడ్డితో పంపిణీ
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన, ఇస్తున్న కార్డులు 5,61,343
- ఈ కార్డుల పంపిణీతో రాష్ట్రంలో 84 శాతం మందికి ప్రయోజనం



సాక్షి, హైదరాబాద్/సాక్షిప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో దశాబ్ద కాలం తర్వాత అధికారికంగా సోమవారం కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేయనున్నారు. మంత్రులు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తదితరులు ఈ సభలో పాల్గొంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..ఈ జనవరి 26 తర్వాత మొదలైన కొత్త కార్డుల జారీ ప్రక్రియ నిరాటంకంగా సాగుతోంది. ఇప్పటి వరకు కొత్తగా జారీ చేసిన, చేస్తున్న కార్డుల సంఖ్య 5,61,343. పాత కార్డుల్లోని డూప్లికేట్ పేర్లు తొలగించిన తర్వాత..ప్రస్తుతం కార్డుల్లో సభ్యుల సంఖ్య 3,09,30,911గా తేల్చారు.

ఇంత పెద్ద మొత్తంలో ఇప్పుడే...

పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల స్థానంలో జాతీయ ఆహారభద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద ఆహార భద్రత కార్డులను జారీ చేసింది. అప్పట్లో రాష్ట్రంలో సుమారు 55 లక్షల కార్డులను మాత్రమే కేంద్ర ప్రభుత్వం జారీ చేయగా, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులతో సంబంధం లేకుండా మరో 30 లక్షల కార్డులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. తర్వాత జరిగిన పరిణామాల్లో అప్పుడప్పుడు జారీ చేసిన కార్డులు, తొలగించిన కార్డులు పోగా 2023లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి రాష్ట్రంలో 89.95 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కొత్త కార్డుల జారీ ప్రకటన చేశారు. అప్పటి నుంచి మే 23వ తేదీ వరకు కొత్తగా 2.03 లక్షల కార్డులు జారీ అయ్యాయి. ఆ తర్వాత 24 మే నుంచి ఇప్పటి వరకు మరో 3.58 లక్షల కార్డులను ఆన్‌లైన్‌లో జారీ చేశారు. దీంతో ఇప్పటి వరకు జారీ చేసిన కార్డుల సంఖ్య 5,61,343గా తేల్చారు. దీంతో రాష్ట్రంలో ఉన్న రేషన్ కార్డుల సంఖ్య 95,56,625గా పౌరసరఫరాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త సభ్యులను చేర్చుకుంటూ, పాత రేషన్‌కార్డుల్లోని ఉమ్మడి కుటుంబాల్లో పెళ్లిళ్లు అయిన వారిని, ఇళ్లల్లో లేని వారిని తొలగించగా, రాష్ట్రంలో రేషన్ పొందేందుకు అర్హులుగా 3.09 కోట్లుగా నిర్ధారించినట్టు పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది.

5,61,343 కార్డుదారులకు ప్రయోజనం : మంత్రి ఉత్తమ్



రాష్ట్రంలో కొత్తగా 5,61343 రేషన్‌కార్డులు అందజేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తద్వారా 45,34,430 మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. రాష్ట్రంలో పదేళ్ల తర్వాత ఇంత పెద్ద ఎత్తున రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం తమదేనని వెల్లడించారు. పాతకార్డుల్లో పేర్ల చేర్పు ద్వారా మరో 28,32,719మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

పది జిల్లాల్లో అత్యధిక కార్డులు

పది జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు ఎక్కువగా పంపిణీ చేయబోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 50,102 కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయి. ఆ తర్వాత కరీంనగర్‌లో 31,772 కొత్త కార్డులను ఇవ్వబోతున్నారు. కొత్త కార్డుల జారీ తర్వాత అత్యధికంగా 6,67,778 రేషన్‌కార్డులు ఉన్న జిల్లాగా హైదరాబాద్, అతి తక్కువ కార్డులు కలిగిన జిల్లాగా 96,982 కార్డులతో ములుగు ఉంది.

ఆయా జిల్లాల్లో పాత, కొత్త రేషన్ కార్డులు ఇలా.. వివరాలు.. - సాక్షి ప్లస్‌లో

మొత్తంగా కార్డుల సంఖ్య

95,56,625

సన్నబియ్యం ఇచ్చేది

3,09,30,911 మందికి

13 ఏళ్ల తర్వాత కార్డు



నాకు వివాహమై 13 ఏళ్లు అవుతోంది. మాకు ఇద్దరు పిల్లలు. ఇంతవరకు రేషన్ కార్డు రాలేదు. ఇరవైముప్పై సార్లు మీసేవ కేంద్రంలో, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. అయినా రాలేదు. ఈసారి దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పుడు కార్డు వస్తోంది.

– బూరి రేణుక, మొల్కపట్నం, నల్లగొండ

సంతోషంగా ఉంది



చేనేత కార్మికులుగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాం. నాలుగైదేళ్లుగా కార్డు కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. గతంలోనూ అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నాం. అయినా రాలేదు. ఇప్పుడు మీసేవలో దరఖాస్తు చేసుకున్నాం. కార్డు అప్రూవ్ అయ్యింది.

– చెరుపల్లి నవీన, గట్టుప్పల్, నల్లగొండ

ఇప్పటికొచ్చింది



నాకు ఐదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డు కోసం రెండుసార్లు దరఖాస్తు చేశా. అయినా రాలేదు. మొత్తానికి ఇప్పుడు అప్రూవ్ అయ్యింది.

– బొందల విక్రం, తుమ్మల పెన్‌పహాడ్, సూర్యాపేట



జెండా ఊపి ప్రారంభిస్తున్న పొన్నం, గుత్తా, రఘువీర్, వీరేశం,బీఎల్ఆర్

ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రులు



బస్సు నడిపిన మంత్రి కోమటిరెడ్డి

రామగిరి (నల్లగొండ): నల్లగొండలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఎలక్ట్రిక్ బస్సులను శనివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లాకు మొత్తం 40 బస్సులు రాగా అందులో 10 బస్సులను శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బస్ స్టేషన్ నుంచి కొంతదూరం వరకు బస్సును నడిపారు. అనంతరం ఇద్దరు మంత్రులు కలిసి నల్లగొండ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, అధికారులతో నల్లగొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, జయవీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

యాదాద్రి తరహాలో బాసర అభివృద్ధి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ. చిత్రంలో మంత్రి వివేక్.

భైంసా: నిర్మల్ జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి క్షేత్రాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. పవిత్ర బాసర క్షేత్రానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శనివారం మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సురేఖ బాసరకు వచ్చారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ ఆధ్వర్యంలో రూ.9.30 కోట్లతో మరమ్మతు చేసిన 100 గదుల సత్రాన్ని, రూ.3.48 కోట్లతో నిర్మించిన ఈవో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాసరకు వచ్చే భక్తుల భద్రతే ప్రధానమని మంత్రి కొండా సురేఖ అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను వైభవంగా జరిపిస్తామని తెలిపారు. కాగా, బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా వర్సిటీ అకడమిక్ బ్లాక్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చొరవతో ఏర్పాటైన ట్రిపుల్‌ఐటీలో చదివిన వేల మంది విద్యార్థులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలో సోలార్‌పేరిట నిధులు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. బాసర క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. కాగా, ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై కలెక్టర్ అభిలాష అభినవ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అమ్మవారి ఆలయం, పార్కింగ్, గోదావరి ఘాట్‌లు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల అభివృద్ధి నమూనాలను వివరించారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దు చేయాలి: ఎన్‌వోపీఆర్‌యూఎఫ్

సాక్షి, హైదరాబాద్: భాగస్వామ్య పింఛను పథకంతో పాటు తాజాగా కేంద్రం ప్రవేశ పెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను రద్దు చేయాలని నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ (ఎన్‌వోపీఆర్‌యూఎఫ్) దక్షిణ భారత ఇన్‌చార్జి మాచన రఘునందన్ డిమాండ్ చేశారు. యూపీఎస్‌ను రద్దు చేయాలంటూ ఉద్యోగులందరమూ మొక్కలు నాటామని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 20న వారణాసిలో జాతీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రఘునందన్ తెలిపారు.

వాడుతున్న పత్తికి తడులు

పెద్దవూర: కొన్ని రోజులుగా వరుణుడు ముఖం చాటేయడం.. మండుతున్న ఎండలతో పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. దీంతో రైతులు సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసుకుని స్ప్రింక్లర్లతో నీటి తడులందిస్తూ కాపాడుకుంటున్నారు. కొందరు రైతులు డ్రిప్‌లు ఏర్పాటు చేసుకుని నీటి తడులు వేస్తున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందా.. అని ఎదురుచూస్తున్నారు.



నీమానాయక్ తండాలో పత్తి మొక్కలకు స్ప్రింక్లర్లతో నీటితడి అందిస్తున్న రైతులు



ఆటకే వీడ్కోలు... ఆదాయంలో రారాజులు

సచిన్ నుంచి కోహ్లి వరకు ఇంకా తగ్గని క్రేజ్
ఇప్పటికీ ప్రకటనల్లో కనిపిస్తూ ఆదాయార్జన
బ్రాండ్ అంబాసిడర్లుగా వెలుగుతున్న దిగ్గజాలు

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడి పుష్కరం గడిచింది. అతని సమకాలీకులు రాహుల్ ద్రవిడ్ (2012లో ఆఖరి మ్యాచ్), సౌరవ్ గంగూలీ (2008లో) తమ ఆటను ముగించి చాలా కాలమైంది. ఈతరం దిగ్గజం ధోని కూడా మూడు ఫార్మాట్ల నుంచి తప్పుకున్నాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కొన్ని ఫార్మాట్ల నుంచి రిటైరయ్యారు. కానీ క్రికెట్ అభిమానుల్లో వీరందరి పట్ల క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఆటకు సంబంధించిన లేదా క్రికెటేతర కార్యక్రమం అయినా సరే...వీరు హాజరైతే చాలు, దాని విలువ అమాంతం పెరిగిపోతుంది. ఈ దిగ్గజ క్రికెటర్లకు వాణిజ్యపరంగా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికీ పెద్ద సంఖ్యలో వీరు వివిధ బ్రాండ్లకు ప్రచారకర్తలుగా పని చేస్తుండటం విశేషం. పైగా ఆయా బ్రాండ్‌లకు అంబాసిడర్లుగా మాత్రమే కాకుండా చాలా వ్యాపారాల్లో సహ భాగస్వాములుగా తాము కూడా మార్కెట్‌ను శాసిస్తున్నారు.

- సాక్షి, క్రీడా విభాగం

సచిన్ టెండూల్కర్ ప్రస్తుతం 25 బ్రాండ్‌లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నాడు. వీటిలో 10 కంపెనీల్లో అతను సహ భాగస్వామి. సగం వాటిలో అతను కేవలం పెట్టుబడులు పెట్టడంతోనే సరిపెట్టగా... మరో సగం కంపెనీ వ్యవహారాల్లో తన సలహాలు, సూచనలు కూడా ఇస్తూ చురుకైన భాగస్వామిగా ఉన్నాడు.



ముగ్గురూ ముగ్గురే

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఏకంగా 42 బ్రాండ్స్‌తో జత కట్టాడు. రెగ్యులర్‌గా ప్రకటనల్లో కనిపించే బ్రాండింగ్ కాకుండా ప్రీమియం స్పోర్ట్స్ టూరిజం కంపెనీ 'డ్రీమ్ సెట్ గో'ను సొంత వ్యాపారంలా ప్రమోట్ చేస్తున్నాడు. ఇక రాహుల్ ద్రవిడ్ వీరిలో మరింత ప్రత్యేకం. ఈ మిస్టర్ డిపెండబుల్ కనీసం సోషల్ మీడియాలో కూడా లేడు. కానీ 24 బ్రాండ్లకు ప్రచారం చేస్తున్నాడు. ముఖ్యంగా నెమ్మదైన స్వభావానికి బ్రాండ్ అంబాసిడర్‌లాంటి ద్రవిడ్.. క్రెడిట్ కార్డ్ పేమెంట్ కంపెనీ 'క్రెడ్'కోసం 'నేను ఇందిరానగర్ గూండాను..'అంటూ చేసిన యాడ్ ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

పేరు ప్రఖ్యాతులే పెట్టుబడిగా...

క్రికెట్ నుంచి తప్పుకొని చాలా రోజులైనా ఈ మాజీలకు డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. దీనిపై వ్యాల్యుయేషన్ రంగంలో నిష్ణాతులైన హర్ష్ తలికోటి మాట్లాడుతూ.. 'సుదీర్ఘ కెరీర్‌లో వారు సాధించిన ఘనతలతో వచ్చిన పేరుప్రఖ్యాతులే కాదు.. ప్రజల్లో ఇప్పటికీ ఉన్న క్లీన్ ఇమేజ్, అభిమానులకు వారంటే ఉన్న గౌరవం, ఏళ్లు గడిచాక కూడా తమను తాము మార్చుకుంటూ ప్రస్తుత సెలబ్రిటీల్లో కూడా తమ ప్రత్యేకత నిలబెట్టుకోవడమే అందుకు కారణం'అంటాడు. పైగా తాము నమ్మిన, విశ్వాసం ఉన్నవాటితోనే జత కట్టడానికి వీరు సిద్ధమవుతారు. 'గ్రండ్‌ఫోస్' పంప్స్‌ను తన ఇంట్లో ఎనిమిదేళ్లుగా వాడుతున్నాను కాబట్టి దానికి ప్రచారం చేసేందుకు సిద్ధమైనట్లు ద్రవిడ్ చెప్పడం ఇందుకు ఒక ఉదాహరణ.

ధోని, విరాట్, రోహిత్

ఈతరం అభిమానుల్లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న ఎమ్మెస్ ధోని, విరాట్ కోహ్లి ప్రస్తుతం చెరో 45 బ్రాండ్లతో కలిసి పని చేస్తుండటం విశేషం. ఇటీవల 'ఎజిలిటాస్'స్పోర్ట్స్ కంపెనీలో కోహ్లి రూ.40 కోట్లతో భాగస్వామిగా చేరి అన్నీ తానే అయి నడిపిస్తున్నాడు. 10 స్టార్టప్‌లలో అతను పెట్టుబడులు పెట్టాడు. ధోని కూడా ఫుడ్ అండ్ బేవరేజెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరో స్పేస్ కంపెనీల్లో భాగమయ్యాడు. అలాగే హిట్ మ్యాన్ రోహిత్ శర్మ టెస్టులు, టీ20ల నుంచి రిటైరైనా క్రేజ్ తగ్గలేదు. అడిడాస్, సియట్, నిస్సాన్ వంటి అనేక ప్రముఖ కంపెనీలకు ప్రకటనకర్తగా ఉన్నాడు. సుమారు 20 బ్రాండ్లతో కలిసి పనిచేస్తున్నాడు.

ఉభయతారక ఒప్పందాలు

భారత్‌లో క్రికెటర్లకు పాన్ ఇండియా విలువ ఉంటుంది. ఎక్కువ సందర్భాల్లో ఒక్కో ప్రాంతం లేదా భాషకే పరిమితమయ్యే సినిమా తారలతో పోలిస్తే క్రికెటర్ల ప్రకటనలే పెద్ద సంఖ్యలో జనానికి చేరతాయని ప్రకటన రంగ నిపుణులు చెబుతున్నారు. బ్రాండ్ అంబాసిడర్ ఒప్పందాలు ఉభయతారకంగా ఉంటూ అటు ప్లేయర్లకు, ఇటు కంపెనీలకు కూడా లాభదాయకంగా ఉండటం కారణంగా ఇరు పక్షాల మధ్య సుదీర్ఘ కాలపు అనుబంధం కొనసాగుతోంది. ధోని బ్రాండింగ్ చేస్తున్న ఏరో స్పేస్ కంపెనీ 'గరుడ'ఆదాయం ఏడాది తిరిగే లోగా రూ.15 కోట్ల నుంచి రూ. 123 కోట్లకు చేరగా, తర్వాతి సంవత్సరమే కంపెనీ పూర్తిగా లాభాల్లోకి మళ్లింది. కోకాకోలాతో గంగూలీ అనుబంధం 18 ఏళ్లుగా కొనసాగుతుండగా, పవర్ కంపెనీ ల్యూమినస్ 15 ఏళ్లుగా సచిన్‌తో కలిసి ఉంది. ఆటకు గుడ్‌బై చెప్పినా మార్కెటింగ్, బ్రాండింగ్‌ను తాము శాసించగలమని ఈ దిగ్గజాలంతా నిరూపిస్తున్నారు.

- ప్రభుత్వరంగ సంస్థ బీపీసీఎల్‌కు చెందిన ల్యూబ్రికెంట్స్ యాడ్‌లో ద్రవిడ్ నటించిన తర్వాత అమ్మకాలు భారీ ఎత్తున పెరిగాయని స్వయంగా కంపెనీ వెల్లడించింది. కర్ణాటకలో 'గ్రండ్‌ఫోస్'పంప్స్‌తో ద్రవిడ్ జతకట్టిన తర్వాతే అవి ప్రజలకు మరింత చేరువయ్యాయి.
- 'గరుడ'బ్రాండ్‌తో వచ్చిన డ్రోన్ల వ్యాపారం పెరుగుదలకు ధోని మాత్రమే కారణమని ఆ సంస్థ సీఈఓ అగ్నీశ్వర్ వెల్లడించడం 'కెప్టెన్ కూల్'విలువేమిటో చెబుతుంది.

ఒక్కో ప్రకటనకూ

దిగ్గజ క్రికెటర్లు ఒక్కో ప్రకటనకూ సగటున ఎన్ని కోట్లు రూ. తీసుకుంటున్నారంటే..

సచిన్ టెండూల్కర్	5-6
సౌరవ్ గంగూలీ	2.25 - 2.50
రాహుల్ ద్రవిడ్	1.5
ఎమ్మెస్ ధోనీ	4-6
విరాట్ కోహ్లి	7.5-10
రోహిత్ శర్మ	5

వాళ్ల పేరే ఒక బ్రాండ్

క్రికెటర్ల బ్రాండ్ వాల్యూ (సుమారు రూ.కోట్లలో)

విరాట్ కోహ్లి	1,900
ఎమ్మెస్ ధోని	800
సచిన్ టెండూల్కర్	766
రోహిత్ శర్మ	344

క్లుప్తంగా...

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా సందీప్‌శుక్లా



రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా సందీప్‌శుక్లా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత డైరెక్టర్ పీజే నారాయణన్ తన స్నాతకోత్సవ ఉపన్యాసంలో మాట్లాడుతూ త్వరలో డైరెక్టర్ పదవిని వదిలి అధ్యాపకుడిగా కొనసాగుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఐఐటీ కాన్పూర్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్, ఐఈఈఈ ఫెలో అయిన సందీప్ కె.శుక్లా ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణులుగా గుర్తింపు పొందారు. అమెరికాలోని ఎస్‌యూఎన్‌వై అల్బనీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా సందీప్‌శుక్లా మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ లాంటి అగ్రగామి సంస్థకు నూతన నాయకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం రావడం గర్వంగా ఉందని, ఇదొక సవాలుతో కూడిన అవకాశంగా పేర్కొన్నారు. వచ్చే నెలలో ఆయన ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు.

15 నుంచి 'యాక్టివ్ సీఐఎస్‌సీఈ'

పాఠశాల విద్యార్థులకు ఫిట్‌నెస్ ప్రోగ్రామ్

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, శారీరక సామర్థ్యం, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్‌సీఈ) సరికొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ఈనెల 15 నుంచి 'యాక్టివ్ సీఐఎస్‌సీఈ'కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ రీజనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ థెరిసా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు ప్రత్యేక ఫిట్‌నెస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థుల ఫిట్‌నెస్ స్కోర్‌లు, జీవనశైలి సూచికలు, క్రీడా నైపుణ్యాలను ట్రాక్ చేస్తారు. పీఈటీల పర్యవేక్షణలో ఆన్‌లైన్ ఫిట్‌నెస్ రిపోర్ట్ కార్డులు జారీ చేస్తారు. రిపోర్ట్ కార్డులు విద్యార్థుల బేస్‌లైన్ ఫిట్‌నెస్ స్కోర్, విద్యా సంవత్సరాల్లో పురోగతి, క్రీడా నైపుణ్య బ్యాడ్జ్‌లు, ప్రతిభ గుర్తింపును సులభతరం చేస్తాయి. సీఐఎస్‌సీఈ అనుబంధ పాఠశాలల్లో డేటా ఏకీకరణ ద్వారా విద్యార్థుల పర్యవేక్షణను సమర్థవంతంగా నిర్వహించనున్నారు. ఐసీఎస్‌ఈ (10వ తరగతి), ఐఎస్‌సీ (12వ తరగతి) పరీక్షల రిజిస్ట్రేషన్‌కు 'యాక్టివ్ సీఐఎస్‌సీఈ'కార్యక్రమంలో పాల్గొనడం తప్పనిసరి షరతుగా నిర్ణయించినట్లు థెరిసా వెల్లడించారు. కార్యక్రమం తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా ఉన్న 2,975కు పైగా ఉన్న సీఐఎస్‌సీఈ అనుబంధ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

టీజీఈఏపీసెట్-2025 మాక్ అలాట్‌మెంట్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి టీజీఈఏపీసెట్-2025 మాక్ అలాట్‌మెంట్‌ను సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం విడుదల చేశారు. జూలై 1 నుంచి 8వ తేదీ వరకు విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన, ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. తాజాగా మాక్ అలాట్‌మెంట్/ప్రాబబుల్ అలాట్‌మెంట్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఇచ్చిన ఆప్షన్లను ఈనెల 13 నుంచి 15వ తేదీ మధ్య మార్చుకునే వీలుంటుందని, దీని ఆధారంగా మొదటి విడత సీట్ అలాట్‌మెంట్ జాబితా విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు.

21 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

షెడ్యూల్ విడుదల చేసిన ఎంసీసీ
- 21 నుంచి 30 వరకు ఆలిండియా కోటా
- 30 నుంచి స్టేట్ కోటా సీట్లకు కౌన్సెలింగ్
- రాష్ట్రంలో 9,065 ఎంబీబీఎస్ సీట్లు
- 34 ప్రభుత్వ కాలేజీల్లో 4,090 సీట్లు
- సెప్టెంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లోప్రవేశం కోసం నీట్ యూజీ- 2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, రాష్ట్రం పరిధిలోని సీట్లలో చేరికకు సంబంధించిన కౌన్సెలింగ్ తేదీలను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ప్రకటించింది. ఆలిండియా కోటా, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 21 నుంచి 30వతేదీ వరకు జరుగుతుంది. మూడు రౌండ్లలో జరిగే ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ సెప్టెంబర్ 10వ తేదీ వరకు సాగనుంది. స్టేట్ కౌన్సెలింగ్ మొదటి దశను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 18 వరకు మూడు రౌండ్లలో ఈ కౌన్సెలింగ్ సాగనుందని ఎంసీసీ తెలిపింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. తెలంగాణ నుంచి నీట్ యూజీ -2025 పరీక్ష 70,259 మంది రాయగా, 43,400 మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు ఇప్పటికే కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది.

రాష్ట్రంలో 9,065 ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు డీమ్డ్ యూనివర్సిటీ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కలిపి 64 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 34 రాష్ట్ర ప్రభుత్వ కాలేజీలు కాగా , 26 ప్రైవేటు కాలేజీలు. మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ పేరిట 2 కాలేజీలు ఉండగా, ఈఎస్ఐ, బీబీనగర్ ఎయిమ్స్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి. ఈ కళాశాలలన్నింటిలో కలిపి 9,065 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో 34 ప్రభుత్వ కళాశాలల్లో 4,090 సీట్లు ఉండగా, వాటిలో 15 శాతం అంటే 613 సీట్లు ఆలిండియా కోటా కిందికి వెళ్తాయి. మిగతా 3,477 సీట్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయి. అలాగే 26 ప్రైవేట్ కళాశాలల్లో 4,350 సీట్లు ఉన్నాయి. మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన రెండు మెడికల్ కాలేజీలు (ఒకటి మహిళా కాలేజ్) డీమ్డ్ యూనివర్సిటీ కేటగిరీలో ఉన్నాయి. ఈ రెండు కళాశాలల్లో కలిపి 400 సీట్లు ఉండగా, డీమ్డ్ యూనివర్సిటీ విభాగంలో వీటికి కౌన్సెలింగ్ జరుగనుంది. కాగా ప్రైవేటు కాలేజీల్లోని 4,350 సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటా కింద తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయి. మరో 35 శాతం సీట్లు బీ - కేటగిరీలో, 15 శాతం సీట్లు సీ కేటగిరీలో ఎన్‌ఆర్ఐ కోటాలో ఫీజులు చెల్లించే స్తోమత ఉన్నవారికే కేటాయిస్తారు. ఇవి కాకుండా ఈఎస్ఐ కాలేజీలో 125 సీట్లు, బీబీనగర్ ఎయిమ్స్‌లోని 100 సీట్లను ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు.

ఆలిండియా కోటా/డీమ్డ్/కేంద్ర వర్సిటీల కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు

మొదటి రౌండ్ కౌన్సెలింగ్	:	జూలై 21 నుంచి 30 వరకు
కాలేజీల్లో రిపోర్టు చేయటానికి చివరి తేదీ	:	ఆగస్టు 6
చేరిన విద్యార్థుల డేటా ధ్రువీకరణ	:	ఆగస్టు 7-8
రెండో రౌండ్ కౌన్సెలింగ్	:	ఆగస్టు 12 నుంచి 20 వరకు
కాలేజీలో రిపోర్టింగ్‌కు చివరి తేదీ	:	ఆగస్టు 29
మూడో రౌండ్	:	సెప్టెంబర్ 3-10
చేరికకు చివరి తేదీ	:	సెప్టెంబర్ 18
స్ట్రే వేకెన్సీ రౌండ్	:	సెప్టెంబర్ 22-26
కాలేజీల్లో చేరికకు చివరి తేదీ	:	అక్టోబర్ 3

రాష్ట్ర కౌన్సెలింగ్ (స్టేట్ కోటా) వివరాలు

మొదటి రౌండ్	:	జూలై 30 నుంచి ఆగస్టు 6
కాలేజీలో రిపోర్టింగ్‌కు చివరి తేదీ	:	ఆగస్టు 12
డేటా ధ్రువీకరణ	:	ఆగస్టు 13-14
రెండో రౌండ్	:	ఆగస్టు 19-29
డేటా ధ్రువీకరణ	:	సెప్టెంబర్ 5-6
చేరికకు చివరి తేదీ	:	సెప్టెంబర్ 4
మూడో రౌండ్	:	సెప్టెంబర్ 9-18
డేటా ధ్రువీకరణ	:	సెప్టెంబర్ 24
చేరికకు చివరి తేదీ	:	సెప్టెంబర్ 23
స్ట్రే వేకెన్సీ రౌండ్	:	సెప్టెంబర్ 25-29
చేరికకు చివరి తేదీ	:	అక్టోబర్ 3

కలిసి పని చేస్తే ఉత్తమ ఫలితాలు

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం



సాక్షి, హైదరాబాద్: డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఎక్సైజ్‌శాఖల అధికారులు కలిసి పనిచేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ, ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ అధికారుల సమన్వయ సమావేశం అబ్కారీ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షానవాజ్ ఖాసీం మాట్లాడుతూ ప్రాణహాని, మత్తు కలిగించే నిషేధిత మందుల వినియోగం, గంజాయి, ఇతర డ్రగ్స్‌ను అరికట్టడంలో రెండు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండు శాఖలు కలిసి పని చేయడానికి ఉన్న అవకాశాలేంటి? అనే అంశంపై చర్చించుకోవాలని, కలిసి దాడులు చేయడానికి ప్రాంతాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. రెండు విభాగాల్లో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నలుగురు అధికారులతో కూడిన కామన్ ఇంటెలిజెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఖాసీం సూచించారు. వాట్సాప్ గ్రూప్‌లు సహా ఆన్‌లైన్ యాప్స్‌లో జరుగుతున్న డ్రగ్స్ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యాచరణకు ఒక రూట్‌మ్యాప్‌ను బుక్‌లెట్ రూపంలో తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, డ్రగ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ రామ్‌ధన్, డిప్యూటీ కమిషనర్లు కేఏబీ శాస్త్రి, పి.దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి పాల్గొన్నారు.

శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై ఈడీ దృష్టి

హెచ్‌ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్‌కు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ఈడీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్, రెరా మాజీ కార్యదర్శి శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి పెట్టింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడనే ఆరోపణలతో గతేడాది జనవరి 24న ఏసీబీ అధికారులు శివబాలకృష్ణపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఏసీబీ సోదాల్లో దాదాపు రూ.250 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులను గుర్తించారు. శివబాలకృష్ణ అక్రమార్జనలో మనీలాండరింగ్ కోణంలో ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసిన ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈనెల 2న శివబాలకృష్ణ నివాసంతోపాటు ఆయన సోదరుడు, కుటుంబ సభ్యుల ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. వారి నుంచి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బును వివిధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టినట్లు ఆధారాలు సేకరించారు. బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీగా పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ విచారణలో బయటపడింది. దీంతో బినామీల పేరిట పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టినట్టు అనుమానిస్తున్న ఈడీ అధికారులు, ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ అంశాలకు సంబంధించి మరింత సమాచారం తెలుసుకునేందుకు శివబాలకృష్ణను విచారించాలని ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు వచ్చే వారంలో ఆయనకు ఈడీ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

సైబర్ నేర దర్యాప్తులో పెరగనున్న సమన్వయం

- 'డిజిటల్ ఎవిడెన్స్ ఇన్వెస్టిగేషన్'లో శ్రీలంకన్ పోలీసులకు శిక్షణ
- సీడీటీఐలో ముగిసిన వారం రోజుల కోర్సు



వాలెడిక్టరీ వేడుకలో రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు, పీ.వీ.కే.ప్రసాద్‌లతో శ్రీలంక పోలీసులు

సాక్షి, హైదరాబాద్: భారత్, శ్రీలంక మధ్య చట్టాల అమలుతోపాటు సైబర్-భద్రతా రంగంలో సామర్థ్య పెంపు, దర్యాప్తులో సమన్వయం పెంచేందుకు ఐటీఈసీ (ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్) కోర్సు ఉపయోగపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎవిడెన్స్ ఇన్వెస్టిగేషన్'అంశంపై శ్రీలంక సీనియర్ పోలీస్ అధికారులకు ఐటీఈసీ కోర్సులో శిక్షణ ఇచ్చారు. జూన్ 30 నుంచి జూలై 11 వరకు రామంతపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సీడీటీఐ)లో శిక్షణ నిర్వహించారు. ఈ కోర్సు ముగింపు సందర్భంగా శనివారం నిర్వ హించిన వాలెడిక్టరీ వేడుకకు ముఖ్యఅతిథిగా రాచకొండ పోలీసు కమిషనర్ జి.సు ధీర్ బాబు, గౌరవ అతిథిగా ఉత్తరాఖండ్ హోంగార్డ్స్ డీజీ డాక్టర్ పీ.వీ.కే.ప్రసాద్ హాజరయ్యారు. సీడీటీఐ డైరెక్టర్ సల్మంతాజ్ పాటిల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. కార్తికేయన్ ఈ కోర్సు విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. కోర్సు కోఆర్డినేటర్, సీడీఐటీ డీఎస్పీ కేకేవీరెడ్డి కోర్సు నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ, శ్రీలంక పోలీసు అధికారులు ఈ కోర్సు నుంచి పొందిన జ్ఞానం వారి దేశంలో పోలీసు వ్యవస్థను మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్-శ్రీలంకల మధ్య లా ఎన్‌ఫోర్స్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సామర్థ్య నిర్మాణం, సమాచార వినిమయంలో బలమైన సహకారాన్ని ఏర్పరుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కోర్సు ద్వారా అధికారుల వృత్తిపరమైన నైపుణ్యాలు మెరుగుపడడమే కాకుండా, ద్వైపాక్షిక సహకారాన్ని ప్రోత్సహించేందుకు విశ్వాసం, బలమైన బంధాలు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. కోర్సులో పాల్గొన్న శ్రీలంక అధికారులకు సర్టిఫికెట్లు, స్మారక చిహ్నాల పంపిణీతో కార్యక్రమం ముగిసింది.

నెట్‌వర్క్‌కన్నా మానవ సంబంధాలు ముఖ్యం

- నీతి ఆయోగ్ విశిష్ట సభ్యురాలు దేబ్జాని ఘోష్
- ఘనంగా ట్రిపుల్‌ఐటీ-హైదరాబాద్ 24వ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న నీతి ఆయోగ్ విశిష్ట సభ్యురాలు దేబ్జాని ఘోష్

రాయదుర్గం (హైదరాబాద్): నెట్‌వర్క్‌ల కంటే మానవ సంబంధాలు ఎంతో ముఖ్యమని నీతి ఆయోగ్ విశిష్ట సభ్యురాలు, నీతి ఫ్రంటియర్ టెక్ హబ్ చీఫ్ ఆర్కిటెక్ట్, నాస్కామ్ మాజీ అధ్యక్షురాలు దేబ్జాని ఘోష్ అన్నారు. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 24వ స్నాతకోత్సవాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన దేబ్జాని ఘోష్ మాట్లాడుతూ, సమస్యలు ఉంటే ఒకరితో ఒకరు మాట్లాడుకొని వాటిని పరిష్కరించుకొని ముందుకుసాగాలన్నారు. అయిదు జీవిత మంత్రాలు ప్రతిఒక్కరికీ.. ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కృతజ్ఞతతో ప్రారంభించాలని, జీవితంలో లక్ష్యం ఉండాలని, ఓటమిని అంగీకరించరాదని, సత్యనిష్టను సోర్స్‌కోడ్‌లా కాపాడుకోవాలని, నెట్‌వర్క్‌కన్నా మానవ సంబంధాలు ఎంతో ముఖ్యమని.. ఈ అయిదు జీవిత మంత్రాలను అందరూ పాటిస్తే విజయవంతంగా ముందుకుసాగేందుకు తోడ్పాటును అందిస్తాయని వివరించారు. ట్రిపుల్‌ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొ. అశోక్ జంఝున్‌వాలా మాట్లాడుతూ, ట్రిపుల్‌ఐటీ ప్రభుత్వ అధీనంలో లేని పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్ అని, మీరు ఇప్పటివరకు నేర్చుకున్నది తొలి మెట్టని, ఇకపై సహచరుల నుంచి నేర్చుకుంటూ ప్రయాణం కొనసాగించాల్సి ఉంటుందన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం స్నాతకులైన విద్యార్థులు తాము అందుకున్న విద్యతో సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీ కొత్త చైర్మన్ డాక్టర్ అభిజాత్

- ఎంఏఆర్‌బీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.కే. రమేశ్
- ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్ నియామక కమిటీ
- నీట్ యూజీ కౌన్సెలింగ్ వేళ కీలక పరిణామం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని వైద్య విద్యా రంగానికి సంబంధించి కీలక నియామకాలకు కేంద్ర కేబినెట్ నియామక కమిటీ ఆమోదం తెలిపింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సూచనల మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) చైర్మన్‌గా డాక్టర్ అభిజాత్ చంద్రకాంత్ శేథ్‌ను నియమించింది. ఆయన ప్రస్తుతం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్, న్యూఢిల్లీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఎన్‌ఎంసీ చైర్మన్‌గా ఉన్న కర్ణాటకకు చెందిన డాక్టర్ గంగాధర్ స్థానంలో అభిజాత్ శేథ్‌ను నియమించారు. దేశంలో నీట్ యూజీ మెడికల్ కౌన్సెలింగ్ తేదీలు ప్రకటించిన సమయంలోనే ఎన్‌ఎంసీ చైర్మన్‌ను మార్చడం విశేషం. దేశవ్యాప్తంగా ప్రైవేటు మెడికల్ కాలేజీల రెన్యూవల్స్ విషయంలో ఎన్‌ఎంసీ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడం, దీనిపై సీబీఐ దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో ఎన్‌ఎంసీ చైర్మన్ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. చైర్మన్‌తోపాటు ఎన్‌ఎంసీలోని వివిధ విభాగాలకు చెందిన సభ్యులను కూడా మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. అందులో భాగంగానే మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (ఎంఏఆర్‌బీ) అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.కే. రమేశ్ నియమితులయ్యారు. ఆయన గతంలో పీజీఎంఈబీ అధ్యక్షుడిగా, బెంగళూరులోని రాజీవ్‌గాంధీ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా పని చేశారు. వీరిద్దరు ఈ పోస్టుల్లో నాలుగేళ్లపాటు లేదా వారికి 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు లేదా కేంద్రం తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఈ పదవుల్లో కొనసాగుతారు.

సందీప్ పోయి సంజయ్ వచ్చారు

పది రోజుల్లోనే దక్షిణ మధ్య రైల్వే కొత్త జీఎం మార్పు




సంజయ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: బాధ్యతలు స్వీకరించిన కేవలం పది రోజుల్లోనే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మారిపోయారు. నాలుగేళ్లపాటు జోన్ జీఎంగా పనిచేసిన అరుణ్ కుమార్ జైన్ గత నెలాఖరున ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో, కొత్తగా ఏర్పాటైన దక్షిణ కోస్తా జోన్ జీఎం సందీప్ మాథుర్ నియమితులయ్యారు. తాత్కాలిక పద్ధతిలో మూడు నెలల కోసం ఆయనను నియమించినా, కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా జోన్‌కు సంబంధించి కేంద్ర కార్యాలయం పూర్తి స్థాయిలో ఏర్పడనందున.. ఆయన సికింద్రాబాద్ కేంద్రంగా రెండు జోన్‌ల కార్యకలాపాలు పర్యవేక్షిస్తారని అంతా భావించారు. దానికి తగ్గట్టుగానే ఆయన కుటుంబంతో సహా నగరానికి మకాం మార్చారు. ఈ పది రోజుల్లో మూడు సార్లు ఆయన వివిధ డివిజన్లలో పర్యటించి తనిఖీలు చేశారు. వివిధ అంశాలపై సమీక్షలు నిర్వహించారు. కానీ, శుక్రవారం రాత్రి రైల్వే బోర్డు.. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ సెంట్రల్ ఆర్గనైజేషన్ జీఎంగా ఉన్న సంజయ్ కుమార్ శ్రీవాస్తవను దక్షిణ మధ్య రైల్వే జోన్ జీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే ఆయన ఢిల్లీ నుంచే వర్చువల్ పద్ధతిలో జోన్ జీఎంగా బాధ్యతలు స్వీకరించారు. శ్రీవాస్తవ ఇండియన్ రైల్వే ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు చెందిన 1988 బ్యాచ్ అధికారి. సివిల్ ఇంజనీరింగ్‌కు సంబంధించి వివిధ సాంకేతిక పురోగతులు, విధానాలు అమలు చేయటంలో ఆయన కీలకపాత్ర పోషించారు. రైల్వేలో మౌలిక సదుపాయాల కల్పన, మెట్రో ప్రాజెక్టులు, ఆధునిక రైలు సాంకేతికత అభివృద్ధిలో కూడా కీలకపాత్ర పోషించారు. ఆయన సోమవారం నగరానికి రానున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 13-7-2025



భద్రాద్రి వారధి.. 60 ఏళ్లు

గోదావరి పాత వంతెనపై లక్షలాది వాహనాల రాకపోకలు

ఎన్ని వరదలు వచ్చినా తట్టుకున్న నిర్మాణం	కొత్త వంతెన నిర్మించాక తగ్గిన ఒత్తిడి	పాత వంతెనకు నేటితో 60 ఏళ్లు పూర్తి



16 డిసెంబర్ 1959లో వంతెన నిర్మాణానికి అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



13 జూలై 1965లో అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంతెనను ప్రారంభించినప్పటి శిలాఫలకం

భద్రాచలం అర్బన్: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి రావాలంటే ఏళ్ల క్రితం అనేక కష్టాలు ఎదురయ్యేవి. వాహనాల రాకపోకలు సరిగ్గా లేక.. మధ్యలో గోదావరి దాటాలంటే ప్రాణాలకు తెగించాల్సి వచ్చేది. ఏటా శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు భద్రాచలం గోదావరి అవతల బూర్గంపాడు మండలం గొమ్మూరు నుంచి కాలినడకన, ఆపై పడవలో ప్రయాణించేవారు. అలా వస్తున్న 150 మంది భక్తులు ఒకసారి నీట మునగడంతో.. వారధి నిర్మాణం ఆవశ్యకతను పాలకులు గుర్తించారు. ఈ మేరకు గోదావరిపై నిర్మించిన తొలి వంతెనకు ఈనెల 13వ తేదీతో 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనమిది.

ఆ ప్రమాదంతో నిర్మాణానికి అడుగులు

1959లో శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తులు రెండు పడవలను కట్టుకుని గోదావరి నదిపై ప్రయాణం ప్రారంభించారు. అయితే, వరద ఉధృతితో వారి పడవలు మునిగిపోగా.. సుమారు 150 మంది మృతి చెందారు. దీంతో స్పందించిన నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం గోదావరి నదిపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1959 డిసెంబర్ 16న శంకుస్థాపన చేశారు. వంతెన డిజైన్, నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను ముంబైకి చెందిన పటేల్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు అప్పగించారు. ఆపై అనేక అవాంతరాల నడుమ వంతెన నిర్మాణం సాగుతూ ఆరేళ్లకు పూర్తవగా.. 1965 జూలై 13న అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు.



భద్రాచలం వద్ద గోదావరిపై రెండు వంతెనల మీదుగా రాకపోకలు

అప్పట్లో రూ.70 లక్షలతో నిర్మాణం

భద్రాచలం వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణానికి రూ.70 లక్షలు వెచ్చించారు. దీన్ని 3,934 అడుగుల పొడవు, 37 పిల్లర్లు, ఒక్కొక్క పిల్లర్ మధ్య 106.6 అడుగుల దూరంతో.. ముంబైకి చెందిన పటేల్ ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యాన నిర్మించారు. ఈ వంతెనపై ఇన్నాళ్లూ లక్షలాది వాహనాల రాకపోకలు సాగినా పటిష్టంగానే ఉండడం విశేషం. ఈ వంతెనకు ఇంకా సామర్థ్యం ఉన్నా.. జాతీయ రహదారి కావడంతో.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా పక్కనే మరో వంతెన నిర్మించారు. కొత్త వంతెన నిర్మాణానికి 2015లో శ్రీకారం చుట్టగా 2024లో శ్రీరామనమి వేడుకల వేళ అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.100 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేయగా.. ముంబైకే చెందిన రాజ్‌దీప్ సంస్థ పనులను దక్కించుకుని 2024 నాటికి పూర్తిచేసింది.

నాలుగు రాష్ట్రాల ప్రజలకు సదుపాయం

భద్రాచలంలో గోదావరిపై 1965లో అందుబాటులోకి వచ్చిన వంతెన ద్వారా నాలుగు రాష్ట్రాల ప్రజలకు రవాణా సదుపాయం ఏర్పడింది. ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వచ్చివెళ్లే వారికి ఇది వారధిగా నిలుస్తోంది. అప్పుడప్పుడు చిన్న చిన్న మరమ్మతులు తప్ప ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. కాగా, 1986లో మొదటిసారి గోదావరికి 75.6 అడుగుల వరద వచ్చినప్పుడు.. ఉన్నతాధికారులు వంతెనపై రాకపోకలను నిషేధించారు. మళ్లీ 2022లో కూడా అంటే దాదాపు 36 ఏళ్ల తర్వాత భారీగా వరద రావడంతో రాకపోకలను కొన్నాళ్లు నిలిపివేశారు.

ఎన్నో వరదలకు ప్రత్యక్ష సాక్షి

భద్రాచలం వద్ద గోదావరి వరద ఆరున్నర దశాబ్దాల్లో పలుమార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటింది. ఎప్పుడూ జూలైలోనే గోదావరి నది 11 సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటడమే కాకుండా.. నాలుగుసార్లు మూడో ప్రమాద హెచ్చరికను (53 అడుగులు) సైతం దాటడం గమనార్హం. 1972 జూలై 6న 44.3 అడుగులుగా గోదావరి నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1986లో 75.6 అడుగులు, 1988 జూలై 29న 54.3, 2002 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 57, 2013 జూలై 24న 56.7, 2016 జూలై 12న 52.4 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇక 2022లో జూలై 16న 71.3 అడుగులుగా నీటిమట్టం నమోదు కాగా, 2023లో జూలై 29న 56.1, 2024లో జూలై 27న 53.9 అడుగులుగా నమోదైంది. వరదలే కాక గోదావరి ఎండిపోయి ఇసుక తిన్నెలు తేలడానికి కూడా ఈ వంతెన సాక్షిగా నిలిచింది.

ఆయా జిల్లాల్లో పాత, కొత్త రేషన్‌కార్డుల వివరాలు ఇవీ...

జిల్లాపేరు	పాత కార్డులు	పాత యూనిట్లు	కొత్త కార్డులు	కొత్త యూనిట్లు
ఆదిలాబాద్	1,91,614	6,36,492	6,878	68,170
భద్రాద్రి	2,93,263	8,38,399	872	1,07,434
హనుమకొండ	2,28,118	6,74,865	2,629	1,48,279
హైదరాబాద్	6,39,451	23,61,440	1,163	3,30,528
జగిత్యాల	3,07,091	8,81,469	8,762	1,78,971
జనగామ	1,61,132	4,85,164	246	66,307
భూపాలపల్లి	1,23,453	3,44,470	459	49,526
గద్వాల	1,60,099	5,45,398	46	97,154
కామారెడ్డి	2,53,255	8,56,672	5,925	1,49,581
కరీంనగర్	2,76,895	8,04,498	1,772	1,77,897
ఖమ్మం	4,11,143	11,29,122	453	1,62,450
కుమరంభీం	1,39,754	4,59,031	440	73,826
మహబూబాబాద్	2,40,359	7,04,796	1,068	1,39,296
మహబూబ్‌నగర్	2,39,500	7,89,439	1,254	1,13,936
మంచిర్యాల	2,19,152	6,37,864	9,743	1,24,158
మెదక్	2,13,771	6,85,114	611	99,414
మేడ్చల్	5,23,800	17,17,263	6,453	2,15,154
ములుగు	91,425	2,52,846	780	47,573
నాగర్‌కర్నూల్	2,37,800	7,49,761	2,981	1,14,701
నల్లగొండ	4,65,998	13,91,798	102	2,89,118
నారాయణపేట	1,40,320	5,08,354	982	96,609
నిర్మల్	2,08,426	6,40,135	5,696	1,58,603
నిజామాబాద్	4,01,959	12,81,215	3,494	2,05,745
పెద్దపల్లి	2,19,622	6,24,380	2,521	93,925
రాజన్న సిరిసిల్ల	1,73,725	4,96,968	4,560	97,698
రంగారెడ్డి	5,58,352	18,21,881	7,830	1,83,870
సంగారెడ్డి	3,78,511	12,32,137	4,136	1,51,438
సిద్దిపేట	2,91,374	8,93,479	7,956	1,79,096
సూర్యాపేట	3,24,165	9,31,014	2,837	1,73,818
వికారాబాద్	2,41,169	8,08,896	9,640	1,66,940
వనపర్తి	1,57,094	5,15,999	368	82,127
వరంగల్	2,66,661	7,87,439	277	76,984
యాదాద్రి	2,16,831	6,59,767	2,409	1,14,104

కార్డుల జారీ వివరాలు ఇలా...

01-01-2025 నాటికి రాష్ట్రంలో ఉన్న రేషన్ కార్డులు: 89,95,282, అందులో సభ్యులు (యూనిట్లు): 2,81,47,565

26.01.2025 నుంచి 23.05.2025 వరకు జారీ అయిన కార్డులు: 2,03,156, కొత్తగా చేరిన సభ్యులు: 5,90,488, పాత కార్డుల్లో కొత్తగా చేరిన సభ్యులు: 23,90,868

24.05.2025 నుంచి 14.07.2025 వరకు జారీ చేయనున్న కొత్త కార్డులు: 3,58,187, అందులోని సభ్యులు (యూనిట్లు): 11,11,223, పాతకార్డుల్లో చేరనున్న సభ్యులు: 4,41,851

జనవరి నుంచి ఇప్పటి వరకు కొత్తగా జారీ చేసిన, చేస్తున్న కార్డుల సంఖ్య : 5,61,343 . డూప్లికేట్ పేర్లు తొలగించిన తర్వాత ప్రస్తుతం కార్డుల్లో సభ్యుల సంఖ్య: 3,09,30,911

నోట్: గణాంకాల వివరాలు శనివారం మధ్యాహ్నం వరకు అందిన సమాచారం మేరకు మాత్రమే....

ప్రకృతి ప్రియుడు

3.5 లక్షల మొక్కలు నాటిన రాజ్‌కుమార్



భార్య శివానితో కలిసి పర్యావరణ పరిరక్షణ కోసం ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్

కోల్‌సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన పిట్టల రాజ్‌కుమార్ ప్రకృతికి పరవశించిపోతాడు. ఆయనకు మొక్కలంటే ప్రాణం. ఇప్పటివరకు మూడున్నర లక్షల మొక్కలకుపైగా నాటాడు. అంతేకాదు.. కనిపించిన వారికల్లా మొక్కలు పంపిణీ చేస్తున్నాడు. దీంతో రాజ్‌కుమార్‌కు మొక్కలంటే ఎంత ఇష్టమో అర్థం చేసుకోవచ్చు. గోదావరిఖనిలోని విద్యానగర్‌కు చెందిన రాజ్‌కుమార్ పీజీలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్(ఎంఎస్‌డబ్ల్యూ) పూర్తిచేశాడు. 2009 నుంచే అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. ప్రకృతికి తొలిప్రాధాన్యం ఇస్తున్నాడు. 2012లో మదర్ హ్యూమన్ యూత్ సొసైటీ సంస్థను ఏర్పాటు చేసిన రాజ్‌కుమార్.. స్వయంగా మొక్కలు నాటడంతోపాటు పెళ్లిళ్లు, పుట్టినరోజు వేడుకలు, కొత్తగా బాధ్యతలు స్వీకరించే అధికారులు, వీడ్కోలు తదితర కార్యక్రమాలతోపాటు ఏటా వర్షాకాలంలో మొక్కలను పంపిణీ చేస్తున్నాడు. ఫారెస్ట్ బైహార్ట్ ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో ప్లాంటేషన్‌పై ప్రత్యేక శిక్షణ పొందిన రాజ్‌కుమార్.. మంచిర్యాల జిల్లాలోని జైపూర్‌లో రెండున్నరేళ్లుగా మొక్కల పర్యవేక్షకుడిగా పనిచేస్తున్నాడు. గోదావరిఖనిలో చెట్లను నరికివేస్తున్నారని తెలిస్తే, అక్కడ ప్రత్యక్షమవుతున్న ఆయన.. చెట్లను నరకకుండా అడ్డుకుంటున్నాడు. తనభార్య శివానితో కలిసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాడు. వర్షాకాలంలో ప్రజలకు తక్కువ ధరలో మొక్కలను అందించాలనే లక్ష్యంతో గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట ఏటా మొక్కల ప్రదర్శన, నర్సరీ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నాడు.



నర్సరీలో పిట్టల రాజ్‌కుమార్

ప్రాసెట్-టీఎస్ నూతన కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: పీఆర్టీయూ-టీఎస్‌కు అనుబంధంగా ఉన్న ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ అసోసియేషన్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (ప్రాసెట్) అడ్‌హాక్ కమిటీ శనివారం ఏర్పాటైంది. నారాయణగూడలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షునిగా జంగం సుమన్ (భద్రాద్రి జిల్లా), ప్రధాన కార్యదర్శిగా జి.శివరాజ్ (యాదాద్రి జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా మారుపాక భాస్కర్ (యాదాద్రి జిల్లా) నియమితులయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎం.కపిల్ రెడ్డి, శ్రీకాంత్ చారి, రహీం, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిలివేరి వెంకటేశం, జ్యోతి ఎన్నికయ్యారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌ని కలిసిన మందకృష్ణ

సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయం పట్ల లోతైన అవగాహన కలిగి ఉన్న మేధావి, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం పట్ల అచంచల విశ్వాసం కలిగిన ఉన్న గొప్ప న్యాయమూర్తి సుప్రీంకోర్టు సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో సీజే జస్టిస్ గవాయిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం మీద నిర్దిష్టమైన అభిప్రాయం కలిగిన సమానత్వవాది అని పేర్కొన్నారు. ఎన్నో చారిత్రక తీర్పులు వెలువరించి న్యాయవ్యవస్థ మీద ప్రజలకున్న నమ్మకాన్ని పెంచిన న్యాయకోవిదుడు, ఎన్నో చారిత్రక తీర్పుల్లో భాగస్వామిగా ఉండి న్యాయాన్ని నిలబెట్టడానికి కృషి చేసిన వ్యక్తి చీఫ్ జస్టిస్ కావడం దేశానికి గర్వకారణమని కొనియాడారు. దళిత పేద కుటుంబంలో పుట్టి ఎన్నో వివక్షల్ని ఎదుర్కొని ఎంతో కష్టపడి ఉన్నత మైలురాయికి చేరుకొని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ గవాయ్ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్, జస్టిస్ నరసింహలను సన్మానించిన హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు



నయనమనోహరం

రాగం, తాళం, అభినయం ప్రధానంగా అలవోకగా భావాలను ప్రదర్శించే శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. అనంతపురంలోని టీటీడీ కళ్యాణమండపంలో శనివారం చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఊపందుకున్న విగ్రహాల తయారీ

వినాయక చవితి దగ్గర పడుతుండటంతో విగ్రహాల తయారీ ఊపందుకుంది. ఏడాది పొడుగునా అదేపని మీద ఉండే కార్మికులు ప్రస్తుతం విగ్రహాల తయారీని ముమ్మరం చేశారు. విజయవాడలోని నున్న మ్యాంగో మార్కెట్ సమీపంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కూటమికే 'ఫిట్‌నెస్'



రాజానగరంలోని ఫిట్‌నెస్ సెంటర్

అధికార పార్టీ నేతల చేతుల్లోకి వాహన సామర్థ్య సర్టిఫికెట్ల జారీ విధానం

- కాకినాడ, అనకాపల్లి, రాజానగరంలో ఫిట్‌నెస్ టెస్టింగ్ యూనిట్లు టీడీపీ వారికే
- ఇలాంటి నిర్ణయం పట్ల రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్‌లో ప్రజా వ్యతిరేకత
- దీంతో వెనక్కుతగ్గిన ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు..
- మన రాష్ట్రంలో టీడీపీ నాయకుడు కావడంతో ప్రోత్సహిస్తున్న సర్కారు
- ప్రభుత్వ ఆదాయానికి గండి... ప్రైవేటు విధానంపై నిరసనల వెల్లువ
- రాజమహేంద్రవరం, శ్రీకాకుళంలో ఆటో డ్రైవర్ల ఆందోళన



ఫిట్‌నెస్ సెంటర్ వద్ద వాహనాలు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ సేవలను ప్రైవేటుకు కట్టబెట్టు... కూటమి నాయకులకు దోచిపెట్టు..! ఇసుక, గనులు, మద్యంలో దోచెయ్... పచ్చ నేతల జేబులు నింపేయ్...! చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఏడాదిగా రాష్ట్రంలో ఇదే తంతు...! ఈ జాబితాలోకి రవాణా విభాగం కూడా చేరింది. ఈ శాఖలో అత్యంత కీలకమైన వాహనాల ఫిట్‌నెస్ (సామర్థ్య) సర్టిఫికెట్ల జారీ సేవలను టీడీపీ నేతకు చెందిన ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. యువగళంలో పాదయాత్ర చేసినవారికి కేటాయించింది. ఇకపై లైట్, హెవీ మోటార్ వెహికల్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను కూటమి నేతల నేతృత్వంలోని ప్రైవేటు సంస్థ జారీ చేస్తుంది.

- ఇప్పటివరకు రవాణా శాఖ కార్యాలయంలో వాహనాల ఫిట్‌నెస్‌ను సర్టిఫై చేసేవారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పనులన్నీ ఇక ప్రైవేటు సంస్థకు చెందిన వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో జరుగుతాయి. దీనిపై ఎవరికీ అజమాయిషీ ఉండదు. నేరుగా కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది.

కూటమి నేతలకే ఏటీఎస్ సెంటర్లు

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) మంజూరైంది. తొలి దశలో 15 ప్రారంభమయ్యాయి. త్వరలో మరికొన్నిటిని అందుబాటులోకి తెచ్చేలా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదే అదనుగా రంగంలోకి దిగిన టీడీపీ నేతలు సింహభాగం సెంటర్లను కైవసం చేసుకున్నారు. దీనివెనుక మంత్రి లోకేష్ చక్రం తిప్పినట్లు సమాచారం. యువగళం పాదయాత్ర చేసిన టీడీపీ నేతలకు కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి.

- కాకినాడ, రాజానగరం, అనకాపల్లి ప్రాంతాల్లో మాత్రం ఓ రాజ్యసభ సభ్యుడి అనుయాయులకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తంతు నడిచినట్లు తెలిసింది.

చలానాపై ఆందోళన

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేందుకు తొలుత సంస్థ పేర్కొన్న మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. నిర్దేశించిన సమయంలోగా పరీక్ష చేయించుకోకుంటే చలానా సమయం ముగిసిపోతుంది. తిరిగి చలానా తీయాలి. గతంలో చలానాకు వారం నుంచి 15 రోజుల వరకూ గడువుండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని వాహనదారులు వాపోతున్నారు. పైగా ప్రభుత్వం గతంలో వసూలు చేసిన దాని కంటే చలానా రూ.200కు పైగా పెంచారని చెబుతున్నారు.

చిన్నవాటికీ తిరస్కరణ

ఇదివరకు వాహనం ఫిట్‌నెస్‌కు వెళ్తే చిన్నపాటి మరమ్మతులుంటే సరిచేసుకుని వస్తే సర్టిఫికెట్ ఇస్తామని చెప్పేవారు. ప్రస్తుతం బ్రేక్ ఆయిల్ తక్కువగా ఉండటం చిన్నపాటి విషయానికీ అన్‌ఫిట్ చేసేస్తున్నారు. ఈ విషయం వారం తర్వాత మెసేజ్ ద్వారా తెలుస్తోంది. అప్పటికి చలానా గడువు ముగిసిపోతోంది. మళ్లీ చలానా కట్టాల్సి వస్తోంది. ఇదే అదనుగా బ్రోకర్లు రంగంలోకి దిగి రూ.వేలు వసూలు చేస్తున్నారు.

గ'లీజు'

ఒక ఏటీఎస్ స్థాపించేందుకు సుమారు రూ.5 కోట్లు ఖర్చవుతోంది. ప్రభుత్వం ఏకంగా రూ.3 కోట్ల సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన రూ.2 కోట్లు ప్రైవేటు సంస్థ వెచ్చించాలి. దీనిపై కార్మికులు మండిపడుతున్నారు. ఏటా ఫిట్‌నెస్‌కు ప్రతి జిల్లా నుంచి రూ.కోట్లు వసూలవుతాయి. వాటిని ఆ ప్రైవేటు సంస్థే తీసుకుంటుంది. ఫిట్‌నెస్ టెస్ట్‌ల ద్వారా రెండేళ్ల పాటు వసూలు చేసిన సొమ్మును ఆ సంస్థ సొంతానికి వాడుకోవచ్చు. ప్రభుత్వానికి పైసా చెల్లించాల్సిన పనిలేదు. ఆ సంస్థ బాగుపడేలా ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రైవేటీకరణ ఏకంగా 20 ఏళ్లకు రాసివ్వడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు, వివిధ సంస్థల నుంచి అప్పులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఇలా దీర్ఘకాలిక లీజులు ఇస్తోందని వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.

మిగిలిన రాష్ట్రాలు వ్యతిరేకించినా..

కేంద్రం తీసుకున్న ఫిట్‌నెస్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఏ రాష్ట్రమూ అమలు చేయడం లేదు. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్‌లో వాహన కార్మికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కర్ణాటక, రాజస్థాన్ ప్రభుత్వాలు అమలు నిలిపివేశాయి. గుజరాత్ పాత, కొత్త విధానాల్లో చేయించుకునే వెసులుబాటు కల్పించింది. మిగిలిన రాష్ట్రాలు అమలుపై వెనక్కి తగ్గినా.. ఏపీలో కూటమి ప్రభుత్వం మాత్రం కార్మికులను ఇబ్బందిపెట్టేలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కేవలం తమ పార్టీల నేతలకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా చేస్తోందన్న చర్చ నడుస్తోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు 1.80 కోట్లు ఉన్నాయి. వీటిలో ఏటా 15 లక్షల వాహనాలు ఫిట్‌నెస్ కోసం వస్తుంటాయి. తద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.150 కోట్ల ఆదాయం వస్తుంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో ఈ ఆదాయానికి గండి పడినట్లే.

దూరంగా సెంటర్లు.. వెల్లువెత్తుతున్న నిరసనలు

ఫిట్‌నెస్ సెంటర్లను జిల్లా కేంద్రాలకు దూరంగా ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై కార్మికులు, డ్రైవర్లు, వివిధ పార్టీల నేతల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లాలోని 18 మండలాలకు సంబంధించి రాజానగరం వద్ద ఏటీఎస్ పెట్టారు. నల్లజర్ల నుంచి రాజానగరం వచ్చి వెళ్లాలంటే 150 కిలోమీటర్లు ప్రయాణించాలి. దీనిపై కార్మికులు, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, వివిధ రవాణా వాహన కార్మిక సంఘాల ప్రతినిధుల జేఏసీ కన్వీనర్లు వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్ ప్రసాద్ తదితరులు రాజానగరం ఏటీఎస్ దగ్గర మంగళవారం నిరసన తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం రావాలంటే 130 కిలోమీటర్లు ప్రయాణించాలి. పనులు మానుకుని రావాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు.

ఫిట్‌నెస్ ప్రైవేటీకరణపై పోరాటం

కార్మికులు ఏమీ చేయలేరన్న ఉద్దేశంతో ఫిట్‌నెస్ ప్రైవేటీకరణకు పాల్పడ్డారు. దీనిని ఉపసంహరించుకునే దాక పోరాటం ఉధృతం చేస్తాం. వేలాదిగా కార్మికులతో రోడ్డెక్కుతాం. ఈ విషయంలో కార్మిక జేఏసీ తీసుకున్న నిర్ణయానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. మాజీ సీఎం వైఎస్ జగన్ అండగా ఉంటారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాహనమిత్ర ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం ఇచ్చేది. కూటమి ప్రభుత్వం అది ఇవ్వడం లేదు. ఏ ప్రభుత్వం మంచి చేసిందో కార్మికులు గ్రహించాలి.

– మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ, రాజమహేంద్రవరం

ఉపసంహరించుకోవాలి

ఫిట్‌నెస్ జారీని ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నాం. దీనిని తక్షణమే ఉపసంహరించాలి. కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వ్యక్తులకు సామర్థ్య పరీక్షలు అప్పగిస్తే పారదర్శకత ఏం ఉంటుంది? ఒక వాహనానికి పరీక్ష చేయాలంటే 40 నిమిషాలు పడుతోంది. కొన్ని పాఠశాలలు, కళాశాలల వాహనాలు సెంటర్ వద్దకు రాకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారు.

– వాసంశెట్టి గంగాధరరావు, కార్మిక సంఘాల ప్రతినిధుల జేఏసీ కన్వీనర్, రాజమహేంద్రవరం

చలానాల పెంపు ఇలా..

వాహనం	పాత చలానా	కొత్త చలానా	బాదుడు
లారీ	920	1320	400
మినీ వ్యాన్	920	1320	400
ఎల్ఎంవీ	720	920	200
ఆటో	620	820	200

అడ్డంతిరిగిన రైతులు.. వెనక్కి తగ్గిన ప్రభుత్వం

అమరావతిలో రెండో విడత భూ సేకరణపై ప్రభుత్వం వెనుకంజ

మొదటికే మోసం వస్తుందన్న భయంతో తాత్కాలికంగా వాయిదా

రైతులతో చర్చించి ఒప్పిస్తామని సన్నాయి నొక్కులు



పొన్నెకల్లులో తిరగబడి గో బ్యాక్ అంటున్న టీడీపీ నాయకులు, రైతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెండో విడత భూసేకరణపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు రైతుల నిరసన సెగ తగిలింది. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సామాజికవర్గానికి చెందిన రైతులే తిరగబడటంతో చంద్రబాబు సర్కారు ఒక అడుగు వెనక్కి వేసింది. భూసేకరణపై బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేసింది. రైతులతో చర్చించి, వారిని ఒప్పించి నిర్ణయం తీసుకుంటామంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మొదలుపెట్టింది. భూసేకరణపై ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, గ్రామాల్లో అధికారులు వ్యవహరిస్తున్న తీరుకు పొంతన లేదు. గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామసభలు నిర్వహిస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేశారు. ఎక్కడ భూమి తీసుకుంటారో, ఏ గ్రామాల్లో ఎంత అవసరమో... అనేది చెప్పకుండా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ముందు ప్రకటించిన గ్రామాల్లోనే కాకుండా తాడికొండ మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించడం వివాదానికి దారితీసింది. ప్రభుత్వం పైకి చెబుతున్నది ఒకటైతే పరోక్షంగా లక్ష ఎకరాలకు పైగా భూసమీకరణ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆ దిశగా అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. భూసేకరణకు అంగీకరించబోమని అడ్డం తిరిగారు.

గెజిట్‌తో సంబంధం లేకుండా గ్రామసభలు

తాడికొండ మండలంలోని మూడు గ్రామాల్లో 7,256 ఎకరాలు, తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాల్లో 10,878 ఎకరాలు, అమరావతి మండలంలోని 8 గ్రామాల్లో 19,504 ఎకరాలు, పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామాల్లో 4,586 ఎకరాలు కలిపి 42,226 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించి గ్రామసభలు నిర్వహించారు. వీటికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైంది. అయితే గెజిట్‌తో సంబంధం లేకుండా అభిప్రాయ సేకరణ పేరుతో తాడికొండ మండలంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తాము భూములివ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయా సభల్లో వినతిపత్రాలు కూడా అందజేశారు. భూసేకరణపై బేజాత్పురం, రావెల గ్రామసభల్లో రైతులు ప్రశ్నించినప్పటికీ ఎమ్మెల్యే, ఆర్డీవోలు దాటవేత ధోరణి అవలంభించారు. స్పష్టమైన సమాధానం చెప్పలేదు. నోటిఫికేషన్‌కు ముందు జరిపిన గ్రామ సభలకు సంబంధం లేకుండా గత గురువారం తాడికొండ మండలంలోని పాములపాడు, బేజాత్పురం, రావెల గ్రామాల్లో సభలు నిర్వహించగా, తర్వాత రోజు ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో రైతులు పూర్తిగా అడ్డం తిరిగి తాము భూములిచ్చేది లేదంటూ ఎమ్మెల్యే గో బ్యాక్... అంటూ నినాదాలతో హోరెత్తించారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అధికారులు మధ్యలోనే వెనుతిరగాల్సి వచ్చింది. ఇప్పటికే తీసుకున్న 33 వేల ఎకరాలను అభివృద్ధి చేసి ఈ ప్రాంతంలో మాకు మేలు చేస్తారనుకుంటే మరో లక్ష ఎకరాలు సమీకరణ పేరుతో మా నోళ్లు కొడతారా? అంటూ సీఎం చంద్రబాబుపై గ్రామాల్లో రైతులు మండిపడుతున్నారు.

భూములు ఇచ్చేది లేదని మైక్ ప్రచారం

భూసమీకరణకు తాము భూములు ఇచ్చేది లేదంటూ రాజధాని గ్రామాల్లో ఇటీవల మైక్ ప్రచారం కూడా చేయడం సంచలనంగా మారింది. మొదటి దశలో భూములు తీసుకున్న రైతులకు న్యాయం చేసిన తర్వాతే రెండో దశ పూలింగ్‌కు వెళ్లాలంటూ సీఆర్డీఏ సిటిజన్ కమిటీ సమావేశంలో సభ్యుడిగా ఉన్న రాజధాని ప్రాంత టీడీపీ సీనియర్ నాయకుడు స్పష్టంచేశారు. సొంత పార్టీ నేతలే ఈ వ్యవహారంపై ఎదురుతిరగడంతో చంద్రబాబు మాట మార్చి రెండో దఫా భూ సమీకరణను కుదించి తుళ్లూరు మండలంలోని 3 గ్రామాలు, అమరావతి మండలంలో కొన్ని గ్రామాలకే పరిమితం చేశారు. అయినప్పటికీ పెదపరిమి గ్రామ రైతులు బహిరంగంగా మైకులు పెట్టి మరీ మా భూములివ్వం... అంటూ ఎదురుతిరగడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. తొలి విడతలో భూములిచ్చిన రైతులకు న్యాయం చేయకుండా మళ్లీ ఈ ప్రాంతంలో వ్యవసాయం కనుమరుగు చేసేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతులను నట్టేట ముంచుతాయని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో చంద్రబాబు తాత్కాలికంగా భూసేకరణ వ్యవహారాన్ని పక్కనపెట్టినట్లు సమాచారం.





గొడుగులు పట్టుకొని చదువుకుంటున్న విద్యార్థులు , (ఇన్‌సెట్) వర్షాలకు ఆగని రేకుల షెడ్డులో.. గోడలు లేని ముక్కిపుట్టు పాఠశాల

వానొస్తే గొడుగుడుగుంచం!

బడిలో ఆటల సమయంలో చిన్నారులు గుడుగుడు గుంచం ఆడడం చూస్తుంటాం.. కానీ ఈ చిన్నారులు వానొస్తే నిత్యం 'గొడుగు'డుగుంచం అంటూ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తడిచిముద్దయిపోతున్నారు. ఈ చిత్రంలో కనిపించేది ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీ ముక్కిపుట్టులో ఎంపీపీ పాఠశాల. ప్రస్తుతం ఈ బడిలో 27 మంది పిల్లలు చదువుతున్నారు. పక్కా భవనం లేకపోవడంతో తల్లిదండ్రులు నిర్మించిన ఈ చిన్న రేకుల షెడ్డులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల పైకప్పు కారిపోతోంది. ఫలితంగా పిల్లలు ఇలా గొడుగులు పట్టుకుని కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గోడలు లేకపోవడంతో పక్క నుంచి పడే జల్లు వానకు తడిచి ముద్దవ్వాల్సిందే. గ్రామస్తులు షెడ్డుపైన టార్పాలిన్లు కప్పినా ఫలితం లేదు. నేలంతా బురదమయమవుతోంది. గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోవడంతో విద్యావలంటీర్‌తోనే పాఠశాలను నడిపిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చత్వారం సోకిన సర్కారు ఈ ఛత్రాలు చూసైనా చలించకపోతుందా అని నిరీక్షిస్తున్నారు. పక్కా భవనం నిర్మించడంతోపాటు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతున్నారు. – ముంచంగిపుట్టు

కరువు భత్యం చెల్లించండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు ఇవ్వాల్సిన కరువు భత్యం(డీఏ) వెంటనే చెల్లించాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2023 జూలై నుంచి ఇప్పటి వరకు నాలుగు విడతలుగా డీఏలు కలిపి మొత్తం 16.38 శాతం ఇవ్వాల్సి ఉందన్నారు.

తక్షణమే చెల్లించండి : సకాలంలో డీఏ చెల్లిస్తామని, మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి రీత్యా ఏడాది పాటు ఓర్పు వహించామని, తక్షణమే పెండింగ్ బకాయిలు ఇవ్వాలని పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు.

పీఆర్సీపై కమిటీని నియమించాలి: ఆప్టా

కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు వెంటనే పీఆర్సీకి కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4 డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

రూ.50 లక్షల విలువైన 250 మొబైల్ ఫోన్ల అప్పగింత



చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసులు దాదాపు రూ.50 లక్షల విలువ చేసే 250 సెల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ వివరాలు వెల్లడించారు. ఫోన్లు పోగొట్టుకున్న వాళ్లు, చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వాటి వివరాలను పోలీసుశాఖకు వాట్సప్‌లో 9440900004 నెంబరుకు హాయ్ అని పెట్టడం, సీఈఐఆర్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా ఫోన్లను కనిపెట్టి.. అప్పగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తుచేసి బాధితుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్లను వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించామన్నారు. ఇందుకోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐటీ విభాగం పనిచేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పన్నెండు విడతల్లో 3,791 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. వీటి విలువ దాదాపు రూ.7.92 కోట్లు ఉంటుందన్నారు.

జట్టు కడదాం... హిట్టు కొడదాం!

ఏ ఇండస్ట్రీలోనైనా ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ కనిపిస్తుంది. ఇటీవలి కాలంలో పాన్ ఇండియా ట్రెండ్ కనిపించింది. అయితే ఒకప్పుడు తెలుగు సినిమాల్లో కనిపించిన మల్టీస్టారర్ ట్రెండ్ ఇప్పుడు మళ్లీ ఊపందుకుంది. ఒక సినిమాలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ స్టార్స్ నటిస్తున్నారు. ఆడియన్స్ థియేటర్స్‌కు వచ్చి సినిమా చూసే పరిస్థితులు తగ్గిపోతున్న ఈ తరుణంలో టాప్ హీరోలు ఇలా మల్టీస్టారర్ సినిమాలు చేసేందుకు ఒప్పుకోవడం ఓ మంచి పరిణామమే. ఇలా తాజాగా 'జట్టు కడదాం... హిట్టు కొడదాం' అంటూ ఆడియన్స్ ముందుకు రానున్న కొన్ని మల్టీస్టారర్ తరహా సినిమాలపై ఓ లుక్ వేద్దాం.


చిరంజీవి


వెంకటేశ్


నాగార్జున


బాలకృష్ణ


రజనీకాంత్


ఎన్టీఆర్


హృతిక్ రోషన్


అల్లు అర్జున్


ప్రభాస్


అమితాబ్ బచ్చన్


రామ్


ఉపేంద్ర

సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం

సీనియర్ టాప్ స్టార్స్ చిరంజీవి, వెంకటేశ్ ఒకే సినిమాలో స్క్రీన్‌పై కనిపిస్తే ఆడియన్స్ సూపర్‌గా ఎగ్జైట్ అవుతారు. ఈ ఇద్దరు టాప్ స్టార్స్‌ని దర్శకుడు అనిల్ రావిపూడి ఒకే ఫ్రేమ్‌లోకి తీసుకు రానున్నారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి ఓ ఫ్యామిలీ అండ్ ఫన్ ఎంటర్‌టైనర్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలోనే వెంకటేశ్ ఓ కీలక పాత్రలో నటించనున్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఓ సందర్భంలో వెంకటేశ్ కూడా కన్ఫార్మ్ చేశారు. ఇప్పటికే ఈ సినిమా మూడు షెడ్యూల్స్ చిత్రీకరణ పూర్తయింది. నాలుగో షెడ్యూల్ కోసం అతి త్వరలోనే కొచ్చి వెళ్లనుంది యూనిట్. అక్కడ చిరంజీవి – నయనతార కాంబినేషన్‌లో ఓ సాంగ్ చిత్రీకరణ, కొంత టాకీ పార్టు, ఓ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్‌ను ప్లాన్ చేశారని తెలిసింది. ఈ షెడ్యూల్ తర్వాత హైదరాబాద్‌లో జరిగే కొత్త షూటింగ్ షెడ్యూల్‌లో వెంకటేశ్ రాకను అధికారికంగా ప్రకటిస్తారట మేకర్స్. ఇక ఈ సినిమాలో శివశంకర వరప్రసాద్ (చిరంజీవి అసలు పేరు) అనే డ్రిల్ మాస్టర్‌గా చిరంజీవి, ఆయన భార్య పాత్రలో నయనతార కనిపిస్తారని తెలిసింది. వెంకటేశ్ పాత్రపై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే ఈ సినిమాకు ప్రస్తుతానికి 'మన శివశంకర వరప్రసాద్‌గారు, సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. సుష్మితా కొణిదెల, సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమా యాక్షన్ జానర్ కాదు... దీంతో స్క్రీన్‌పై చిరంజీవి, వెంకటేశ్ కాంబినేషన్ సీన్స్ ఎలా ఉండబోతున్నాయి? ఎలాంటి ఫన్‌ను జనరేట్ చేయబోతున్నారనే అంశాలపై ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొని ఉంది.

చారిత్రక చిత్రంలో...

మల్టీస్టారర్ మూవీస్ చేయడంలో వెంకటేశ్ ముందుంటారు. గతంలో రామ్‌తో కలిసి 'మసాలా', పవన్ కల్యాణ్‌తో కలిసి 'గోపాల గోపాల' వంటి సినిమాలు చేశారు వెంకటేశ్. అయితే వెంకీ తాజాగా మరో పూర్తి స్థాయి మల్టీస్టారర్ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. ఇటీవల అమెరికాలో జరిగిన 'నాట్స్–2025' వేడుకల్లో భాగంగా తానో పెద్ద స్టార్‌తో కలిసి సినిమా చేయబోతున్నానని చెప్పేశారు. ఈ వేడుకలకు బాలకృష్ణ కూడా హాజరయ్యారు. దీంతో వెంకటేశ్–బాలకృష్ణ కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ కన్ఫార్మ్ అయిపోయిందనే టాక్ తెరపైకి వచ్చింది. తనకు 'వీరసింహారెడ్డి' వంటి హిట్‌ను అందించిన గోపీచంద్ మలినేనితో 'గౌతమి పుత్రశాతకర్ణి' తరహాలో బాలకృష్ణ ఓ వార్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేయనున్నారని తెలిసింది. ఈ సినిమాలోనే వెంకటేశ్ ఓ లీడ్ క్యారెక్టర్‌లో కనిపిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై పూర్తి స్థాయిలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు.

కూలీతో కొట్లాట

యాక్టర్‌గా కెరీర్‌లో నాగార్జున కాస్త రూట్ మార్చినట్లుగా ఉన్నారు. ఇటీవల ధనుష్‌తో కలిసి 'కుబేర' సినిమా చేశారు. ఈ సినిమాలో దీపక్ పాత్రలో నాగార్జున మెప్పించారు. అయితే ఇలాంటి కీలక తరహా పాత్రనే 'కూలీ' సినిమాలోనూ చేశారు. రజనీకాంత్ లీడ్ రోల్ చేసిన ఈ చిత్రంలో నాగార్జున మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. దేవ పాత్రలో రజనీకాంత్ నటించగా, సైమన్ పాత్రలో నాగార్జున కనిపిస్తారు. అయితే సైమన్ పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉంటాయి. సినిమాలో రజనీ–నాగార్జున మధ్య వచ్చే సన్నివేశాలు సూపర్బ్‌గా ఉంటాయట. అలాగే ఈ 'కూలీ' సినిమాలోనే బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ 'దహా' అనే ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించారు. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఈ పాత్ర 'కూలీ' కథను కీలక మలుపు తిప్పుతుందని తెలిసింది. ఇంకా ఇదే చిత్రంలో ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతీ హాసన్, మలయాళ నటుడు సౌబిన్ షాహిర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించగా, 'మోనిక' అనే ఓ స్పెషల్ సాంగ్‌లో పూజా హెగ్డే డ్యాన్స్ చేశారు. రజనీకాంత్–నాగార్జున–ఆమిర్ ఖాన్–ఉపేంద్ర–శ్రుతీహాసన్... ఇలాంటి టాప్ యాక్టర్స్‌తో 'కూలీ' ఓ పర్‌ఫెక్ట్ మల్టీస్టారర్ సినిమాకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది.

సీక్వెల్ సిద్ధమౌతోంది!

ప్రభాస్ మెయిన్ లీడ్‌గా, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, కమల్‌హాసన్, ప్రధాన పాత్రల్లో నటించిన మైథలాజికల్ అండ్ సైన్స్ ఫిక్షనల్ సినిమా 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ ఈ సినిమాకు దర్శకుడు. సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 2024లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, కమల్‌హాసన్‌ల పాత్రలు చాలా పవర్‌ఫుల్‌గా కనిపించాయి. ఈ సినిమాకు సీక్వెల్ రానుంది. ఈ సీక్వెల్ షూటింగ్ ఈ సెప్టెంబరులో ప్రారంభం కానుందని ఇటీవల ఓ సందర్భంలో చెప్పారు అశ్వనీదత్. ఈ 'కల్కి 2898 ఏడీ పార్ట్ 2' చిత్రంలో కూడా ప్రభాస్ పాత్రకు దీటుగానే అమితాబ్ బచ్చన్, దీపిక, కమల్‌హాసన్‌ల పాత్రలు ఉంటాయని తెలిసింది. తొలి భాగం 'కల్కి 2898 ఏడీ'లో కనిపించిన విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, దిశా పటానీల రోల్స్ కూడా సీక్వెల్‌లో మరింత నిడివి ఎక్కువగా కనిపించనున్నాయట. ఇలా ఈ సీక్వెల్ ఓ పర్‌ఫెక్ట్ మల్టీస్టారర్‌గా ఆడియన్స్‌ను అలరించనుందనడంలో సందేహం లేదు.

బాలీవుడ్ వార్

నార్త్‌లో హృతిక్ రోషన్ సూపర్ స్టార్. సౌత్‌లో ఎన్టీఆర్ సూపర్ స్టార్. ఈ ఇద్దరు స్టార్స్ కలిసి చేసిన భారీ యాక్షన్ సినిమా 'వార్ 2'. 'బ్రహ్మాస్త్రం' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ స్పై యాక్షన్ డ్రామా సినిమాలో హీరోయిన్ కియారా అద్వానీ మరో లీడ్ రోల్ చేశారు. ఎన్టీఆర్‌కు తొలి స్ట్రయిట్ హిందీ ఫిల్మ్ కూడా 'వార్ 2'యే కావడం విశేషం. ఇటీవల ఈ 'వార్ 2' సినిమా నుంచి విడుదలైన టీజర్‌లోని యాక్షన్ సన్నివేశాలు సినిమా లవర్స్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా హృతిక్ రోషన్–ఎన్టీఆర్ మధ్య వచ్చే సన్నివేశాలు యాక్షన్ లవర్స్‌కి మంచి కిక్ ఇచ్చేలా ఉంటాయనిపిస్తోంది. అంతేకాదు... ఈ సినిమా కోసం ఎన్టీఆర్ – హృతిక్ రోషన్ మధ్య ఓ సూపర్ సాంగ్‌ను కూడా చిత్రీకరించారు మేకర్స్. ఇలా సినిమా లవర్స్‌కు 'వార్ 2' ఓ పర్‌ఫెక్ట్ మల్టీస్టారర్ మూవీగా కనిపిస్తోంది. వైఆర్‌ఎఫ్ (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ సినిమా ఆగస్టు 14న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఇక ఈ 'వైఆర్‌ఎఫ్' స్పై యూనివర్స్ నుంచి ఇప్పటికే సల్మాన్ ఖాన్ 'ఏక్తా టైగర్, టైగర్ జిందా హై', హృతిక్ రోషన్ – టైగర్ ష్రాఫ్‌ల 'వార్', షారుక్ ఖాన్ 'పఠాన్' వంటి సినిమాలొచ్చాయి. హీరోయిన్స్ ఆలియా భట్–శార్వరీ చేసిన 'ఆల్ఫా' సినిమా రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. కాగా 'వార్ 2' కూడా 'వైఆర్‌ఎఫ్' స్పై యూనివర్స్‌లో భాగంగా వస్తున్న సినిమాయే కనుక ఈ యూనివర్స్‌లోని ఇతర చిత్రాల్లో హీరోలుగా నటించిన సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, ఆలియా భట్ వంటి స్టార్స్ గెస్ట్ రోల్స్‌లో కనిపించే చాన్స్ ఉందట. ఇదే జరిగితే... యాక్షన్ లవర్స్‌కి 'వార్ 2' మరింత మజానిస్తుంది. భారీ బడ్జెట్‌తో ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించారు.

హీరో వర్సెస్ ఫ్యాన్

కన్నడ నటుడు ఉపేంద్ర తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. ఈ కన్నడ హీరో తాజాగా నటిస్తున్న తెలుగు సినిమా 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ఇందులో రామ్ మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారు. ఓ సినీ సూపర్ స్టార్ హీరో, అతని ఫ్యాన్‌కి మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో సూపర్ స్టార్ సూర్యకుమార్ పాత్రలో ఉపేంద్ర, సూర్యకుమార్ అభిమాని పాత్రలో రామ్ కనిపిస్తారు. భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు పి. మహేశ్‌బాబు దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ నైట్ షూట్‌లో రామ్–భాగ్యశ్రీలపై లవ్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. త్వరితగతిన ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేసి, ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలని మేకర్స్ అనుకుంటున్నారని తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమా కోసం హీరో రామ్ ఓ పాట రాశారని, ఈ పాటను తమిళ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ పాడతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

ఈ తరహాలో మరికొన్ని మల్టీస్టారర్ సినిమాలు ఉన్నాయి.

– మునిమి శివాంజనేయులు


రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాగూర్

మల్టీస్టారర్ సినిమాలంటే... ఇద్దరు, ముగ్గురు హీరోలున్న సినిమాలే కాదు... అలానే ఇద్దరు ముగ్గురు హీరోయిన్స్ ఉన్న సినిమాలను కూడా చెప్పుకోవచ్చు. హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకు అల్లు అర్జున్ సిల్వర్‌స్క్రీన్‌పై ద్విపాత్రాభినయం చేయలేదు. కానీ ఈ సినిమాలో అల్లు అర్జున్ ఏకంగా నాలుగు పాత్రలు చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. కథ రీత్యా..తాత -తండ్రి - ఇద్దరు కొడుకులు... ఇలా నాలుగు పాత్రల్లో అల్లు అర్జున్ కనిపించనున్నారట. అల్లు అర్జున్ పాత్రలకు తగ్గట్లే... ఈ సినిమాలో నలుగురు ప్రధాన హీరోయిన్స్ రోల్స్ ఉంటాయని, మరో కీలక పాత్రలో ఇంకో హీరోయిన్ కనిపిస్తారని.. ఇలా మొత్తంగా ఈ సినిమాలో ఐదుగురు హీరోయిన్స్ ఉంటారని తెలిసింది. ఈ ఐదుగురు హీరోయిన్స్‌లో దీపికా పదుకోన్ కన్ఫార్మ్ అయ్యారు. ఇంకా ఖరారైపోయిన వారిలో జాన్వీ కపూర్, రష్మికా మందన్నా, మృణాల్ ఠాగూర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఐదో హీరోయిన్ పాత్ర కోసం భాగ్య శ్రీ భోర్సే, బాలీవుడ్ నటి ఆలియా.ఎఫ్‌లపై టెస్ట్ షూట్ జరిగిందని, వీరిలో ఒకరు ఫైనల్ అవుతారని బాలీవుడ్ సమాచారం. ఇలా ప్రజెంట్ ట్రెండింగ్‌లో ఉన్న ఐదుగురు హీరోయిన్స్ ఒకే సినిమాలో నటించనుండటం, వీరిలో ఇద్దరు పవర్‌ఫుల్ వారియర్ రోల్స్ చేస్తుండటం, అందులోనూ రష్మికా విలన్ పాత్రలో కనిపిస్తారనే టాక్ తెరపైకి రావడం అనేది ఆడియన్స్‌ను కచ్చితంగా ఎగ్జైట్ చేసే విషయమే. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం 2027లో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

కామెడీ థ్రిల్లర్



'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి' పోస్టర్

దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్న తెలుగు–కన్నడ చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. అభిషేక్ ఎమ్. దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బృందా ఆచార్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీదేవి ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై హెచ్ కె. ప్రకాశ్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. ఇప్పటికే రిలీజైన ఈ మూవీ ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్ 'హర ఓం...' సాంగ్‌కి మంచి స్పందన వచ్చింది. బ్యాంక్ దోపిడీకి వెళ్లిన హీరో అండ్ గ్యాంగ్‌కి అక్కడ కేవలం 67 వేల రూపాయిలు మాత్రమే దొరుకుతాయి. ఆ తర్వాత ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అన్నది సినిమాలో వినోదాత్మకంగా ఉంటుంది. దీక్షిత్ శెట్టి నటన, కామెడీ టైమింగ్ అదిరిపోతుంది. ఈ చిత్రంలో కామెడీ, థ్రిల్లర్, యాక్షన్... ఇలా అన్నింటినీ అద్భుతంగా బ్లెండ్ చేశారు అభిషేక్'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

డాన్‌తో ఢీ?


విజయ్ దేవరకొండ

'పెళ్ళి చూపులు, అర్జున్ రెడ్డి, గీత గోవిందం' వంటి హిట్ సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేకమైన మేనరిజం, ఫ్యాన్ ఫాలోయింగ్‌ని సొంతం చేసుకున్నారు హీరో విజయ్ దేవరకొండ. ప్రస్తుతం కథానాయకుడిగా వరుస తెలుగు ప్రాజెక్టులతో బిజీ బిజీగా ఉన్న ఆయన 'డాన్ 3' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టనున్నారట. అది కూడా ప్రతినాయకుడిగా అనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. షారుఖ్ ఖాన్ హీరోగా ఫరాన్ అక్తర్ దర్శకత్వం వహించిన 'డాన్, డాన్ 2' సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. డాన్ ఫ్రాంచైజీలో 'డాన్ 3' కి సన్నాహాలు చేస్తున్నారు ఫర్హాన్ అక్తర్. అయితే ఈసారి మాత్రం డాన్‌గా రణ్‌వీర్ సింగ్ నటించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇదిలా ఉంటే... 'డాన్ 3'లో ప్రతినాయకుడిగా విజయ్ దేవరకొండ నటించనున్నారని బాలీవుడ్ టాక్. పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న విజయ్ దేవరకొండ విలన్‌గా నటిస్తే 'డాన్ 3'కి ప్లస్ అవుతుందని మేకర్స్ ఆలోచన అట. పైగా హీరో పాత్రకి ఏమాత్రం తగ్గకుండా ఉండేలా విలన్ పాత్రని తీర్చిదిద్దారట ఫర్హాన్. స్క్రిప్ట్‌ని ఇప్పటికే విజయ్‌కి వినిపించగా కథ, తన పాత్ర నచ్చడంతో ఆయన ఓకే చెప్పారనే వార్తలు వస్తున్నాయి. అదే విధంగా బాలీవుడ్ ఎంట్రీకి ఇది సరైన సినిమా అనే ఆలోచనలో ఉన్నారట విజయ్. ఈ వార్తలపై అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్' ఈ నెల 31న విడుదల కానుంది. అదేవిధంగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్), రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'ఎస్‌వీసీ 59' (వర్కింగ్ టైటిల్) వంటి ప్రాజెక్టులు విజయ్ చేతిలో ఉన్నాయి.

ప్రేక్షకాదరణ ఎంతో సంతోషాన్నిచ్చింది

– దారపునేని రాజా


గీతానంద్, రాజా, దయానంద్, శ్రీహాన్

''హైదరాబాద్‌లో 'వర్జిన్ బాయ్స్' సినిమాని ప్రదర్శిస్తున్న థియేటర్లకు మా యూనిట్ వెళ్లినప్పుడు అక్కడి ప్రేక్షకాదరణ చూసి ఎంతో సంతోషం వేసింది. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు'' అని దారపునేని రాజా తెలిపారు. గీతానంద్, మిత్రా శర్మ, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుయేల్, రోనిత్, అన్షుల, బబ్లు, కౌశల్ ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దారపునేని రాజా మాట్లాడుతూ–''మేము థియేటర్లకి వెళ్లినప్పుడు ప్రేక్షకులకు మా సినిమా ఎంతగా నచ్చిందో స్వయంగా అర్థమైంది. అయితే ఇంత గొప్ప ఆదరణ పొందుతున్న మా చిత్రంపై కొందరు విషం చిమ్ముతున్నారు. అలాంటి వారిపై ఇప్పటికే ఫిలింఛాంబర్లో ఫిర్యాదు చేశాం. అలాగే న్యాయపరంగా వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది'' అన్నారు. దయానంద్ గడ్డం మాట్లాడుతూ–''మా 'వర్జిన్ బాయ్స్' టైటిల్ చూసి ఎలా ఉంటుందో అనుకున్నవారంతా సినిమా చూశాక ఎంతో ఆదరిస్తున్నారు'' అని తెలిపారు. ''ఎంతో కష్టపడి ఒక సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. వాటిని సపోర్ట్ చేయాలి కానీ, నెగటివ్‌గా మాట్లాడటం తప్పు'' అన్నారు గీతానంద్. ''మొదటిసారి నన్ను నేను వెండితెరపై చూసుకోవడం నాకు చాలా సంతోషంగా అనిపించింది'' అని శ్రీహాన్ పేర్కొన్నారు.

బిజినెస్ రీల్

మివి నుంచి ఏఐ బడ్స్



న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ మివి కొత్తగా కృత్రిమ మేధ ఆధారిత ఏఐ బడ్స్‌ను ప్రవేశపెట్టింది. సెటింగ్స్ ఏవీ మార్చకుండానే తెలుగు, హిందీ సహా ఎనిమిది భారతీయ భాషలను ఇది అర్థం చేసుకుని, ప్రతిస్పందిస్తుంది. యూజర్ల ప్రాధాన్యతలను గుర్తుపెట్టుకుని, సందర్భానుసారంగా వ్యవహరించేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ కో–ఫౌండర్ మిధులా దేవభక్తుని తెలిపారు. 40 గంటల బ్యాటరీ లైఫ్, 3డీ సౌండ్‌స్టేజ్, స్పష్టత కోసం క్వాడ్ మైక్ మొదలైన ప్రత్యేకతలు ఉన్నాయి. దీని ధర రూ. 6,999గా ఉంటుంది.

ప్రాంతీయ భాషల్లో సీడీఎస్ఎల్ ఐపీఎఫ్ పోర్టల్

ముంబై: పెట్టుబడులపై ఇన్వెస్టర్లలో అవగాహన పెంపొందించేందుకు సీడీఎస్ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (సీడీఎస్ఎల్ ఐపీఎఫ్) తాజాగా ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను ప్రారంభించింది. ఇందులో తెలుగు, హిందీ, తమిళం, పంజాబీ తదితర 12 భాషల్లో కంటెంట్ ఉంటుంది. తొలిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్న వారితో పాటు పెట్టుబడులు పెట్టాలనే ఆలోచనతో ఉన్న పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని భావి ఇన్వెస్టర్లకు కూడా ఈ వెబ్‌సైట్ ఉపయోగకరంగా ఉంటుంది. సీడీఎస్ఎల్ఐపీఎఫ్‌డాట్‌కామ్‌లోని ఈ కంటెంట్‌ను ఉచితంగా పొందవచ్చని సంస్థ సెక్రటేరియట్ సుధీష్ పిళ్లై తెలిపారు

నూరేళ్ల కాలానికి బంధన్ బీమా రక్షణ

న్యూఢిల్లీ: బంధన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వినూత్నమైన బీమా ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో 100 ఏళ్ల వరకు జీవిత బీమాను తీసుకోవచ్చు. పాలసీ కాలవ్యవధిలోపు పాలసీదారు మరణించినట్లయితే వారసులకు ఏక మొత్తం బీమా పరిహారాన్ని చెల్లిస్తుంది. అంతేకాదు అక్కడినుంచి క్రమం తప్పకుండా ఆదాయాన్ని చెల్లిస్తుంటుంది. గడువు తీరిన మెచ్యూరిటీ ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

ఎప్సన్ ఇంక్ ట్యాంక్ ప్రింటర్ల తయారీ ప్లాంటు ప్రారంభం



చెన్నై: సీకో ఎప్సన్ కార్పొరేషన్ భారత్‌లో తొలిసారిగా తమ ఇంక్ ట్యాంక్ ప్రింటర్ తయారీ ప్లాంటును నెలకొల్పింది. తయారీ భాగస్వామి రికున్‌తో కలిసి చెన్నైలో దీన్ని ఏర్పాటు చేసింది. 2025 అక్టోబర్ నుంచి ఈ ప్లాంటులో కార్యకలాపాలు ప్రారంభమవుతాయని సీకో ఎప్సన్ కార్పొరేషన్ గ్లోబల్ ప్రెసిడెంట్ జున్‌ఇచి యొషిదా తెలిపారు. ఇప్పటివరకు భారత్‌లో 80 లక్షలకు పైగా ఎకో ట్యాంక్ ప్రింటర్లు అమ్ముడయ్యాయని ఎప్సన్ ఇండియా ప్రెసిడెంట్ సాంబ మూర్తి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా 10 కోట్లకు పైగా వీటిని విక్రయించినట్లు యొషిదా వివరించారు.

ఫిలిం స్కూల్స్ విద్యార్థులకు స్క్రీన్ అకాడెమీ ఫెలోషిప్‌లు

ముంబై: ఫిలిం ఇనిస్టిట్యూట్స్‌లోని ప్రతిభావంతులైన పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఫెలోషిప్‌లను అందించే దిశగా స్క్రీన్ అకాడెమీ ఏర్పాటైంది. లోధా ఫౌండేషన్‌కి చెందిన అభిషేక్ లోధా వితరణతో స్క్రీన్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ దీన్ని ఏర్పాటు చేశాయి. ఫిలిం ఇనిస్టిట్యూట్స్ నామినేట్ చేసిన, ఆర్థిక వనరులు అంతగాలేని విద్యార్థులకు స్క్రీన్ అకాడెమీ వార్షికంగా ఫెలోషిప్‌లు అందిస్తుంది. రసూల్ పోకుట్టి, గునీత్ మోంగా లాంటి ప్రముఖులు మెంటార్లుగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం పుణెలోని ఎఫ్‌టీఐఐ, కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిలిం అండ్ టీవీ ఇనిస్టిట్యూట్, ముంబైలోని విజ్లింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్‌తో అకాడెమీ జట్టు కట్టగా, ఇతర ఇనిస్టిట్యూట్స్‌కి కూడా దీన్ని విస్తరించనున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

13-7-2025

విశాఖ	540–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

లగ్జరీ ఈవీలవైపు.. సంపన్నుల చూపు

లగ్జరీ సెగ్మెంట్లో 11 శాతానికి ఎలక్ట్రిక్ వాహనాల వాటా

జనవరి-మే వ్యవధి గణాంకాలు • 66 శాతం పెరిగిన మార్కెట్



న్యూఢిల్లీ: దేశీయంగా అత్యంత సంపన్నులు కాలుష్యకారక ఇంధనాలతో నడిచే వాహనాలతో పోలిస్తే క్రమంగా పర్యావరణహితమైన వాహనాల వైపు మళ్లుతున్నారు. దీనితో లగ్జరీ కార్ల విభాగంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాటా పెరుగుతోంది. వాహన్ పోర్టల్ గణాంకాల ప్రకారం 2024 జనవరి-మే మధ్య కాలంలో లగ్జరీ సెగ్మెంట్లో 7 శాతంగా ఉన్న ఈవీల వాటా ఈ ఏడాది అదే వ్యవధిలో 11 శాతానికి చేరింది. ఏకంగా 66 శాతం వృద్ధి చెందింది. ప్రీ-ఓన్డ్ కార్ల మార్కెట్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. 2025లో జూన్ నెలాఖరు వరకు అమ్ముడైన ఖరీదైన కార్లలో 10 శాతం వాటా ఈవీలదే ఉంటోంది. గతేడాది ఇదే వ్యవధిలో వీటి వాటా 5 శాతం లోపే నమోదైంది.

కొత్త మోడల్స్ దన్ను..

మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడిలాంటి దిగ్గజ సంస్థలు ఎప్పటికప్పుడు కొత్త మోడల్స్‌ను ప్రవేశపెడుతుండటం కూడా ప్రీమియం కస్టమర్లకు ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి నెలకొనడానికి కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బీఎండబ్ల్యూ ఐఎక్స్1 మోడల్ గేమ్‌చేంజర్‌గా నిల్చిందని పేర్కొన్నాయి. ఇక, తమిళనాడులోని రాణిపేటలో 2026 తొలినాళ్లలో భారీ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇటీవల ప్రకటించింది. ప్రాథమికంగా దీని వార్షికోత్పత్తి సామర్థ్యం 30,000 యూనిట్లుగా ఉంటుంది. ఇక అమెరికన్ దిగ్గజం టెస్లా కూడా భారత్‌లో విక్రయాలకు సిద్ధమవుతోంది. జూన్ 15న తొలి స్టోర్‌ను ముంబైలో ప్రారంభిస్తోంది. దీనితో ఎలక్ట్రిక్ వాహనాల విభాగం మరింత ఆసక్తికరంగా మారుతోంది. ప్రస్తుతం ఈవీలను ఎందుకు కొనాలి అనే సందేహం నుంచి బైటపడి ఏ ఈవీని కొనుక్కోవాలి అనే ఆలోచించే వైపు కొనుగోలుదార్లు మళ్లుతున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. తాను రెండేళ్లుగా ఈవీని ఉపయోగిస్తున్నానని పేర్కొన్నారు. మాస్ మార్కెట్ ఈవీల రేట్లు కూడా దాదాపు సంప్రదాయ ఐసీఈ వాహనాల ధరలకు కాస్త అటూ ఇటూగా ఉండటం కూడా ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్‌కి దోహదపడుతోంది. ట్యాక్సేషన్‌పరమైన ప్రయోజనాల వల్ల లగ్జరీ సెగ్మెంట్లో ఐసీఈ వాహనాలతో పోలిస్తే ఈవీల రేట్లు కొన్ని సందర్భాల్లో 4–5 శాతం తక్కువకే లభిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇక , డ్రైవింగ్‌పరంగా సౌకర్యం, చార్జింగ్ పాయింట్లు పెరుగుతుండటం వంటి అంశాలు సైతం ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తికి దోహదపడుతున్నాయని వివరించాయి. రేంజ్‌పరమైన (మైలేజీ) ఆందోళన కూడా తగ్గుతోందని పేర్కొన్నాయి.

టాప్ ఎండ్ లగ్జరీ కార్లకు డిమాండ్

దేశీయంగా టాప్ ఎండ్ లగ్జరీ, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలకు గణనీయంగా డిమాండ్ నెలకొందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దిన వాహనాలపై కస్టమర్లు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అమ్మకాలపరంగా అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసినట్లు చెప్పారు. 4,238 కార్లను విక్రయించినట్లు పేర్కొన్నారు. ఎస్-క్లాస్, మేబాక్, ఏఎంజీల్లాంటి టాప్ ఎండ్ వాహన విక్రయాలు 20 శాతం ఎగిశాయని వివరించారు. కొత్తగా జీఎల్ఎస్ ఏఎంజీ లైన్‌కి సంబంధించి రెండు వాహనాలను కంపెనీ ప్రవేశపెట్టింది. వీటి ధర రూ. 1.4 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది.



ఆయిల్ కంపెనీల ఎల్‌పీజీ నష్టాల భర్తీ!

కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ: గత 15 నెలలుగా ద్రవీకృత గ్యాస్ (ఎల్‌పీజీ)ని తక్కువ రేట్లకు విక్రయించడం వల్ల ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు వాటిల్లిన నష్టాలను భర్తీ చేయడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇందుకోసం సుమారు రూ. 30,000–50,000 కోట్లు సబ్సిడీ ఇచ్చే అవకాశమున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఎంత నష్టం (అండర్ రికవరీలు) వాటిల్లింది, దాన్ని ఏ విధంగా భర్తీ చేయాలి అనే అంశాలపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. 2025–26 బడ్జెట్‌లో అండర్–రికవరీలకు కేటాయింపులు చేయలేదు. అయితే, ఏప్రిల్‌లో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలు పెంచడం ద్వారా అదనంగా రూ. 32,000 కోట్లు సమకూర్చుకుంది. ఇలా అదనంగా వచ్చిన ఆదాయాన్నే ఎల్‌పీజీ అండర్ రికవరీలకి కేంద్రం సర్దుబాటు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్)కు 2024–25లో ఎల్‌పీజీ విక్రయాలపై సుమారు రూ. 40,500 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. అంతర్జాతీయ మార్కెట్లో అధిక రేట్ల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వమే వంట గ్యాస్ ధరలను నియంత్రిస్తోంది. దీనితో మార్కెట్ రేటు కన్నా తక్కువకి విక్రయించడం వల్ల కంపెనీలకు నష్టం వాటిల్లితే, దాన్ని ఇతరత్రా మార్గాల్లో భర్తీ చేస్తోంది. ఇలా 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో రూ. 28,249 కోట్ల అండర్ రికవరీలకు గాను రూ. 22,000 కోట్లు సర్దుబాటు చేసింది.

ఆన్‌లైన్ సీవోపీపీతో ఫార్మా ఎగుమతులకు విఘాతం

ఫార్మెగ్జిల్ ఆందోళన



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సర్టిఫికెట్ ఆఫ్ ఫార్మా ప్రోడక్ట్ (సీవోపీపీ) దరఖాస్తులను ఓఎన్‌డీఎల్ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే సమర్పించాలంటూ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జారీ చేసిన సర్క్యులర్, దేశీ ఔషధ సంస్థలను కలవరపరుస్తోంది. దీని వల్ల ఎగుమతులకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెగ్జిల్) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సర్క్యులర్‌ను తక్షణం పునఃసమీక్షించాలని కోరింది. రెగ్యులేటరీ వ్యవస్థలను డిజిటలీకరించడాన్ని తాము స్వాగతిస్తామని, కానీ దానికి మారే విషయంలో ఎగుమతిదారులకు తగిన మార్గదర్శ ప్రణాళికను ఇవ్వకుండానే హఠాత్తుగా కొత్త నిబంధనలను పాటించి తీరాల్సిందేనంటూ ఆదేశించడం సరికాదని పేర్కొంది. దీని వల్ల రెస్ట్ ఆఫ్ ది వరల్డ్ (ఆర్‌వోడబ్ల్యూ)కి ఫార్మా ఎగుమతులు గణనీయంగా అవరోధాలు ఏర్పడతాయని ఫార్మెగ్జిల్ వివరించింది. ప్రస్తుతం మొత్తం ఫార్మా ఎగుమతుల్లో ఆర్‌ఓడబ్ల్యూ మార్కెట్ల వాటా దాదాపు 45 శాతంగా ఉంది. ఎగుమతిదారులు ఇప్పుడు నియంత్రణలపరంగా రెండు రకాల అవరోధాలను ఎదుర్కొనాల్సి వస్తుందని ఫార్మెగ్జిల్ డైరెక్టర్ జనరల్ కె. రాజా భాను తెలిపారు. దేశీయంగా సీడీఎస్‌సీవో నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, కొత్త ఔషధాల వర్గీకరణపరమైన జాప్యాలు ఒక ఎత్తైతే అంతర్జాతీయంగా అనుమతుల్లో జాప్యం మరో ఎత్తుగా మారిందని వివరించారు. ఈ నేపథ్యంలోనే సీవోపీపీలను తప్పనిసరిగా ఓఎన్‌డీఎల్ఎస్ ద్వారానే సమర్పించాలన్న నిబంధనను వాయిదా వేయాలని, పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, సీడీఎస్‌సీవోలకు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

సమతుల్యత ఉండాలి..

ఒకవైపు కఠినతరమైన నాణ్యతా ప్రమాణాలు, మరోవైపు వ్యాపారవర్గాలకు వెసులుబాట్ల మధ్య సమతుల్యత పాటించే విధంగా నియంత్రణ విధానాలు ఉండేలా చూడాలని కోరినట్లు రాజా భాను పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన తయారీని ప్రోత్సహించడమన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ, నిబంధనలపరమైన కొన్ని కొత్త పరిణామాలు వ్యాపారాలకు ప్రతిబంధకాలుగా మారొచ్చని పరిశ్రమలో అభిప్రాయం నెలకొన్నట్లు వివరించారు. సీవోపీపీ అనుమతులను లేదా నో అబ్జక్షన్ సర్టిఫికెట్లను (ఎన్‌వోసీ) సకాలంలో పొందలేకపోతే, విదేశీ కొనుగోలుదారులు, మనతో పోటీ పడే దేశాలకు చెందిన ప్రత్యామ్నాయ సరఫరాదారులవైపు మళ్లే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీనితో దీర్ఘకాలికంగా భారతీయ ఎగుమతిదార్ల ప్రయోజనాలకు తీరని విఘాతం ఏర్పడుతుందని తెలిపారు.

యూఎస్ఐఎస్‌పీఎఫ్ బోర్డ్‌లోకి కుమార మంగళం బిర్లా



న్యూయార్క్: దేశీ పారిశ్రామిక దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తాజాగా యూఎస్–ఇండియా స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం (యూఎస్ఐఎస్‌పీఎఫ్) డైరెక్టర్ల బోర్డులో చేరారు. వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలుస్తూ, ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతమయ్యేందుకు కృషి చేస్తున్నందుకు గాను గత నెలలో వాషింగ్టన్ డీసీలో జరిగిన లీడర్‌షిప్ సదస్సు 2025లో ఆయన గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక, ఆర్థిక బంధాలను పటిష్టం చేయడంలో యూఎస్ఐఎస్‌పీఎఫ్ బలమైన శక్తిగా ఎదిగిందని బిర్లా తెలిపారు. తమ సంస్థ అమెరికాలో అతి పెద్ద భారతీయ ఇన్వెస్టరుగా కార్యకలాపాలు సాగిస్తోందని, మరింతగా పెట్టుబడులను పెంచే ప్రణాళికలు ఉన్నాయని ఆయన వివరించారు. అమెరికాలో ఆదిత్య బిర్లా గ్రూప్ 15 బిలియన్ డాలర్ల పైగా ఇన్వెస్ట్ చేసింది. మెటల్స్, కార్బన్ బ్లాక్, రసాయనాలు తదితర రంగాల్లో 15 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. దాని అనుబంధ సంస్థ అయిన నోవెలిస్ ప్రపంచంలోనే అతి పెద్ద అల్యూమినియం రీసైక్లింగ్ కంపెనీ.

యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఆంథెమ్ బయోసైన్సెస్‌కు రూ.1,016 కోట్లు

ముంబై: ఫార్మా సంస్థలు, బయో టెక్నాలజీ సంస్థలకు ఔషధాల ఆవిష్కరణ, కాంట్రాక్ట్ రీసెర్చ్, అభివృద్ధి, తయారీ సేవలు(సీఆర్‌డీఎంఓ) అందించే ఆంథెమ్ బయోసైన్సెస్ తమ పబ్లిక్ ఇష్యూకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.1,016 కోట్లు సమీకరించింది. ఈ సంస్థ ఐపీఓ సోమవారం(జూన్ 14న) ప్రారంభమై, బుధవారం ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.540–570గా ఉంటుంది. ఇందులో భాగంగా గరిష్ట ధర రూ.570కి 60 ఫండ్లకు (యాంకర్ ఇన్వెస్టర్లు) 1.78 కోట్ల ఈక్విటీ కేటాయించినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉండటంతో కంపెనీకి ఎటువంటి నిధులు అందవు. మొత్తం 60 యాంకర్ ఇన్వెస్టర్లలో అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, గవర్నమెంట్ పెన్షన్ ఫండ్ గ్లోబల్, ఈస్ట్ స్ప్రింగ్ ఇన్వెస్ట్‌మెంట్స్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, యాక్సిస్ ఎంఎఫ్, యూటీఐ ఎంఎఫ్, క్వాంట్ ఎంఎఫ్, మోతీలాల్ ఓస్వాల్ ఎంఎఫ్ తదితర ఫండ్ సంస్థలున్నాయి. ఇప్పటికే ఈ సీఆర్‌డీఎంఓ విభాగం నుంచి సాయి లైఫ్ సైన్సెస్, సింజీన్ ఇంటర్నేషనల్, సువెన్ లైఫ్ సైన్సెస్, దివీస్ ల్యాబొరేటరీస్ కంపెనీలు ఐపీఓ పూర్తి చేసుకొని ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. జేఎం ఫైనాన్షియల్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, జేపీ మోర్గాన్ ఇండియా, నోమురా ఫైనాన్షియల్ అడ్వైజరీ అండ్ సెక్యూరిటీస్ కంపెనీలు ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

మెట్‌లైఫ్‌కు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు



న్యూఢిల్లీ: ఉద్యోగం చేసేందుకు భారత్‌లో అత్యుత్తమ కంపెనీల్లో ఒకటిగా ఆర్థిక సేవల దిగ్గజం మెట్‌లైఫ్‌కు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' ఇండియా గుర్తింపు లభించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం మీద 100 టాప్ కంపెనీల జాబితాలో ఆరో స్థానం, బీమా రంగంలో అగ్రస్థానాన్ని కంపెనీ దక్కించుకుంది. ప్రతి ఒక్కరు ఎదిగేందుకు, అత్యుత్తమంగా రాణించేందుకు తోడ్పాటునిచ్చే సంస్కృతిని తమ సంస్థలో అమలు చేస్తున్నామని, దానికి ఈ గుర్తింపు లభించడం సంతోషకరమైన విషయమని మెట్‌లైఫ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆశీష్ శ్రీవాస్తవ తెలిపారు. ఉద్యోగుల అభిప్రాయాలు, సిబ్బంది విషయంలో కంపెనీ పాటించే విధానాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఈ జాబితాను రూపొందిస్తుంది.

బీఎస్ఈ ఇన్సూరెన్స్ ఇండెక్స్ ప్రారంభం



ముంబై: బీఎస్ఈ అనుబంధ సంస్థ అయిన ఏషియా ఇండెక్స్ తాజాగా బీఎస్ఈ ఇన్సూరెన్స్ పేరిట కొత్త సూచీని ప్రారంభించింది. బీఎస్ఈ 1000 ఇండెక్స్‌లోని బీమా రంగం కింద వర్గీకరించిన సంస్థలు ఈ సూచీలో ఉంటాయి. దీని బేస్ వేల్యూ 1000గా, తొలి వేల్యూ డేట్ 2018 జూన్ 18గా ఉంటుంది. వార్షికంగా రెండు సార్లు (జూన్, డిసెంబర్) ఈ సూచీలో మార్పులు, చేర్పులు చేస్తారు. ప్యాసివ్ వ్యూహాలను పాటించే ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్లకు ఇది ప్రామాణికంగా ఉంటుంది.

3 గిగావాట్లకు డేటా సెంటర్లు

2030 నాటికి అంచనాలు

- ఏఐ, క్లౌడ్ వినియోగం దన్ను
- ఎవెండస్ క్యాపిటల్ అధ్యయనంలో వెల్లడి



ముంబై: దేశీయంగా డేటా సెంటర్ల రంగం భారీ స్థాయిలో విస్తరిస్తోంది. 2030 నాటికి ఏకంగా 3 గిగావాట్ల సామర్థ్యాన్ని సంతరించుకుంటుందనే అంచనాలు నెలకొన్నాయి. ఎవెండస్ క్యాపిటల్ రూపొందించిన మల్టీ ఇయర్ గ్రోత్ ప్రాక్సీ ఆన్ ఇండియాస్ డేటా ఎక్స్‌ప్లోజన్ అండ్ లోకలైజేషన్ వేవ్ పేరిట ఎవెండస్ క్యాపిటల్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2024లో దేశీయంగా డేటా సెంటర్ల సామర్థ్యం 1.1 గిగావాట్లుగా ఉంది. డేటా, ఏఐ, క్లౌడ్ వినియోగం పెరుగుతుండటం, డేటా లోకలైజేషన్ ప్రధాన లక్ష్యంగా తీసుకుంటున్న పాలసీపరమైన చర్యలు లాంటి అంశాలు డేటా సెంటర్లకు కీలక చోదకాలుగా ఉండనున్నాయి. దీనితో 2033 నాటికి డిమాండ్ 6 గిగావాట్ల స్థాయికి చేరే అవకాశం ఉంది. అయితే, సరఫరా మాత్రం 4.5 గిగావాట్ల స్థాయికే పరిమితం కానుంది. దీంతో 1.5 గిగావాట్ల మేర డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసం ఏర్పడనుంది. లార్జ్ ఫార్మాట్, హైపర్‌స్కేల్ రెడీ మౌలిక సదుపాయాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో తక్కువ లేటెన్సీతో వర్క్‌లోడ్ భారాన్ని భరించగలిగే ఎడ్జ్-రెడీ సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా ఈ డిమాండ్‌ను తీర్చే అవకాశం ఉంది. దీంతో ఈ పరిశ్రమ వార్షికంగా 25–30 శాతం మేర వృద్ధి నమోదు చేయనుంది.

భారీగా పెట్టుబడులు..

డేటా సెంటర్ల వృద్ధికి అపార అవకాశాలు నెలకొన్న నేపథ్యంలో ఈ పరిశ్రమలోకి భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం ఏటా 1–1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 12,870 కోట్లు) స్థాయిలో వస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ పెట్టుబడులు రెట్టింపు కానున్నాయి. వివిధ రాష్ట్రాలు సబ్సిడీ రేటుకు స్థలాన్ని, విద్యుత్తును తక్కువ రేటుకు అందిస్తుండటం వంటి అంశాలు దేశవ్యాప్తంగా డేటా సెంటర్లు వేగంగా వృద్ధి చెందడానికి దోహదపడుతున్నాయి. ఇప్పటికే ఎస్‌టీటీ జీడీసీ, సిఫీలాంటి దిగ్గజాలుఈ రంగంలో స్థానాన్ని పటిష్టం చేసుకోగా, పెరుగుతున్న డిమాండ్‌ని తీర్చే దిశగా మరిన్ని కొత్త సంస్థలు కూడా వస్తున్నాయి. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌కి చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్ సంస్థ అనంత్ రాజ్ భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. 2031–32 నాటికి నిర్వహణ సామర్థ్యాలను 307 మెగావాట్లకు పెంచుకునేందుకు 2.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 18,000 కోట్లు) వెచ్చించనుంది. 2025–26లో డేటా సెంటర్ సామర్థ్యం 28 మెగావాట్లుగా ఉండనుంది. డేటా సెంటర్ల కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ విధానాల తోడ్పాటు, విద్యుత్ లభ్యత, కనెక్టివిటీ మొదలైన అంశాలన్నీ కూడా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ క్లయింట్ల నుంచి ఎంటర్‌ప్రైజ్, హైపర్‌స్కేలర్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజ్ ఏ సర్వీస్ లాంటి వాటికి పెరుగుతున్న డిమాండ్‌ని తీర్చేందుకు పరిశ్రమ సన్నద్ధంగా ఉందని అనంత్ రాజ్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సరీన్ తెలిపారు.

సాక్షి ప్లస్
ఆదివారం। 13-7-2025


స్వియాటెక్


స్వియాటెక్ చేతిలో ఫైనల్లో ఓటమి అనంతరం అనిసిమోవా నిర్వేదం

ఒక్కటే మిగిలింది!

మూడు గ్రాండ్‌స్లామ్‌లనూ సాధించిన ఇగా స్వియాటెక్

- తదుపరి లక్ష్యం ఆస్ట్రేలియన్ ఓపెన్
- వింబుల్డన్‌లో జైత్రయాత్ర

సాక్షి క్రీడా విభాగం

2019...ఇగా స్వియాటెక్ తొలి సారి గ్రాండ్‌స్లామ్ బరిలోకి దిగిన ఏడాది. అంటే 2020లో నిర్వహించని వింబుల్డన్‌ను మినహాయిస్తే 26 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆమె బరిలోకి దిగింది. ఏడేళ్ల కెరీర్ కూడా పూర్తి కాకముందే ఆమె ఖాతాలో ఇప్పుడు ఆరు టైటిల్స్ ఉన్నాయి. 24 ఏళ్ల వయసుకే ఇన్ని ఘనతలు సాధించిన ఇగా... పురుషుల, మహిళల విభాగంలో వింబుల్డన్ నెగ్గిన తొలి పోలండ్ ప్లేయర్‌గా నిలిచింది. దూకుడైన ఆటతో ఆమె అన్ని సర్ఫేస్‌లపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చింది. స్వయంగా ఇగా మాటల్లోనే చెప్పాలంటే 'భారీ సర్వీస్‌లు, టాప్ స్పిన్, పదునైన బ్యాక్‌హ్యాండ్ నా ప్రధాన బలాలు'. ఇదే ఆటపై ఇప్పుడు ఆమె ప్రపంచ మహిళల టెన్నిస్‌ను శాసిస్తోంది. శనివారం అనిసిమోవాతో జరిగిన ఫైనల్లో ఆమె ఆధిక్యం ప్రదర్శించిన తీరు స్వియాటెక్ పదునును చూపించింది. క్రీడాకారులు, ఒలింపిక్స్‌లో పాల్గొన్న రోయర్ అయిన తండ్రి ప్రోత్సాహంతో తొలి అడుగులు వేసిన ఆమె ఇప్పుడు అసాధారణ ప్రదర్శనతో శిఖరానికి చేరింది. ఆమె ప్రొఫెషనల్ కెరీర్‌లో తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. తొలిసారి 903వ ర్యాంక్‌తో డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో అడుగు పెట్టిన ఆమె మూడేళ్ల పాటు చెప్పుకోదగ్గ విజయాలతో దూసుకుపోయింది. స్వియాటెక్ కెరీర్‌లో మూడేళ్లు 2022, 2023, 2024 అద్భుతంగా సాగాయి. తొలి సారి వరల్డ్ నంబర్‌వన్‌గా నిలవడంతో పాటు మూడు సీజన్ల పాటు ఆమె దానిని నిలబెట్టుకోవడం విశేషం. ఐదేళ్ల వ్యవధిలో నాలుగు సార్లు క్లే కోర్టు ఫ్రెంచ్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచినా గ్రాస్ మాత్రం ఆమెకు కొరుకుడు పడలేదు. ఈ సారి విజేతగా నిలవడానికి ముందు ఆమె అత్యుత్తమ ప్రదర్శన క్వార్టర్ ఫైనల్ మాత్రమే. గత ఏడాదైతే మూడో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఆ తర్వాత నవంబరులో డోపింగ్ పరీక్షల్లో విఫలం కావడంతో కొత్త వివాదం రేగింది. సస్పెన్షన్ ముగిసి మళ్లీ బరిలోకి దిగిన తర్వాత 2025లో కూడా ఆమె ప్రదర్శన గొప్పగా లేదు. రెండు గ్రాండ్‌స్లామ్‌లు ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్‌లలో ఇగా సెమీఫైనల్‌కే పరిమితమైంది. అయితే గ్రాస్‌కోర్టులో ప్రాక్టీస్‌ను తొందరగా మొదలు పెట్టేందుకు ఇది ఉపకరించింది. వింబుల్డన్‌కు ముందు సన్నాహక గ్రాస్ కోర్టు టోర్నీ బాడ్ హాంబర్గ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరడంతో కాస్త ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పుడు దానినే కొనసాగిస్తూ పచ్చికపై తన చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. హార్డ్ కోర్టుపై యూఎస్ ఓపెన్ నెగ్గగా...ఆస్ట్రేలియన్ ఓపెన్ మాత్రమే ఇంకా అందుకోవాల్సి వచ్చింది. ఇదే ఫామ్ కొనసాగితే 2026లోనే అది సాధ్యం కావచ్చు.

సినెర్ X అల్‌కరాజ్


సినెర్


అల్‌కరాజ్

నేడు వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్
- రాత్రి గం. 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

లండన్: ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్‌కు వేళయింది. ఆదివారం జరగనున్న ఈ తుది పోరులో ప్రపంచ నంబర్‌వన్ జానిక్ సినెర్ (ఇటలీ), రెండో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) అమీతుమీ తేల్చుకోనున్నారు. గత నెల జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోనూ ఈ ఇద్దరే తలపడగా... అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. ఇలా ఫ్రెంచ్ ఓపెన్ తర్వాత వింబుల్డన్‌లో ఆ ఇద్దరు ఆటగాళ్లే ఫైనల్లో తలపడనుండటం రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), రాఫెల్ నాదల్ (స్పెయిన్) తర్వాత ఇదే తొలిసారి. ఈ ఇద్దరు దిగ్గజాలు 2006–2008 మధ్య వరుసగా మూడేళ్ల పాటు ఈ రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఢీకొన్నారు. ఆ ఇద్దరు కెరీర్‌కు వీడ్కోలు పలకగా... 38 ఏళ్ల జొకోవిచ్ కూడా గతంలో మాదిరిగా దూకుడు కనబర్చలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా నవతరం నిలకడ కనబరుస్తోంది. అందులో ముఖ్యంగా 22 ఏళ్ల అల్‌కరాజ్, 23 ఏళ్ల సినెర్ తమ పోరాట పటిమతో అభిమానుల మనసు దోచుకుంటున్నారు. అల్‌కరాజ్ ఇప్పటి వరకు ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలవగా... సినెర్ మూడు నెగ్గాడు. గత 6 మేజర్ టైటిల్స్‌ను ఈ ఇద్దరే పంచుకోవడం విశేషం. 'భవిష్యత్తు గురించి ఇప్పటి నుంచే ఆలోచించడం లేదు. ప్రస్తుతానికైతే సినెర్‌తో పోటీని ఆస్వాదిస్తున్నా. ముమ్ముందు కూడా ఇలాగే సాగుతుందని చెప్పలేను. దిగ్గజాల సరసన మా పేర్లు జోడించడం ఆనందమే' అని అల్‌కరాజ్ అన్నాడు. వింబుల్డన్‌లో గత రెండేళ్లుగా తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తున్న ఈ స్పెయిన్ యంగ్‌స్టర్... 'హ్యాట్రిక్'పై కన్నేశాడు. ఇప్పటి వరకు జాన్ బోర్గ్, సంప్రాస్, ఫెడరర్, జొకోవిచ్ వింబుల్డన్‌లో వరుసగా మూడు టైటిల్స్ సాధించగా... ఇప్పుడు ఆ జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని అల్‌కరాజ్ తహతహలాడుతున్నాడు. సినెర్‌కు ఇది వరుసగా నాలుగో మేజర్ ఫైనల్ కాగా అందులో యూఎస్ ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్‌లో విజయాలు సాధించాడు. గత నెలలో వీరిద్దరి మధ్య రోలాండ్ గారోస్‌లో 5 గంటల 29 నిమిషాల పాటు సాగిన సుదీర్ఘ ఫైనల్లో సినెర్‌పై అల్‌కరాజ్ విజయం సాధించగా... ఆ ఓటమికి బదులు తీర్చుకోవాలని ఇటలీ ప్లేయర్ భావిస్తున్నాడు.

'ఇది ముగింపు కాదు'



- వచ్చే ఏడాది మళ్లీ బరిలోకి దిగుతా
- వింబుల్డన్‌లో పాల్గొనడంపై నొవాక్ జొకోవిచ్

లండన్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ బరిలోకి దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ సెమీ ఫైనల్లోనే ఇంటిబాట పట్టాడు. అయితే ఇక్కడితో తన వింబుల్డన్ ప్రస్థానం ముగిసినట్లు కాదని జొకోవిచ్ స్పష్టం చేశాడు. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ప్రపంచ నంబర్‌వన్ సినెర్ (ఇటలీ) చేతిలో ఓడిన 38 ఏళ్ల జొకో... 2017 తర్వాత వింబుల్డన్ ఫైనల్‌కు చేరుకోకపోవడం ఇదే తొలిసారి. 'వింబుల్డన్ కెరీర్ ముగించాలనుకోవడం లేదు. కచ్చితంగా తిరిగివస్తా. కనీసం మరొక్క సారైనా ఇందులో పాల్గొంటా. గాయం కారణంగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయా. వయసు పెరుగుతుందనేది అందరికీ తెలిసిందే. కానీ నా ఫిట్‌నెస్ అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్ ఆడేందుకు అనుకూలంగానే ఉంది. ఈ ఏడాది కొన్ని టోర్నీల్లో అది స్పష్టమైంది. అందుకే ఇప్పుడే ముగించాలని అనుకోవడం లేదు' అని సెమీస్ పరాజయం అనంతరం జొకోవిచ్ అన్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో 10, ఫ్రెంచ్ ఓపెన్‌లో 3, వింబుల్డన్‌లో 7, యూఎస్ ఓపెన్‌లో 4 టైటిల్స్ గెలిచిన జొకోవిచ్... పురుషుల సింగిల్స్‌లో అత్యధిక (24)గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. నాదల్ (22 టైటిల్స్; స్పెయిన్), రోజర్ ఫెడరర్ (22; స్విట్జర్లాండ్) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక ఓవరాల్‌గా మార్గరెట్ కోర్ట్ 24 టైటిల్స్ సాధించగా... ప్రస్తుతం జొకో ఆమెతో సమానంగా ఉన్నాడు. మరో గ్రాండ్‌స్లామ్ గెలిచి ఒకే ఒక్కడిగా నిలవాలని ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు.

ఆయుశ్ మాత్రే సెంచరీ

- భారత అండర్–19 జట్టు 450/7
- ఇంగ్లండ్ అండర్–19 జట్టుతో తొలి యూత్ టెస్టు


ఆయుశ్

బెకెన్‌హామ్ (ఇంగ్లండ్): ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత అండర్–19 జట్టు దుమ్మురేపుతోంది. వన్డే సిరీస్ గెలుచుకున్న యువ భారత జట్టు... యూత్ టెస్టులో శుభారంభం చేసింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం ప్రారంభమైన తొలి టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత అండర్–19 జట్టు 88 ఓవర్లలో 7 వికెట్లకు 450 పరుగులు చేసింది. కెప్టెన్ ఆయుశ్ మాత్రే (115 బంతుల్లో 102; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కగా... అభిజ్ఞ కుందు (95 బంతుల్లో 90; 10 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ కుమార్ (81 బంతుల్లో 85; 14 ఫోర్లు, 1 సిక్స్), విహాన్ మల్హోత్రా (99 బంతుల్లో 67; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. వన్డే సిరీస్‌లో రికార్డు సెంచరీతో చెలరేగిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14) ఎక్కువసేపు నిలవలేకపోగా... అందులో పెద్దగా పరుగులు చేయలేకపోయిన ఆయుశ్ మాత్రే 'శత'క్కొట్టాడు. అతడు రెండో వికెట్‌కు విహాన్‌తో కలిసి 173 పరుగులు జోడించాడు. టి20 తరహాలో ధనాధన్ ఆటతీరుతో రెచ్చిపోయిన అభిజ్ఞ, రాహుల్ నాలుగో వికెట్‌కు 27.4 ఓవర్లలోనే 179 పరుగులు జోడించడంతో యువభారత్ భారీ స్కోరు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో అలెక్స్ గ్రీన్, జాక్ హోమ్, ఆర్చీ వాన్ తలా 2 వికెట్లు పడగొట్టారు. బ్యాటర్లంతా దూకుడు కనబర్చడంతో తొలి రోజు యంగ్ఇండియా 5కు పైగా రన్‌రేట్‌తో పరుగులు రాబట్టింది. అంబ్రిష్ (31 బ్యాటింగ్), హెనిల్ పటేల్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఈ ఏడాది ఐఎస్‌ఎల్ అనుమానమే!

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2025–26 సీజన్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్), ఈవెంట్ నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎఫ్‌ఎస్‌డీఎల్) మధ్య మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎమ్ఆర్‌ఏ) పునరుద్ధరణ అంశంపై స్పష్టత లోపించడంతో ప్రస్తుతానికి తాజా సీజన్‌ను 'హోల్డ్'లో పెట్టినట్లు ఐఎస్‌ఎల్ ప్రకటించింది. దేశంలో అత్యున్నత ఫుట్‌బాల్ లీగ్ అయిన ఐఎస్‌ఎల్ సాధారణంగా ప్రతి ఏటా సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు సాగడం పరిపాటి. అయితే సమాఖ్యకు ఐఎస్‌ఎల్‌కు మధ్య గతేడాది డిసెంబర్ 8న ఎమ్ఆర్‌ఏ ముగిసింది. అనంతరం దీన్ని పునరుద్ధరించుకోలేదు. దీంతో ఈ సీజన్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. 'ఈ ఏడాది ఎమ్ఆర్‌ఏ ఒప్పందం ధ్రువీకరించకపోవడంతో... 2025–26 ఐఎస్‌ఎల్ సీజన్‌కు సంబంధించిన ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో సీజన్‌కు సంబంధించిన షెడ్యూల్, వాణిజ్య కార్యకలాపాలపై ఎలాంటి చర్చలు జరగడం లేదు. అందుకే ప్రస్తుతానికి తాత్కాలికంగా సీజన్ నిలిపివేస్తున్నాం. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి. పరిస్థితిని ఫ్రాంచైజీలకు వివరించాం. వాళ్లు అర్థం చేసుకున్నారు' అని ఐఎస్‌ఎల్ నిర్వాహకులు తెలిపారు. ఏఐఎఫ్‌ఎఫ్ 2010లో ఎఫ్‌ఎస్‌డీఎల్‌తో 15 ఏళ్ల ఒప్పందం కుదుర్చుకోగా... అది తాజాగా ముగిసింది.

ఉజ్బెకిస్తాన్‌తో భారత్ ఫ్రెండ్లీ పోరు

నేడు మహిళల అండర్–20 ఫుట్‌బాల్ మ్యాచ్



తష్కంట్: భారత మహిళల అండర్–20 ఫుట్‌బాల్ జట్టు ఉజ్బెకిస్తాన్‌తోతో స్నేహపూర్వక మ్యాచ్‌లకు సిద్ధమైంది. రెండు మ్యాచ్‌ల్లో భాగంగా ఆదివారం ఇరు జట్ల మధ్య తొలి పోరు జరగనుంది. ఈ పర్యటనకు ముందు బెంగళూరులో ప్రత్యేక శిక్షణ తీసుకున్న భారత మహిళల యువ జట్టు శుక్రవారం ఉజ్బెకిస్తాన్ చేరుకొని శనివారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. ఏఎఫ్‌సీ అండర్–20 మహిళల ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో సత్తా చాటాలనే లక్ష్యంతో మన జట్టు ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడుతోంది. ఈ టోర్నీలో భాగంగా ఇండోనేసియా, తుర్క్‌మెనిస్తాన్, మయన్మార్‌తో భారత్ తలపడాల్సి ఉంది. 'ఆసియా క్వాలిఫయర్స్‌కు ముందు ఈ స్నేహపూర్వక మ్యాచ్‌లు జట్టుకు లబ్ధి చేకూర్చుతాయి. మెరుగైన ప్రత్యర్థులతో తలపడేందుకు ముందు... ఏ రంగాల్లో వెనుకబడి ఉన్నామో తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఫినిషింగ్ లోపాలను సవరించుకోవాల్సి ఉంది. విభిన్న పరిస్థితుల్లో ఎలా రాణించాలనే అంశాలు కూడా ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌లతో మన అమ్మాయిలుకు తెలిసి వస్తుంది' అని కోచ్ జొకిమ్ అలెగ్జాండర్సన్ అన్నాడు. ఇటీవల భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఆసియా కప్‌నకు అర్హత సాధించగా... ఇప్పుడు అదే బాటలో అండర్–20 జట్టు కూడా సత్తా చాటాలని భావిస్తోంది. సీనియర్ జట్టుతో కలిసి సమాన శిక్షణ తీసుకోవడం కూడా మన ప్లేయర్లకు కలిసిరానుంది. ప్రస్తుత అండర్–20 జట్టులోని పలువురు ప్లేయర్లు సీనియర్ జట్టు సభ్యులతో కలిసి గతంలో మ్యాచ్‌లు ఆడారు. ఆ అనుభవం ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో ఉపయోగపడనుంది.

భారత్ 'ఎ' 'హ్యాట్రిక్'

ఎయిండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): యూరప్ పర్యటనలో భారత 'ఎ' పురుషుల హాకీ జట్టు 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. గత రెండు మ్యాచ్‌లలో భారీ తేడాతో విజయాలు సాధించిన భారత 'ఎ' జట్టు... శనివారం జరిగిన పోరులో 3–2 గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌ను చిత్తు చేసింది. మన జట్టు తరఫున ఆదిత్య అర్జున్ డబుల్ గోల్స్‌తో సత్తా చాటగా... బాబీ సింగ్ ఒక గోల్ సాధించాడు. ఆదిత్య అర్జున్ ఓ ఫీల్డ్ గోల్‌తో పాటు ఒక పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఫ్రాన్స్ తరఫున క్లైమెంట్ రెండు గోల్స్ చేశాడు. ఐర్లాండ్‌తో జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో 6–1, 6–0తో విజయాలు సాధించిన భారత ఆటగాళ్లు... ఫ్రాన్స్‌పై కూడా అదే జోరు కొనసాగించారు. 'ఈ పర్యటన కోసం మెరుగ్గా సిద్ధమయ్యాం. ప్లేయర్లంతా తీవ్రంగా శ్రమించారు. దానికి తగ్గ ఫలితాలు రావడం ఆనందంగా ఉంది. ఈ పర్యటనలో మరిన్ని మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వాటిలో కూడా ఇలాంటి ఆటతీరే కనబర్చాలని ఆశిస్తున్నాం' అని కోచ్ శివేంద్రసింగ్ అన్నాడు. టూర్‌లో భాగంగా ఆదివారం మరోసారి ఫ్రాన్స్‌తో భారత 'ఎ' జట్టు తలపడనుంది.

అనిమేశ్‌కు నాలుగో స్థానం

- అవినాశ్ సాబ్లే విఫలం
- మొనాకో డైమండ్ లీగ్


అనిమేశ్

మొనాకో: భారత యువ అథ్లెట్ అనిమేశ్ కుజుర్ మొనాకో డైమండ్ లీగ్ అండర్–23 విభాగంలో సత్తా చాటాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన 200 మీటర్ల పరుగులో అనిమేశ్ 20.55 సెకన్లలో లక్ష్యాన్ని చేరి... నాలుగో స్థానంలో నిలిచాడు. గౌట్ బ్లేజ్‌డ్ (20.10 సెకన్లు; ఆస్ట్రేలియా), బుసాంగ్ కొలెన్ (20.28 సెకన్లు; బోస్వానా), నయీమ్ జాక్ (20.42 సెకన్లు; దక్షిణాఫ్రికా) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామానికి చెందిన కుజుర్... 200 మీటర్ల పరుగులో ఇటీవల 20.32 సెకన్ల టైమింగ్‌తో జాతీయ రికార్డు నెలకొల్పాడు. సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అర్హత మార్క్ 20.16 సెకన్లు కాగా... ఇప్పుడు దాన్ని చేరుకునే లక్ష్యంతో కుజుర్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. గత వారం గ్రీస్‌లో జరిగిన డ్రోమియా అంతర్జాతీయ స్ప్రింట్ మీట్‌లో కుజుర్ 100 మీటర్ల పరుగును కేవలం 10.18 సెకన్లలో పూర్తి చేసి జాతీయ రికార్డు నెలకొల్పాడు.

భారత స్టీపుల్‌చేజర్ అవినాశ్ సాబ్లే 3000 మీటర్ల పరుగును పూర్తి చేయలేకపోయాడు. ఇప్పటికే వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన అవినాశ్... రేసులో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. రేసు ఆరంభంలోనే ఈ ఘటన జరగగా... తిరిగి అతడు పరుగు తీయలేదు. జాతీయ రికార్డు కలిగిన 30 ఏళ్ల అవినాశ్... ఈ ఏడాది స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. గత డైమండ్ లీగ్‌లో కూడా అతడు 13వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

నదీమ్‌తో నీరజ్ ఢీ

- పారిస్ ఒలింపిక్స్ తర్వాత తొలిసారి అమీతుమీ
- వచ్చే నెల 16న సిలేసియా డైమండ్ లీగ్


నీరజ్
నదీమ్

సిలేసియా (పోలాండ్): భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా... దాయాది పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌తో పోటీకి సిద్ధమవుతున్నాడు. వచ్చే నెల 16న పోలాండ్ వేదికగా జరగనున్న సిలేసియా డైమండ్ లీగ్‌లో వీరిద్దరూ బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య శనివారం వివరాలు వెల్లడించింది. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో చివరిసారిగా ఈ ఇద్దరు తలపడగా... నదీమ్ జావెలిన్‌ను 92.97 మీటర్ల దూరం విసిరి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. నీరజ్ 89.45 మీటర్ల దూరంతో రజతం గెలుచుకున్నాడు. అంతకుముందు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో చోప్రా పసిడి పతకం నెగ్గాడు. ఇటీవల భారత్ వేదికగా తొలిసారి జరిగిన అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ 'నీరజ్ చోప్రా క్లాసిక్' టైటిల్ గెలిచిన 27 ఏళ్ల నీరజ్ చోప్రా జోరు మీదున్నాడు. ఈ సీజన్‌లో వరుసగా మూడు టైటిల్స్‌తో అతను ఇప్పటికే 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. 'నదీమ్, నీరజ్ మధ్య ఆసక్తికర పోరు ఖాయం. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఈ ఇద్దరు ఒకే టోర్నమెంట్‌లో పాల్గొంటుండటం ఇదే తొలిసారి. ఒకరు ప్రపంచ చాంపియన్, మరొకరు ఒలింపిక్ చాంపియన్. వారి మధ్య సమరాన్ని చూసేందుకు పోలాండ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పాకిస్తాన్ అథ్లెట్ యూరోపియన్ లీగ్‌ల్లో పాల్గొనడం చాలా తక్కువ. మరి ఈ సారి అతడికి నీరజ్‌కు మధ్య పోటీ ఎలా సాగుతుందో చూడాలి' అని లీగ్ నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఏడాది తొలిసారి 90 మీటర్ల మార్క్ దాటిన నీరజ్ చోప్రా... మే నెలలో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 90.23 మీటర్ల దూరం విసిరి తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత వరుసగా టోర్నీల్లో పాల్గొంటున్న నీరజ్ దిగ్గజ కోచ్ జాన్ జెలెజ్నీ దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడు. మరోవైపు 28 ఏళ్ల నదీమ్... ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచిన అనంతరం కేవలం ఒక్క టోర్నీలో మాత్రమే పాల్గొన్నాడు. సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో ఈ లీగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. 2023లో వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన నీరజ్ దాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

సాక్షి ప్లస్
ఆదివారం | 13-7-2025

ఫ్లైట్ మోడ్!





శనివారం కొలంబియాలోని రియోనెగ్రోలో ఎయిర్ షో సందర్భంగా కనువిందు చేసిన వైమానిక విన్యాసం.
అమెరికాలోని వర్జీనియా బీచ్‌లో సగం తినేసిన చేపను కాళ్లతో తన్నుకుని అచ్చం ఆ విమానాన్ని తలపించే పోజులో ఎగిరిపోతున్న ఓ డేగ

జమ్మూలో 50 మంది ముష్కరులు

- వెంటాడి..వేటాడుతాం..!
- భద్రతా బలగాల వెల్లడి

నగ్రోటా: జమ్మూ ప్రాంతంలో చురుగ్గా ఉన్న 40 నుంచి 50 మంది ఉగ్రవాదుల ఆచూకీ కనిపెట్టడమే లక్ష్యంగా భద్రతా బలగాలు కూంబింగ్‌ను నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. జమ్మూలోపలి ప్రాంతాలతోపాటు సరిహద్దులకు సమీపంలోనూ ప్రస్తుతం పరిస్థితులు ప్రశాంతంగానే కనిపిస్తున్నా పలు అంచెల భద్రతా వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా అదనపు బలగాల మోహరింపు, రాత్రి వేళ తనిఖీలు, డ్రోన్లపై నిషేధం వంటి చర్యలతో ముష్కరుల కట్టడికి పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. పీర్ పంజాల్ పర్వత శ్రేణికి దక్షిణ ప్రాంతంలో 40 నుంచి 50 మంది ఉగ్రవాదులు పలు గ్రూపులుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లుగా నిఘా వర్గాలు, కూంబింగ్ సందర్భంగా సేకరించిన సమాచారం ఆధారంగా భద్రతా బలగాలు అంచనా వేస్తున్నాయి. ఈ మేరకు రాజౌరీ, పూంఛ్, కిష్త్వార్, దోడా, ఉధంపూర్ జిల్లాల్లో ఉగ్రవాద వ్యతిరేక చర్యలను చేపట్టారు. బలగాలు వెంటాడుతున్న విషయం పసిగట్టిన ముష్కరులు ఎప్పటికప్పుడు తప్పించుకు తిరిగే పనిలో ఉన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పర్వత ప్రాంతాలతోపాటు అత్యంత సున్నితంగా ఉండే ప్రాంతాల్లో బలగాలను అదనంగా మోహరించారు. దీంతో, ఈ ప్రాంతమంతా బలగాల నియంత్రణలోకి వచ్చేసిందని చెప్పాయి. రాత్రి పూట స్పష్టంగా చూడగలిగే పరికరాలు, ఆధునిక సాధన సంపత్తితో రాత్రి వేళలోనూ నిఘా కొనసాగుతోందని ఓ అధికారి తెలిపారు. గతంలో ఉగ్రవాదులు సంచరించిన, చొరబడిన మార్గాలను పూర్తిగా దిగ్బంధించామన్నారు. సరిహద్దుల ఆవల ఉగ్ర మూకలు చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాత్రి వేళ ఉగ్రవాదులు ముఠాలుగా ఏర్పడటం, సంచరించడం, ఆశ్రయం తీసుకోవడం వంటి వాటిని అడ్డుకునేందుకు పర్వత ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి సారించామన్నారు. 'కీలక ప్రాంతాలపై పట్టుబిగించాం. వారి కదలికలను ఎప్పటికప్పుడు కనిపెట్టి, వెంటాడుతున్నాం. నేడోరేపో వారు చిక్కడం ఖాయం'అని ఆ అధికారి స్పష్టం చేశారు.

కేరళలో బుజ్జగింపు రాజకీయాలు

ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లపై అమిత్ షా ధ్వజం

తిరువనంతపురం: కేరళలోని అధికార సీపీఎం సారథ్యంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌లపై బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ రెండు పక్షాలు రాష్ట్రంలో అవినీతిని, బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) వంటి దేశ వ్యతిరేక శక్తులకు కేరళను సురక్షితమైన ప్రాంతంగా మార్చాయని మండిపడ్డారు. శనివారం ఆయన తిరువనంతపురంలో జరిగిన పార్టీ సమావేశంలో ప్రసంగించారు. పీఎఫ్ఐ అనుబంధ సంస్థలను కేంద్రం 2022లో చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించింది. కేరళలో పీఎఫ్ఐ సంస్థపై నిషేధం విధించే అధికారం ఉన్నా ఇప్పటి వరకు ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఆ సంస్థ నేతలను ఎందుకు అరెస్ట్ చేయలేదని ఈ సందర్భంగా వామపక్ష ప్రభుత్వాన్ని అమిత్ షా ప్రశ్నించారు. 'రాష్ట్రాభివృద్ధి బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏతో మాత్రమే సాధ్యం. దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా వికసిత్ భారత్ సాధ్యం కాదు. వికసిత్ కేరళమ్ మాత్రమే వికసిత్ భారత్‌కు మార్గమని చెప్పారు. అందుకే, బీజేపీ లక్ష్యం ఇక నుంచి వికసిత్ కేరళమ్' అని ఆయన పేర్కొన్నారు. కేరళలో పార్టీకి చెందిన ముఖ్యమంత్రి ఉండటం కంటే రాష్ట్రాన్ని వికసిత్‌కు కేంద్రంగా మార్చడం ముఖ్యమైన విషయమని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వికసిత్ కేరళమ్ మిషన్ లోగోను ఆవిష్కరించారు. బీజేపీ, సీపీఎంలకు పార్టీ కేడర్ ఉన్నప్పటికీ ప్రధానమైన తేడా ఒకటుందని చెబుతూ ఆయన..బీజేపీ కేడర్ రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తే, సీపీఎం కేడర్ అభివృద్ధి కోసమే పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా అమిత్ షా బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యాలయం మరార్జీ భవన్‌ను ప్రారంభించారు.

లెక్చరర్ వేధింపులతో నిప్పంటించుకున్న విద్యార్థిని

90 శాతం గాయాలతో పరిస్థితి విషమం

బాలసోర్: తనను లైంగికంగా వేధిస్తున్న లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని ఓ విద్యార్థిని కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. ఎలాంటి చర్యలూ లేకపోవడంతో మనస్తాపం చెంది శనివారం కళాశాల ఆవరణలోనే ఒంటికి నిప్పంటించుకుంది. దాదాపు 90 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఈ దారుణం ఒడిశాలోని బాలసోర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు బాలసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో బీఈడీ సెకండియర్ చదువుకుంటోంది. కాలేజీలో తన విభాగం హెచ్‌వోడీ, లెక్చరర్ లైంగికంగా వేధిస్తున్నారంటూ జూన్ 30వ తేదీన ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు అందించింది. ఆ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాలేజీ క్యాంపస్‌లో వారం రోజులపాటు నిరసన కూడా కొనసాగించింది. శనివారం ప్రిన్సిపల్ దిలీప్ ఘోష్‌ను కలిసింది. అనంతరం కాలేజీ ఆవరణలోనే నిప్పంటించుకుంది. మంటలు ఆర్పి, ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన ఓ విద్యార్థి సైతం గాయపడ్డాడు. దాదాపు 90 శాతం కాలిన గాయాలైన బాధితురాలు ప్రస్తుతం భువనేశ్వర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతోంది.

జన వనం!



స్పెయిన్‌లోని పాంప్లోనాలో రసవత్తరంగా సాగుతున్న బుల్ రన్‌ను శనివారం వీధి పొడవునా బాల్కనీలు, కిటికీల్లోంచి విరగబడి మరీ వీక్షిస్తున్న అభిమాన జనసందోహం

ఉత్తర కొరియా లక్ష్యంగా జట్టు కడితే ఊరుకోం

దక్షిణ కొరియా, జపాన్, అమెరికాలకు రష్యా హెచ్చరిక

సియోల్: ఉత్తర కొరియా లక్ష్యంగా జట్టు కట్టాలని చూస్తే ఊరుకునేది లేదని అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలను రష్యా హెచ్చరించింది. రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్ శనివారం ఉత్తర కొరియాలోని వొన్సాన్ నగరంలో మీడియాతో మాట్లాడారు. ఉత్తర కొరియా చుట్టూ అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ సైనిక మోహరింపులు పెంచాయని ఆరోపించారు. ఈ మూడు దేశాలు రష్యా, ఉత్తర కొరియా సహా మరే ఇతర దేశాలకు వ్యతిరేకంగా సైనిక కూటమిని ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు. అణ్వాయుధాలను కలిగి ఉండాలనే ఉత్తర కొరియా ఆకాంక్షను రష్యా అర్థం చేసుకుంటుందని లావ్‌రోవ్ చెప్పారు. ఉత్తర కొరియా నిర్మించే ఆయుధ వ్యవస్థలన్నీ ఆ దేశ శాస్త్రవేత్తల కృషి ఫలితమేనన్నారు. రష్యా, ఉత్తర కొరియాలు ఇటీవలి కాలంలో దగ్గరవుతున్న విషయం తెల్సిందే.

దాడులు ఆపేస్తే చర్చలకు సిద్ధం: ఇరాన్

టెహ్రాన్: అమెరికాతో అణు చర్చలు జరిపేందుకు తాము సిద్ధమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి చెప్పారు. అయితే, భవిష్యత్తులో తమ దేశంపై మళ్లీ దాడి చేయబోమని ముందుగా అమెరికా హామీ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అమెరికా చర్యలు తమ అణు కార్యక్రమానికి పరిష్కారం సాధించడంలో మరింత అవరోధం కారాదన్నారు. జూన్‌లో ఇజ్రాయెల్-ఇరాన్‌లు దాడులు చేసుకున్నాయి. అదే సమయంలో, ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా ఇరాన్‌లోని అణు స్థావరాలపై భారీ బాంబులు వేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ అణు శక్తి సంస్థ సభ్యులను ఆ దేశం వెనక్కి పంపించేసింది. ఆ సంస్థ సభ్యులు తిరిగి తనిఖీలు కొనసాగించాలంటే తమ భద్రతాపరమైన ఆందోళనలతోపాటు ఇన్‌స్పెక్టర్ల భద్రతను దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుందన్నారు.

త్వరలో యూపీ బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

- రేసులో స్వతంత్రదేవ్ సింగ్, ధరంపాల్ సింగ్, బీఎల్ వర్మ, సాధ్వి నిరంజన్ జ్యోతి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సగానికి పైగా రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసి, అధ్యక్షులను నియమించిన బీజేపీ అధిష్టానం తమ పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియకు అతిత్వరలో శ్రీకారం చుట్టబోతోంది. మరో పది రోజుల్లో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా.. అంతకంటే ముందే ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. బీజేపీకి ఆయువు పట్టులాంటి ఉత్తర్‌ప్రదేశ్‌లో రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికను జాతీయ అధ్యక్షుడి ఎంపిక అనంతరమే చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్‌కు ఉన్న రాజకీయ ప్రాధాన్యత వల్ల అధ్యక్షుడి ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలని బీజేపీ పెద్దలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

2027 ఎన్నికలే లక్ష్యంగా..

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ బీజేపీకి జాట్ వర్గానికి చెందిన భూపేంద్రసింగ్ చౌదరి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2023లోనే ఆయన పదవీకాలం ముగిసినా 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పొడిగించారు. లోక్‌సభ ఎన్నికల్లో 80 స్థానాలకు గాను బీజేపీ కేవలం 33 స్థానాలు గెలుచుకుంది. పార్టీ పేలవ ప్రదర్శన దృష్ట్యా ఆయనను మార్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మొగ్గు చూపుతున్నాయి. ప్రస్తుతం యూపీలో దళితులు, ఓబీసీలు, ఆదివాసీల చుట్టే రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. బీజేపీ సైతం ఆయా వర్గాల నుంచి సమర్థులైన నేతలను అన్వేషిస్తోంది. ఓబీసీ వర్గానికి చెందిన స్వతంత్రదేవ్ సింగ్, ధరంపాల్ సింగ్, బీఎల్ వర్మలు ప్రధాన పోటీదారులుగా ఉండగా, కేంద్ర మాజీ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, సీనియర్ నేతలు బాబూరామ్ నిషాద్, అశోక్ కటారియాలు సైతం రేసులో ఉన్నారు. యూపీ బీజేపీ అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేసినా ఆయన సారథ్యంలోనే 2027లో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. క్రమంగా బలపడుతున్న సమాజ్‌వాదీ పార్టీ, దానికి అండగా ఉన్న కాంగ్రెస్‌ను ఎదిరించాలంటే బీజేపీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికిప్పుడు కొత్త అధ్యక్షుడి ఎంపిక సాధ్యం కాదని, జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాతే ఈ ప్రక్రియ మొదలవుతుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీకి సైతం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాతే కొత్త అధ్యక్షుడి వస్తారని అంటున్నారు. ఢిల్లీలో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా నేతృత్వంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయనకే మళ్లీ పగ్గాలు కట్టబెడతారా? లేక కొత్త వారికి అవకాశం ఇస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

కీకారణ్యం గుహలో రష్యా మహిళ

- రెండు వారాలుగా ఇద్దరు కూతుళ్లతో నివాసం
- కర్ణాటకలో సంచలన ఘటన



యశవంతపుర: భారతీయ ఆధ్యాత్మికతపై మక్కువ పెంచుకున్న ఓ రష్యా మహిళ, తన ఇద్దరు కూతుళ్లతోపాటు దట్టమైన అడవిలోని ఓ కొండగుహలో ఉంటోంది. శివుని విగ్రహానికి పూజలు చేస్తూ ధ్యానంలో గడుపుతోంది. ప్రమాదకరమైన ప్రదేశంలో ఉంటున్న వీరి జాడ అనుకోకుండా పోలీసులకు తెలిసింది. ప్రమాదకరమైన ఆ ప్రాంతం నుంచి తల్లి, ఇద్దరు చిన్నారులను తీసుకువచ్చి ఓ మాతాజీ ఆశ్రమంలో చేర్పించారు పోలీసులు. రష్యా దౌత్య కార్యాలయానికి సమాచారమిచ్చారు. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం గోకర్ణలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల వర్షాలకు కొండచరియలు విరిగి పడుతున్న ఘటనలు నమోదవుతుండటంతో పోలీసులు రామతీర్థ కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో దట్టమైన అడవిలో ఓ గుహ వద్ద దుస్తులు ఆరవేసి ఉండటాన్ని సీఐ శ్రీధర్ సారథ్యంలోని బృందం గమనించింది. లోపలికెళ్లి చూడగా ఓ విదేశీ మహిళ, ఇద్దరు చిన్నారులు కనిపించడంతో వారు ఆశ్చర్యపోయారు. మహిళను ప్రశ్నించగా తన పేరు నినా కుటినా(40), తన ఇద్దరు కూతుళ్ల ప్రేయ(6), అమా(4)అని తెలిపింది. దాదాపు రెండు వారాలుగా అక్కడే నివాసం ఉంటున్నట్లు తెలిపింది. బిజినెస్ వీసాపై 2017లో గోవాకు వచ్చిన ఈమె ఆధ్యాత్మిక చింతనతో గడిపేందుకు నగర వాతావరణానికి దూరంగా ఏకాంతప్రాంతంలో గడపాలని నిర్ణయించుకుని అందుకు గోకర్ణను ఎంచుకున్నానంది.

ఆశ్రమానికి తరలింపు

గతంలో రామతీర్థలో భారీవర్షాలకు కొన్ని గుహలు కూలిపోయాయి. క్రూర జంతువులు, ప్రమాదకరమైన సర్పాలకు నెలవైన అడవిలో ఉండటం ప్రమాదకరమని నచ్చచెప్పి నినాతోపాటు ఇద్దరు పిల్లల్ని తీసుకువచ్చారు. ప్రస్తుతానికి కర్వార్‌లోని మహిళా కేంద్రంలో ఉంచారు. ఆమె కోరిక మేరకు కుమటా తాలూకాలోని యోగరత్న సరస్వతి ఆశ్రమానికి పంపిస్తామని అధికారులు తెలిపారు. హిందూ ఆధ్యాత్మికతపై అభిమానం ఉన్న మహిళ భారత్‌లోనే నివాసం ఉండాలనే కోరిక వ్యక్తం చేసిందన్నారు. జిల్లా ఎస్పీ నారాయణ మాట్లాడుతూ ప్రమాదకరమైన ఆ అటవీ ప్రాంతంలో తల్లి, కూతుళ్లకు ఎలాంటి ప్రమాదం జరక్కపోవడం అదృష్టమన్నారు. వారు అక్కడ ఏమి తిన్నారో, ఎలా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. నినా వద్ద పాస్‌పోర్టు, వీసా వంటివేవీ లేవని చెప్పారు. అవి అడవిలో ఎక్కడో పడిపోయి ఉంటాయని ఆమె చెబుతోందని వివరించారు. 2018 ఏప్రిల్ 19వ తేదీన గోవాలో ఎగ్జిట్ పర్మిట్ తీసుకున్న రష్యా మహిళ నేపాల్ వెళ్లిపోయినట్లు రికార్డుల్లో ఉంది. అయితే, తిరిగి ఆమె అనధికారికంగా దేశంలోకి ప్రవేశించి ఇక్కడే ఉంటోంది. తల్లి సహా ముగ్గుర్ని తిరిగి రష్యాకు పంపించేందుకు అధికారులు చట్టపరమైన ఏర్పాట్లు ప్రారంభించారు.

క్యూబా అధ్యక్షుడిపై అమెరికా ఆంక్షలు

హవానా: మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కనెల్ ఇతర ఉన్నతాధికారులపై ఆంక్షలు విధించినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. క్యూబా న్యాయ, జైళ్ల శాఖల అధికారులపై వీసా ఆంక్షలు విధించామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో 'ఎక్స్'లో తెలిపారు. 2021 జూలై 11, 12వ తేదీల్లో క్యూబాలో ఆర్థిక సంక్షోభం తీవ్రంగా ఉందంటూ ప్రతిపక్ష గ్రూపు దేశవ్యాప్తంగా భారీ నిరసనలు చేపట్టింది. ఇందుకు బాధ్యులని పేర్కొంటూ క్యూబా ప్రభుత్వం 790 మందిని నిర్బంధించింది. క్యూబాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వ చర్యలను అమెరికా ఖండిస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా అధ్యక్షుడు డియాజ్ కనెల్‌తోపాటు రక్షణ మంత్రి అల్వారో లోపెజ్ మియెరా, ఇంటీరియర్ మంత్రి లజారో అల్వారెజ్ కసాస్‌పైనా ఆంక్షలను ప్రకటించింది. క్యూబా ప్రజల ప్రాథమిక స్వేచ్ఛ, మానవ హక్కులకు అమెరికా మద్దతుగా నిలుస్తుందని మార్కో రూబియో పేర్కొన్నారు. గత బైడెన్ యంత్రాంగం కంటే ప్రస్తుత ట్రంప్ ప్రభుత్వం క్యూబాపట్ల కఠిన వైఖరిని అనుసరిస్తోంది.

అధ్యక్షుడిగా జర్దారీయే కొనసాగుతారు

ఆ పదవిని ఆర్మీ చీఫ్ ఎన్నడూ కోరలేదు: ప్రధాని షహబాజ్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీని గద్దె దింపేసి ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఆ పదవిని చేపట్టాలని భావిస్తున్నారంటూ వస్తున్న వార్తలను ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ కేవలం వదంతులేనంటూ కొట్టిపారేశారు. జర్దారీ ఐదేళ్ల పూర్తి కాలం కొనసాగుతారన్నారు. 'ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ దేశాధ్యక్ష పదవిపై ఎన్నడూ ఆసక్తి వ్యక్తం చేయలేదు. ప్రస్తుతానికి అటువంటి ప్రణాళిక కూడా ఏదీ లేదు'అని ఆయన స్పష్టం చేశారు. మునీర్, జర్దారీ మధ్య సానుకూల సంబంధాలున్నాయి. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి గౌరవముంది. పాకిస్తాన్ అభివృద్ధి, పురోగమనమే వీరిద్దరి లక్ష్యం కూడా'అని ప్రధాని వివరించారు. 'జర్దారీ, మునీర్, షరీఫ్‌లే లక్ష్యంగా దుష్ప్రచారం జరుగుతోంది. దీని వెనుక విదేశీ శక్తులున్న సంగతి మాకు తెలుసు. జర్దారీ స్థానంలో ఆర్మీ చీఫ్ మునీర్ రానున్నారంటూ వస్తున్న వార్తలు పూర్తి అసత్యాలు. దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదు. అటువంటి యోచన కూడా లేదు'అంటూ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నక్వీ ఎక్స్‌లో చేసిన ప్రకటన అనంతరం ప్రధాని ఈ మేరకు వివరణ ఇవ్వడం విశేషం. ప్రధాని పదవిని షహబాజ్‌కు, అధ్యక్ష బాధ్యతలను జర్దారీకి అప్పగించేందుకు అధికార కూటమిలో గతేడాది ఒప్పందం కుదిరింది. ఆ మేరకు జర్దారీ ఐదేళ్లకాలానికి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

యూకేలోనే అత్యంత వృద్ధుడి కన్నుమూత

లండన్: రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న సైనికుడు, బ్రిటన్‌లోనే అత్యంత వృద్ధుడిగా భావిస్తున్న డొనాల్డ్ రాస్ 110 ఏళ్ల వయస్సులో శుక్రవారం కన్నుమూశారు. డి-డే ల్యాండింగ్స్‌లో పాల్గొన్న ఈయన జర్మనీలోని బెర్గెన్-బెల్సెన్ కాన్సన్‌ట్రేషన్ క్యాంపునకు విముక్తి కల్పించిన సైనిక డివిజన్‌లోనూ ఉన్నారు. 1944 జూన్ 6వ తేదీన ఫ్రాన్స్‌లోని నార్మండీలో మిత్ర దేశాల సైన్యం నాజీల ఆక్రమణ నుంచి పశ్చిమ యూరప్‌ను కాపాడేందుకు భారీ యుద్ధానికి తెరతీసింది. దీన్నే డి-డే ల్యాండింగ్స్‌గా పేర్కొంటారు. ఈ చారిత్రక ఘటన రెండో ప్రపంచ యుద్ధ గతినే మార్చింది. అడాల్ఫ్ హిట్లర్ సారథ్యంలోని నాజీ జర్మనీ పరాజయం పాలైంది. డొనాల్డ్ రాస్ మృతిని శుక్రవారం ఇంగ్లండ్‌లోని ఎర్‌వాష్ బొరో కౌన్సిల్ ప్రకటించింది. ఆయన్ను యుద్ధ హీరోగా కీర్తించింది. అప్పటి యుద్ధంలో విజయానికి 80 ఏళ్లు నిండిన సందర్భంగా మొన్న మేలో రాయల్ బ్రిటిష్ లీజియన్ ఇచ్చిన టీ పార్టీకి మరో 45 మంది మాజీ సైనికులతోపాటు రాస్ కూడా పాల్గొన్నారు. 1914 డిసెంబర్ 25వ తేదీన రాస్ లండన్ సమీపంలోని వెస్ట్‌కాట్ గ్రామంలో జన్మించారు. 23వ ఏట సైన్యంలో చేరిన ఆయన ఉత్తర ఆఫ్రికాతోపాటు ఇటలీ, ఫ్రాన్స్‌ల్లో సేవలందించారు. ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం లీజియన్ డి ఆనర్ సహా పలు గౌరవ పురస్కారాలను పతకాలను అందుకున్నారు.

గాజాలో 58 మంది మృత్యువాత

డెయిర్ అల్-బలాహ్: గాజా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న మారణ హోమంలో మరో 58 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు చిన్నారులు, మహిళలు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక సెంట్రల్ గాజాలోని డెయిర్ అల్-బలాహ్‌పై జరిగిన దాడుల్లో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా కనీసం 13 మంది చనిపోయారని అల్ అక్సా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంధన డిపో వద్ద జరిగిన మరో దాడిలో నలుగురు మృతి చెందారు. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌పై జరిగిన దాడుల్లో 15 మంది చనిపోయారని నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కాగా, గడిచిన 48 గంటల్లో గాజాలోని మిలిటెంట్ల స్థావరాలు, టన్నెళ్లు, ఆయుధ నిల్వ కేంద్రాలు, యాంటీ ట్యాంక్ మిస్సైల్ లాంఛ్ పోస్టులు తదితర 250 లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ శనివారం ప్రకటించింది. ఇలా ఉండగా, గాజాలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఏర్పాటు చేసిన ఆహార కేంద్రాల వద్ద మారణ హోమం కొనసాగుతోంది. తాజాగా, రఫా, డెయిర్ అల్-బలాహ్‌లలో జరిగిన కాల్పుల్లో మరో 30 మంది అన్నార్తులు ప్రాణాలు కోల్పోయారని అల్ జజీరా పేర్కొంది.

ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్ల వర్షం

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడుల తీవ్రత తగ్గే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. శుక్రవారం రాత్రి నుంచి 597 డ్రోన్లు, 26 క్రూయిజ్ మిస్సైళ్లను ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాలపై ప్రయోగించింది. వీటిలో 319 డ్రోన్లు, 25 క్షిపణులను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. మరో 258 డ్రోన్లు ఎలక్ట్రానిక్ జామింగ్‌తో దారి తప్పాయని వెల్లడించింది. చెర్నివ్‌ట్సీ ప్రాంతంలోని బుకోవినాపై జరిగిన దాడిలో ఇద్దరు చనిపోగా 14 మంది గాయపడ్డారు. లివివ్ ప్రాంతంపై జరిగిన మరో డ్రోన్ దాడిలో ఆరుగురు గాయాలపాలయ్యారు. ఖర్కీవ్‌లో ముగ్గురు క్షతగాత్రులయ్యారు.

ఆర్‌పీఎఫ్ చీఫ్‌గా సోనాలి మిశ్రా

న్యూఢిల్లీ: రైల్వేస్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా మొట్టమొదటి సారిగా మహిళా అధికారి నియమితులయ్యారు. మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఐపీఎస్ అయిన సోనాలి మిశ్రా ఆర్‌పీఎఫ్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కేబినెట్ నియామకాల కమిటీ ఈమె నియామకంపై ఆమోదం తెలిపిందని సిబ్బంది వ్యవహారాల శాఖ శనివారం పేర్కొంది. సోనాలి మిశ్రా 2026 అక్టోబర్ 31వ తేదీ వరకు బాధ్యతల్లో కొనసాగనున్నారు. జూలై 31వ తేదీన పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ స్థానంలో పగ్గాలు చేపడతారు. సోనాలి మిశ్రా ప్రస్తుతం మధ్యప్రదేశ్ అదనపు డీజీపీ(సెలెక్షన్)గా కొనసాగుతున్నారు. రైల్వే ఆస్తుల పరిరక్షణ, ప్రయాణికుల భద్రత, తదితరాలు ఆర్‌పీఎఫ్ బాధ్యతలు.

ఖైదీ పొట్టలో సెల్‌ఫోన్

శివమొగ్గ: జైలు జీవితం అనుభవిస్తున్న ఓ వ్యక్తి అధికారుల కళ్లుగప్పి సెల్‌ఫోన్‌ను వాడుతున్నాడు. అధికారుల కంటపడరాదనో ఏమో దాన్ని మింగేశాడు. కడుపునొప్పితో ఇబ్బందిపడ్డాడు. చివరికి తట్టుకోలేక జైలు అధికారులకు గోడు వెళ్లబోసుకున్నాడు. ఆస్పత్రికి తీసుకెళ్లాక అసలు విషయం వెలుగుచూసింది. వైద్యులు అతడికి ఆపరేషన్ తీసి సెల్‌ను వెలికితీశారు. కర్నాటకలోని శివమొగ్గలో ఈ ఘటన చోటుచేసుకుంది. శివమొగ్గ జైలులో దౌలత్ అలియాస్ గూండా(30) పదేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. జూన్ 24వ తేదీన పొట్టలో నొప్పిగా ఉందని అతడు చెప్పడంతో అధికారులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎక్స్ రే తీయించిన వైద్యులు అతడి పొట్టలో సెల్‌ఫోన్ ఉన్నట్లు తేల్చారు. ఖైదీ సమ్మతి మేరకు ఆపరేషన్ చేసి ఒక అంగుళం మందం, మూడంగుళాల వెడల్పు ఉన్న సెల్‌ఫోన్‌ను బయటకు తీశారు. ఈ నెల 8న సీల్డ్ కవర్‌లో దానిని జైలు అధికారులకు అందజేశారు. దౌలత్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పూర్తయిన కీలక ఇంజన్ అభివృద్ధి

గగనయాన్‌కు మరింత చేరువలో ఇస్రో

సూళ్లూరుపేట: గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్ఎంపీఎస్) పేజ్-4 హాట్ టెస్ట్‌ను 350 సెకన్లపాటు విజయవంతంగా నిర్వహించినట్టు ఇస్రో తెలిపింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో వున్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఈ పరీక్ష జరిగిందంది. 9న ఒక హాట్‌టెస్ట్‌ను విజయవంతంగానే నిర్వహించడం తెలిసిందే. ఈ అర్హత పరీక్ష పూర్తి కావడంతో గగన్‌యాన్ మిషన్ కోసం సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ అభివృద్ధిని ఇస్రో విజయవంతంగా పూర్తి చేసినట్లయింది. శుక్రవారం హాట్ టెస్ట్ సమయంలో ప్రొపల్షన్ సిస్టం మొత్తం అంచనాల ప్రకారమే సాధారణంగానే ఉందని ఇస్రో పేర్కొంది.

నిజాం వ్యక్తిగత సైన్యం పేరేంటి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

అసఫ్‌జాహీలు

నిజాం రాజ్య పాలకులు గతంలో మొగలులు, కుతుబ్‌షాహీలు అనుసరించిన భూమిశిస్తు విధానాలనే కొనసాగించారు. స్థానిక అవసరాల దృష్ట్యా కొన్ని మార్పులు చేశారు.

హైదరాబాద్ రాజ్య విస్తీర్ణం 82,698 చదరపు మైళ్లు. దీనిలో 60 శాతం దివానీ భూమి, 30 శాతం భూమి జాగీర్దార్ల ఆధీనంలో ఉండేది. మిగిలిన 10 శాతం భూమిని నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించేవారు. ఆ భూములను సర్ఫ్-ఎ-ఖాస్ అనేవారు.

దివానీ భూమి శిస్తు విధానం

- రాజ్యానికి చెందిన భూమిని 'దివానీ లేదా ఖల్సా' భూములు అనేవారు. ఇందులో 60 శాతం ప్రభుత్వ ఆధీనంలో ఉండేది.
- దివానీ భూముల నుంచి వచ్చే పన్నులను ప్రభుత్వ నిర్వహణకు ఉపయోగించేవారు.
- 1875లో దివానీ పద్ధతిలో క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానం 1317 ఫసలీ చట్టం ద్వారా సాలార్‌జంగ్–1 ప్రవేశపెట్టాడు.
- 1948లో హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేనాటికి సంస్థానం దివానీ భూమిలో 13,816 గ్రామాలు ఉన్నాయి.
- కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేసి నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరిచారు. తెలంగాణలో ఎక్కువ శాతం వ్యవసాయం చెరువులు, వర్షం ఆధారంగా సాగయ్యేది.
- సాగు భూముల నుంచి వచ్చే ఆదాయం తక్కువ ఉండటం, సరైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడం వల్ల గుత్తేదార్లు, దళారీలు రైతులను వీలైనంత ఎక్కువ దోచుకొనేవారు. ఫలితంగా 15 శాతం సాగు భూమి వృథాగా ఉండేది.
- నిజాం రాజ్యంలో రైత్వారీ విధానంతోపాటు ఇతర భూమి శిస్తు పద్ధతులు కూడా ఉండేవి. రైత్వారీ విధానం ఎక్కువ ప్రాచుర్యం పొందింది. నిజాం పాలకుల కింద అధిక భూభాగం ఈ విధానం కిందే ఉండేది. రాజ్యంలో రైత్వారీ పద్ధతితోపాటు సరబాస్తా, ఇజారా, పాన్‌మక్తా వంటి ఇతర పద్ధతుల కింద కూడా భూమి ఉండేది.

రైత్వారీ విధానం

ఈ విధానంలో భూమి దున్నే రైతులకు యాజమాన్య హక్కులు ఇచ్చారు. ఈ విధానంలో మధ్యవర్తులు ఉండేవారు కాదు. దాదాపు 200 మిలియన్ల ఎకరాలకు పైగా భూమి రైత్వారీ విధానం కింద ఉండేది.

- హైదరాబాద్ రెవెన్యూ కోడ్ (1879) కింద ప్రభుత్వం భూయజమానులకు వాస్తవ హక్కులను కల్పించింది. ఈ కోడ్ ద్వారా రాజ్యంలో రైతును అసలైన యజమానిగా గుర్తించారు.
- భద్రత, సమర్థమైన పూర్తి హక్కులకు కోడ్ ప్రకారం రైతులకు అప్పగించారు. కొన్ని నియమ నిబంధనలతో రైతు ప్రభుత్వానికి క్రమం తప్పకుండా భూమి పన్ను కట్టాలి.
- రైత్వారీ విధానంలో పట్టాదారు తన భూమిని విక్రయించడానికి లేదా తనఖా పెట్టడానికి హక్కు ఉండేది.
- చట్టపరంగా సేద్య భూమిని వ్యక్తిగతంగా లేదా వ్యవసాయ కూలీల ద్వారా సేద్యం చేసేవారు. దీన్ని పట్టాదారు విధానం అనే వారు.
- ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ రైతులు సేద్యం ద్వారా ఉమ్మడిగా లేదా వాటాదారులుగానీ ఉత్పత్తి చేసిన దాంట్లో సమాన భాగస్వామ్యం కలిసి ఉన్న విధానమే 'పాథ్ పట్టాదారీ'.

పాన్‌మక్తా:
ప్రభుత్వ భూములను కౌలుకు తీసుకొని స్థిరమైన శిస్తు చెల్లించే కౌలుదారీ విధానమే పాన్‌మక్తా. ఇందులో పన్ను పెరుగుదల ఉండేది కాదు.

ఇజారా పద్ధతి:
వ్యవసాయ క్షేత్రాలు బ్రిటిష్ ప్రాంత పరిపాలనలోకి వెళ్లకుండా, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో గ్రామాలను పునర్జీవనం చేయడానికి, బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన పద్ధతే ఇజారా పద్ధతి. పరిపాలనలో అవినీతిని నిరోధించడానికి, గుత్తేదార్లు, భూస్వాముల నుంచి వ్యవసాయదారులను రక్షించడానికి సాలార్‌జంగ్ సంస్కరణల ఫలితంగా ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు.

వతన్‌దారీ పద్ధతి:
ఇది చాలా ప్రాచీన భూమిశిస్తు పద్ధతి. రాజుకు సేవ చేసినందుకు ప్రభుత్వం ఈ భూములను ఇచ్చేది. వతన్ అంటే స్థానిక లేదా సొంత ప్రాంతం అని అర్థం.

- స్థానిక రెవెన్యూ అధికారులైన పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, సర్దేశ్‌పాండేలు, గ్రామంలోని వృత్తి పనివాళ్లకు, గ్రామ సేవకులకు నగదు రూపంలో ఇచ్చే జీతాలకు బదులుగా ఈ భూములను ఇచ్చేవారు.

సర్ఫ్–ఎ–ఖాస్:
సర్ఫ్–ఎ–ఖాస్ పదాన్ని అరబిక్ భాష నుంచి గ్రహించారు. సర్ఫ్–ఎ– ఖాస్ అంటే వ్యక్తిగత వ్యయం అని అర్థం.

- నిజాం రాజు సొంత ఖర్చుల నిమిత్తం కేటాయించిన భూమే సర్ఫ్–ఎ–ఖాస్ (సర్ఫేఖాస్). వీటి విస్తీర్ణం 10,000 చదరపు మైళ్లు.
- 1948లో హైదరాబాద్ సంస్థానం, భారత యూనియన్‌లో విలీనం అయ్యేంత వరకు సర్ఫేఖాస్ భూముల ఆదాయం, వనరులను రాజ కుటుంబానికి కేటాయించారు.
- రెండో నిజాం కాలంలో దార్–ఉల్–సిఫ్రా అనేది సర్ఫేఖాస్ భూముల కేంద్ర పరిపాలన విభాగం.
- నిజాంకు వ్యక్తిగత సైన్యం ఉండేది. దాన్ని సర్ఫేఖాస్ సైన్యం అని పిలిచేవారు.
- సర్ఫేఖాస్ ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో కలిపేవారు కాదు. ఈ భూముల్లో వసూలైన పన్నులను జిల్లా సర్ఫేఖాస్ ఖాతా నుంచి పర్యవేక్షకుడి ఖాతాలో చేరుతుంది. వీటిని ప్రభుత్వ ఆజ్ఞ ద్వారా సర్ఫేఖాస్ అధికారి పర్యవేక్షించేవాడు. ఖాతా ధనం మొత్తం సర్ఫేఖాస్ కార్యదర్శి ద్వారా సర్ఫేఖాస్ అధికారికి చేరుతుంది.
- సర్ఫేఖాస్ భూములను సర్దార్–ఉల్–మహామ్ అనే అధికారి పర్యవేక్షించేవాడు. ఇతడు ప్రత్యక్షంగా నిజాం ఆధీనంలో పనిచేసేవాడు.
- సర్ఫేఖాస్ భూములను ముఫ్‌వాజా(అప్ప గించిన భూములు), జేర్‌నిగరాని(పర్యవే క్షించే తాలూకాలు)గా విభజించారు.

జాగిర్దారీ పద్ధతి:
నిజాం నవాబుకు, ప్రభుత్వానికి సేవచేసిన వారికి ఇచ్చిన భూములను జాగీర్లు అనేవారు. జాగీరు పొందిన వ్యక్తి ఆ ప్రాంతం మీద పూర్తి హక్కులు పొందుతాడు. అలా పూర్తి హక్కులు పొందినవారినే జాగీర్దార్లు.

- ఈ జాగీర్దారీ విధానాన్ని కాకతీయుల కాలంలోని నాయంకర విధానం, విజయనగర కాలంలో అమర నాయక విధానం, మొగలుల కాలంలో మున్సబ్‌దారీ విధా నాలతో పోల్చవచ్చు.
- జాగీర్దారీ విధానాన్ని మధ్యాసియా ప్రాంతం నుంచి ఢిల్లీ సుల్తాన్లు తీసుకువచ్చి భారతదేశంలో ప్రవేశపెట్టారు.



- జాగీర్దార్ అనే పదం రెండు పర్షియన్ పదాల కలయిక. జాగీరు అంటే భూమి, దార్ అంటే అధికారి. భూమి మీద హక్కులు ఉన్న అధికారి అని జాగీర్దార్ అర్థం.
- నిజాం రాజు మొత్తం భూభాగంలో 40 శాతం జాగీర్దార్లకు ఇచ్చారు.
- జాగీర్దారు తన జాగీరులో పన్నులు వసూలు చేసుకొని శాంతి భద్రతలు కాపాడుతూ, సైన్యాన్ని నిర్వహించేవారు. రాజుకు అవసరం ఉన్నప్పుడు సైన్యాన్ని పంపేవారు.

జాగీరు రకాలు

పాయిగా జాగీర్:
పాయిగా జాగీరు భూములకు మరో పేరు జాగిరత్–ఇ–నిగదిస్తు జామతి. ఇది ఒక సైనిక జాగీరు. పాయిగా జాగీరును నవాబ్ నిజాం అలీ ఖాన్ బహదూర్ నుంచి అబ్దుల్ ఖాహిర్ ఖాన్, నవాబ్ షంషుల్ ఉమ్రా, అమీర్–ఇ–కబీర్ గుర్రాల నిర్వహణ కోసం భూములను పొందారు. తర్వాత కాలంలో ఈ భూములను పాయిగా జాగీరుగా మార్చారు.

- పాయిగా అంటే స్థిరత్వం. ఈ జాగీరు మొత్తం విస్తీర్ణం 2000 చ.మైళ్లు. ఇందులో సుమారు 1000 గ్రామాలు ఉన్నాయి.

అల్‌తమ్‌గా జాగీర్:
అల్‌తమ్‌గా తుర్కీ భాషకు చెందిన పదం. అల్‌తమ్‌గా అంటే రాజు చిహ్నానికి ఉన్న రెండు గుర్తులు. ఇది భూమిశిస్తు లేని జాగీరు. ఈ జాగీరును రాజు తన ముద్ర ద్వారా కేటాయిస్తారు. ఈ జాగీరు శాశ్వతమైన వంశపారపర్యంగా పొందే హక్కు. దీన్ని విక్రయించే హక్కు లేదు. ఒకవేళ ఈ భూమిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వాలంటే ముందుగా రాజు అనుమతి తీసుకోవాలి.

జాట్ జాగీర్‌లు:
నిజాం కాలంలో అతిపెద్ద భూ విస్తీర్ణం ఉన్న జాగీరు. జీవితాంతం నిజాం కోసం సేవ చేసే వారికి ఇచ్చే భూములే జాట్ జాగీరులు.

- ఈ జాగీరు పొందినవారు తమ జీవితాంతం ఆ భూమిని అనుభవించవచ్చు.
- ఈ జాగీరుకు మరో పేరు ఖాస్ కా జాగీరు. ఈ జాగీర్దారుకు తమకు వచ్చే ఆదాయం పై న్యాయపరమైన హక్కు ఉండేది.
- వీరికి ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, భూమి కొలతల శాఖ మొదలైన వాటిపై పొందిన భూమిపై అన్నిరకాల పన్నుల నుంచి మినహాయింపులు ఉండేవి. వీరు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన హోదాను కలిగి ఉండేవారు.

ఉమ్రా–ఇ–అజిమ్ జాగీరు:
వీరు కూడా నిజాం రాజు సేవకులే. పాయిగా జాగీరు తర్వాత స్థాయికి చెందినవారు. ఈ జాగీర్లను ఇలాఖాలు అని కూడా పిలిచేవారు. నిజాం రాజ్యంలో మొత్తం ఇలాఖాలు తొమ్మిది. ఇందులో ప్రధానమైనవి నాలుగు.

- ఈ నాలుగు ఇలాఖాలు అత్యంత పలుకుబడి ఉన్న అధికారుల ఆధీనంలో ఉండేవి. ఇవి నవాబ్ సాలార్‌జంగ్, మహారాజా శ్రీ కిషన్ ప్రసాద్, నవాబ్ ఖాని ఖానన్, నవాబ్ ఫఖుర్–ఉల్–ముల్క్ అనే ప్రధాన మంత్రులకు చెందినవి.
- ఈ ఇలాఖాల్లో మొత్తం 769 గ్రామాలు ఉండేవి. ఈ గ్రామాలను నాలుగు సంస్థానాలుగా విభజించారు.
- ఈ నాలుగు సంస్థానాల్లో సాలార్‌జంగ్‌కు చెందిన ఇలాఖా పెద్దది. ఇందులో 1126 చదరపు మైళ్ల విస్తీర్ణంతో 359 గ్రామాలుండేవి. ఇలాఖా నుంచి ఏడాదికి 20 లక్షల సిక్కాల ఆదాయం లభించేది.
- ఈ నాలుగు ఇలాఖాలు విడివిడిగా రెవెన్యూ, చట్ట నిర్వహణ చేసేవి.

మశ్రుతి జాగీర్లు:
రాజ్యంలో ప్రజల కోసం, సైనిక వ్యవస్థ కోసం, మతం కోసం పనిచేసిన వ్యక్తులకు ఇచ్చే జాగీర్లు. ఇది షరతులతో కూడిన జాగీరు.

జాగీరు భూముల్లో రెవెన్యూ పరిపాలన

అన్ని జాగీరుల భూముల విస్తీర్ణం, ఆదాయం ఒకే విధంగా ఉండేది కాదు. ఈ జాగీరు ప్రాంతాల్లో వివిధ రకాలైన పరిపాలన ఉంటుంది. కాబట్టి కౌలుదార్ల నుంచి జాగీర్దార్లు ఎక్కువ కౌలు వసూలు చేసేవారు. నిజాం కూడా పెద్ద జాగీరుల ఆగడాలను నిలువరించలేకపోయాడు. కొన్ని సందర్భాల్లో నిజాం దివానీ హక్కులను కూడా జాగీర్దార్లు ధిక్కరించారు. తొంభై శాతం జాగీర్దార్లు నిజాం రాజు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానం కాకుండా తమ స్వతంత్ర శిస్తు విధానాన్ని అమలు చేశారు.

ఇనాం భూములు:
ఇనాం అనేది బహుమతిగా ఇచ్చిన భూమి లేదా భూమిశిస్తు. పాలకులు పొందిన సేవలు లేదా భవిష్యత్తులో పొందే సేవలకు గాను సేవకులకు ఇనాం భూములు ఇచ్చారు.

అగ్రహారాలు:
అగ్రహారాలు నిజాం కాలంలో ప్రధాన హిందూ విద్యా కేంద్రాలుగా ఉండేవి. విద్య బోధించడానికి బ్రాహ్మణులకు అగ్రహార గ్రామాలను శిస్తులేకుండా ఇచ్చేవారు. ఈ అగ్రహార భూములు వంశపారంపర్యంగా వారసులకు లభించేవి. ఈ విద్యాకేంద్రాలపై ఎటువంటి అజమాయిషీ ఉండేది కాదు.

వెట్టి:
వెట్టి అంటే బలవంతంగా లేదా తప్పనిసరిగా దేశ్‌ముఖ్‌లకు, దొరలకు తక్కువ వేతనాలకు లేదా అసలు వేతనం లేకుండా పని చేయడం.

బాగేలా(వెట్టి చాకిరి) పద్ధతి:
హైదరాబాద్ నిజాం కాలంలో సమాజంలో భూమి లేని తక్కువ వర్గాలకు చెందినవారు బాగేలా పద్ధతిలో పనిచేసేవారు. తీసుకున్న అప్పు తీరే వరకు కుటుంబంలో ఒక వ్యక్తి దేశ్‌ముఖ్ లేదా దేశ్‌పాండే ఇంట్లో పని చేసేవారు. తనఖా ఉన్న బాగేలా జీతం చాలా తక్కువగా ఉండేది. బాగేలా చనిపోతే ఆ అప్పు తన కుమారుడికి వారసత్వంగా వెళ్లేది.

- 1992లో చిలుకూరులో జరిగిన నిజాం ఆంధ్ర మహాసభ సమావేశంలో వెట్టిచాకిరి నిర్మూలన కోసం అవగాహన వారాలను నిర్వహించింది.
- 1944 భువనగిరి, 1945 మణికొండ నిజాం ఆంధ్ర మహాసభల్లో 'వెట్టిచాకిరిని రద్దు చేయాలి' అని తీర్మానం చేశారు..

క్లోనింగ్‌లో ఉపయోగించే కణాలు?

- క్లోనింగ్ ద్వారా మానవ అవయవాలను కూడా అభివృద్ధి చేయవచ్చు. అయితే శరీర భాగాలను తయారు చేయడం ద్వారా సాంఘిక, సామాజిక పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.
- జంతువుల్లో జీవ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సూపర్ ఒవ్యులేషన్ విధానం ద్వారా ఆవుల్లో, గేదెల్లో కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు.
- జన్యు చికిత్స (Gene Therapy)ని అనువంశిక వ్యాధులను నయం చేయడంలో ఉపయోగిస్తారు.
- నేర నిర్ధారణ, రక్త సంబంధీకుల నిర్ధారణలో పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (PCR) అనే ఆధునిక పరీక్ష ఎక్కువగా తోడ్పడుతోంది.

బయోటెక్నాలజీ

బయోటెక్నాలజీలో సస్య ప్రజననంతోపాటు కణజాల వర్ధనం, జెనెటిక్ ఇంజినీరింగ్, క్లోనింగ్, ఏకకణ ప్రోటీన్స్ లాంటివి అనేక అంశాల్లో వివిధ రీతుల్లో ఉపయోగపడుతున్నాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్: దీంట్లో భాగంగా జన్యు పదార్థమైన డీఎన్ఏను ఉపయోగించి ఆధునిక విధానాల ద్వారా మొక్కల్లో, జంతువుల్లో శ్రేష్టమైన లక్షణాలను నిక్షిప్తం చేయడం, నూతన వంగడాలు, జంతు క్లోన్స్, వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేయడం, కలుషిత నీటిని, పరిసరాలను శుభ్రపరచడం మొదలైన అంశాలుంటాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో నాలుగు దశలుంటాయి.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

1. వాంఛనీయ జన్యువును వేరు చేయడం.
2. జన్యువును వాహక డీఎన్ఏలోకి ప్రవేశపెట్టడం.
3. పునఃసంయోజక డీఎన్ఏ వాహకాన్ని అతిథేయి కణంలోకి బదిలీ చేయడం.
4. వాంఛనీయ జన్యువును కలిగిన అతిథేయి కణాలను వరణం ద్వారా ఎన్నుకోవడం.

వాంఛనీయమైన జన్యువును వేరు చేయడంలో డీఎన్ఏను ఖండితాలుగా చేయడానికి ఉపయోగించే ఎంజైమ్‌లను 'రిస్ట్రిక్టెడ్ ఎంజైమ్స్' అంటారు. వీటినే 'అణు కత్తెరలు' అని కూడా అంటారు.



వీటిలో ఎండో న్యూక్లియేజ్ ఎంజైమ్‌లు ఉంటాయి. ఖండితాలైన డీఎన్ఏ ముక్కలను ఎలక్ట్రో ఫోరెసిస్, సదరన్ బ్లాటింగ్ పరీక్ష ద్వారా గుర్తించి ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియను ఇ.ఎం. సదరన్ కనుగొన్నాడు.

ఈ ప్రక్రియ అనంతరం వాహకంలో క్లోనింగ్ చేస్తారు. అంటే వేరు చేసిన డీఎన్ఏ ఖండితాల నకళ్లను తయారు చేస్తారు. వాహకంగా ఇ–కోలీ అనే బ్యాక్టీరియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్మిడ్, కాస్మిడ్, బ్యాక్టీరియో ఫేజెస్ లాంటివాటిని కూడా వాహకాలుగా వినియోగిస్తున్నారు. వాహకంలో ఏర్పడిన డీఎన్ఏను r-డీఎన్ఏ లేదా కైమరిక్ డీఎన్ఏ అంటారు. P^{BR} – 322 అనేది కృత్రిమ వాహకం.

r-డీఎన్ఏను బదిలీ చేసిన కణాలను మార్కర్ జన్యువుల ద్వారా గుర్తిస్తారు. ఎంపిక విధానంలో ముఖ్యంగా కాలనీ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగిస్తారు. కొన్నిసార్లు C-డీఎన్ఏను ఉపయోగించి కూడా అతిథి కణాలను ఎంపిక చేస్తారు. C-డీఎన్ఏను ఉపయోగించి డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా నేర నిర్ధారణ జరుపుతారు. ఇది వివిధ వ్యాధులను, ఆహార కాలుష్యకాలను గుర్తించడానికి కూడా ఉపయోగపడుతుంది. మొక్కల్లో T_i ప్లాస్మిడ్‌ను కలిగిన ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్లను జన్యువుల బదిలీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

క్లోనింగ్ విధానంలో కనుగొన్న కొన్ని క్లోన్స్	
డాలి	– గొర్రె పిల్ల (మొదటి క్లోన్)
ప్రామేటి	– గుర్రం పిల్ల
టెట్రా	– రీసస్ కోతి
హుంబావో	– లేగ దూడ
పంపా	– ఆవు దూడ
ప్రిన్స్	– పంది పిల్ల
మటిల్డా	– గొర్రె
ద్యూయీ	– మగజింక
విటి–20	– కుందేలు
స్పాటి	– మచ్చల జింక
జియోజియో	– ఎలుక

వ్యవసాయం – బయోటెక్నాలజీ

నార్మన్ ఇ. బోర్లాగ్ 1960 ప్రాంతంలో అధిక దిగుబడినిచ్చే రకాలను కనుగొని హరిత విప్లవానికి కారకులయ్యారు. ఈయనను 'హరిత విప్లవ పితామహుడు' అంటారు. ఇండియాలో ఎం.ఎస్. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పేర్కొంటారు. మెరుగైన వంగడాలను వాడటం, రసాయన ఎరువులు, పెస్టిసైడ్స్, సేద్యపు నీటి పరిజ్ఞానం, భూ సంస్కరణలు, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం తదితరాలు హరిత విప్లవంలో భాగంగా ఉంటాయి.

జన్యు మార్పిడి విధానం ద్వారా జన్యు పరివర్తిత మొక్కలను (GM–Plants) రూపొందిస్తున్నారు.

ఉదా: బీటీ కాటన్, గోల్డెన్ రైస్.

బీటీ – పత్తిలో చీడల నిరోధకతను అభివృద్ధి పరిచారు. దీన్ని మొదట మోనిశాంటో అనే అమెరికా విత్తన సంస్థ రూపొందించింది. ప్రస్తుతం దీన్ని ఇండియాలో మహికో విత్తన సంస్థ రూపొందిస్తోంది.

బాసిల్లస్ థురెంజియన్సిస్ అనే బ్యాక్టీరియా లెపిడాప్టిరాన్స్, కోలియోప్టిరాన్స్, డిప్టిరాన్స్ లాంటి వాటి నుంచి రక్షించడానికి తోడ్పడుతుంది.

గోల్డెన్‌రైస్‌లో విటమిన్–ఎ ఉత్పత్తి జరిగే విధంగా రూపొందించారు.

గతంలో జంతువులను చంపి వాటి క్లోమం నుంచి ఇన్సులిన్‌ను నిష్కర్షణ చేసేవారు. 1983లో అమెరికాకు చెందిన ELiLilly అనే కంపెనీ ఇ-కోలీ బ్యాక్టీరియాను ఉపయోగించి హ్యూమ్యులిన్ అనే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేసింది.

జన్యుపరివర్తిత మొక్కల ఉపయోగాలు:

- బొప్పాయిలో రింగ్ స్పాట్ వైరస్ నిరోధకతను సాధించగలిగాం.
- టమాటో పంటలో సూడోమోనాస్ అనే వ్యాధికారక బ్యాక్టీరియాకు నిరోధకతను రూపొందించారు.
- ఫలాలు ఆలస్యంగా పక్వతకు వచ్చే విధానాన్ని సృష్టించి రవాణాకు అనుకూలపరిచారు.
- బంగాళాదుంపలో ఫైటాప్తోరా అనే శిలీంధ్ర నిరోధకతను అభివృద్ధి పరిచారు.
- బాస్మతి వరి రకంలో జీవ, నిర్జీవ ప్రతి బలాలను తట్టుకునే నిరోధకతను రూపొందించారు.
- మొక్కలను జీవ పరిశ్రమలు (బయోరియాక్టర్)గా ఉపయోగించి వాణిజ్య ఉత్పత్తులు, ఔషధాలు, రసాయనాలను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. దీన్నే 'అణు సేద్యం' అంటారు.

జీవభద్రత, నైతిక సమస్యలు

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో అనేక లాభాలున్నప్పటికీ ప్రజల్లో కొంత అభద్రతా భావం ఉంది. దీనికి ప్రధాన కారణాలు..

1) మానవులు, జంతువుల్లో విష పదార్థాలు బదిలీ చెంది ఇతర కొత్త సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది.
2) కూరగాయల సహజత్వంలో మార్పు వచ్చే ఆస్కారం ఉంది.
3) జీవ వైవిధ్యానికి హాని ఏర్పడే ప్రమాదం ఉంది.
4) అసహజ కలుపు మొక్కలు వృద్ధి చెందే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయి.

పైన పేర్కొన్నవాటితో పాటు బయోపైరసీ జరిగే ప్రమాదం కూడా ఉంది. రూపొందించిన వారి అనుమతికి సంబంధించిన అధికారిక పత్రం, నష్ట పరిహారం లేకుండా జీవ వనరులను ఉపయోగించడాన్ని బయోపైరసీ అంటారు.

క్లోనింగ్

ఈ విధానంలో స్టెమ్ (మూల) కణాలను ఉపయోగించి కృత్రిమంగా జంతువులను రూపొందిస్తారు. స్టెమ్‌సెల్స్‌కు ఉండే సామర్థ్యాన్ని 'ప్లూరో పొటెన్సీ' అంటారు. మొట్టమొదటగా ఈ ప్రక్రియలో 'డాలి' అనే గొర్రె పిల్లను సృష్టించారు. స్కాట్లాండ్ శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ దీన్ని రోసాలిన్ అనే పరిశోధనా సంస్థలో రూపొందించారు.

క్లోనింగ్ ఉపయోగాలు: జంతువుల్లో అవసరమైన లక్షణాలను అభివృద్ధి చేయవచ్చు.

ఉదా: తల్లిపాలలో ఉండే ప్రోటీన్లను ఆవుపాలలో ప్రవేశ పెట్టవచ్చు. అంతరించిపోయే ప్రమాదమున్న జంతుజాలాన్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయవచ్చు. .

మాదిరి ప్రశ్నలు

1. జన్యు పదార్థంగా దేన్ని పరిగణిస్తారు?
   1) C–DNA 2) r–DNA
   3) B–DNA 4) Z–DNA
2. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసే మొక్కలను ఏమంటారు?
   1) జెనెటికల్ మొక్కలు
   2) అనువంశిక మొక్కలు
   3) జన్యు పరివర్తిత మొక్కలు
   4) ఉత్పరివర్తిత మొక్కలు
3. డీఎన్ఏను ఖండితాలుగా చేసేది?
   1) ఎండో న్యూక్లియేజ్
   2) లిగేజ్
   3) ఐసోమరేజ్
   4) ఏదీకాదు
4. బీటీ – కాటన్‌ను మొదట ఉత్పత్తి చేసిన విత్తన సంస్థ?
   1) పోయినీర్ 2) మోనిశాంటో
   3) ప్రీమియర్ 4) పైవన్నీ
5. గోల్డెన్‌రైస్‌లో ఏ అంశాన్ని ప్రవేశ పెట్టారు?
   1) హార్మోన్ 2) బయోపెస్టిసైడ్స్
   3) విటమిన్స్ 4) పిండి పదార్థం
6. డీఎన్ఏ టెక్నాలజీలో విరివిగా ఉపయోగిస్తున్న బ్యాక్టీరియా?
   1) స్ట్రెప్టోకోకస్ 2) బాసిల్లస్
   3) ఇ–కోలీ 4) స్పైరిల్లం
7. మొదటగా రూపొందించిన క్లోన్?
   1) స్పాటి 2) డాలి
   3) ప్రామేటి 4) స్వప్ని
8. మొదటగా రూపొందించిన టెస్ట్ ట్యూబ్ బేబీ?
   1) బేబీ హర్ష
   2) లూయిస్ జాయ్ బ్రౌన్
   3) డాలి 4) ఏదీకాదు
9. పెన్సిలిన్‌ను ఏ సంవత్సరంలో కను గొన్నారు?
   1) 1920 2) 1928
   3) 1935 4) 1919
10. భారతదేశంలో సాగు చేస్తున్న పుట్టగొడుగు రకం?
    1) అగారికస్ వైరోసా
    2) అమానిటా జాతులు
    3) అగారికస్ బైస్పోరస్
    4) పైవన్నీ
11. మష్రూమ్ అంటే అర్థం ఏమిటి?
    1) పుష్పం 2) స్పాంజీ
    3) గొడుగు 4) బూడిద
12. స్పైరులినా అనేది?
    1) ఏక కణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శైవలం
    2) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శిలీంధ్రం
    3) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే బ్యాక్టీరియా
    4) ఏదీకాదు
13. క్లోనింగ్‌లో ఉపయోగించే కణాలు?
    1) టాటి పోటెంట్ కణాలు
    2) ప్రోకేరియోటిక్ కణాలు
    3) మూలకణాలు (స్టెమ్ సెల్స్)
    4) పైవన్నీ
14. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసిన ఇన్సులిన్?
    1) హ్యూమ్యులిన్
    2) హైరుడిన్
    3) రెన్నెట్
    4) ఏదీకాదు
15. టానరింగ్ (తోళ్ల శుద్ధి) విధానంలో ఉపయోగపడే బ్యాక్టీరియా?
    1) క్లాస్ట్రీడియం 2) అజటో బాక్టర్
    3) రైజోబియం 4) పైవన్నీ
16. ఫింగర్ ప్రింటింగ్ విధానంలో నేరస్థులను నిర్ధారణ చేసేందుకు ఉపయోగపడేది?
    1) r–DNA 2) C–DNA
    3) B–DNA 4) Z–DNA
17. లైంగిక నిర్ధారణలో ఉపయోగపడే క్రోమోజోములు?
    1) xx 2) xy 3) yy 4) 1, 2
18. ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్ అనేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) విత్తన సంస్థ 4) ఏదీకాదు
19. టెస్ట్ ట్యూబ్ బేబి అంటే?
    1) శిశువు పరీక్ష నాళికలో వృద్ధి చెందుతుంది
    2) ఫలదీకరణ పరీక్ష నాళికలో జరిగి శిశువు గర్భాశయంలో ఎదుగుతుంది
    3) ఫలదీకరణ ఫాలోపియన్ నాళంలో జరిగి శిశువు పరీక్ష నాళికలో ఎదుగుతుంది
    4) ఫలదీకరణ, శిశువు ఎదుగుదల పరీక్ష నాళికలో జరుగుతుంది
20. గోబర్ గ్యాస్ దేని నుంచి లభిస్తుంది?
    1) ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్
    2) బాసిల్లస్ థురెంజియన్సిస్
    3) మిథనో కోకస్
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 3; 3) 1; 4) 2;
5) 3; 6) 3; 7) 2; 8) 2;
9) 2; 10) 3; 11) 2; 12) 1;
13) 3; 14) 1; 15) 1; 16) 2;
17) 4; 18) 2; 19) 2; 20) 3.

వాతావరణంలో అత్యధికంగా ఉండే జడవాయువు?

శీతోష్ణస్థితి-వాతావరణ పొరలు-సూర్యపుటం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

వాతావరణ సంఘటనం

భూమిని ఆవరించి సుమారు 1600 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న గాలిపొరను 'వాతావరణం' అంటారు. వాతావరణ పొరలకు భూగురుత్వాకర్షణ శక్తి ఉండటం వల్ల అవి భూమిని ఆవరించి ఉంటాయి. భూమి ఆకర్షణ వల్ల వాతావరణం భూ ఉపరితలం వద్ద దట్టంగా, ఎత్తుకు వెళ్లే కొద్దీ పలుచగా ఉంటుంది. వాతావరణాన్ని అట్మాస్ఫియర్ అంటారు. అట్మాస్ అంటే ఆవిరి.

వాతావరణ స్థితి: ఒకరోజు లేదా కొన్ని గంటల్లో వాతావరణ అంశాల పరిస్థితిని తెలియజేస్తుంది. ఇది ప్రాంతాలను బట్టి మారుతుంది. తాత్కాలికమైంది, అస్థిరమైంది.

శీతోష్ణస్థితి: ఏదైనా ఒక ప్రాంతానికి సంబంధించి కొన్ని ఏళ్ల సగటు ఉష్ణోగ్రత, వాయుపీడనం, పవనాలు, వర్షపాతం తదితర భౌతికాంశాల పరిస్థితులను తెలుపుతుంది. ఇది వందల ఏళ్ల వాతావరణ పరిస్థితుల సంగ్రహం.

వాయువులు

జీవకోటి మనుగడకు ముఖ్యమైన వాయువు ఆక్సిజన్. మొత్తం వాతావరణంలో నీటిఆవిరి సుమారు 0.4 శాతం ఉంటుంది. దీనిలో అధిక భాగం భూమికి దగ్గరగా ఉంటుంది.

నైట్రోజన్	78.08 శాతం
ఆక్సిజన్	20.94 శాతం
ఆర్గాన్	0.93 శాతం
కార్బన్ డై ఆక్సైడ్	0.03 శాతం
ఇతర వాయువులు	0.02 శాతం
మొత్తం	100.00 శాతం

వాతావరణం - పొరలు

వివిధ పదార్థాల ఆధారంగా వాతావరణాన్ని రెండు ప్రధాన పొరలుగా విభజించారు. అవి..

1) సమరూప ఆవరణం (Homo sphere)
2) బహురూప ఆవరణం (Hetero sphere)

సమరూప ఆవరణం:
ఈ ఆవరణం 90 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. దీనిలో మూడు పొరలుంటాయి. అవి.. ట్రోపో ఆవరణం, స్ట్రాటో ఆవరణం, మెసో ఆవరణం. సమరూప ఆవరణం అంతటా నైట్రోజన్, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువుల నిష్పత్తి ఒకే రకంగా ఉంటుంది.

బహురూప ఆవరణం:
90 కి.మీ. కంటే పైన ఉన్న వాతావరణ పొరను బహురూప ఆవరణం అంటారు. దీనిలో వాయువుల నిష్పత్తి వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. దీనిలో థర్మో ఆవరణం, ఎక్సో ఆవరణం అనే రెండు పొరలు ఉన్నాయి.



ట్రోపో ఆవరణం:
ఇది వాతావరణంలో అన్నిటికంటే కింద ఉన్న పొర. ధ్రువాల వద్ద 8 కిలోమీటర్ల ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు ఇది విస్తరించి ఉంటుంది. ఈ పొర సగటు ఎత్తు 13 కిలోమీటర్లు.
భూమధ్యరేఖ వద్ద బలమైన సంవహన ప్రవాహాల వల్ల వేడిమి చాలా ఎత్తు వరకు వెళుతుంది. కాబట్టి ఇక్కడ ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలోని ధూళికణాలు, తేమ అంతా ఈ పొరలోనే ఉంటాయి. శీతోష్ణస్థితులు, వర్షపాతం లాంటి వాతావరణ అంశాలన్నీ ఈ ఆవరణంలోనే సంభవిస్తాయి. ఈ పొరలో పైకి వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీన్ని 'సాధారణ క్షీణతా క్రమం' అంటారు. నీటి బిందువులు ఘనీభవించటం, బాష్పీభవనం కావటం, ద్రవీభవనం, వర్షపాతం, తుపానులు వంటివన్నీ ఈ పొరలోనే జరుగుతాయి.

స్ట్రాటో ఆవరణం:
ఈ పొర 50 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఇందులో మబ్బులు ఉండవు, కాబట్టి వర్షపాతం, తుపానులు వంటివి ఉండవు. దీంతో జెట్ విమానాలు ఎగరడానికి ఈ పొర చాలా అనువుగా ఉంటుంది. స్ట్రాటో ఆవరణంలో ఓజోన్ పొర ఉంటుంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

మెసో ఆవరణం: ఇది 80 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఉల్కలు ఈ పొరలోకి ప్రవేశించగానే కాలిపోతాయి. ఎత్తు పెరిగే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

థర్మో ఆవరణం: ఇది 400 కి.మీ. వరకు ఉంటుంది. థర్మో ఆవరణంలో ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతాయి. ఈ పొరలో అయాన్లు అనే కణాలు ఉంటాయి. వీటికి విద్యుదావేశం ఉంటుంది. ఈ అయాన్ల వల్ల భూమి నుంచి ప్రసారితమయ్యే రేడియో తరంగాలు తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి. ఈ పొరని 'ఐనో ఆవరణం' అని కూడా అంటారు.

ఎక్సో ఆవరణం
ఇది వాతావరణంలో అన్నింటికంటే చివరి పై పొర.

సౌరశక్తి - సూర్యపుటం

సూర్యుడి నుంచి నిరంతరం విడుదలయ్యే శక్తిని సౌర వికిరణం అంటారు. సూర్యుడిలో నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియే అణు సంఘటనం. సూర్యుడి వ్యాసం, భూమి వ్యాసం కంటే 109 రెట్లు ఎక్కువ ఉంటుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి కంటే సూర్యుడి గురుత్వాకర్షణ శక్తి 28 రెట్లు అధికం. సూర్యుడు భూమి కంటే 1.3 మిలియన్ రెట్లు పెద్దగా ఉంటాడు. సూర్యుడు విడుదల చేస్తున్న శక్తిలో భూమి గ్రహించే శక్తి (2 వేల మిలియన్లు) 2 వేల మిలియన్లలో ఒక వంతు.

సూర్యపుటం: భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్యుడి శక్తిని సూర్యపుటం అంటారు. సగటున భూమి ఒక చ.సెం.మీ. ఉపరితల విస్తీర్ణంలో నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన సూర్యపుటాన్ని గ్రహిస్తుంది. దీన్నే సౌర స్థిరాంకం అంటారు. భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతాన్ని ఆల్బిడో అంటారు. భూమి ఆల్బిడో 35 యూనిట్లు.

సూర్యపుటం ప్రభావితం చేసే అంశాలు

సూర్యకిరణాలు భూమి మీద పడే కోణం:
సూర్య కిరణాల వాలు తక్కువగా ఉంటే సూర్యపుటం తీవ్రత ఎక్కువగా, వాలు ఎక్కువగా ఉంటే తీవ్రత తక్కువగా ఉంటుంది.
ఉదా: సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో కంటే మిట్ట మధ్యాహ్నం వేళ సూర్యపుటం ఎక్కువ.
ఉదా: సూర్యకిరణాలు లంబంగా ప్రసరించే ఉష్ణ మండల ప్రాంతాలు, సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించే ధ్రువ ప్రాంతాల కంటే ఎక్కువ సూర్యపుటాన్ని గ్రహిస్తాయి.

పగటి ప్రమాణం
పగటి ప్రమాణం ఎక్కువగా ఉండే వేసవి కాలాలు పగటి ప్రమాణం తక్కువగా ఉండే శీతాకాలాల కంటే అధిక సూర్య పుటాన్ని గ్రహిస్తాయి.
భూమధ్యరేఖ నుంచి దూరంగా వెళ్లే కొద్దీ వేసవి కాలం పగటి ప్రమాణం పెరుగుతుంది. శీతాకాలంలో రాత్రి ప్రమాణం పెరుగుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలోని పై పొరను ఏమని పిలుస్తారు?
   1) ట్రోపో స్ఫియర్ 2) స్ట్రాటో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ఎక్సో స్ఫియర్
2. వాతావరణంలో అత్యధికంగా ఉండే జడవాయువు?
   1) నియాన్ 2) ఆర్గాన్
   3) మోనాజటాన్ 4) ఏదీకాదు
3. వాతావరణంలోని ఏ పొర నుంచి రేడియో తరంగాలు ప్రసారమవుతాయి?
   1) ఐనో ఆవరణం 2) మెసో ఆవరణం
   3) స్ట్రాటో ఆవరణం
   4) ట్రోపో ఆవరణం
4. భూమికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర?
   1) ఎక్సో స్ఫియర్ 2) ఐనో స్ఫియర్
   3) ట్రోపో స్ఫియర్ 4) స్ట్రాటో స్ఫియర్
5. రాత్రివేళల్లో భూమి నుంచి సముద్రం వైపు వీచే గాలులను ఏమంటారు?
   1) సముద్ర మంద మారుతం
   2) భూమంద మారుతం
   3) చల్లని గాలి 4) రాత్రి గాలి
6. వాతావరణంలోని అత్యల్ప ఎత్తులో ఉన్న పొరను ఏమని పిలుస్తారు?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) మెసో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ట్రోపో స్ఫియర్
7. వాతావరణ మార్పులు ఎక్కువగా ఎక్కడ జరుగుతాయి?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) ట్రోపో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) మెసో స్ఫియర్
8. భూమి మీద ఆక్సిజన్ భాగం?
   1) 27.72 శాతం 2) 46.5 శాతం
   3) 41.5 శాతం 4) 8.13 శాతం
9. ఓజోన్ ఆవరణం అని దేన్ని పిలుస్తారు?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) మెసో 4) ఎక్సో
10. స్పేస్ స్టేషన్ ఏ ఆవరణంలో ఉంది?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) థర్మో 4) ఎక్సో
11. వాతావరణ పొరలు వేటి మూలంగా వేడెక్కుతాయి?
   1) ఉష్ణ వికిరణం 2) భూ వికిరణం
   3) ఉష్ణ వాహకం 4) ఉష్ణ సంవహనం
12. భూమి సగటు ఆల్బిడో?
   1) 35 శాతం 2) 45 శాతం
   3) 37 శాతం 4) 38 శాతం
13. సముద్రమట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం (మిల్లీ బార్లలో)?
   1) 1083.3 2) 1019.3
   3) 870 4) 1013.2
14. అధిక ఉష్ణోగ్రతలు గ్రహించే నేలలు?
   1) ఎర్ర నేలలు 2) నల్లరేగడి నేలలు
   3) ఇసుక నేలలు 4) ఒండ్రు నేలలు

సమాధానాలు

1) 4; 2) 2; 3) 1; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3; 11) 2; 12) 1; 13) 4; 14) 2.

ముఖ్యమైన పదాలు - అర్థాలు

- **సౌర వికిరణం:** సూర్యుడి నుంచి నిరంతరం విడుదయ్యే అపరిమితమైన శక్తి.
- **అణు సంఘటన:** సూర్యుడి నుంచి నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియ.
- **సూర్యపుటం:** భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్య శక్తి.
- **సౌర స్థిరాంకం:** ఒక చ.సెం.మీ. భూమి విస్తీర్ణం 1 నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన ఉష్ణాన్ని గ్రహించటం.
- **భూ వికిరణం:** భూమి గ్రహించిన శక్తిని దీర్ఘతరంగాలుగా విశ్వంలోకి విడుదల చేయడం.
- **ఆల్బిడో:** భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతం.
- **ఉష్ణ సమతుల్యం:** సూర్యపుటం ద్వారా భూమి ఎంత వేడెక్కుతుందో, భూ వికిరణం ద్వారా అంతగానే చల్లబడటం.

The local residents may protest against..

MODEL QUESTIONS

BANK EXAMS

REASONING

Read the questions carefully and answer the following:

Directions (Q. No. 1-5): Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
Mark (a) if only assumption I is implicit
Mark (b) if only assumption II is implicit
Mark (c) if either I or II is implicit
Mark (d) if neither I nor II is implicit
Mark (e) if both I and II are implicit

1. **Statement:-**
   The government has decided to provide monetary relief to the farmers in the drought-hit areas.
   Assumptions:
   I. The farmers of the affected areas may accept the government relief.
   II. The government machinery may be able to reach the affected farmers to provide relief.

2. **Statement:-**
   All the students of a school were instructed by the Principal to reach school at least 15 minutes before the stipulated time for the coming month.
   Assumptions:
   I. The parents of the students of the school may protest against the Principal's instruction.
   II. The parents may request the Principal to withdraw the instruction.

3. **Statement:-**
   Railway authority has started Internet booking facility of long-distance trains and also delivering the tickets at the doorstep through courier service at a little extra cost.
   Assumptions:
   I. Many customers may now book their tickets through Internet, resulting into fewer crowds at ticket booking offices.
   II. Most of the customers may still buy their railway tickets at the booking counters.

4. **Statement:-**
   "If you have obtained 75 per cent or more marks in X Std examination, your admission to our coaching class for XII Std is guaranteed."_An advertisement.
   Assumptions:
   I. Bright students do not generally opt for attending coaching classes.
   II. The coaching class has adequate capacity to accommodate all such students.



5. **Statement:-**
   The municipal corporation has given permission for holding fun fairs in the local football ground during the holiday season.
   Assumptions:
   I. The local residents may protest against the corporation's decision.
   II. Many people may not participate in the fun fair.

Directions (Q. No. 6-10): In making decisions about important questions, it is desirable to be able to distinguish between "strong" arguments and "weak" arguments in so far as they relate to the question. Strong arguments are those which are both important and directly related to the question. Weak arguments are those which are of minor importance and also may not be directly related to the question or may be related to a trivial aspect of the question.

Instructions: Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a strong argument and which is a weak argument.
Give answer 1 if only argument I is strong
Give answer 2 if only argument II is strong
Give answer 3 if either I or II is strong
Give answer 4 if neither I nor II is strong and
Give answer 5 if both the arguments I and II are strong.

6. Should graduation be made minimum educational qualification for entry-level jobs in any public sector organization?
   Arguments:-
   I. Yes, graduates always perform better than non-graduates by virtue of their higher level of education.
   II. No, there are quite a few people who cannot afford to remain unemployed till the completion of graduation and are capable of performing equally well as the graduate candidates.

7. Should the examination bodies for all university examinations permit the use of calculators?
   Arguments:-
   I. No, it is necessary for the students to know the methods of manual calculations.
   II. Yes, manual calculations are no more required with extensive use of computers in all fields.

8. Should the knowledge of Hindi language be made compulsory for all the employees of public sector organizations?
   Arguments:-
   I. Yes, it is necessary for dealing with people from the educationally backward strata of the society.
   II. No, it is not necessary for every employee to have the knowledge of Hindi language.

9. Should it be made compulsory for all the private sector organizations to reserve quota for society backward classes?
   Arguments:-
   I. No, the private sector should not be governed by the Government rules.
   II. Yes, private sector organizations should also contribute in upliftment of socially backward classes.

10. Should the women be advised not to travel alone at night in view of the increasing incidences of rape and sexual abuse?
   Arguments:-
   I. No, instead the Government should take measures to control such incidences.
   II. Yes, it is difficult even for the police department to control such cases.

Directions (Q. No. 11 - 13): Read the questions carefully and answer the following:

11. **Cause:-**
   All the major rivers in the state have been flowing way over the danger level for the past few weeks. Which of the following is /are possible effect (s) of the above cause?
   (A) Many villages situated near the riverbanks are submerged, forcing the residents to flee.
   (B) Govt has decided to provide alternate shelter to all the affected villagers residing near the river banks.
   (C) The entire state has been put on high flood alert.
   (1) Only (A) (2) Only (A) and (B)
   (3) Only (B) and (C)
   (4) All (A), (B) and (C)
   (5) None of these

12. **Effect:-**
   This year majority of the final year students of the management institute have opted for finance specialization.
   Which of the following can be a probable cause of the above effect?
   (1) Last year most of the students with HR specialization got better job offers than other specializations.
   (2) The management institute offers only finance specialization to its final year students.
   (3) Last year the students with finance specialization bagged most of the lucrative offers vis-à-vis students with other specializations.
   (4) The management institute has recently started its finance specialization in addition to Marketing and HR being offered earlier.
   (5) None of these

13. **Effect:-**
   Govt allowed all the airlines to charge additional amount as peak time congestion charges for the flights landing between 6.00 a.m. and 10.00 a.m.
   Which of the following is a probable cause of the above effect?
   (1) All the airline companies had threatened to suspend their services during peak hours.
   (2) The Govt has increased its tax for peak time flights.
   (3) The aircrafts are routinely put on hold over, causing extra fuel consumption.
   (4) The airline companies can now charge unlimited additional charge for peak time flights.
   (5) None of these.

Solutions

1. When the government has decided to provide relief to the farmers, it must be assuming that the plan can be executed, and the farmers respond positively. Hence, both I and II are implicit. **Ans: 5**
2. If Principal is instructing students, he must be assuming that the students will abide by his instruction, and the parents will also accept it. Hence, both I and II are not implicit **Ans: 4**
3. The initiative taken by the railway authority has been aimed at providing better service-customer. Hence, I is implicit. II may nor may not be an assumption. Hence II is not implicit **Ans: 1**
4. From the advertisement, it is clear that the advertiser must be assuming II. Hence, II is implicit. Assumption I is rather contradicting the statement. Hence, I is not implicit. **Ans: 2**
5. Since assumptions I and II go against the spirit of the given statement, both I and II are not implicit. **Ans: 4**
6. Note "graduates ALWAYS perform". Hence, I is not necessarily true. Hence I is not strong. II deviates from the core issue. Hence, II is not strong. **Ans: 4**
7. I is a simple declaration. Hence, it is not strong. II is strong as it explains the reason behind it. **Ans: 2**
8. I is strong because it is true to a large extent. But II is simplistic and hence weak. **Ans: 1**
9. I is not the correct way of arguing. Hence, I is not strong. Upliftment of socially backward classes is necessary. Hence, II is strong. **Ans: 2**
10. **Ans:** 4.
11. All the three are the possible effects of the given cause. **Ans: 4**
12. Only (3) seems to be the probable cause. **Ans: 3**
13. As aircrafts incur extra fuel consumption charges, government allowed all the airlines to charge additional amount. **Ans: 3**